శ్రీతాళ్ళపాకవారిపదసాహిత్యము–సంపుటము 26

# శృంగార సంకీర్తనలు

## అన్నమాచార్య విరచితములు

పరిష్కర్త:

గౌరిపెద్ది రామసుబ్బశర్మ

తిరుమల తిరుపతి దేవస్థానముల బోర్డు ఆఫ్ ట్రస్టీస్ వారి అనుమతితో

ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు

శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్ ఐ. ఏ. ఎస్., గారి

అనుమతిని ప్రకటింపబడినది.

1979

అన్ని హక్కులు
తిరుమల తిరుపతి దేవస్థానమువారివి

మొదటి ముద్రణ 2,000 ప్రతులు

ముద్రణము :
తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము,
తిరుపతి.

# తొలిపలుకు:

'ఆడే బొమ్మలు వారు ఆడించేసూత్రము నీవు
యేదో ఇన్నాళ్లు నేను ఇదెఱఁగనైతిని' — (అన్నమయ్య)

విశ్వనాటకరంగంలో జీవరాసులనే పాత్రలను నడిపించే సూత్రధారుడు భగవంతుడు. అజ్ఞానపుపొరల తెరలను తొలగించుకొని చూడగలిగినప్పుడే సత్యమైన భగవల్లీల దృగ్గోచరమౌతుంది - అని శ్రీవేంకటేశ్వరుని పరమభక్తుడైన అన్నమాచార్యులు గురూపదేశాన ఆత్మానుభవాన ఆ పరతత్త్వాన్ని తెలుసుకొని దానిని సార్వజనీనంగా సార్వకాలికంగా చాటి వినిపించినాడు.

నేను, తొలుత తిరుమల తిరుపతి దేవస్థానాల పవిత్ర పాలనను చేపట్టినప్పుడు నన్ను ప్రధానంగ ఆకర్షించింది, ఆశ్చర్యపరచింది తాళ్లపాక కవుల వాఙ్మయరాశి. ఈ వాఙ్మయవ్యాప్తికి దేవస్థానంవారు గత దశాబ్దాలుగ చేస్తున్న తీవ్రకృషి నన్ను ఉత్తేజపరచింది. తాళ్లపాక కవులలో ప్రధానపురుషుడు అన్నమాచార్యులు. క్రీ. శ. 1408—1503 మధ్య జీవించినవాడు. తిరుమలదేవుని తనహృదయమందిరంలో ప్రతిష్ఠించుకొని వేలకొలది సంకీర్తనపుష్పాలతో అర్చించి తరించిన ఆ మహాభాగవతోత్తముని జీవితమే ఒక మహాకావ్యం. హరినందకాంశంలో అవతరించినాడన్న ప్రతీతిని పొందిన ఆ సంకీర్తనాచార్యుడు తనజీవితానికి ఆలంబనంగ స్వీకరించినది శ్రీవేంకటేశ్వరమంత్రము. దీనినే తనప్రతిపాటలో 'ముద్రగ' నిక్షేపించినాడు 'వినరో భాగ్యము విష్ణుకథ' అని వీధి వీధిన పాడి వినిపించినాడు. శ్రీవేంకటేశ్వరతత్త్వాన్ని మధురభావనలతో సులలితశైలిలో ప్రజలభాషలో వినిపించిన

అన్నమాచార్యుల సంకీర్తనలను వ్యాప్తం చేయడమంటే శ్రీనివాసుని మహిమలను లోకానికిచాటడమే. అందుకే దేవస్థానాల కార్యనిర్వాహకుడుగా నేను, ప్రధానంగ ఈ వాఙ్మయవ్యాప్తికిపూనుకోవడంజరిగింది.

తాళ్లపాకవారి పాటలు బహుళప్రచారం పొందడానికి ఒక ప్రణాళికను, రాగిరేకులమీద వ్రాసిపెట్టబడివున్న ఈ కీర్తనలను ప్రకటించడానికి మరొక ప్రణాళికను ప్రత్యేకంగ ప్రవేశపెట్టడం జరిగింది. మిగిలిన రేకులలోనిపాటలు రెండేండ్లలో పూర్తిగ ప్రకటింపబడడానికి ఒక ప్రత్యేక అధికారిని సంపూర్ణంగా ఆపనికే నియమించడం జరిగింది. ఈపనిని అంతకుముందే కొన్నిఏండ్లుగ తృప్తిగ నిర్వహిస్తున్న శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మకు అప్పగించడమైనది. అన్నమయ్యపాటలప్రచారకార్యక్రమంలో పాల్గొంటూ ఉత్సాహంగ పనిచేస్తున్న శ్రీకామిశెట్టి శ్రీనివాసులుశెట్టిని 'అన్నమాచార్యప్రాజెక్టు' అని ఒకవిభాగాన్ని అన్నమాచార్యకళామందిరములో ఏర్పాటుచేసి దానికి ప్రత్యేకాధికారిగ నియమించడం జరిగింది. దేశంలో ఈ వాఙ్మయంమీద అనురక్తి, అన్నమాచార్యులమీద ఆసక్తి దినదిన ప్రవర్ధమాన మౌతున్నది.

అన్నమాచార్యుల జన్మభూమి తాళ్లపాకగ్రామంమీదకూడ దృష్టిని కేంద్రీకరించడం జరిగింది. ఆ మహాభక్తుని జన్మస్థలం దుర్గమంగ, మసతెలుగువారి అశ్రద్ధకు చిహ్నంగ నిలిచివుండడం బాధను, వేదనను కలిగించినది. అందుకే మేము తాళ్లపాకగ్రామాన్ని దత్తత తీసుకొని ఆ మహాభక్తుని స్మృతికి చిహ్నంగ బహుజనాకర్షకంగ తీర్చిదిద్దడానికి కార్యక్రమాలను చేపట్టినాము. క్రింది, మీదిశక్తులు ఏకమై మేము చేపట్టిన ఈ పవిత్రకార్యములు ఫలవంతం ఔతాయని ఆశిస్తున్నాం.

తాళ్లపాకవారి పాటల ముద్రణం శీఘ్రంగ కొనసాగడానికి మా ముద్రణాలయంలో ఒక ప్రత్యేకవిభాగంకూడ ఏర్పాటుచేయడం జరిగింది. పండిత పామరజనరంజకంగ ఈ పాటలు వ్యాప్తిపొంద డానికి తగినకృషి జరుగుచున్నది. అన్నమాచార్యులసంకీర్తనల అధ్యయనానికి ప్రత్యేకమైన ఏర్పాట్లుచేస్తూ, అన్నమయ్యసంగీతంతో బాటు సాహిత్యంమీదకూడ పరిశోధనచేసే విద్యార్థులకు ఉపకార వేతనాల నిచ్చి ప్రోత్సహిస్తున్నాం. ఈ సంకీర్తనల్లో ప్రత్యేకశిక్షణ పొందినవారికి అన్నమాచార్య ప్రచారసంస్థలో పనిచేసే అవకాశాలు కూడ కల్పిస్తున్నాం. ఈ సంస్థలో పనిచేసే కళాకారులు దేశం నలు మూలలా తిరిగి ఈ సారస్వతవ్యాప్తికి శ్రద్ధాభక్తులతో దృఢదీక్షతో పనిచేయవలసివున్నది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థానవిదుషీమణి విశ్వవిఖ్యాతినిపొందిన గాయని శ్రీమతి ఎం. ఎస్. సుబ్బలక్ష్మి వారికి అన్నమాచార్యుల సంకీర్తనల రెండు ఎల్. పి. గ్రామఫోను రికార్డులిచ్చే బాధ్యతను అప్పగించినాము. వారు ఈ పవిత్రకార్యాన్ని దయతో అంగీకరించినారు. తి. తి. దేవస్థానం ఆస్థానవిద్వాంసులు డా॥ శ్రీపాద పినాకపాణిగారు స్వరపరచిన అన్నమాచార్యుల సంకీర్త నలను కొన్నింటిని తెలుగు తమిళ లిపులలో ప్రకటించడానికికూడ పూనుకొన్నాము. ఈ వాఙ్మయవ్యాప్తికి నాకు తమ పరిపూర్ణ సహ కారాలను సంతరిస్తున్న కవిపండితగాయకులకు, నేను ఈ రంగంలో ప్రవేశపెట్టిన ప్రణాళికలను ఆమోదిస్తూ ఉత్సాహపరుస్తున్న ప్రభుత్వం వారికి, దేవస్థానం ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీరమేశన్‌గారికి, తదితర సభ్యులకు నా ధన్యవాదాలు.

ఇప్పుడు మీ చేతిలోవున్న శృంగారసంకీర్తనల 26 వ సంపుటం పరిష్కరించినవారు గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు, వీరు సంస్కృ

తాంధ్రిలలో గొప్పపండితులు. స్వర్గీయ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారి అడుగుజాడలలో నడుస్తూ పరిష్కరణను కొనసాగిస్తున్నారు. ఈసంపుటం ప్రారంభంలో వీరు చేర్చిన విపులమైన పీఠిక, క్రీనీతల్లో అక్కడక్కడ వీరు చేసిన భాషాసాహిత్య చర్చలు, పాఠాంతర సూచనలు విశంకటమైన వీరిపాండిత్యానికి నిదర్శనలు. అన్నమయ్య భక్తి శృంగారములనుగూర్చి వీరు చర్చించితేల్చిన విషయాలు అమూల్యములైనవి. అన్నమయ్యది 'సమారోపభక్తి' అన్న వీరి నిరూపణ వీరి పాండిత్యపు లోతును, ఆధ్యాత్మిక చిత్తవృత్తిని వివరిస్తున్నది.

రేకులలోని పాటలస్వరూపం చెడకుండా యథాతథంగ ఆధునిక లిపిసంకేతాల కనుగుణంగ ప్రకటించి అందరికీ అందుబాటులో వుంచాలనే మా ప్రయత్నం. రసహృదయులైన పాఠకుల ముందు పుస్తకమున్నది. శ్రీవేంకటేశ్వరభక్తి మకరందాన్ని అందరు ఆస్వాదించగలరనే మా ఆశంస.

'నాయకుఁడ నీచిత్తము నాభాగ్యము'

—అన్నమయ్య

(సం) ప్రసాద్,

(పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ. ఏ. ఎస్.)

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.



శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు

# పీఠిక

**శ్లో॥ భూమికాః నాయికానాం యః ఆస్థాయ బహుధా పుమాన్।**
**రంజయిత్వాంజనాద్రీశం నిర్వహౌ తముపాస్మహే ॥**

1001 వ రేకునుండి 1100 వ రేకువరకుగల 100 రేకులలోని 600 పాటలు గలది ఈ సంపుటము.

ప్రతిసంపుటముమొదట అన్నమయ్యావాఙ్మయములోని భాషావిశేషములను పురస్కరించుకొని ఏదో ఒక భాషాసంబంధచర్చ చేయవలెననుసంకల్పము కలదని 24 వ సంపుటముపీఠికలో వ్రాసియుంటిని. ఆ పద్ధతిలోనే 24, 25 సంపుటములపీఠికలు నడచినవి. ఈ సంపుటమునందు "భక్తిశృంగారము — అన్నమయ్య" అను విషయము పరిశీలింపవలసి వచ్చినది.

12 వ సంపుటము ద్వితీయముద్రణపీఠికలో "అన్నమయ్య భక్తి" అనుఉపశీర్షికక్రింద అన్నమయ్య భక్తిస్వరూపముమాత్రము యథామతిగ తేటపరచితిని. అక్కడ పూర్వపక్షసిద్ధాంతములతో అన్నమయ్యభక్తిశృంగారమును చర్చింపలేదు. ఆ కొరతదీర్చుటకే ఈ ప్రయత్నము.

భగవంతుని కీర్తించుటయో, ధ్యానించుటయో, తత్త్వములను వివరించుటయో, లోకమును పరిశీలించి గర్హించుటయో భక్తికార్యములుగా ఎంచవచ్చుగానీ, కచకుచాదివర్ణనములతో నిండి, నానారతిక్రియలతో పండి, పాఠకుల మనసున భక్తిభావముకంటె, లౌకికమైనశృంగారబీజములనే నాటునట్టి ఈ శృంగారసంకీర్తనల రాశి అన్నమయ్యను భాగవతస్థానమునుండి శృంగారచపలుని స్థానమునకు దిగదీయుచున్నది కదా అని సందేహింపవచ్చు. మరియు ఇంకా ఏవేవో ఊహాలుచేయుచు పరమార్థమెరుగనిపండితులవాద

ములుగూడ కొన్ని ఇట్టి విషయములందు పాతకాలమునుండి నేటి దాక సాగుచునే యున్నవి.

అన్నమయ్య పరమభాగవతుడుగా, అతని అధ్యాత్మశృంగార సంకీర్తనలు భాగవతధర్మములుగా చాటుచు, అతని కీర్తనలరాశి నంతటిని ముద్రించి లోకమున కందించుచున్న మాదేవస్థానమువారి ప్రయత్నములో, ఈ పరిష్కరణకార్యము సాగించుచున్న మాబోటి వారు అన్నమయ్యపరిశుద్ధభాగవతధర్మమును, దాని సనాతనత్వ మును, ప్రామాణ్యమును లోకమునకు చాటి శాస్త్రీయసమాధాన ములతో పై తెల్పినట్లు పకొందరికోగల్గుకొన్నిదుర్బల సందేహము లను తీర్చి, ఇది భాగవతసంప్రదాయమేయని సమర్థింప వలసిన అవసర మున్నది.

విరక్తుడైనవాడు ప్రపంచమును రోసి, పరమాత్మను మనసున పదిలపరచి, యోగమార్గముతో తాను తరించుట, తనఉపదేశము లతో ఇతరులను తరింపజేయుట ఒకసంప్రదాయముగ లోకమున సాగుచున్నది. దీనిని కాదనువా రెవ్వరును లేరు. ఈ యోగ మొక్కటియే పరమార్థసాధకమను హఠముమాత్రము మంచిది కాదు.

తరించుటకు, తరింపజేయుటకు మార్గములు చాల కలవు. మనస్సును, శరీరమును క్రుంగదీయు తీవ్రమైనతపస్సులు, శరీరము లోనిభాగములపై గారడీచేయుహఠయోగము, సర్వధర్మసన్యా సమైనరాజయోగము, శైవ, శాక్త సౌర, వైష్ణవ, గాణాపత్య కల్పములందు చెప్పబడిన నానావిధమంత్రతంత్ర మార్గములు మొదలయినవెన్నో కలవు. ఈ అన్నింటియందును భక్తి ప్రధాన హేతువుగ నిలుచుచున్నది. ధ్యానము యజనము అర్చనము కీర్త నము అను నాలుగు పద్ధతులను, యుగక్రమముగ భగవత్ప్రాప్తికి ప్రధాన సాధనములుగా "ధ్యాయన్కృతే, యజన్ యజ్ఞైః త్రేతా

యాం,ద్వాపరేఽర్చయన్, యదాప్నోతి, తదాప్నోతి కలౌసంకీర్త్య కేశవమ్[1]" అని విష్ణుపురాణము ఘోషించుచున్నది.

పై చెప్పినశైవ శాక్తాదులయందు సదాచార దురాచారములు రెండును పెనగొని మాదే మంచిపద్ధతి, మాదే మంచిపద్ధతి అని విఱ్ఱవీగుచున్నవి.

పై చెప్పిన ఐదుకల్పములందును ఈ సదాచార దురాచారములు సమానములే. కాని సదాచారము వైదికమని, దురాచారము అవైదికమని స్మృతికర్తలు చెప్పుచున్నారు. ఈ అన్నింటిలోని మంచిచెడ్డలను వింగడించి నిగ్గుదేల్చుట నాపనిగాదు. అయినను ఒక్క శాక్తకల్పమునందలిదురాచారము, సదాచారమును కాలదన్ని, తానే వైదికధర్మముగ చలామణియగుచు శ్రుతిస్మృతిపురాణములందు దిట్టలయినవారినికూడ కనుగప్పి వారిచేగూడ ఈ ఆచారమే ధర్మ్యముగ, వైదికముగ పరిపాలింపబడుచున్నదన్నచో దాని బల మింక చెప్పనక్కరలేదు.

శ్రీ శంకర భగవత్పాదులకు ముందు ఇవి 64 తంత్రములుగ లోకములో బహుళవ్యాప్తిలో నుండినవి. అవన్ని పరమార్థమునకు దూరములని శ్రీ శంకరులవారు ఖండించి వాటి వ్యాప్తిని కొంత మందగింప జేసిరి. ఈ తంత్రములందు ఆసక్తులైన కొందరు నేటికిని శ్రీ శంకర భగవత్పాదులను దూషించుట కలదు. ఈ తంత్ర గ్రంథములు 72 గా, Arthur Avalon అను నతడు, కలకత్తా 'ఆగమానుసంధానసమితి' యాజమాన్యమున సంపుటములవారీగా ప్రకటించువరకు దీనిలోనిచిదంబరరహస్యము లోకమునకు తెలియక, అంధపరంపరగ ఆ యాచారముననే సాగుచుండినది.

అవైదికములైన శైవశాక్తతంత్రములలో పురుషులందరు పరమశివులు. స్త్రీలందరు శక్తి స్వరూపిణులు. వావివరుసలులేక,

---

1. 6–2–17 విష్ణుపురాణము.

తన పెర అను భావములేక, ఎవరితో ఎవరు క్రీడించినను అదంతయు దేవీపూజగనే, పరమశివార్చనగనే భావింపవలెనట! ఇది భైరవ తంత్రముయొక్క పరమసిద్ధాంతము. దీనికి 'కాలావళీనిర్ణయః' అను ఒకమహాగ్రంథము మూలాధారము. సమయ, దక్షిణ, వామ, కౌలాచారములని నాలుగు సంప్రదాయములు కలవు. మొదటి రెండును వైదికములు, అవి శ్రీవిద్యాపరములు. శ్రీ అనగా పరబ్రహ్మ, మోక్షము అని అర్థము. "సా హి శ్రీః అమృతా సతా" అని శ్రుతి. వామకౌలములు రెండును అవైదికములు.

శ్లో॥ సర్వేభ్యశ్చోత్తమా వేదాః వేదేభ్యో వైష్ణవం పరం।
వైష్ణవా దుత్తమం శైవం శైవాద్దక్షిణ ముత్తమమ్॥
దక్షిణా దుత్తమం వామం వామాత్సిద్ధాంత ముత్తమం।
సిద్ధాంతా దుత్తమం కౌలం కౌలాత్పరతరం నహి॥

అని వీరిసిద్ధాంతము. వీరికి

శ్లో॥ మద్యం మాంసం తథా మత్స్యం ముద్రా మైథునమేవచ।
మకారపంచకంచైవ దేవతా ప్రీతికారకమ్॥

[4–26 కౌలావలీనిర్ణయము]

అని నిత్యాచార విశేషములు. ఇంతయేల వీరిప్రధానసిద్ధి ఒకటి రెండుశ్లోకములలో చెప్పి "కథాఽపి ఖలు పాపానా మలమశ్రేయసే యతః" అని ఈపాపచర్చను ముగించుచున్నాను.

శ్లో॥ వామే రామా రమణకుశలా, దక్షిణే పానపాత్రం
మధ్యే న్యస్తం మరిచసహితం సూకరస్యోష్ణమాంసమ్।
స్కంధే వీణా లలితసుభగా సద్గురూణాం ప్రపంచః
కౌలో ధర్మః పరమగహనః యోగినామప్యగమ్యః॥

[21–190 కౌలావలీనిర్ణయము]

శ్లో॥ శ్రుతౌ కుండలే అస్య గ్గళే ముండమాలా
కరే పానపాత్రం ముఖే హంత హాలా

పరిత్యక్తకర్మా లయన్యస్తధర్మో
విరక్తోఽవధూతో ద్వితీయో మహేశః ॥

[21–189 కాలావలీనిర్ణయము]

వీరి భక్తికి, యోగమునకు, సిద్ధికి ఇంతకు మించిన స్థానము లేదు.[1] ఇట్టులే వైష్ణవతంత్రము లందును. నేటికిని వైష్ణవులుగ పేరు చాటుకొనుచు కలశపూజ, కంచుకోత్సవము సాగించు పెద్దలు దండిగనున్నారు. ఇవి వివరింపవలసిన పనిలేదు.

ఇట్లు అవైదికాచారములు, అభాగవత సంప్రదాయములు లెక్కకు మిక్కిలిగా బలిసి "సారపుధర్మమున్ విమలసత్యము పాపముచేత బొంకుచేఁ, బారము చెందలేక చెడబారినదైనయవస్థ" అన్నట్లు వైదికాచారమును, భాగవత సంప్రదాయమును మైలపరచి నిలిచినవి.

మనకు ప్రకృతచర్చనీయమగుఅన్నమయ్య భాగవతసంప్ర దాయములో కచకుచాదివర్ణనము, రతిలంపటము గలిగిన శృంగార సంకీర్తనలరాశి, పైచెప్పిన అభాగవత సంప్రదాయమునకు తార్కాణ మగునేమో యని కొందరు భావింపవచ్చు. 'పాలను గలసిన జల మును, పాలవిధంబుననె తోఁచు' అన్నట్లు తయారైనది నేటి సంప్ర దాయసరళి. కావున సందేహించుట కవకాశము లేకపోలేదు. కాని సమ్యగ్దృష్టితో తత్త్వచింతతో పరిశీలించువారు పరమార్థము గ్రహింపగలరు. అట్టివారే కరవైనరోజులివి. కావున అన్నమయ్య-భక్తిస్వరూపము పైకోవకు చెందినది కాదని నిరూపింపవలసిన అవసరమేర్పడినది.

---

1. చూడు: 'కాలావలీనిర్ణయప్రభంజనము.' జగద్గురు శ్రీ కల్యాణానంద భారతీమాంతాచార్య విరచితము. శ్రీనివాసా ప్రింటింగ్‌వర్క్సు, సికింద్రాబాదు – 1946.

శృంగారభక్తి - భాగవతవిష్ణుపురాణములు.

శ్లో॥ శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం ।
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్ ॥

గుణమాహాత్మ్యాసక్తి, రూపాసక్తి, పూజాసక్తి,
స్మరణాసక్తి, దాస్యాసక్తి, సఖ్యాసక్తి, వాత్సల్యాసక్తి,
కాంతాసక్తి, ఆత్మనివేదనాసక్తి, తన్మయతాసక్తి,
పరమవిరహాసక్తిరూపా ఏకధాపి ఏకదశధా భవతి ॥ నార. భ. సూ.5-82

అని తొమ్మిదివిధములుగ, పదకొండు విధములుగ భక్తి పేర్కొనబడినది. వీనిలో కడపటిదగు ఆత్మనివేదనరూపమైన భక్తికి విరహాసక్తిభక్తికి ప్రధానముగ గోపికలే పాత్రములగుచున్నారు శ్రీకృష్ణునికి తమ తను మాన ప్రాణములు సమర్పించి ధన్యులయిన వారు వారే. గోపికలభక్తినిగూర్చి భాగవతవిష్ణుపురాణాదులు విపులముగ చర్చించినవి.

గోపికలతో శ్రీకృష్ణుని రాసక్రీడను విపులముగ శుకబ్రహ్మ పరీక్షిత్తునకు తెల్పెను. సాక్షాత్తు భగవంతుడగుకృష్ణుడు గోపికలతో లౌకికశృంగారమునకు పాల్పడినట్లు శుకునివలన వినినపరీక్షిత్తు:

శ్లో॥ కథం స ధర్మసేతూనాం వక్తా కర్తాఽభిరక్షితా ।
ప్రతీప మాచరద్బ్రహ్మన్ పరదారాభిమర్శనమ్ ॥

శ్లో॥ ఆప్తకామో యదుపతిః కృతవాన్ వై జుగుప్సితం ।
కిమభిప్రాయ ఏతన్నః సంశయం ఛింది సువ్రత ॥
[భాగ. 10-33-29, 30]

అని ప్రశ్నించినాడు. మనవలెనే పరీక్షిత్తుకూడ శుకబ్రహ్మయంతటి వానిని 'జుగుప్సితం' అను పదముతో ఈప్రశ్న వేసినాడంటే మనకు సందేహము రావడములో సందేహమే లేదు. దీనికి శుకబ్రహ్మ:

శ్లో॥ అనుగ్రహాయ భూతానాం మానుషం దేహమాశ్రితః।
భజతే తాదృశీః క్రీడాః యాశ్శ్రుత్వా తత్పరో భవేత్ ॥
[భాగ. 10–33–38]

అని బదులు చెప్పినాడు. ఈ భాగములో 'అనుగ్రహాయ' అను పదమును వ్యాఖ్యానించుచు శ్రీధరస్వామి :

"శృంగారరసాకృష్టచేతసః బహిర్ముఖానపి
స్వపరాన్ కర్తుమితిభావః"

అని వివరించినాడు. దీనివలన భగవత్పరముగ బహిర్ముఖానందమును చెందదలచినవారినికూడ స్వామి తనవారినిగ చేసికొనుటకు దయ చూపుచున్నాడు. కావున ఈ శృంగారము బాహ్యముగ శృంగారమైనను ఆంతరముగ భగవత్పరమైనందున పవిత్రమేయని తెలియు చున్నది.

రాసక్రీడానంతరము శంఖచూడాదివధమునుచెప్పే 34-వ అధ్యాయారంభమునకు పీఠికగా పూర్వాధ్యాయఫలమును చెప్పుచు శ్రీధరస్వామి :

'తదేవం కామానుగ్రహముఖేన కామజయం ప్రతిపాద్య'

అని సూచించినాడు. దీనివలన భగవదర్పితమైనకామలీల, భౌతిక కామములనుండి దూరమై భగవత్ప్రాప్తికి కారణమగుచున్నదని మన మూహింపవలసియున్నది. ఇదే కామజయము అశ్వమేధము నందుకూడ "అంబే అంబాల్యంబికే" అను శ్రుతిచేత వివరింపబడు చున్నది. పైనచెప్పినభాగవతపురాణపద్ధతి శ్రుతికి సన్నిహితమని ఊహింపవలసియున్నది. రాసక్రీడానంతరము దానిఫలశ్రుతి చెప్పుచు భాగవతము :

శ్లో॥ విక్రీడితం వ్రజవధూభి రిదంచ విష్ణోః
శ్రద్ధాన్వితో ను శ్రుణయా దనువర్ణయేద్యః।

భక్తిం హరౌ భగవతి ప్రతిలభ్య కామం
హృద్రోగ మాశ్వపహినో త్యచిరేణ ధీరః ॥

[భాగ. 10-33-41]

అని కీర్తించినది. ఇదేఘట్టమునందు నారాయణీయభాగవతము,

శ్లో॥ జారాత్మనా న పరమాత్మతయా స్మరంత్యః
నార్యోగతాః పరమహంసగతిం క్షణేన ।
తం త్వాం ప్రకాశపరమాత్మతనుం కథంచిత్
చిత్తే వహ న్నమృత మశ్రమ మశ్నువీయ ॥

[నారా. భాగ. దశకము 65. శ్లో 8.]

అని కీర్తించినది.

కంసవధానంతరము దేవకీదేవి బలరామకృష్ణులను చూచి, మీకు ముందు పుట్టి కంసునిచే చంపబడిననాసంతానమును చూడ గోరుచున్నాను అనగా, వారు ఆసంతానమున్న పాతాళమునకు పోయి అక్కడ బలిచక్రవర్తిని చూచిరి. అప్పుడు బలి రామకృష్ణులతో

శ్లో॥ సాలోక్యంచాపి సారూప్యం సామీప్య మథ సాత్మతాం ।
ప్రాప్తాస్తే పుండరీకాక్ష భావోహి భవకారణమ్ ॥
కేచిదుద్బుద్ధవైరేణ భక్త్యా కేచన కామతః ।
న తథా సత్వసంరబ్ధాః సన్నికృష్టా స్సురాదయః ॥

[భాగ. 10-85-42, 43]

అని పల్కినాడు. దీనివలన సాత్త్వికమైనతపస్సునకంటెకూడ స్వామి సాయుజ్యమునకు వైరము—భక్తి—కామము ప్రధానముగ పేర్కొనబడినవి. ఇందులో వైరముతో కంసచైద్యాదులు, భక్తితో అక్రూరనారదాదులు, కామముతో గోపికలు స్వామి సాయుజ్యము నందిరనుట సిద్ధము. ఎవరిపైనగాని వైరమైనను, భక్తియైనను, కామమైనను గాఢముగ నిలిచినచో, దానికిగురియైన ఆవ్యక్తి గట్టిగ

మనసులో పాదుకొనును. ఆవ్యక్తి మనుష్యుడైతే ఐహికఫలము అశాశ్వతము, దైవమైతే దివ్యఫలము-శాశ్వతము. ఇంతేగదా దీని సారము. కావుననే కంసాదులు, అక్రూరాదులు, గోపికలు ముక్తి నందిరని భాగవతము గొంతెత్తి చాటుచున్నది.

ఇదే విషయమునందు ఇంకకొంచము దృఢముగ, సంగ్రహముగ, సారవంతముగ విష్ణుపురాణ ముపదేశించుచున్నది. శరద్రాత్రి వేళజరిగినరాసక్రీడకు ముందు ఆ శరద్రాత్రిని విష్ణుపురాణము, భాగవతముకూడ విచిత్రముగ వర్ణించినవి. ఆశరద్వర్ణనమునకు పీఠికగా విష్ణుపురాణవ్యాఖ్యాతయగు శ్రీధరస్వామి

**"గోవర్ధనవహాదీని శరత్కర్మాణి వర్ణయన్ ।**
**శరదం వర్ణయత్యాదౌ అధ్యాత్మార్థోపమానతః ॥**

అని వివరించినాడు. ఇది శ్రీధరీయ శ్లోకము. ఆ శరద్వర్ణనము మచ్చునకు రెండుశ్లోకములు:

**శ్లో॥ మయూరాః మౌన మాతస్థుః పరిత్యక్తమదా వనే ।**
**అసారతాం పరిజ్ఞాయ సంసారస్యేవ యోగినః**

[విష్ణు 5-10-8]

**శ్లో॥ బభూవ నిర్మలం వ్యోమ శరదా ధ్వస్తతోయదం ।**
**యోగాగ్నిదగ్ధక్లేశౌఘం యోగినామివ మానసమ్ ॥**

[విష్ణు 5-10-12]

ఈ విధముగా విజృంభించిన ఆశరద్రాత్రిలో పలువురు గోపికలు కృష్ణునితో రాసక్రీడ సలిపిరి. ఆ రాసక్రీడయంతయు పైకి శృంగారమయమైనను లోపలికి అధ్యాత్మవిద్యామయము. ఒక గోపిక దశనుగూర్చి విష్ణుపురాణము:—

**శ్లో॥ తచ్చిత్తవిమలాహ్లాదక్షీణపుణ్యచయా తథా ।**
**తదప్రాప్తిమహాదుఃఖవిలీనాశేషపాతకా ॥ అన్నది**

[విష్ణు 5-10-21]

శ్రీకృష్ణుని మనసులో ధ్యానించేఆనందముతో ఒడలుమరచినగోపి కకు తాను పూర్వము సంపాదించుకొన్న పుణ్యారాశియంతయు నశించినదట. ఆ స్వామిని తనవశముచేసుకోలేనిమహాదుఃఖముతో తనపూర్వార్జితపాపవిశేషమంతయు నశించినదట. ముక్తుడగు వానికి పుణ్యాపాపములు రెండును ప్రతిబంధకములే. పుణ్యముతో ఉత్తమ జన్మము-ఉత్తమలోకము, పాపముతో నీచజన్మము-నరకలోకము సంభవించుచున్నవి. ఉత్తమజన్మమైనను జన్మమేకదా. జన్మమును కడ దాటుటయేకదా ముక్తి. కావున ముక్తికి పుణ్యముకూడ ప్రతిబంధకమే. అందుకే "పుణ్యాపాపే విధూయ" అని శ్రుతి. సిడుపాటి జడలుపెరిగినమహాయోగులకుకూడ సంభవింపని ఈ పుణ్యాపాపనాశనము గోపికకు సంభవించినదంటే మరి యోగమునకంటే భగవదేకాగ్రమైనకామ ముత్తమముకాదా? పై శ్లోకములో శృంగారసంబంధులైన సంయోగవియోగములు రెండును చెప్పబడినవి. కాని ఫలితము మహాయోగులకుకూడ అందరానిది. అట్లే

> శ్లో॥ చింతయంతీ జగత్సూతిం పరబ్రహ్మస్వరూపిణం।
> నిరుచ్ఛ్వాసతయా ముక్తిం గతాఽన్యా గోపకన్యకా॥
>
> [విష్ణు 5-10-22]

ఒకగోపిక స్వామిని తలచి తలచి తన్మయీభావముతో మైమరచి, తుదకు ఉచ్ఛ్వాసనిశ్వాసములుకూడ లేక రాతిబొమ్మవలె నిలిచినదట. ఈఘట్టములో 'నిరుచ్ఛ్వాసతయా' అను పదమును వ్యాఖ్యానించుచు,

"ప్రియానుభవరూపధ్యానాత్ అంతర్మగ్నే మనసి తదవినాభూతప్రాణాదేరపి అంతర్గతత్వాత్ నిరుచ్ఛ్వాసత్వం, దశమ్యావస్థయా ప్రియమితి కామశాస్త్రే వల్లభసాయుజ్యముక్తం. ద్వేషా చ్చైద్యాదేరివ కామాత్ గోపీనాం సాయుజ్య ముపపన్నం"

అని విష్ణుచిత్తీయము చెప్పుచున్నది. కావున భాగవతవిష్ణుపురాణములలోనిగోపికాభక్తి అన్నమయ్య నాకర్షించినది.

## అన్నమయ్య శృంగారము

దానికి తోడు ఆయన పట్టుగ అభ్యసించిన శ్రీవైష్ణవవేదాంత పద్ధతి ఆయాకర్షణక్రియకు దోహదము చేసినది. శ్రీవైష్ణవ మతమునకు చేరిన పంద్రెండుగురు ఆళ్వారులుకూడా ఈ నాయికాభావమునకు అగ్రపూజ యిచ్చి కొనియాడి తరించినారు. అందువలననే ద్రావిడభాషలలోనున్న నాలుగు వేలపాటలను 'నాలాయిర దివ్య ప్రబంధ' మని రామానుజమతస్థులు కొనియాడుచున్నారు. ఆ దివ్యప్రబంధమునకు వేదముతో సమానమైన స్థానమునుగూడ నిచ్చి 'ద్రావిడ వేద'మని చెప్పుచున్నారు.

శ్రీవైష్ణవ మతదీక్షతో, పై చెప్పిన దివ్యప్రబంధాదుల శ్రవణ మననములతో, ఆ యాళ్వారులముక్తి సిద్ధాంతముతో పండినఅన్నమయ్యమనస్సు. ఈ శృంగారసంకీర్తనలరాశికి బాట వేసుకొన్నది. కానీ అన్నమయ్యశృంగారసంకీర్తనలలో భౌతికశృంగారము ఎక్కువగ త్రావుచేసుకొన్నట్లు కన్పట్టుచున్నది. దీనికి కారణము ఆయన ఎంతవేదాంతము చదివినను, ఆయన మనసులో నిలిచినది గోపికా భక్తియే. నారద భక్తిసూత్రములయందు :

"సా త్వస్మిన్ పరమప్రేమరూపా" (నార-భ-సూ. 1–2)

"పూజాదిష్వనురాగ ఇతి పారాశర్యః।
కథాదిష్వితి గర్గః। ఆత్మరత్యవిరోధేనేతి శాండిల్యః।
నారదస్తు తదర్పితాఖిలాచారితా తద్విస్మరణే పరమవ్యాకులతేతి।
అస్త్యేవమేవం। యథావ్రజగోపికానాం॥"
తత్రాపి న మాహాత్మ్యవిస్మృత్యపవాదః।
తద్విహీనం జారాణామివ॥

అని నారదభక్తిసూత్రములు 1-వ అధ్యాయము 16 నుండి 23 వరకు గలవి చెప్పుచున్నవి. అట్లే 'అతఏవ తదభావాద్వల్లవీనామ్' అని శాండిల్యభక్తిసూత్రము (1-14).

"భజనం అంతఃకరణస్య భగవదాకారతారూపం భక్తిః" అని కానీ, "భజ్యతే సేవ్యతే భగవదాకార మంతఃకరణం క్రియతే అనయా ఇతి భక్తిః" అని కాని, "భజ్యతే ఆస్వాద్యతే భగవాన్ నాయకత్వేన అనయా ఇతి భక్తిః" అని కానీ, భక్తికి వ్యుత్పత్తి చెప్పుకొనవచ్చును. ఈ విషయమునే "దృష్టానుశ్రావిక విషయతృష్ణస్య వశీకారసంజ్ఞా వైరాగ్యమ్," "తత్పరం పురుషఖ్యాతేః గుణవైతృష్ణ్యం" పా. యో-సూ 1-15-16. అను పాతంజలయోగసూత్రములును వివరించుచున్నవి.

"యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమోమతః"

(భగ. 6-47)

అను భగవద్గీతాశ్లోకమునకు మధుసూదనసరస్వతీవ్యాఖ్యానముకూడ పెద్దలు పరిశీలింపగలరు.

పై భాగవత విష్ణుపురాణములనే ఆధారముగా చేసుకొని మధుసూదనసరస్వతి తనభక్తిరసాయనమును సాగించినాడు. అందులో

"[1] ఉపాయాః ప్రథమస్కంధే నారదేనోపవర్ణితాః
సంక్షేపాత్తానహం వక్ష్యే భూమిభేదవిభాగతః ॥
ప్రథమం మహతాంసేవా తద్దయాపాత్రతా తతః
శ్రద్ధాఽథ తేషాం ధర్మేషు తతో హరిగుణశ్రుతిః ॥
తతో రత్యంకురోత్పత్తిః స్వరూపాధిగతి స్తతః
ప్రేమవృద్ధిః పరానందే తస్యాఽథ స్ఫురణం తతః ॥
భగవద్ధర్మనిష్ఠాతః స్వస్మిం స్తద్గుణశాలితా
ప్రేమ్ణోఽథ పరమా కాష్ఠేత్యుదితా భక్తిభూమికాః ॥"

[భక్తిరసాయనము, ప్రథమోల్లాసము 31-34]

"మహాపురుషులసేవ, వారిదయకు పాత్రుడగుట, వారొనరించు

1. చూ. భక్తిరసాయనము. సాధనగ్రంథమండలి 52. తెనాలి 1953.

ధర్మములపై శ్రద్ధ, భగవద్గుణశ్రవణము, భగవంతునియందు ప్రేమ ఉదయించుట, భగవత్స్వరూపమును తెలిసికొనుట, భగవత్స్ఫూర్తి, భగవద్ధర్మనిష్ఠ, తనయందాగుణములను పెంపొందించుట, భగవంతునిపై గల ప్రేమ పరాకాష్ఠనందుట అనునవి క్రమక్రమముగా, ఒకదానితర్వాత ఒకటి అలవడవలెను. వీటినన్నింటిని శాస్త్రీయోపాయములందురు. ఇవి యన్నియు భాగవతమున వ్యాసనారద సంవాదములో వివరింపబడినది ''

వీనిలో తుదిమెట్టు నందుకొన్నవాడు మనఅన్నమయ్య, ఈ శృంగారభక్తినే మొదట మూడుదశలుగ, తరువాత ఆ దశలతో ఎనిమిదివిధములుగ మధుసూదనసరస్వతి పేర్కొనినాడు.

శ్లో॥ వైకుంఠే ద్వారకాయాం చ శ్రీమద్బృందావనే తథా।
మృదుతీవ్రా మధ్యతీవ్రా తీవ్రతీవ్రా చ సా క్రమాత్॥
ఇయం నిసర్గసంసర్గౌపమ్యాధ్యాత్మాభియోగజా।
సంప్రయోగాభిమానాభ్యాం సమారోపే స్థితా తథా॥

[భక్తిరసాయనము. ద్వితీయోల్లాసము-62,63]

ఈ భక్తి మృదుతీవ్రము, మధ్యతీవ్రము, తీవ్రతీవ్రము అని మొదట మనమనోబలమునుబట్టి మూడుదశలుగా, తరువాత ఆదశలతోనే ఎనిమిది విధములుగా పేర్కొనబడినది. 1. సంస్కార విశేషముగల ఆత్మయందు సహజముగా పుట్టినది నిసర్గభక్తి. 2. ఇతరసంబంధములతో కలిగినది సంసర్గభక్తి. 3. స్వామిసదృశవిషయములను చూచి కలిగినది ఔపమ్యభక్తి. 4. వేదాంతవిషయవాసనతో కలిగినది అధ్యాత్మభక్తి 5. తనమనసులోని భావములఒత్తిడిచే కలిగినది అభియోగభక్తి. 6. నిత్యకర్మానుష్ఠానముతో కలిగినది సంప్రయోగభక్తి, 7. నేనింత కావలెను అను సంకల్పముతో కలిగినది అభిమానభక్తి. 8. తనయందు నాయికాత్వమును, స్వామియందు నాయకత్వమును ఆరోపించుకొని విషయసుఖాత్మకముగ సాగినది

సమారోపభక్తి. ఈ కడపటిదగు సమారోపభక్తియే మన అన్నమయ్యాది. క్షేత్రయ్య, రూపగోస్వామి, మీరాబాయి, ఒకదశలో రాను కృష్ణపరమహంస మొదలగువారు ఈకోవవారే. ఇంకను నాలుగువిధములభక్తిని చెప్పి దానిని గోపికలయందు సమన్వయింపజేసినాడు మధుసూదనసరస్వతి.

శ్లో॥ "వ్రజదేవీషు చ స్పష్టం దృష్టం రతిచతుష్టయమ్,
తచ్చిత్తాలంబనత్వేన స్వచిత్తం తాదృశం భవేత్ ॥

[భక్తిరసాయనము 2–72]

గోపికాస్త్రీలయందు కనబడుభక్తిని భావించినవారికి, వారిచిత్తమువలెనే తనచిత్తముగూడ మారుచున్నదని స్పష్టమగుచున్నది. మరి సాధారణమై, తుచ్ఛమైన లౌకికశృంగారమే కావ్యములయందు విభావాదిరూపముగ సమర్పింపబడి, రసానందమును చేకూర్చుచున్నదని ఆలంకారికులు చెప్పుచున్నారు. కాని కనపడనిరూపముగల స్వామివిషయమున కేవలమానసికముగ సాగించినఈశృంగారము శాశ్వతరసానందము కలిగించుననుటలో సందేహమేలేదు అందులకే

శ్లో॥ పరిపూర్ణరసా క్షుద్రరసేభ్యో భగవద్రతిః।
ఖద్యోతేభ్య ఇవాదిత్యప్రభేవ బలవత్తరా ॥

[భక్తిరసాయనము. 2–78]

క్షుద్రములగుకావ్యశృంగారరసములతో తన్మయులగువారికి భగవద్విషయకశృంగారభక్తి, మిణుగురు బూచులను చూచి అబ్బురపడువారికి ఆదిత్యప్రభవలె కన్పట్టగలదు, కావున అన్నమయ్యాది నేను తొలుత పేర్కొనిన పాషండదురాచారభక్తిశృంగారము కాదనీ, యోగసూత్ర, భక్తిసూత్ర, భాగవత, విష్ణుపురాణము మొదలగుపరమపవిత్రగ్రంథములచే చెప్పబడి, ఏకొందరిమహానుభావులకో, ఎన్నిజన్మములతపఃఫలముగనో సిద్ధించునట్టి సాత్త్వికము, శుద్ధము, సంతారకము అయిన భక్తిశృంగారము అని నా

మనవి. ఎన్ని జన్మములకైన మనము, దానిని భౌతిక భావములేక పరమాత్మానందరూపముగ భావింపగలమా? యని ఆత్మపరామర్శ చేసికొనదగినది

గురువులయొద్ద చదివిన వేదాంతము, ఆళ్వారుల చరిత్రములు, భాగవత విష్ణుపురాణములందును - నారద శాండిల్యాది భక్తిసూత్ర ములయందును వివరింపబడినగోపికాభక్తియు, అన్నమయ్యకు ఆదర్శములుగా నిలిచి, ఆతనిచే ఈ శృంగారసంకీర్తనలరాశిని నిర్మింప జేసినవి. ఆళ్వారులయందు కానరానిపామరశృంగారము ఈతని యందు కానవచ్చుటకు భాగవతవిష్ణుపురాణములే కారణములుగా తోచుచున్నవి.

తననొక నాయికగా భావించుకొని, స్వామిని నాయకునిగా మనసున నిల్పుకొని, పురుషుడై దొడ్డసంసారియైన తాను, తన యందు పుంస్త్వమే లేనట్లు, ఆడుదనమే నిండుకొన్నట్లు అంత తన్మయీభావముతో ఈ కీర్తనలను రచించినాడు. కొన్ని పట్టుల పరిశీలించునప్పుడు, భౌతికసుఖములను రెండుచేతుల జుఱ్ఱుకొను రసికస్త్రీలకుకూడ మనసుకందనిశృంగారమర్మములను, తెచ్చిపెట్టు కొన్ననాయికాత్వముగల ఈతడు వర్ణించుట చూడగా ఎంత యోగికైనను ఈతన్మయీభావము కుదురదని ఊహింపవలసి యున్నది.

తనకుముందే సంస్కృతమున జయదేవుడు :

శ్లో॥ యది హరిస్మరణే సరసం మనః
యది విలాసకథాసు కుతూహలమ్ ।
మధురకోమలకాంతపదావలీం
శృణు తదా జయదేవసరస్వతీమ్ ॥

అని ఉపక్రమించినగీతగోవిందములోనిశృంగారముకూడ ఈతని

నాకర్షించియుండవచ్చు. ఈతనిశృంగారపరమార్థమును తెల్పునట్టి రెండు మూడుపాటల నుదాహరించుచున్నాను.

ముఖారి *

ఇది గాక సౌభాగ్య మిదిగాక తపము మఱి
యిదిగాక వైభవం బిఁక నొకటి గలదా. ॥ పల్లవి ॥

అతివజన్మము సఫలమై పరమయోగివలె-
నితరమోహాపేక్ష లిన్నియును విడిచె
సతికోరికలు మహాశాంతమై యిదె చూడ
సతతవిజ్ఞానవాసనవోలె నుండె ॥ ఇది ॥

తరుణిహృదయము కృతార్థతఁ బొంది విభుమీఁది-
పరవశానందసంపదకు నిరవాయ
సరసిజానన మనోజయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చలభావమాయ ॥ ఇది ॥

శ్రీ వేంకటేశ్వరునిఁ జింతించి పరతత్త్వ-
భావంబు నిజముగాఁ బట్టె చెలి యాత్మ
దేవోత్తమునికృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు తిరమాయ ॥ ఇది ॥

(12 సంపు-17 కీర్తన.)

కన్నడగౌళ

కామయాగము చేసెఁ గలికి తన-
ప్రేమమే దేవతాప్రీతిగాను ॥ పల్లవి ॥

పొలుపలర సురతతాంబూలరసపానంబు
నలినాక్షి సోమపానంబుగాను
కలకలంబుల మంచిగళరవంబుల మోఁత
తలకొన్న వేదమంత్రములుగాను ॥ కామ ॥

---

* దీని విస్తృతవ్యాఖ్యానము చూ: 12 సంపుటము పీఠిక పుటలు 18–20

పడఁతి తనవిరహతాపమునఁ బుట్టినయగ్ని
అడరి దరికొన్న హోమాగ్నిగాను
ఒడఁబడిక సమరతుల నుదయించినచెమటఁ
దడియుటే యది యవభృథంబుగాను ॥ కామ ॥

తనరఁ గుచములరుచులు దంతా( త ? )క్షతక్రీడ
నను పైన పశుబంధనంబుగాను
యెనసి శ్రీతిరువేంకటేశ్వరునిపొందు
ఘనమైనదివ్యభోగంబుగాను ॥ కామ ॥

(12 సంపు-223 కీర్తన)

వరాళి

వెలయు నీకల్యాణవేదిగా మతినుండి
కలికి జవ్వనపుయాగము సేసె నతఁడు ॥ పల్లవి ॥

మలయు నీనాభిహోమపుగుండమునను
నెలకొన్న విరహాగ్ని నిండాఁ బోసి
పొలయునీనిట్టూరుపుల విసరుచును
వొలుకుఁజెమటల నాహూతి వోసె నతఁడు ॥ వెలయు ॥

కదిసి నీవెన్నడిమిగగనమునందు
పొదలినయారనేపొగ నిండఁగా
మదిరాక్షి నీమంచిమానపుఁబశువు
నదనెరిఁగి వేలిచె నతివ నీకతఁడు ॥ వెలయు ॥

కాటుకకన్నుల నిన్నుఁ గడునలయించి
బూటకముల చిటిపొటిసిగ్గుల
గాఁటపుఁగరుణ వేంకటగిరివిభుఁడు
కోటిహోమము సేసెఁ గూడి నిన్నతఁడు ॥ వెలయు ॥

(12 సంపు-288 కీర్తన)

పై మూడు పాటలలో నిశ్శృంగార రహస్యమును రసికు లూహింపగలరు. మొదటిది వేదాంత పరమార్థముగ, రెండవది నాయికా కృతమైన వైదికహోమప్రక్రియగా, మూడవది నాయక కృతమైన వైదికహోమప్రక్రియగా వర్ణింపబడినవి. వేదములోగూడ ఇట్లే రతి, హోమప్రక్రియగా వర్ణింపబడియుండుట సుప్రసిద్ధమే.

తపము, యోగము, కర్మము అనువీనికి ఇంద్రియజయము. యమనియమాది సాధనము, కాలముదాటనిదీక్షయు అవసరము లైనవి. వీనిలో హృదయపరిపాకమునకంటె శ్రద్ధ, సాధనము ముఖ్యములు. భక్తియందు శ్రద్ధతోపాటు హృదయపరిపాకము, తన్మయీభావము హెచ్చు. ఆ హృదయపరిపాకము బలిసినపుడే తన్మ యీభావము సిద్ధించును. హృదయము అయస్కాంతమువలె తాననుకొన్నవస్తువును పట్టుకొని విడువకున్నచో హృదయపరి పాకము సిద్ధించినట్లు. ఈ భక్తిప్రక్రియలలో కొన్ని కాలికములు, కొన్ని దైశికములు, కొన్ని మానసికములు, కొన్ని పరాశ్రయములు. కొన్ని ఆత్మార్పణరూపములును గలవు.

**శ్లో॥ అంకోలం నిజబీజసంతతి రయస్కాంతోపలం సూచికా**
**సాధ్వీ నైజవిభుం లతా క్షితిరుహం సింధు స్సరిద్వల్లభమ్।**
**ప్రాప్నోతీహ యథా తథా పశుపతేః పాదారవిందద్వయే**
**చేతోవృత్తిరుపేత్య తిష్ఠతి యదా సా భక్తిరిత్యుచ్యతే॥**

(శివానందలహరి శ్లో॥ 61)

తొలికారు మబ్బులురిమినపుడు నేలపైనున్న ఊడుగగింజలు ఎగిరి చెట్టుమొదటి నంటికొనునట. ఇదికాలికము. సూది, తనపట్టు నకు తగినంతదూరములోనున్న సూదంటురాయిని పట్టుకొనును. ఇది దైశికము. పతివ్రత తనభర్త నెప్పుడు మనమున నిలిపి తలచు చుండును. ఇదిమానసికము. తీగ, తానెక్కడ క్రిందపడి త్రొక్కుడు పడుదునోయని చెట్టుకు చుట్టుకొనియుండును. ఇదిపరాశ్రయభక్తి.

ఏరు చాలాదూరము పరుగులెత్తి సముద్రములో కలిసి తనరూపమే లేకుండ సముద్రమయముగ మారిపోవును. ఇది ఆత్మార్పణభక్తి. అట్లే, మన అన్నమయ్యయుచాలకాలము పరమాత్మయందు మనసు నిలిపి, సంకీర్తనరూపముగ ప్రవహించి పరమాత్మసముద్రమున గలిసిన మహాభక్తుడు. ఈతడు తనభక్తితురంగమును, సంగీతమను కళ్లెముతో, సాహిత్యశ్వేతద్వీపమున తరిమి నడిపి, వైకుంఠధామము నందుకొన్న మహాభాగవతయోధుడు. అందులకే

శ్లో॥ వీణావాదనతత్వజ్ఞః శ్రుతిజాతివిశారదః
తాలజ్ఞశ్చాప్రయాసేన మోక్షమార్గం నియచ్ఛతి॥

శ్లో॥ గీతజ్ఞో యది యోగేన నాప్నోతి పరమం పదం
రుద్రస్యానుచరో భూత్వా తేనైవ సహ మోదతే.॥

(యాజ్ఞవల్క్యస్మృతి, యతిధర్మప్రకరణం–115,116)

గీతజ్ఞుడై, యోగసిద్ధుడై భక్తిభావముతో ముక్తిసీమ నలంకరించిన వాడు మనఅన్నమయ్య.

ఈతని శృంగారములో ప్రబంధములందున్నట్లు కొంతపచ్చిదనము అక్కడక్కడ కనబడుచుండుట నిజమే. అది గీతగోవిందములో లేదా? గోపికలవిషయమున లేదా? కృష్ణకర్ణామృతమున లేదా? మరి వీరిశృంగారము మాత్రము మడిగట్టుకొనవలెనా? శృంగారమన్నప్పుడు కచకుచాది వర్ణనలు, రతిలంపటములు లేక, దర్భలు- రుద్రాక్షమాలలు - భస్మత్రిపుండ్రములు-తులసీదామములు - ఊర్ధ్వపుండ్రములు సాక్షాత్కరించునా? నిగనిగలాడుపట్టుచీరలఅంగడిలో పచ్చారిసరకులు దొరకునా? ఎటుచూచినా కొన్నికీర్తనలందుగల పచ్చిదనము మాత్రము మనదృష్టిలో హేయము కావచ్చు, అది తప్పనిసరి. నాయికారూపము ధరించినఅన్నమయ్య తనప్రాణేశ్వరుడగు వేంకటేశ్వరునితో విచ్చలవిడి సంచరింపక, మనలనుజూచి భయపడి నంగి నంగిగా నడచుకొావలెనా? అన్నమయ్యకున్నంత ఆత్మార్పణభక్తి,

నాయికాత్మసిద్ధి మనకున్నచో మనమీమాట అనలేము. అంత ఆత్మార్పణశక్తి లేకుండుట మనలోనిలోపమేకాని ఆతనిలోపము కాదు. ఈతనిశృంగారకీర్తనలరాశిలో వ్యంగ్యమర్యాదకుపడగలెత్తిన పాటలెన్నియో కలవు. అవి మనము వాడుకొనవచ్చును. పాడుకొనవచ్చును.

"నాయకస్య కవేః శ్రోతుః సమానోఽనుభవో మతః" అన్నట్లు శృంగారసంకీర్తనకర్తయగు అన్నమయ్యతోపాటు మనకు సమానానుభవము కలిగినచో అప్పుడు ఆ పాటలలోనిపచ్చిదనము మన కగపడదు. లౌకికస్త్రీపురుషులకు సంబంధించినశృంగారము వారి అంతస్తుకు తగిన ఔచిత్యమును పాటింపవలెను. భగవద్విషయమై, భగవదర్పితమైన ఆత్మార్పణసిద్ధితో సాగించినశృంగారమునందు ఈ లౌకికమర్యాదలను పాటింపవలసినపని లేదు. అది ఆయంతస్తు వారికే స్పష్టముగ అర్థము కాగలదు.

బళహంస

పాయపువారమట పందిపొల్లవోయీనా
చాయల మెలఁగవోయి జరపులేమిటికి ॥ పల్లవి ॥

కన్నుల నీవు మొక్కఁగ కాదని తోసేనా
చన్నుల నొత్తితేను చాలుననేవా
యెన్నిలేవు నీయాస లెక్కడ నుండినాను
పన్ని లోనికి రావోయి పరపుమీఁదికిని ॥ పాయ ॥

సరసము నీవాడఁగ సమ్మతించకుండేనా
వొరసి నేఁ గొసరితే నొల్లననేవా
యిరవైనకోరికలే యిందుకు మీఁదుమిక్కిలి
తెరవేసితి రావోయి తేరి నాముందరికి ॥ పాయ ॥

పైపై నీవు గూడఁగాను పలుమారు లోఁగేనా
దాపుగా నామోవిచ్చితే తనివందేవా
• యేపున శ్రీవేంకటేశ యెప్పుడూ సమరతులే
ఆపనికి రావోయి అప్పటి కాఁగిటికి ॥ పాయ ॥

[26 సంపుట - పాట 587]

దేసాళం

అటువంటిది గలితే నానతీవయ్యా
యెటువంటిమగవాఁడ వేమిచెప్పేవయ్యా ॥ పల్లవి ॥

చనవుసేసుక నీతో సరసములాడితేను
కొనగోరుదాఁకెనంటా గుంపించేవు
వెనకటిచెలులెల్లా వినోదములాడేవేళ
మనసిజముద్రలకు మాన్యమిచ్చిరా ॥ అటు ॥

మచ్చికచేసుక నీతో మాటలు నేనాడితేను
యెచ్చుకుందులున్నవంటా యెగ్గుపట్టేవు
అచ్చమైనరతివేళ ఆడువారెల్లాఁ గూడి
పచ్చిమాటలాడమని బాసయిచ్చిరా ॥ అటు ॥

కూరిమిసేసుక నిన్నుఁ గూడఁగా శ్రీవేంకటేశ
మేరలుమీరితినంటా మించివచ్చేవు
కోరిక కాఁగిట నీకు గోపసతులెల్లాను
మారుకొనమని నీకు మన్ననిచ్చిరా ॥ అటు ॥

[26 సంపుట - పాట 594]

వీనిలోని పలుకుబడులను రాసిక్యమును సహృదయులు గుర్తింప గలరు. ఇందులోనిపచ్చిదనముగూడ, స్వామియందు అన్నమయ్యకుగలచనవును, తాను నాయికగా మగతనము మరచి,

సారోపమైన ఆదుదనముతో స్వామితో కలిసి అనుభవించిన తన్మయీభావమును స్పష్టము చేయుచున్నది.

శ్లో॥ బాలోఽపిశైలోద్ధరణాగ్రపాణి ర్నీలోఽపి నీరంధ్రతమః ప్రదీపః।
ధీరోఽపి రాధానయనావబద్ధో, జారోఽపి సంసారహర స్త్వమేవ॥
(శ్రీకృష్ణ కర్ణామృతము 2–73)

అనిన లీలాశుకు డాశృంగారమర్మము నెరుగును.

శ్లో॥ బ్రహ్మాండాని బహూని పంకజభవాన్ ప్రత్యండ మత్యద్భుతాన్
వత్సాన్ గోపయుతా నదర్శయ దజం విష్ణూ ననేకాంశ్చ యః।
శంభుర్యచ్చరణోదకం స్వశిరసా ధత్తే చ మూర్తిత్రయాత్
కృష్ణోవై పృథగస్తి కోఽప్యవికృతః సచ్చిన్మయో నీలిమా॥
—ప్రబోధసుధాకరము. 242.

అన్నట్లు శ్రీకృష్ణుని పరబ్రహ్మగా శాస్త్రములు ఘోషించుచున్నవి. ఆతని శైశవమునే కొందరు, బాల్యమునే కొందరు, మంచి నడిప్రాయమునే కొందరు భావించి తరించినారు. మనఅన్నమయ్య ఆతని నన్ని విధముల ధ్యానించి తరించిన మహనీయుఁడు. మాతృమూర్తిగ వాత్సల్య భావముతో చూచినందుకు;

భైరవి

ఉగ్గు పెట్టరే వోయమ్మా చె-
య్యొగ్గీ నిదె శిశు వోయమ్మా ॥ పల్లవి ॥

కడుపులోనిలోకమ్ములు గదలీ-
నొడ లూఁచకురే వోయమ్మా
తొడికెడి సరుగనఁ దొలఁగఁదీయరే
వుడికెడిపాలివి వోయమ్మా ॥ ఉగ్గు ॥

చప్పలు వట్టుక సన్నపుబాలుని-
　　నుప్పర మెత్తకు రోయమ్మా
　　• అప్పుడె సకలము నదిమీ నోరనె
　　వొప్పదు తియ్యరె వోయమ్మా　　॥ ఉగ్గు ॥

తొయ్యలు లిటు చేతుల నలఁగించక
　　వుయ్యల నిడరే వోయమ్మా
　　కొయ్యమాటలను కొండలతిమ్మని-
　　నొయ్యన తిట్టకు రోరమ్మా　　॥ ఉగ్గు ॥

(అన్న. శృం. సంపుటం. 12–పాట 97)

ఇట్లే మిగిలినవన్నియును గ్రంథములందు సహృదయులు చదివి తనియగలరు. విస్తరభీతిచే ఉదాహరింపలేదు. ఎక్కువభాగము ఆతడు ప్రౌఢమూర్తినే వలగొన్నాడు. అందుకే శృంగారరస ప్రవాహముగ సంకీర్తనలరాశి పెరిగినది. ఆతనిలో దేవత్వమును భావించినకీర్తనలెన్నో కలవు.

## అధ్యాత్మ శృంగార సంకీర్తనల పౌర్వాపర్యము.

అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలను ముందు వ్రాసెనా? శంగార సంకీర్తనలను ముందు వ్రాసెనా?అను సందేహముగూడ కొందరికి కలుగవచ్చు. మంచివయసులో శృంగారసంకీర్తనలనువ్రాసి, "సోఽయం సంప్రతి రాజశేఖరకవిః వారాణసీం వాంఛతి" అన్నట్లు కడపట అధ్యాత్మ కీర్తనలను వ్రాసి యుండునను వాద మొకటి సాధారణముగ తోచవచ్చు. కాని నా దృష్టిలో, అధ్యాత్మ సంకీర్తనలే ముందు వ్రాసి శృంగార సంకీర్తనలే తరువాత వ్రాసినాడనుటయే సమంజసముగా తోచుచున్నది. గురువుగారియెద్ద చదివిన వేదాంతము, పరమాత్మయందు చిక్కినమనస్సు, నిత్యానుష్ఠానములోనిశ్రద్ధ ఇవన్నీ ఒక్కటిగా

చేరి తొలుత అధ్యాత్మ కీర్తనలే రచించి, మనసు పండగా పండగా, వేంకటేశ్వరునితో చనవు బలియగా బలియగా, హృదయము పరిపక్వము కాగా కాగా, ఆత్మార్పణబుద్ధి నిండగా నిండగా, భాగవతవిష్ణుపురాణాదులయందలిగోపికాభక్తి తన్నావేశింపగా ఉత్తర వయసుననే శృంగారసంకీర్తనలరచన సాగించియుండును. ఇంత మర్మజ్ఞతగలశృంగారరచన ఉత్తరవయసున సాధ్యమా అనరాదు. ఇది హృదయపరిపాకసిద్ధికి, స్వామితో కలిగినచనవునకు తార్కాణములు. వయోధర్మ మిక్కడ పనిచేయదు. మనోధర్మమునకే అగ్రపూజ. ఈతనిశృంగారసంకీర్తనలయందు వేంకటేశ్వరుడే నాయకుడైనను అతడు శ్రీకృష్ణపరబ్రహ్మగనే భావింపబడినాడు. అందుకే మాటిమాటికి కృష్ణచరిత్రము, గోపికలను పేర్కొనుట, తన్మయీభావముతో లెక్కకుమించిననాయికారూపములతో, సవతులరూపముతో, దూతికలరూపముతో ఈశృంగారరచన సాగినది. తాను నాయికగా, స్వామి నాయకుడుగా, ఆస్వామి తనపై కోపగించినట్లుగా, దానికి తాను వేడుకొనుచున్నట్లుగా జరిగిన ఈసంకీర్తన రచన తిలకింపగలరు.

శంకరాభరణం

తరుణి నీయలుక కెంతటి దింతి నీవేళ
గరుణించఁగదర వేంకటశైలనాథా ॥ పల్లవి ॥

ఒకమారు సంసార మొల్లఁబొమ్మని తలఁచు
ఒకమారు విధిసేఁత లూహించి పొగడు
ఒకమారు తనుఁజూచి వూరకే తలవూఁచు-
నొకమారు హర్షమున నొంది మేమఱచు ॥ తరుణి ॥

నిన్నుఁజూచి వొకమారు నిలువెల్లఁ బులకించు
తన్నుఁ జూచి వొకమారు తలపోసి నగును
కన్ను దెరచి నినుఁజూచి కడుసిగ్గువడి నిలిచి
యిన్నియునుఁ దలపోసి యింతలో మఱచు ॥ తరుణి ॥

వదలైనమొలనూలు గదియించు నొకమారు
చెదరినకురులెల్లఁ జెరుగు నొకమారు
అదనెరిఁగి తిరువేంకటాధీశ పొందితివి
చదురుఁడవు నినుఁబాయఁజాల దొకమారు ॥ తరుణి ॥

(సంపుటము 12–పాట 70)

శ్లో॥ శృంగారరససర్వస్వం శిఖిపింఛవిభూషణమ్ ।
అంగీకృతనరాకార మాశ్రయే భువనాశ్రయమ్ ॥

[శ్రీకృష్ణకర్ణామృతము 1–92]

శ్లో॥ మయి ప్రసాదం మధురైః కటాక్షైః వంశీనినాదానుచరైః విధేహి।
త్వయి ప్రసన్నే కిమిహాపరైర్నః త్వయ్యప్రసన్నే కిమిహాపరైర్నః ॥

[శ్రీకృష్ణకర్ణామృతము 1–20]

ఈ లీలాశుకుని శ్లోకములు కూడ ఆతని ఉత్తరవయసులోనివే. కావున నాయికాత్వము పరిణతిచెందుటకు వయసు, అనుభవము, చనవు మూడును నిండినప్పుడే సాధ్యమనుట నిర్వివాదము. ఈ అన్నమయ్య భక్తినిగూర్చి 12 వ సంపుటము ద్వితీయముద్రణ పరిష్కరణమున కొంత చర్చించియుంటిని. దానినికూడ సహృదయులు తిలకింప వేడికోలు.

తాళ్ళపాకకవులసంగీతసాహిత్యములను గడ్డకుదెచ్చి సహృదయులకు అందివ్వవలెనను తీవ్రభావన, దానికై సొమ్మెంతయైనను వెచ్చించుటకు వెనుకాడని ఉదారత గలిగిన ఇప్పటి కమిటీఛైర్మన్ డాక్టర్ యన్. రమేశన్ I. A. S గారికిని, వారికి కుడిభుజముగ నిలిచి చేసినపనికి సంతోషించుచు, చేయవలసినపనికి చేయూత నిచ్చుచు,

వలసినసౌకర్యములనెల్ల సమకూర్చుచు, ఉత్సాహమూర్తిగ అగపడుచున్న కార్యనిర్వహణాధికారులు శ్రీ P. V. R. K ప్రసాద్ I. A. S గారికిని నాకృతజ్ఞతాభివాదములు. పనితనమునందును, మెలకువయందును ముందునడచుస్వభావముగల తి. తి. దే. ప్రెస్ మేనేజర్ శ్రీ యం. విజయకుమారరెడ్డిగారికిని, వారి కన్ని విధముల బాసటగ నిలిచి మాపనికి పదునువెట్టుచున్న పౌరసంబంధశాఖాధికారి (P. R. O) శ్రీ R. సూర్యనారాయణమూర్తిM. A.,గారికిని, అడుగడుగున నాపనికి తోడునీడగ సాయపడుచున్న 'సప్తగిరి' సంపాదకులు శ్రీ K. సుబ్బారావు. M. A గారికిని నాధన్యవాదములు. నాకీ పరిష్కరణకార్యమునందు సహాయకుడుగ క్రొత్తగ నియమింపబడి కనుచూపులవెంట కార్యము నడపుచు విధేయుడై శ్రద్ధావంతుడైన చిరంజీవి J. బాలసుబ్రహ్మణ్యమ్ M. A కును, వీలైనంత నిష్పర్షముగ ముద్రణమును కొనసాగించునేర్పరులగు అచ్చుకూర్పరులకును నా మంగళాశాసనములు. నామతిమితికి తగినంతగ జరిగినఈపరిష్కరణమునందు దోషములను గమనించినసహృదయులు పెద్దమనసుతో తెల్పినచో, పైపై పరిష్కరణములందు జాగ్రత్తపడగలనని మనవి. ప్రతి సంపుటము పీఠిక మొదట అన్నమయ్యను, కడపట పూజ్యులు శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారిని శ్లోకరూపముగ కీర్తించుట 25వ సంపుటమునుండి సాగుచున్న పని.

**శ్లో॥ సంస్కృతప్రాకృతాంధ్రాంగ్ల కర్ణాట ద్రవిడోక్తిషు।**
**తపస్యంతం రసాధీనం వందేహం కృష్ణదేశికమ్॥**

బుధవిధేయుడు,

గౌరిపెద్ది రామసుబ్బశర్మ,
స్పెషల్ఆఫీసరు, అన్నమాచార్యవాఙ్మయము,
తి. తి. దేవస్థానములు,

తిరుపతి
9–3–79

## ధ్రువపాతము.

" హా ధి క్కష్ట మనిష్ట మ స్తకరుణః కోఽయం విధేః ప్రక్రమః "

సౌజన్య సౌశీల్యములకు, సంగీతసాహిత్యములలోని సారజ్ఞ-తకు, వంచన చవిచూడని భక్తిప్రేమ దయావాత్సల్యమర్యాదలకు, సమయములందు దిగజారని ధీరతకు, ప్రమాణపూతమైన మాటకూ వ్రాతకూ, లోతులంటినవిమర్శలకు, పై పటారములేని కవిత్వమునకు ఒరగల్లై, అన్నిటా ఓర్పునేర్పులు పండించి, తాళ్ళపాకకవులభాగవతసంప్రదాయమునందు బద్ధాదరులై పనిచేసి, అన్నివిధములా అన్నమయ్యకు ప్రతిరూపులై, ఆపని చేయువారందరికి అడుగకయిచ్చు కల్పతరువుగ మెలగుచు, నాబోటిఅల్పజ్ఞులందుగూడ అహేతుపక్షపాతము గలిగి, తుదిగడియలలో మనవేంకటేశ్వరునియాస్థానకవిగ సత్కారమంది, ఎన్నోసందర్భములందు నిండుమనసుతో మమ్ముల నాశీర్వదింపవలసినమహానుభావులు పూజ్యులు శ్రీమాన్ శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు 11–3–79 7-45 పి. యం. కు ప్రశాంతముగ కన్నుమూయుట మన దురదృష్టముగ భావింపవలసివచ్చినది.

" యస్మై జన స్స్పృహయతే నరపుంగవాయ కాలో నినీషతి తమేవ నిజం నికాయ్యమ్ " అని ఒకప్పుడు వారే ఉదాహరించినపద్య మిది.

శ్లో॥ రాళ్లపల్లికులాంభోధి రాకాచంద్రప్రభోజ్జ్వలం।
అనంతకృష్ణశర్మాఖ్యం పుణ్యశ్రవణకీర్తనమ్ ॥ ౧ ॥
ఆస్థానకవిపట్టస్య ప్రదానచ్ఛద్మనా హరిః ।
ప్రసార్య కరుణాబాహు మాత్మసాదనయ త్స్వయమ్ ॥ ౨ ॥
కాళయుక్తసమే మాసి ఫాల్గునే పితృభే సితే ।
త్రయోదశ్యాం రవేర్వారే కృష్ణ స్స్వామిపదం యయౌ ॥ ౩ ॥

తిరుపతి. విధేయుడు,
15–3–79. గౌరిపెద్ది రామసుబ్బశర్మ



కీ॥ శే॥ శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారు

23–1–1893 — 11–3–1979

శ్రీరస్తు

శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు

## 26 వ సంపుటము

స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహనశకవరుషంబులు ౧౩౪౬ అగు-నేటి క్రోధిసంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించినపదారు-యేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అదిమొదలుగాను శాలివాహన-శకవరుషంబులు ౧౪౨౪ అగు నేటిదుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ * నిరుధానకు తిరువేంగళనాథుని మీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమా-చార్యులు విన్నపముచేసినశృంగారసంకీర్తనలు.

రేకు 1001 వరాళి

ఇంకా నేమౌనో ఇంతట నూరకుండవే
కొంకఁబోఁగా నాగోరికొన దాఁకెఁగా ॥ పల్లవి ॥

వాడివట్టి నేఁ దియ్యఁగా వోపనంటాఁ బెనఁగఁగా
వెడఁగునీపోఁకముడి వీడెఁగా యిట్టె
తొడికి కాఁగిలించఁగా తోదోపు లాడఁగాను
పడఁతి నీకుచములు బయలాయఁగా ॥ ఇంకా ॥

---

* ఈశబ్దము 'నిరోధ' 'నిరుద్ధ' శబ్దములకు వ్యావహారికరూపముగా గానవచ్చుచున్నది. అర్థగింపు, అవధి అని యర్థము. అనాడుఁ కడపటిదినమని తాత్పర్యము. కీ॥ శే॥ ప్రభాకరశాస్త్రిగారూహించిన "సరియగు" అను నర్థము తాత్పర్యార్థము గావచ్చును. 'అవధి' అను నర్థములో "ఈ నిరుద్ధమునకుఁ గుశలంబు మాకు" అను తరిగొండ వెంగమాంబగారిప్రయోగము దీనికి సహాయపడుచున్నది. సాహిత్య అకాడమివారి విష్ణుపారిజాతము' 55 పుట. నే నీప్రయోగమివ్వగా శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణ-శర్మగారు, "నిఱుత్తం" అను అరవపదముకూడ 'నిలువు' అను నర్థముతో దీనికి సహాయపడుననిరి.

మోవినే నా కందియ్యఁగా మోరతోపై నీ వుండఁగ
భావించ నీమోవి నాపల్లు సోఁకెఁగా
యీవల నేఁ బై కొనఁగా నిట్టునట్టు బొరలఁగా
చేవదేరేనీకొప్పు చెంపలకు జారెఁగా ॥ ఇంకా ॥

పచ్చడము నేఁ గప్పఁగా పంతాలు నీ వాడఁగాను
మచ్చికరతుల సదమద మైతిగా
ఇచ్చకాన శ్రీవేంకటేశుఁడ నేఁ గూడఁగాను
వచ్చి వచ్చి నాకు లోనై వసమైతిగా ॥ ఇంకా ॥

భైరవి

నీ వొకటి దలఁచఁగా నేరుపు వేరొకటాయ
యీవిధము సరిగాదు యేమిసేసేవే ॥ పల్లవి ॥

చన్నులంటాఁ బెంచితివి జక్కవలాయ నివె
కన్నెరో పయ్యదనేల కప్పేవే నీవు
ఇన్నినెరులంటా దువ్వే వివియుఁ దుమ్మెదలాయ
యెన్నినట్టు రాదాయ నేమిసేసేవే ॥ నీవొ ॥

చొక్కపునీకన్నులంటాఁ జూడఁబోతే నమ్మలాయ
తక్కరిరెప్పలనేల దాఁచుకొనేవే
తొక్కేవు పాదములంటాఁ దొలుతే తామరలాయ
యెక్కడౌతా నెఱఁగవు యేమిసేసేవే ॥ నీవొ ॥

నడుమంటాఁ బట్టితివి నాఁడే బట్టబయలాయ
వడి నందునేల పోఁకముడి వేసేవే
యెడయక శ్రీవేంకటేశుఁడ నేఁ గూడితిని
యెడపు విన్నియుఁ దేరె నేమిసేసేవే ॥ నీవొ ॥ 2

సామంతం

కోరినట్టే నీకుఁ జెల్లె గోవిందుఁడా మా-
కూరిములు మాకు దక్కె గోవిందుఁడా ॥పల్లవి॥

కొలనికఱుత నీవు గోవిందుఁడా। మము
గులుగురేఁచకువోయి గోవిందుఁడా
కొలముఁ గొలముఁ గూడె గోవిందుఁడా। ఇంత
కులికి నవ్వకువోయి గోవిందుఁడా ॥కోరి॥

కోకలేల తీసితివి గోవిందుఁడా। నీకుఁ
గోకో ఇదివో మొక్కె గోవిందుఁడా
గోకులమిందరిలోన గోవిందుఁడా। సిగ్గు
కూకులు వత్తులు నాయ గోవిందుఁడా ॥కోరి॥

కొప్పు దాఁకించకువోయి గోవిందుఁడా। మా-
కుప్పెసవరము వీడీ గోవిందుఁడా
గొప్పశ్రీ వేంకటగిరిగోవిందుఁడా। మేలు
కుప్పళించి కూడితివి గోవిందుఁడా ॥కోరి॥ 3

సామంతం

ఏమన్నా ననసీవే యింతి నీ వాతనితోడ
వాములైనమేలుమీఁద వాదులు నేరకువే ॥పల్లవి॥

చెంగలిచూపులు చూడనేర్చినదానవు
నింగి బొమ్మజంకెనలు నేరకువే
కుంగనిచిలుకపలుకులు నేర్చినదానవు
కంగి నిష్టూరాలాడ కమ్మర నేరకువే ॥ఏమ॥

ననలుగా సెలవుల నవ్వనేర్చినదానవు
నినుపుల కసరులు నేరకువే
అనిళ మాతనికళ లంటనేర్చినదానవు
పెనఁగి విభుని రట్టుపెట్టకువే ॥ ఏమ ॥

యెలమిఁ రతుల భ్రమయించనేర్చినదానవు
నిలుగునివ్వెరగులు నేరకువే
కులికి శ్రీవేంకటేశుఁ గూడనేర్చినదానవు
పలుమారు నెన్నఁటికిఁ బాయఁగనేరకువే ॥ ఏమ ॥ 4

లలిత

ఇద్దరి మీకూటములు యిన్నిటానుఁ దగును
నిద్దపుశ్రీవేంకటేశ నేఁడుగా నాభాగ్యము ॥ పల్లవి ॥

పాలదొంగవై గొల్లపడుచఁడవైతివంటా
పాలజలనిధిలోనఁ బడఁతి వుట్టె;
నీలవేణి పుండరీకనేత్రుఁడవు నీవంటా
తాలిమి రెండుచేతులాఁ దామెరలు వట్టెను ॥ ఇద్ద ॥

బంగారుపచ్చడము పడఁతి నీప్రియమంటా
బంగారువంటిమేనఁ బరగె నిదె
[1] నింగిమోచేచదువులు నీవల్లనే పుట్టెనంటా
చెంగటఁ జదివినట్టిచిలుకఁ జేఁబట్టెను ॥ ఇద్ద ॥

మెండగుశ్రీవేంకటాద్రిమీఁద నీవెక్కితివంటా
కొండవంటినీయురము కొమ్మ యెక్కెను
[2] పండునిమ్మపంటివన్నెపాలిం డ్లంటుదువంటా
పండినమాదీఫలము పడఁతి చేఁబట్టెను ॥ ఇద్ద ॥ 5

1, 2. చిలుక—మాదీఫలములు, వనవిహారలక్ష్మీమూర్తికి సంబంధించినవి కాబోలు.

శంకరాభరణం

అలుకలు చెల్లవు హరి పురుషోత్తమ
నలి నిందిర నీతో నవ్వినది ॥ పల్లవి ॥

ఆదిలక్ష్మి మోహనకమలంబున
వేదమాత నిను వేసినది
ఆదెస నీపై నభయహస్తమును
సాదరమునఁ గడుఁ జాఁచినది ॥ అలు ॥

సిరి దనకన్నుల చింతామణులను
పొరి నీపై దిగఁబోసినది
వరదహస్తమున వలచెయి వట్టుక
అరుదుగ నిను మాఁటాడించినది ॥ అలు ॥

జలధికన్య తనసర్వాంగంబులఁ
బిలిచి నిన్ను నిటు పెనఁగినది
అలముక శ్రీ వేంకటాధిప నిను రతి-
నెలమి నీవురఁ(రం?)బెక్కినది ॥ అలు ॥ 6

రేకు 1002 సామంతం

నీరువట్టు గొన్నవేళ నేయి మందవునా
కూరిమి మమ్మిద్దరినిఁ గూరుచరే చెలులు ॥ పల్లవి ॥

నెలఁతచెక్కులే నాకు నిలువుటద్దములు
అలరులతావిపూర్పు లాలవట్టాలు
చెలవులనగవులే చేతికిచ్చేకప్పురాలు
చలిమందు లిఁక నన్నిఁ జాలునే నాకు ॥ నీరు ॥

వనితమాటలే నాకు వలరాచమంత్రాలు
నినుపుఁజెమటలే పన్నీటిసోనలు
ఘనమైనసరసాలే గందపుఁగస్తూరిపూఁత
యెనలేనివుపచారా లివియేలే నాకు ॥ నీరు ॥

సతితోడిపానుపే చంద్రకాంతపువేది
యితవుగఁ గూడించితి రిందరూ మమ్ము
రతుల శ్రీవేంకటాద్రిరాయఁడ నే నిదివో
మితిమీర నూఁచకురే మేలాయఁ బనులు ॥ నీరు ॥ 7

బౌళి

అట్టే మేలుకంటినే అదివో నేను
గట్టిగా నే నిటువంటికల గంటినే ॥ పల్లవి ॥

తరుణికుచములపైఁ దగ నామొగము మోపి
గరిమ నే నిద్దరించఁ గల గంటినే
పెరరేఁచి యాపె నన్నుఁ బేరుకొని పిలిచి
కరఁగించి కూడెనంటాఁ గల గంటినే ॥ అట్టే ॥

చిప్పిలేటిమోవి ఇచ్చి చెలియవదనమునఁ
గప్పురము నే నందుకోఁ గల గంటినే
ముప్పిరిఁ దప్పకచూచి ముదితపయ్యద నాకు
కప్పెనంటా నిప్పుడిట్టే కల గంటినే ॥ అట్టే ॥

మొక్కుచు నింతికి నేను ముంచినపెక్కురతులఁ
గక్కసించితినంటాఁ గల గంటినే
యిక్కువతో శ్రీవేంకటేశుఁడఁగనక యాకె
గక్కున నన్నుఁ గూడె నిక్కల గంటినె ॥ అట్టే ॥ 8

మాళవి

చేయిముట్టి సరసాలు చెల్లవు నేఁడు
ఆయనాయ నిఁకనేల అటువంటిపనులు ॥ పల్లవి ॥

చేరి నన్ను నంటకురా చెలఁగుమాసినదాన
ఆరసి మాఁట చెప్పరా అల్లంతనుండి
కోరి నీవేమన్న మాకును నవ్వు రాదురా
ఔరా నీవేమి సేయుమన్నాఁ జేసేను ॥ చేయి ॥

మట్టుమీరి రాకురా మంచముపై నున్నదాన
యిట్టె నీపంపినవిడె మిదె చాలును
దిట్ట నీజాణతనాలు తెలియవురా మాకు
వెట్టికి నావీనుల వినేఁగాని ॥ చేయి ॥

బలిమి సేయకురా పవళించివున్నదాన
అలరి నీవు నాకు లోనౌటే చాలు
చెలఁగి కూడితి విట్టె శ్రీవేంకటేశుఁడ నన్ను
అలుక లిన్నియుఁ దీరె నట్టె కానీరా ॥ చేయి ॥ 9

సాళంగం

ఏమని చెప్పేనే యిట్టి నావలపు
ఆమీఁదటిపను లతఁడే యెఱుఁగు ॥ పల్లవి ॥

యెదుటనే వున్నాఁడు యిదె నారమణుఁడు
కదిమీఁ దమకము కనురెప్ప లిడిన
పెదవుల నున్నది పే రాతనిదే
కొాద దీరవు నాకోరికలు ॥ ఏమ ॥

నగుతా నున్నాఁడు నాతో నాతఁడు
నిగిడీఁ గాఁకలు నే నూరకుండిన
వెగటునఁ బతిపై వేసితి నేఁ జేయి
తగులకతొల్లే తడిపీఁ జెమట ॥ ఏమ ॥

కాఁగిట నుందానఁ గడు నాతనితో
రేఁగీ వలపులు రేవగలు
వీఁగ కలమె శ్రీ వేంకటపతి నను
చేఁగదేరె నాచిగురుటధరము ॥ ఏమ ॥ 10

సాళంగనాట

చేసినవారి చేఁతలు చేతనఁ బెట్టు గావా
యీసున నన్నుఁ జూడఁగ నెట్టునాయ కన్నులు ॥ పల్లవి ॥

కోపించి వాదుకురాఁగాఁ గొప్పు కడువెడజారె
యేపున నాతో జగడ మిదివొమ్మదె
యీపాటికి నీపాటి యిఁక నెంత యవునో
పోపో యింతటనైనా బుద్దెఱఁగవే ॥ చేసి ॥

బీరాన నన్నుఁ దిట్టఁగాఁ బెదవికెంపులు రేఁగె
దూరి పెద్దల నాదేది తోడ దోసమే
దారిదప్పఁదిరిగితే దయ్యమైనాఁ దోడౌనా
యీరు దియ్యఁ బేను వచ్చు నివి యేఁటికే ॥ చేసి ॥

వోపనంటాఁ బెనఁగఁగ వో పోఁకముడి వీడె
దాఁపురాలు బయలాయఁ దగదే యిఁక
ఆపనికి సిగ్గువడి యట్టే కాఁగిలించితివి
చేపట్టి వదలకు శ్రీ వేంకటేశుఁడను ॥ చేసి ॥ 11

కాంబోది

పట్టకు పట్టకురా నాపయ్యదకొంగు
వెట్టివలపులు నాపై వెదచల్లవలెనా ॥ పల్లవి ॥

యింత నీవు నేసినందు కిట్టె నిన్నుఁ గూడితేను
యెంత బతిమాలెనని యెంచరా నన్ను
కొంతగొంత నిన్ను నింకాఁ గూరిమి గొసరఁబోతే
యింతులెల్లా నన్నుఁ జూచి యెకసక్కెమాడరా ॥ పట్ట ॥

యీవేళ నే నీకు యిచ్చకము లాడితేను
నావంటివారు చూచి నవ్వరా నన్ను
వావి చూచి నీతో నేను వాసికిఁ బెనఁగఁబోతే
ఆవలీవలిసతు లాడరానన్ను ॥ పట్ట ॥

మొక్కి నీవు వేఁడుకోఁగా మొగమైనాఁ జూడకుంటే
దిక్కులకామినులెల్లాఁ దిట్టరా నన్ను
చక్కని శ్రీవేంకటేశ సమ్మతిగఁ గూడితివి
చిక్కినసతులు గోరసేయరా నన్ను ॥ పట్ట ॥ 12

రేకు 1003 తెలుఁగుఁగాంబోది

ఏళ్లవెనకవే చాళ్లు యెఱఁగవటే
ఆళ్లేమి గంటే కొట్టులాయనేమి ॥ పల్లవి ॥

సుదతినాతో నలిగి చూడదువో చెలియ
యెదుట నీవు చూడవే యిదే అది
వెదకఁ జందురుఁడేమి వెన్నెలేమి నాకును
మదిలోనితాపము మానితేఁ జాలును ॥ ఏళ్ల ॥

మగువ తాఁ గోపించి మాటాడ దదె నాతో
తగ నీవు వలుకవే తానే తాను
చిగురేమి చేఁగేమి చేరినమానికిని
నిగిడి నాకుఁ జల్లనినీదై తేఁ జాలును ॥ ఏళ్ల ॥

చెలి నాకాఁగిట నుండి సిగ్గువడీ నింకాను
కలసి నీవైనాఁ గొంతకాఁక రేఁచవే
వెలియేమి లోనేమి వేడుక కొక్కటేకాదా
అలరిన(శ్రీ)వేంకటాధిపుఁడ నేను ॥ ఏళ్ల ॥ 13

## మాళవిగౌళ

పలుక కూరకుండుటే పాడి నాకు। అప్పు-
డలిగితివంటా నేమి ఆడకుమీఅయ్యా ॥ పల్లవి ॥

మలసి నీ వాడినమాఁటలెల్లాఁ జక్కనే
కలికినాకురులే వంకలు గాని
వలచినయిటువంటివారము నే మేమన్నా
చలువౌనో వేఁడౌనో చవి చాలదయ్యా ॥ పలు ॥

నిక్కి నీచేఁతలు నీమేనికి నన్నీ వన్నెలే
దిక్కుల మానగవులే తెల్లనగాని
వెక్కసాన నీపొందు వెఱవక సేయఁగాను
యెక్కువౌనో తక్కువౌనో యెడ చాలదయ్యా ॥ పలు ॥

కొసరి కాఁగిట నన్నుఁ గూడ నీకుఁ జులుకనే
పసిమి నాజవ్వనమే బర(రు?)వు గాని
యెసఁగ (శ్రీ)వేంకటేశ యింకాఁ గూడి పిఱువఁగ
పొసఁగునో పొసఁగదో పూఁపు చాలదయ్యా ॥ పలు ॥ 14

దేసాళం

మానుమన్నా మానఁడు మాఁటి మాఁటికి
పోనిమ్మని వూరకున్నాఁ బోడవెక్కీఁగదవే ॥ పల్లవి ॥

ఆడరాడు తనకెదురంటే నసీఁగాక
వాడుదేరినమోమేల వచ్చెఁ దనకు
వోడక యిందుకుఁదోడు వూరకుండనీఁడు నన్ను
యీడుగానిమాట దీసి యెచ్చరించీఁగదవే ॥ మాను ॥

తలవంచుకుండరాదు తనచేతిబాధ నేఁడు
చిలుకుగోళ్ల నెత్తీ సిగ్గువడఁడు
నిలువఁబెట్టుచు తననిజమే నెరపవచ్చీ
యెలమి నిందరు నవ్వే దెఱఁగఁడుగదవే ॥ మాను ॥

గుట్టునేసుకుండనీఁడు కుమ్మరించీ వలపులు
యెట్టివాఁడు యిందాఁకా నేడ నుండెనే
వొట్టుక శ్రీవేంకటాద్రినుండి వచ్చి నన్నుఁ గూడె
పట్టినచలముతోడఁ బంత మిచ్చీఁగదవే ॥ మాను ॥ 15

వరాళి

వద్దువద్దు యెన్నఁడూను వాదులు మీకు
ముద్దుముద్దువలె నేఁడు మొక్కవయ్య ఆకెకు ॥ పల్లవి ॥

యిక్కువలు సోఁక నేఁడు యేమాడితివో కాని
చెక్కులెల్లఁ జెమరించె చెలియకును
యెక్కువతక్కువసేఁత లేమినేసితివో కాని
ముక్కున నూర్పులు రేఁగె మొక్కవయ్య ఆకెకు ॥ వద్దు ॥

నాలి నాకె యేమనఁగ నాఁటఁజూచితివో కాని
తాలిమెల్ల దిగఁబడె తరుణికిని
అలరిరతుల నెంత అలయించితివో కాని
మూలనుండి సిగ్గువడీ మొక్కవయ్య ఆకెకు ॥ వద్దు ॥

చెప్పినట్టు నీవేమి సేయవైతివో కాని
అప్పుడే కోపమురేఁగె నంగనకును
యెప్పుడో శ్రీవేంకటేశ యిటు గూడితివో కాని
ముప్పిరి నవ్వులు నవ్వీ మొక్కవయ్య ఆకెకు ॥ వద్దు ॥ 16

సామంతం

ఏల వూరకున్నదాన విటు నిన్నుఁ గూడుదాఁకా
పొలుప డిన్నివ్రతాలు పట్టుకున్నాఁ డతఁడు ॥ పల్లవి ॥

తామెరలు ముడువఁదే తరుణి కెంగేలనే
తామెరలు(ల?)చేత నంటి దగ్గరుదాఁకా
నేమముతో మేనిపైఁ బన్నీరు నించుకో నొల్లఁదే
దోమటి నీచెమటలఁ దొప్పఁదోఁగుదాఁకా ॥ ఏల ॥

అద్దము చూడనొల్లఁదే అంగన నీమించుఁజెక్కు-
టద్దములు చూచుదాఁకా నాడ నుండి
వొద్దిక నారగించఁదే వూరేటినీమోవితేనె
అద్దుకొని చవిచూచినందాఁకను ॥ ఏల ॥

కప్పురము నొల్లఁదే కలికి నీసెలవుల-
కప్పురపునవ్వు తన్నుఁ గప్పుదాఁకాను
ఇప్పుడే శ్రీవేంకటేశుఁ డీడకే విచ్చేసి కూడె
అప్పటి వేగిరించీ నీ వలమినందాఁకాను ॥ ఏల ॥ 17

దేసాళం

వలపు గంపలఁబెట్టి వడి నెందాఁకా నుండీ
కలిగినపాటే చాలు గాసిఁబెట్టనేలే ॥పల్లవి॥

మన సొక్కుచో నుండఁగఁ మాఁటలాడఁబోతేను
వినఁ జవులౌనా వేసటౌఁగాక
యెనయ నెందుకో పోఁగా నింటికి రమ్మని నేఁ
బెనఁగితే నితవౌనా పెనుజోలి గాక ॥వల॥

యెదు రెవ్వతెకో చూచేయీవేళ నేఁ బొలసితే
అది యింపౌనా గుండెబెద రవుఁగాక
కది శొక్కుతేఁ బిలువఁగా నేఁ బలికితేను
ముదమౌనా అది పెద్దమొగచాటౌఁగాక ॥వల॥

నాఁటినయాకెపై నవ్వు నామీఁదికిఁ దీసుకోఁగా
వాఁటమౌనా అది వేరే వగలౌఁగాక
యేఁటికి శ్రీవేంకటేశుఁ డిదివో నన్నుఁ గలసె
పూఁటపూఁట యిటులైతేఁ బొందులౌఁగాక ॥వల॥ 18

రేకు 1004 శ్రీరాగం

వాసికి బతుకుటింతే వనితలయినవారు
పాసినకూటికంటే పస్తైనా మేలురా ॥పల్లవి॥

రాకుండేవాఁడవా రాతిరెల్ల మాయింటికి
ఆకడ నీ కెవ్వతో పై యాడెఁగాక
నీకు నీగుణము లేదు నేఁ డిన్నాళ్లదాఁకా
కాకునఁ బడుటకంటే కడనుంటే మేలురా ॥వాసి॥

కోపగించేవాఁడవా కొసరి నే నేమన్నా-
  నీపాప మెవ్వతో [1]నీకు నేరిపెఁగాక
యేపున మారుమాటాడ వెన్నఁడు నేఁ దలిగేవు
  తీపులలోనఁ జేఁదైతే తెగువలే మేలురా ॥ వాసి ॥

తలవంచేవాఁడవా దగ్గరి కాఁగిలించితే
  కులికి యెవ్వతో బాసగొన్నదిగాక
బలిమి శ్రీవేంకటేశ పైకొని నిన్నుఁ గూడితి
  కలకాలమును నిన్నుఁ గాచుకున్న మేలురా ॥ వాసి ॥ 19

ఆందోళి

సిగ్గువాసి కూటికే చీరగట్టినవారము
  యెగ్గులేక తనవలె నెదుట నుండేదా ॥ పల్లవి ॥

నెట్టన మాయింటిలోన నిద్దిరించఁగాఁ జూచి
  యిట్టె యలిగితినంటానేల వోరినే
అట్టె యెక్కువేళ మాకు నలపు సొలపు లేదా
  పట్టులేక తనవలె పనిలేదా మాకును ॥ సిగ్గు ॥

తగిలి జూజమాడుతా తలవంచుకుండఁగాను
  నగవంటానేల వోరీ నాతో నేఁడు
ముగుదలమైనమాకు ముసిమి ముచ్చట లేదా
  మొగమెత్తి తనవలె మొక్కులు మొక్కేదా ॥ సిగ్గు ॥

అలసెనంటాఁ దనకు ఆలవట్ట మిడఁగాను
  చలిగొనినంటా నేల సారెఁ బోరినే
యెలమి శ్రీవేంకటేశుఁ డిటు గూడఁ జెల్లఁగాక
  వలెనంటా మాకుమాకే వద్దికి రాఁదగవా ॥ సిగ్గు ॥ 20

1. ఎవ్వతోను + ఈకు ?

### మధ్యమావతి

ఎటువంటి వేడుకలో యిద్దరికి మీఁద మీఁద
ఘటన వెన్నెలపులుఁగము లాడేరదివో ॥ పల్లవి ॥

చిత్తజునిఁ గన్నతల్లి సిగ్గువడు తానే పతి-
పొత్తునఁ గూచుండెఁ బెద్దబువ్వానను
యిత్తల నాయకుఁడును యెడమిచ్చి తొడఁదొడ-
నొత్తుక కూచుండి మేను లొరసీనదివో ॥ ఎటు ॥

శిరసు వంచుకొని చిమ్ముఁజూపుతో నింతి
పురుషుఁ డిచ్చేకడి పుచ్చుకొనీ
సరసములాడుకొంటా చవిచెప్పుతా నతఁడు
సరిఁ గజ్జాయపుమోవి సారె నిచ్చీనదివో ॥ ఎటు ॥

కప్పినకుచగిరులు కానరాఁగా మూసుకొంటా-
నప్పటి దవ్వులకూర లందీఁ జెలి
అప్పుడె శ్రీవేంకటేశుఁ డాయాలకే చేచాఁచె
దెప్పరపుఁగందువలఁ దేలించె నదివో ॥ ఎటు ॥ 21

### ఆహిరి

కాంతునివలపు నేనే కన్నదాఁకాను
చెంతల నన్ను బలిమి సేయకురే చెలులు ॥ పల్లవి ॥

దగ్గరివచ్చినదాఁకా దవ్వుల నుండుటే చవి
సిగ్గులు దేరినదాఁకా చింతలే చవి
బగ్గన నవ్వినదాఁకా పంతపుమోనమే చవి
వొగ్గి నన్నుఁ బిలువకుండరాదా చెలులు ॥ కాంతు ॥

తెంకికి వచ్చుదాఁకా సాదింపుఁజూపులే చవి
మంకు దీరుదాఁకా నెడమాటలే చవి
సంకె దీరునందాఁకా సరసములే చవి
అంకెకు రమ్మని నన్ను నంటకురే చెలులు ॥ కాంతు ॥

మనసు గలయుదాఁకా మచ్చరములే చవి
తనివిఁ బొందినదాఁకా తాపమే చవి
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ నేఁడు
పెనఁగి నన్నింకా రట్టుపెట్టకురే చెలులు ॥ కాంతు ॥ 22

ముఖారి

అందాఁకా నీ వేమన్నా నన్నీ నౌఁగాదనఁ గాని
యెందునుఁ బోనప్పుడుగా యెననేది మనసు ॥ పల్లవి ॥

అక్కడిపరాకు మానినప్పుడుగా నీవు
గక్కన నాకాఁగిటిలోఁ గరఁగేది
నిక్కిచూడక నావద్ద నిలిచినప్పుడుగా
చిక్కి నాకుఁ జెప్పినట్లు సేసేది నీవు ॥ అందాఁ ॥

వింత చెలులసుద్దులు వినిన(నని?)యప్పుడుగా
మంతనాన నీవు నాతో మాటలాడేది
సంతల నీసన్నలు నీచాయలు నుడిగితేఁగా
అంతట నాతో సరసమాడేది నీవు ॥ అందాఁ ॥

మగువలభ్రమలెల్ల మఱచినప్పుడుగా
నగితే నీవు నాతో నవ్వేది
అగడై శ్రీవేంకటేశ అంతసేసి నిన్నాఁగఁగ
తగ నన్నుఁ గూడితివి తప్పకిదె నీవూ ॥ అందాఁ ॥ 23

నాగవరాళి

అంత మమ్ము జోలిఁబెట్ట కవులే నీవు। నీ-
యంతరంగమే యెఱుఁగు నంటకురా నీవు ॥ పల్లవి ॥

చెక్కులేల చెమరించెఁ జెలితో నవ్వకుండితే-
నక్కట బాసలు సేసే వప్పటి నీవు
ముక్కునూర్పులేల రేఁగె ముగుదవై వుండితేను
చక్కటి చెప్పకు నాతో సారెసారె నీవు ॥ అంత ॥

అంగమేల పులకించె నాకెయింటి కేఁగకుంటే
యింగితాలు మొరఁగేవు యేరా నీవు
సంగతిఁ గొప్పేల వీడె సతిచేయి దాఁకకుంటే
జంగిలివేసాలు నాతో చవిగాదు నీవు ॥ అంత ॥

ఉత్తు కేలంటె నొసల లలనకు మొక్కకుంటే
వుత్తరా లియ్యవచ్చేవు వొద్దురా నీవు
కొత్తలై శ్రీవేంకటేశ కూడితివి నన్ను నేఁడు
మత్తిలి యితరములు మానరా నీవు ॥ అంత ॥ 24

రేకు 1005 దేశాక్షి

ఊరకున్నవారి మమ్ము నుండనీ కేలరేఁచీనే
మారుమాటాడక యిన్ని మఱచుండుఁ గాక ॥ పల్లవి ॥

ఇంతపరాకయ్యేవాఁ డేల పిలువనంపీనే
చెంత నేఁదే పనులెల్లాఁ జేసుఁగాక
కొంత సిగ్గువదేవాఁడు కొంగువట్టేల తీసీనే
వంతులఁ దా బాలనాటివలె నుండుఁగాక ॥ ఊర ॥

జాగులు నేసేవాఁడు సన్నలేల సేసీనే
వేగుదాఁకా జాగరాలు వేగించుఁగాక
బాగుగ నిద్రించేవాఁడు పైనేల వొరగీనే
వేగమే పానుపుమీఁద విహరించుఁగాక ॥ ఊర ॥

రాజసము చూపేవాఁడు రతికేల దగ్గరీనే
వోజతోడ మమ్ము నంపి వుండుఁగాక
సాజపుశ్రీవేంకటాద్రి సరసుఁడై నన్నుఁ గూడె
జూజమేలాడీనే యిట్టె సుకియించుఁగాక ॥ ఊర ॥ 25

తోండి

సంగడి నట్టే వుంటే చవివుట్టీనా
కొంగు వట్టి తియ్యఁగాను కోపించరాదా ॥ పల్లవి ॥

పయ్యెద నేఁ బెట్టుకొంటే బలిమిసేసే వదేర
అయ్యో ఆఁటదాననైతే అలఁత లేదా
పొయ్యేనంటా లేచితేను పొదిగేవు నీ వదేర
కయ్య మడిచినవేళ కడనుండరాదా ॥ సంగ ॥

ఆకడిమోము నే నైతే నలమిపట్టే వదేర
వాకునిష్ఠూరాలనైన వద్దనరాదా
చేకొని నే నుస్సురంటే చెక్కునొక్కే వదేర
కాఁకఁబొందినట్టివేళ కసరుకోరాదా ॥ సంగ ॥

కన్నుల నేఁ జూడకుంటే కాఁగిలించే వదేర
సొన్నలవిచేఁతలకు చొక్కఁగరాదా
యెన్నఁగ శ్రీవేంకటేశ యింతసేసి కూడితివి
ఇన్నేసి నీ వినయాల కియ్యకొనరాదా ॥ సంగ ॥ 26

శుద్ధవసంతం

అప్పటి నీపంతముల కంటెఁగాక
. యెప్పుడూ నీ వేలమానే వెట్టయినాఁ జేయరా ॥ పల్లవి ॥

తడవనివాఁడవేల తగిలేవు మావెంట
విడువిడు నాచెఱఁగు వెఱతు నీకు
బడినే వోయమ్మ మేను పరవశమయ్యీని
యెడపునీచేఁత చెల్లె నెట్టైనాఁ జేయరా ॥ అప్ప ॥

అనవెట్టుకొన్నవాఁడ వాడనేల మాట మాతో
మాను మాను సరసాలు మరినేల
నానెఁ జిరుచెమటల నవ్వువచ్చీ నాకు నిట్టె
యే నేమీ ననఁజాల నెట్టయినాఁ జేయరా ॥ అప్ప ॥

అలిగినవాఁడ వేల అంకెలఁ గాఁగిలించేవు
నిలునిలు కొంతవడి నేఁ జెప్పేను
బలిమి శ్రీవేంకటేశ పైకొని భోగించితివి
యిల నే నీకే వలచి తెట్టయినాఁ జేయరా ॥ అప్ప ॥ 27

శంకరాభరణం

అబ్బె నాకు నేఁ డంతటిలోనె
సుబ్బనచూరల సూచన లిదివో ॥ పల్లవి ॥

పూచీ నౌనే పున్నమ వెన్నెల
చేచేతనే నీసెలవులను
కాచె నిమ్మ లివె కడు నీ పురమున
పైచింతలనే పండెను మోవి ॥ అబ్బె ॥

మూఁగీ నౌనే మొకరితుమ్మిదలు
తూఁగేటినీనెరితురుమునను
రాఁగీఁ జిలుకలు రతి నీపలుకుల
ఆఁగీఁ బికములు అదె కుత్తికను ॥ అబ్బె ॥

పాఁకీ నౌనే బాహులతలు గడు
కాఁకల నీనాకాఁగిటను
యేఁకట శ్రీవేంకటేశుఁడఁ దియ్యఁగ
సోఁకీ మదనునిసొమ్ములు రతుల ॥ అబ్బె ॥ 28

తెలుఁగుఁగాంబోది

అందరును వినరమ్మ ఆమాఁట
అందాలు చెప్పఁగవచ్చీ నమ్మరోయమ్మా ॥ పల్లవి ॥

యీతల నన్ను రమ్మని యేఁటికిఁ బిలిపించెనో
ఆతని నడుగరమ్మా ఆమాఁట
రాతిరెల్లా జాగరాలే రవ్వకెక్కెఁ బగలెల్లా
చేఁతలేమి సేయవలెఁ జెప్పరోయమ్మా ॥ అంద ॥

పనిలేనిపనికేల పంతమిచ్చెనో కాని
అనఁడా తా నావేళ ఆమాఁట
తనిసె నామనసెల్లాఁ దలకెక్కె వలపెల్లా
అనుమానా లేమిగల్లా నాడుమనరమ్మా ॥ అంద ॥

యేకతానఁ జెప్పేనంటా నిందరి మిమ్ముఁ బొమ్మనె
ఆకడ నప్పుదే వింటి నామాఁట
పైకొని శ్రీవేంకటాద్రిపతి యింతసేసి కూడె
మీకుమీకే యిఁకనైనా మెచ్చుకోరేయమ్మా ॥ అంద ॥ 29

సామంతం

సతివిధము నేర్పు వెదచల్లినటులాయ
• యితవు లిటమీఁదిమే లెట్టు రాఁగలదో ॥పల్లవి॥

కనుచూపు పతిమీఁద కాయంబు చెలిమీఁద
మనసు కోర్కులమీఁద మగువ కిపుడు
తనకొప్పెచట వీడె తలపువ్వు లెటురాలె
విని వినదు మనమాఁట వెస నెంతవలపో ॥సతి॥

నిట్టూర్పు తనువుపై నెరిఁ జెక్కు చేతిపై
గుట్టు చన్నులపయినె కొమ్మ కిపుడు
పట్టినవిడియ మేడ బలుపరా కిది యేడ
తట్టినా నెఱఁగ దిదె తమక మెట్టిదియో ॥సతి॥

సిగ్గు దనవయసులో చిఱునవ్వు సెలవిలో
•నిగ్గు రతికళలలో నెలఁత కిపుడు
అగ్గలపుశ్రీ వేంకటాధిపతిఁ గూడి మరి
యెగ్గు లెంచదు యీపె యెటువంటి గుణమో ॥సతి॥ 30

రేకు 1006 దేవగాంధారి

నే నొకమాఁటాడితేను నీ వొకటాడేవేమే
కానీలేరా నీవంటికతలు నేరుతుమా ॥పల్లవి॥

వెన్నదిన్ననోటనే వేఁడిపాలు దాగినట్టు
వెన్నెగా మాటాడి యేల వెంగెమాడేవే
వెన్నాఁ దింటివి వే డివేఁడిపాలఁ జవిగొంటి-
విన్నిటా నీమోవి పొక్కె నిఁకనేల మాటలు ॥నేనొ॥

పువ్వు లందిచ్చినచేతఁ బూఁచి రాలందిచ్చినట్టు
జవ్వని కుచాల నొత్తి జగడాలేలే
పువ్వులూ నందుకొంటివి పూఁచి, రాలూ నెత్తితివి
ఇవ్వల నీవాళ్లే చెప్పీ నిఁకనేల చేఁతలు ॥ నేనా ॥

సూడిదెవట్టినవారి సొమ్ముల నించినయట్టు
వోడక కైదండిచ్చితే నొత్తేవే గోర
సూడిదెగా నన్నుఁ గూడి సొమ్మూ నా కిచ్చితివి
యీడనే శ్రీ వేంకటేశ యిఁకనేల పనులు ॥ నేనా ॥ 31

## భైరవి

పాయమే పైతరవాయఁ బట్టకురా యెగ్గు నీవు
యేయెడ నీకతమున నే నెన్నిక కెక్కితిరా ॥ పల్లవి ॥

మునుముందు చూచితేను మోవరాదు కుచములు
వెనక చూచితే వేఁకము నాతురు మిది
యెనసి నీ చేఁతలును యిట్టెపో యేమి సేతు
తనిసినింతలోనే తమక మేఁటికిరా ॥ పాయ ॥

పట్టితేను పసలేదు పంతపునానడు మిది
వెట్టని విడువరాదు వేఁడి నిట్టూరుపుగాలి
ఇట్టెపో నీసుద్దు లేమందు నే నిన్ను
మట్టులేదు నావలపు మాయలఁ బెట్టకురా ॥ పాయ ॥

చొక్కక నిన్నెడసితే సొమ్మలవుమ్మలఅట్టు
పక్కన నిన్నుఁ గూడితే పరవశములు బెట్టు
యెక్కువ శ్రీ వేంకటేశ యిఁకనో నాచంద మిది
చక్కఁగాఁ గూడితి విట్టె జాణతనా లేలరా ॥ పాయ ॥ 32

పాడి

చూత మింక తనజాడ సొలయక నీవు రావే
'కాతరపురమణుని కడకుఁ బోనిచ్చేనా ॥ పల్లవి ॥

తలఁ పెందు నిల్చినా తానూ నక్కడ నిల్చు
యెలమి నెంత విల్చినా యేలవచ్చీనే
పలుకేద ని(నిం?) పైనా భావమందింపౌను
తెలిసి నీవు మాటాడితే నేల చేకొనీనే ॥ చూత ॥

కనుచూ పెందువారిన కంటుక లంటు వారు
పనివడి వానినేల బల్మి సేసేవే
తని వెందు గలిగినా తమక మందే కలుగు
వెనుకొ నంతే శతని వేసట సేయకువే ॥ చూత ॥

కాఁక లెంతవిరివైనాఁ గాఁగి లంత విరివౌను
వీఁకల నాతని నేమి వేఁడుకోకువే
వేఁకపుశ్రీ వేంకటాద్రివిభుఁడు నన్నిటుగూడె
యేఁకట వాసె నింక నేమీ ననకువే ॥ చూత ॥33

రామక్రియ

విన్నమాఁట కన్నమాఁట విన్నవించితిమి నీకు
వున్నాఁడవు మాయింట వూహలు నీకెట్టివో ॥ పల్లవి ॥

అల్లాడ వారు నిన్ను నడిగిరి యేమిటికో
వెల్లవిరిగాఁ గొందరు వెదకిరి
మొల్లమిఁ గొందరు నీకు మొక్కిరి యందరియిండ్లా
వల్లెగా నేమిసేసి వచ్చితివో ॥ విన్న ॥

నయములనే కొందరు నవ్విరి నీసుద్దులకు
ప్రియపడి పేర నిన్నుఁ బిలిచిరి
దయతో నిను( గొందరు దలఁచిరి యాదనాద
జయమై చుట్టరికము సరి నెంత గలదో ॥ విన్న ॥

కొందరు నీరాకలకుఁ గోరి నిక్కిచూచిరి
కందువ నీకూటములే కడుమెచ్చిరి
యిందరిఁ గూడి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
సందడిజాణఁడవు నీసరవి చూచితిమి ॥ విన్న ॥ 34

శంకరాభరణం

వరుస దప్పినమీఁద వాదులేలిఁక
సరవి నడిపితేను సమ్మతించేఁగాక ॥ పల్లవి ॥

కోపగించ నిఁకనేలే కొంకుదేరినవెనక
వోపి తనయిల్లాలనై వుండుటగాక
రాపుసేయ నిఁకనేలే రాజసమే చూపఁగాను
చేపట్టి వూడిగాలు నేఁ జేయు టింతేకాక ॥ వరు ॥

జంకించ నిఁకనేలే చలివాసినవెనక
మంకుతోఁ బుస్తెగట్టుక మనుటగాక
అంకించి పిలువనేలే అటుమోమైన వెనక
కంకియై తనరాకకుఁ గాచుకుండడుఁగాక ॥ వరు ॥

పచ్చిసేయ నిఁకనేలే పంతమిచ్చినవెనక
మెచ్చి తనకాఁగిట నే మెరతుఁగాక
అచ్చపుశ్రీవేంకటేశుఁ డంగవించి కూడె నన్ను
యెచ్చుఁగుందు లిఁకనేలే యెఱఁగనైతిఁ గాక ॥ వరు ॥ 35

సాళంగనాట

[1]పరమాత్ముఁ డైనహరి పట్టపురాణివి నీవు
ధర మమ్మ విచారించఁదగు నీకు నమ్మా ॥పల్లవి॥

కమలజుఁ గన్నతల్లి కాముని గన్నతల్లి
అమరులఁ గన్నతల్లి ఆదిమలక్ష్మి
విమలపు * నీపతికి విన్నపము సేసిమమ్మ
నెమకి యేలితి దయ నీకే తగునమ్మా ॥పర॥

కామధేను తోఁబుట్టుగ కల్పకము తోఁబుట్టుగ
దోమటి చల్లనిచంద్రుతోఁబుట్టుగ
నీమగనిపంపునను నిజసిరు లిచ్చితివి
నేమపువితరణము నీకే తగునమ్మా ॥పర॥

పాలజలధికన్యవు పద్మాసనవి నీవు
పాలఁ బండేశ్రీవేంకటపతిదేవివి
యేలిన యితనిబంట్ల కిహపరా లిచ్చి మా-
పాలఁ గలిగితివి సంబంధము మేలమ్మా ॥పర॥ 36

రేకు 1007 దేవగాంధారి

పాకముదప్పినఁ బనికిరా విఁకను
దీకొని రమణుఁడ తెలుపఁగవలెనా ॥పల్లవి॥

వుడికినచిత్తం బూఁకొననోపదు
పడఁతులతోఁ జెప్పర మాఁట
బడలినచేతులు పట్టఁగనోపవు
అడపమునకు వీడె మందియ్యరాదా ॥పాక॥

1. ఇది ఆధ్యాత్మకీర్తనలలో నుండదగు. * 'విమలుఁడౌ నీపతికి' అనియుండ వచ్చు, మహాత్ముల కమహద్వాచకవిశేషణము ఉపమానోక్తరములందే చూపఁబడినది.

వాడుమోము నవ్వఁగనోపదు నీ-
వాదర సరసము లటువోయి
పీడినతురు మది విరులకు నోపదు
బోడమ్ముల మరుపొవుల నుసుచరా ॥ పాక ॥

కాఁగినదేహము కప్పుడు కోపదు
రాఁగుఁబచ్చడము రతి నిడరా
కాఁగిట శ్రీవేంకటపతి కూడితి-
వేఁగక యిచటనె యెనసి వుండరా ॥ పాక ॥ 37

భూపాళం

అలపు దీర్చుకోరాదా అన్నీ నయ్యీఁగాని
నిలువెల్లాఁ జెమరించి నీళ్లుగారీని ॥ పల్లవి ॥

వీడె మందుకొనరాదా వెనక విచ్చేతుగాని
బీడై నీకెమ్మోవి పిప్పిగట్టెను
చూడరాదా మమ్ముఁగొంత చొక్కి కన్నుమూతుగాని
ఆడా నీడా నుమ్మదాఁకి యలపుదేరీని ॥ అల ॥

పాద మొత్తించుకోరాదా పక్కన నవ్వుదుగాని
పీదులెల్లాఁ దిరుగాడి విసిగినది
జూదమైనా నాడరాదా సొంట్లు సోదింతుగాని
ఆదిగొని కోరికలు అంకెకుఁ దీసీని ॥ అల ॥

పవళించి వుండరాదా పానుపుపై నికనైనా
జవళిఁ బులకలు మై జడిసీని
యివల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
సవతులఁ దేకుమీ చలమెక్కీని ॥ అల ॥ 38

## రామక్రియ

ఈడ నెవ్వరి సొలసే వింతసలిగె గలితే
వాడికె నాతనిచేత వలపించుకోవే ॥ పల్లవి ॥

సారె నీవు నాతో జగడించినందుకెల్లా
చేరి ప్రియా లతనిచేఁ జెప్పించుకోవే
దూరి నేఁ గోపాన నిన్ను దొబ్బినందు కిపుడే
యీరానిపంతాలు నందే ఇప్పించుకోవే ॥ ఈడ ॥

నేయరానిసేఁత నిన్నుఁ జేసినందుకెల్లాను
మోయనాడి నాతనిచే మొక్కించుకోవే
వోయమ్మ నిన్ను నే వొట్టువెట్టినందుకట్టె
వేయిమారు లతనిచే వెస మొక్కించుకోవే ॥ ఈడ ॥

సవతిమచ్చరాన నే సడిఁబెట్టినందుకెల్లా
రవళి నీయింటికే రప్పించుకోవే
యివల శ్రీవేంకటేశుఁ డీడ నిట్టె నన్నుఁ గూడి
కవ వాయకున్నాఁడు కరఁగించుకోవే ॥ ఈడ ॥ 39

## సామంతం

మరులుకొలుపఁ జోటులేదు మాకు బొంక నెడములేదు
సరస నాయకుఁడవు నీకు చందమాయఁగా ॥ పల్లవి ॥

కరఁగి కరఁగి చెలియపేరు కలవరించి నుడుగువంక
మరిగినట్టిపొందులౌత మాకుఁ దెలిసెఁగా
వెర వెఱఁగఁ గుండువంక వింత లాలకించువంక
తరతరంబుఁ బాయరానితగులు దెలిసెఁగా ॥ మరు ॥

నిలిచి నిలిచి చొక్కువంక నీలోనినవ్వువంక
చెలికి మేలువాఁడీవౌత చెలువు మిగిలెఁగా
పలికి పలికి భ్రమయువంక బహుపరాకులైనవంక
కలిగినంత మోహమెల్లఁ గానవచ్చెఁగా ॥ మరు ॥

ఇట్టునట్టుఁ జూచువంక యేకతాన నుండువంక
అట్టె చెలియఁ గూడురతుల ఆస దెలిసెఁగా
పెట్టుకొన్న సేసవంక పెండ్లి శ్రీ వేంకటేశ
గట్టిగాఁగ సతికి నీకుఁ గలుగు టాయఁగా ॥ మరు ॥ 40

పాడి

మానుమనవే ఇట్టివి మాయింటికి రమ్మనవే
తానే యెరుఁగు నీమాట తలఁచుకొమ్మనవే ॥ పల్లవి ॥

సరవిదప్పినవేళ సతితో నవ్వేవాఁడు
వరుసెరఁగనియట్టివాఁడెపో కూళ
యెరపరికపుపొరుగింతితో నవ్వేవాఁడు
దొరయైనఁ గానీ వాఁడే దొడ్డైనకూళ ॥ మాను ॥

వలవనివనితలవాకిలి దొక్కేవాఁడు
వలరాచగురుడైన వాఁడెపో కూళ
తలవంచినసతిని తప్పకచూచేవాఁడు
తొలుత నన్నుండఃకంటె దొడ్డైనకూళ ॥ మాను ॥

చిత్త మెరఁగనియట్టి చెలిఁ జేరి కూకులును
వత్తులునై విరిగినవాఁడెపో కూళ
చిత్తగించి నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడే జాణ
తొత్తువంటి దాకెపో దొడ్డైనకూళ ॥ మాను ॥ 41

బౌళి

ఇటు నీకు సతమైతే నేమిసేయవలసునో
తటుకునను నివి యెపుడుఁ దలపోయవలసె ॥ పల్లవి ॥

చెలఁగి నీ వొకనాఁడు సేసినపొందుకుఁగాను
కులికి నీవు రాకుండఁగాఁ గోపగించవలసె
సొలసి నీ వలవోకఁ జూచినచూపుల భ్రమసి
బలిమి నినుఁ బట్టుకొని పచ్చిసేయవలసె ॥ ఇటు ॥

వేడుకలకు నీవు నాకు విడె మియ్యఁగా మరిగి
జాడ నీవు పరాకైతే జంకించవలసె
నాఁడు నీ వొకమాఁటు నవ్వ నవ్వఁగఁ జొక్కి-
కూడుమనుచు నిను సారెఁ గొంగుముట్టవలసె ॥ ఇటు ॥

గరిమెతో నను మెచ్చి కాఁగిలించినందుకుఁగా
సురతమున నిను నొత్తి సూడువట్ట వలసె
సిరుల శ్రీవేంకటేశ సేసవెట్టినందుకుఁగా
యిరవుకొని నీవురము యెక్కివుండవలసె ॥ ఇటు ॥ 42

రేకు 1008 ముఖారి

ఇందుకు నేమందునే యిపుడు నేను
ముందుముందె జాణఁడని మొక్కనే నేను ॥ పల్లవి ॥

కూరిమి వేరొకతెఁ దాఁ గూడఁగా నే జంకించితే
ఆరామపైఁ నానవెట్టీ నాయఁగా నేను (ఁడు?)
కోరక నే నుండినాను కొమ్మచేత విడె మంపె
మేరమీరి ఇది చూచి మేలంటినే నేను ॥ ఇందు ॥

అలిగి నే నుండఁగాను ఆకెచేఁ బిలువ నంపె
చెలువుని చేఁతకు మెచ్చితినే నేను
పలుక కుండఁగ నన్నాపడఁతి పేరఁ బిలిచె
నలుగడ నిందుకుఁగా నవ్వేఁబో నేను ॥ ఇందు ॥

తను నే నొట్టువెట్టితే తనసతి మొక్కించి (చె?)
తనిసితి నిందుకుఁగా తగునే నేను
అనుగు శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడి
తనకాంతఁ జేతికిచ్చె దక్కఁగొంటి నేను ॥ ఇందు ॥ 43

వరాళి

నేరుపెల్లా నొక్కటే నెలఁతలభాగ్య మింతే
సారెసారె ముట్టకురా సటలకు వచ్చేనా ॥ పల్లవి ॥

కన్ను లార్చ నేరుతురు కడు నవ్వ నేరుతురు
కన్నెలట పురుషులఁ గరఁచలేరా
వన్నెల మోహము గత్తే వాడులైనా వింపులే
మన్నించరా రమణుఁడ మాటలకు వచ్చేనా ॥ నేరు ॥

చక్కఁదనాలూఁ గలవు చతురతలుఁ గలవు
చొక్కపుఁగామినులట చొక్కించలేరా
గక్కనఁ జనవు గత్తే గర్వమైనా చందమౌను
చెక్కునొక్కకురా నీవు చేఁతలకు వచ్చేనా ॥ నేరు ॥

పైకొని కూడఁగవచ్చు పంతములాడఁగవచ్చు
లోకములో సతులట లోఁగ నున్నదా
మేకొని శ్రీవేంకటేశ మించి నన్నుఁ గూడితివి
పోకురా యెందునుఁ దలపోఁతలకు వచ్చేనా ॥ నేరు ॥ 44

### పాడి

అందుకు నిందుకుఁ బతి ఆయఁగదరా
నందకధరుఁడ నేఁడు నవ్వువచ్చీ నాకు ॥ పల్లవి ॥

పిన్నదాననై బొమ్మపెండ్లి నేఁ జేయఁగాను
నన్నుఁ జూచి నీవు నాఁడే నవ్వితివిగదరా
చెన్నుగ నాకిట్టె సన్న సేసి నీవు గూడఁగాను
నన్ను నిన్నుఁ జూచి నేఁడు నవ్వువచ్చీ నాకు ॥ అందు ॥

పడుచులు నేను చెట్టాపట్టాలు పట్టు కాడఁగా
నడుమనే నన్నుఁ జూచి నవ్వితివిగదరా
చిడుముడి నీవు నన్నుఁ జెట్టవట్టుకోఁగా నేఁడు
నడుకొత్తి నిన్నుఁ జూచి నవ్వువచ్చీ నాకు ॥ అందు ॥

పొలసి గుజ్జనఁగూళ్ల బువ్వాలాడే నన్నుఁ జూచి
నలువంక నాఁడు నీవు నవ్వితివిగదరా
యెలమి శ్రీవేంకటేశ యిటు నామోవిబువ్వము
నలి నీ వంటి కూడఁగా నవ్వువచ్చీ నాకు ॥ అందు ॥ 45

### వరాళి

కనీఁగానములకుఁ గక్కసించేనా నిన్ను
ఘనుఁడవు నీవైతే గబ్బితన మేలరా ॥ పల్లవి ॥

నగితిఁగాక నీతోను నాయానకు వచ్చేనా
అగడుగ శతాయుష్యమంటేఁ గొంగువట్టేవా
మొగము చూచితిఁగాక ముట్టితే ముయి గొనేనా
మగవాఁడవైతేనే మాట లింతే శేలరా ॥ కనీఁ ॥

సరసమాడితిఁగాక సాదించ వచ్చేనా
పొరి నిప్పంటేనే నోరు పొక్కెననేవా
మరఁగు దీసితిఁగాక మంద మిరేలు చల్లేనా
సరసుఁడవై తేకే సాదింపులేలరా ॥ కనీఁ ॥

కాఁగిలించితిఁగాక కయ్యాలకు వచ్చేనా
మాఁగెను మోవిపండంటే మరి గుక్కిళ్లు మింగేవా
చీఁగక కూడితి నన్ను వేగమె శ్రీవేంకటేశ
తోఁగి నేసవెట్టితేనే తోదోపులేలరా ॥ కనీఁ ॥ 46

శంకరాభరణం

నవ్వే దెఱఁగఁడు నడుమంత్రములవారు
చివ్వనఁ చనలోన సిగ్గువడవలదా ॥ పల్లవి ॥

రాకాఁటోకల రమణుఁడు దూరీనే। తా
జోక సన్నసేయఁగాను చూడనంటా
పోకుంటేఁ బిలిచి బొమ్మల జంకించీనే। యింత—
కాకు గలదా కాంతలలోన ॥ నవ్వే ॥

బలిమిఁ జలిమిఁ బతి యేల యలిగీనే। తా—
నలసి నిద్రించ లేపనైతినంటా
పలికి పలికి పలువెంగేలాడీనే। నే
వెలికి వచ్చితినంటా వేగిరమా తనకు ॥ నవ్వే ॥

తగిలి తగిలి తానేల మొక్కీనే। నే
జిగిఁ గూడి చెప్పినట్టు సేసితినంటా
చిగులుతా మెచ్చీ శ్రీవేంకటేశ్వరుఁడె నేఁ
దగ నురమెక్కితిని తా జాణఁగదవే ॥ నవ్వే ॥ 47

హిందోళవసంతం

పతి మీఁది తమకాన భ్రమసితివింతే నీవు
అతివరో వెలిపేలే అవే నీవు గావా ॥ పల్లవి ॥

చందురుఁ డితఁడు గాఁడే సతి నీనెమ్మోముగాని
పొంది నీనీడ జలధిఁ బొడచూపెను
మందానిలుఁడు గాఁడె మఁగువ నీవూర్పు గాని
గందపుఁగొండఁ దాఁకి కమ్మరా నేతెంచెను ॥ పతి ॥

కోవిలకూఁతలు గావె కొమ్మ నీయెలుఁగు గాని
యీవలఁ బ్రతిధ్వనులై యెగసె వనానను
పూవులమొగ్గలు గావె పూఁపనీచన్నులు గాని
తావుల వసంతమాడఁ దలలెత్తెఁ బొదల ॥ పతి ॥

చిక్కులు మరుఁడు గాఁడె శ్రీవేంకటేశుఁడు గాని
తక్కి నీమనసు చూచి దగ్గరె భావమున
యిక్కువ లంటి కూడితి రిద్దరూఁ బానుపుమీఁద
మొక్కుగాదు మోపు గాని ముంచి నీపై వేసెను ॥ పతి ॥ 48

రేకు 1009 హిందోళం

వనితకుఁ బతి కిదె వసంతము
దినదినము నమరె తిరుమలమీఁద ॥ పల్లవి ॥

పుష్పాదివసంతము పొసఁగె రమణునికి
కప్పురవసంతము కాంతకును
కొప్పెరల నెదురుగఁ గుంకుమ పన్నీరు నించి
కుప్పెలఁ జల్లులాడేరు కోనేటికాడ ॥ వని ॥

జవ్వాదివసంతము చతురుఁడు గైకొనె
పువ్వులవసంతము పొలఁతి కిదె
రవ్వగా బండ్లపై రాసులు వోసుక
నవ్వుతా వేటులాడేరు నడిమిచింతాడ ॥ వని ॥

గందపువసంతముఁ గడు శ్రీవేంకటపతి
అందె కస్తూరివసంత మలమేల్మంగ
చిందుచుఁ దట్టుపుణుఁగు చిమ్ముచుఁ గూడాడేరు
సందడి సమరతుల సంపెంగకాడ ॥ వని ॥ 49

ముఖారి

చెల్లునా నీ కీపనులు చెన్నకేశా[1]
కొల్లకాఁడ వౌర గండిగోటచెన్నకేశా ॥ పల్లవి ॥

అంగవించి మగనాలి కాసపడే విందరిలోఁ
జెంగలింపుఁజూపులతోఁ జెన్నకేశ
రంగుమీర నిరువంక రమణు లిద్దరుండఁగా
అంగన లింకానా ఔరా చెన్నకేశా ॥ చెల్లు ॥

కమ్మటి మానవు మమ్ముఁ గరఁగించే వూరకైనా
చిమ్ముఁదేనెమాటలతోఁ జెన్నకేశ
దొమ్మిసేసి మగువల తొల్లె యాఅడిఁ బెట్టితి-
వమ్మరో నీకు వెరతుమౌర చెన్నకేశా ॥ చెల్లు ॥

వావి గద్దంటా నాతో వచ్చి వచ్చి నవ్వేవు
శ్రీవేంకటాద్రిమీఁదఁ జెన్నకేశ
కావిమోవి గంటిసేసి కమ్మి నన్నుఁ గూడితివి
ఆవేళ నేమననైతి (నే మననైతి?) చెన్నకేశా ॥ చెల్లు ॥ 50

1. "చెన్నకేశవ" శబ్దమునకు వ్యావహారికరూపముగ నున్నది.

వరాళి

ఏమనేవోయని నాకు యెంచరాదు తమకము
నామనసు దా నెఱుఁగు నాలిసేయఁడుగదా ॥పల్లవి॥

చెప్పితివా ఆతనితోఁ జెలియ నామాటలెల్లా
దప్పిగొన్న ట్టిచ్చగించి తాను వినెనా
అప్పటి నేమని విభుఁ డానతిచ్చె మారుమాట
తప్పఁడు గదా నాకుఁ దా నిచ్చినబాస ॥ఏమ॥

పిలిచితివా నీవు ప్రియము గూరిచి వాని
వలపు గలిగి తా వచ్చేననెనా
తలఁపు నీకుఁ దెలుసు తడవెనా నాసుద్ది
నెలవినవ్వులతో నీచేతికాను కంపెనా ॥ఏమ॥

యిచ్చితివా ఆనవాలు యింతి నారమణునికి
యిచ్చల శ్రీవేంకటేశుఁ డియ్యకొనెనా
వచ్చె నిదె యింతలోనే వహికెక్క నను గూడె
తచ్చన లింతాఁ జేసె తారుకాణ లాయనా ॥ఏమ॥ 51

సాళంగనాట

వట్టిదూరులేల వేసీ వద్దే యింత। తన—
గుట్టు నే నెఱఁగనిదా కూడుకొంటి నేను ॥పల్లవి॥

మఱి తాను నవ్వఁగాను మానుమంటినా నేను
తఱితోడ సిగ్గువడీ తానే కాక
వుఱక కాఁగిలించఁగా నొల్లనంటినా నేను
యెఱిఁగి పరాకుసేసీ యేఁటికో కాక ॥వట్టి॥

కడఁగి నేసలెట్టఁగాఁ గాదంటినా నేను
తడవు జోలి దవ్వీ తానే కాక
జడిసి మాటాడఁగాను చాలునంటినా నేను
యెడనెడ సొలసీని ఇది యేమో కాక ॥ వట్టి ॥

పొలసి లోనికి రాఁగాఁ బొమ్మంటినా నేను
తలవాకిటనే వుండీ తానేకాక
అలమి శ్రీవేంకటేశుఁ డంతలో విచ్చేసి కూడె
చలము సాదించీ యెంతసలిగో కాక ॥ వట్టి ॥ 52

## సామంతం

కానీ కానీ పదవే కానవలెఁగా తన్ను
నేనే తాఁ గావలె నెగులేలే తనకు ॥ పల్లవి ॥

పిలిపించఁ గలఁడట ప్రియము చెప్పఁగలేఁడా
బలువుఁడైతే మాతోఁ బంతమా యిది
వలపించఁగలఁడట వరుసకు రాలేఁడా
చెలులమైతేనే చెల్లుబడా తనకు ॥ కానీ ॥

చెక్కునొక్కఁ గలఁడట చెప్పినట్టు సేయలేఁడా
అక్కటా యిదీఁగొంత అగడా నేఁడు
మొక్కించుకోఁగలఁడట మొకమోట నుండలేఁడా
పక్కన నేఁ డింతలోనే పగటా తనకు ॥ కానీ ॥

కాఁగిలించఁ గలఁడట కందువ మోవియ్యలేఁడా
వీఁగేటిరతులలోన వేసటా ఇది
యేఁగివచ్చి శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
దాఁగి దాఁగి సిగ్గువడఁ దగవా తనకు ॥ కానీ ॥ 53

భైరవి

అంతేకాదా మరి ఆయఁగా పని
చెంతఁ జక్కనివా రూరఁ జేరివుండఁ బాసెనా ॥ పల్లవి ॥

ఔరా నీపగటు ఆయము లంటవచ్చేవు
మారుమాటాడకుండేనే మన సిస్తినా
సారెనేల పట్టేవు చక్కనుందేవో వుండవో
నేరిచి మా వారు నన్ను నీకుఁగానే కనిరా ॥ అంతే ॥

అద్దో నీబలువు అద్దలించి పిలిచేవు
వద్దనఁ జాలకుండేనే వసమైతినా
పొద్దువోదా నీకదేమి బూతులనే గొణఁగేవు
బుద్దిలో(లేః)నిమరుఁడు నీపొరుగే కాఁ జేసెనా ॥ అంతే ॥

మేలువో నీతగవు మించి నన్నుఁ గూదేవు
మేలమాడకుండేనే మెచ్చనైతినా
పాలించి శ్రీ వేంకటేశ పకపకనవ్వేవు
పాలవంటివయసు నీపాలికిట్టె దక్కెనా ॥ అంతే ॥ 54

రేకు 1010 శుద్ధవసంతం

ఇంతలోఁ గోపము గద్దా ఇయ్యకొని వుండవద్దా
వింతగాదు నీకు నాకు వెరగైతి నింతే ॥ పల్లవి ॥

సతి! యేలే గొణఁగూ చల్లకువే సణఁగూ
మతి నీమొగమై వుండి మళ్లితి నింతే
కతగాఁ దిట్టకువే కానినింద గట్టకువే
పతినై వున్నాఁడఁ గోక పైఁ గప్పుకొంటి నింతే ॥ ఇంత ॥

వద్దువద్దే కసరూ వంచకువే వుసురూ
వద్దఁ బాయ నాలోఁ దలవంచితి నింతే
గద్దించి చూడకువే కల్లలింతాడకువే
పొద్దువోగా నీయింటిలో నిద్దిరించే నింతే ॥ఇంత॥

వేగిరించి తియ్యకువే వేసాలు సెయ్యకువే
నాగుట్టు నీకుఁ దెలుసు నవ్వితి నింతే
భోగించితిఁగదవే పొంచి ఇంకాఁ బదవే
యీగతి నే శ్రీవేంకటేశుఁడ నింతే ॥ఇంత॥ 55

వేళావళి

నిజమరివి నీవని నే నుందుదును
గజరులు చెలియదే కదిసీ నిన్నును ॥పల్లవి॥

పగటులనడపులఁ బకపకనగుచును
మగువ నీయెదుటను మలసీని
తగులు గలుగఁబోలు; తరుణుల నొల్లనని
పొగరుల నాతో బొంకుదువు ॥నిజ॥

పుక్కిటివిడెముతోఁ బొరిఁ గన్నులార్చుచు
చక్కనిమగువ నిన్ను జరసీని
వొక్కటి నీతోఁ గాఁబోలు; వొగి నీవాఁడనేయంటా
చక్కఁగ నేడలేనిబాసలు సేతువు ॥నిజ॥

నిలువుఁజెమట గార నీతో సరసమాడీని
కలికి నీకు నసలు గాఁబోయిను
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
యిలఁ గొంతవడి భ్రమయించనేల నీవు ॥నిజ॥ 56

సామంతం

పేరుఁ గీర్తిగావలె బిరుదులు వేరె యేల
ఆరీతి నా పఁ(పం?)త మిదె అటు చూడరాదా ॥పల్లవి॥

కన్నెను నామోహము నీకాళ్లఁ బెనఁగించకుంటే
నన్నుఁ జూచి నీ వప్పుడు నవ్వరాదా
యెన్ని చెప్పినా రావు యిదె నా నిట్టూర్పుగాలి
దిన్నలై రాసులువోసితే మెచ్చరాదా ॥పేరుఁ॥

తక్కక నాజవ్వనము తరవు వెట్టించకుంటే
పెక్కువతో నొండుపేరు వెట్టరాదా
చక్కనుండ వెఁ(వెం?)తైనా సటలకుఁ దిరిగేవు
ముక్కలబంటి గావలె ముదు(ద?)లియ్యరాదా ॥పేరుఁ॥

మంతనపునామాటలు మర్మాలు నాటించకుంటే
అంతవింతా నీవు వెంగేలాడరాదా
చెంతల శ్రీవేంకటేశ చేకొని కూడితివి న-
న్నంతటాఁ బొగడవలె నటు చూడరాదా ॥పేరుఁ॥ 57

శంకరాభరణం

ఇంతకంటె నోపము యేదౌతా నెఱఁగము
పంతము లింకానేల పదవయ్యా ॥పల్లవి॥

సన్న సేసితివి నీవు సంగడికి వస్తి నేను
యెన్నఁగ మీఁదటిపని యేమనేవయ్యా
కన్నులఁ జూచితివి నీవు కైదండ యిచ్చితి నేను
చిన్నదాన నేమిసేతుఁ జెప్పఁగదవయ్యా ॥ఇంత॥

చిఱునవ్వు నవ్వితివి సిగ్గువడితిని నేను
యెఱఁగ మేమిటికౌతా నిది యేమయ్యా
జఱపులఁ బెట్టితివి జంకించితిని నేను
మఱఁగులు మొఱఁగులు మఱి యేలయ్యా ॥ ఇంత ॥

కాలుదొక్కితివి నీవు కరఁగితి మేను నేను
వోలి నొక్కమనసుతో నుండవయ్యా
యేలితివి శ్రీవేంకటేశుఁడ విందిర నేను
మేలు మేలు యిన్నిటాను మెచ్చితి నిన్నయ్యా ॥ ఇంత ॥ 58

దేసాళం

మానవయ్యా మాతోడి మందెమేళాలు
సానఁబట్టేవు పంతాలు సతులపై నేలయ్యా ॥ పల్లవి ॥

వా(వ్రా?)యవయ్య చెక్కులపై వలపులవాఁ(వ్రాఁ?)తలు
యేయెడనీసతిపై యెఁ(యెం?)దైనాఁ బోయి
ఆయము దాఁకీ మాకు నంతేసి కోపము నీ-
చేయి పూరకుండకుంటే చిమ్మవయ్య బయలు ॥ మాన ॥

ఆడవయ్యా నీనోర నలపెండ్లిమాటలు
యీడ నాడ సతులపై నెఁ(నెం?)దైనాఁ బోయి
పీడెపుమానెలవుల విచ్చి చెప్పఁజాలము
ఆడుకొన వేడుకైతే నటు ముంటాఁ బోవయ్యా ॥ మాన ॥

అందవయ్య చేయిచాఁచి అంగజమర్మములు నీ-
విందు రాకుంటేఁ జాలు నెఁ(నెం?)దైనాఁ బోయి
కందువ శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితి నీ-
వందుకోలుజాణవైతే నట్టే కానీవయ్యా ॥ మాన ॥ 59

లలిత

నవ్వులు నవ్వించవచ్చీ నగకున్నాను
. యివ్వలఁ గతలు మానఁ డిఁకనన్నాను ॥ పల్లవి ॥

తన్నెవ్వారు దడవిరే తానేల మాటాడీనే
సన్నలుసేయఁగ వచ్చీఁ జాలునన్నాను
యెన్నోవినయాలు సేసీ యియ్యకొన్నవా రెవ్వరే
వున్నతిఁ బైఁజేయివేసీ నోపనన్నాను ॥ నవ్వు ॥

యిట్టె తానేడ నే నేడ యిచ్చకాలు సేసిసేసి
వట్టివావులు దెలిపీ వద్దన్నాను
చుట్టిచుట్టి మొక్కుమొక్కీఁ జూచినవా రెవ్వరే
నెట్టుకొని బాస సేసీ నిలువుమన్నాను ॥ నవ్వు ॥

కాదన్నవా రెవ్వరే కడుమోహములు చెప్పి
సేదదేర మోవి చూపీ సిగ్గువడ్డాను
యీదెస శ్రీవేంకటేశుఁ డిటె బలిమిఁ గూడె
గాదెఁబోసీఁ బంతములు కైకొంటి నన్నాను ॥ నవ్వు ॥ 60

రేకు 1011 సాళంగం

అంది ఇతవుసేసితే నాయఁగా పని। నా-
కందరిలో వెరగయ్యీ నాయఁగా పని ॥ పల్లవి ॥

చింతటిచెక్కుచెమట చేతఁ దుడువఁగఁబోతే
అందుకేఁ తా జగడించీ నాయఁగా పని
కందువలఁ దనమేన గందము పూయఁగఁబోతే
అందందే తప్పకచూచె నాయఁగా పని ॥ అంది ॥

తురుమువాడుఁబువ్వులు తొలఁగఁ దియ్యఁగఁబోతే
అరమరై జంకించీ నాయఁగా పని
గరిమ వంచినమోము కని అలసితివంటే
అరుదుగా మారుమోమై ఆయఁగా పని ॥ అంది ॥

అప్పుడు చెదరినట్టిహారాలు చక్కదొబ్బితే-
నప్పటి తాఁ గాఁగిలించీ నాయఁగా పని
కప్పురము మోవి కియ్యఁగా శ్రీవేంకటపతి
అప్పళించె రతుల నన్నాయఁగా పని ॥ అంది ॥ 61

## సామంతం

ఓయమ్మ ఇంతయేల వొద్దనరే
నాయముగా దిందరిలో నగుఁబాటు దనకు ॥ పల్లవి ॥

చెక్కునొక్కితిని సెలవి నవ్వితిని
మక్కువతో నెఁ(నెం?)తైనా మాటాడఁడు
మొక్కు మొక్కితిని మోనాన నుండితిని
యెక్కుడు దిట్టితినంటా నెగ్గువట్టీ నితఁడు ॥ ఓయ ॥

ఇచ్చకముఁ జేసితి ఇచ్చితి విడెమును
కచ్చుపెట్టి యెఁ(యెం?)తైనాఁ గరఁగఁడు
ముచ్చటలాడితిని మోవిఁజూపితిఁ దన్నుఁ
బచ్చిగాఁ జేసితినంటా పగచాటీ నితఁడు ॥ ఓయ ॥

కన్నులాఁ జొక్కితిని కాఁగిటా నించితిని
మన్నించె రతి నెఁ(నెం?)తైనా మానఁడు
సన్నల మెచ్చితిని చాయల హెచ్చితిని
ఇన్నిటా శ్రీవేంకటేశుఁ డెంతజాణే ఇతఁడు ॥ ఓయ ॥ 62

భైరవి

ఇంతిరో యిట్లనైతే యేమిసేసేనే
ఘంతనాన పతి వీఁడే మరి యేమనేనే ॥ పల్లవి ॥

అప్పుడే నే ననా ఆతఁ డిందుకు వచ్చితే
వొప్పనతో మొగమోడి వుండుదునని
తప్పదేర నాడనుండే తగినట్లెల్లా నాడక
నెప్పున యీడకుఁ దెస్తే నే నేమనేనే ॥ ఇంతి ॥

చేత సన్నసేయ నాచెళ్లుఁ గిట్టే పట్టితే-
నాతల నేఁ బరవశ మందుదునని
పై తరవై ఆడనుండే పంతములు వుచ్చుకోక
యీతల నన్నాడుమంటే యిఁక నేమనేనే ॥ ఇంతి ॥

సెలవి నే నవ్వనా శ్రీవేంకటేశ్వరుఁడు
కలసితేఁ గరఁగుదు కమ్మర నని
తొలుతనే ఆడవైతి దూరకువే యిఁకనేమి
నిలిచితి మిద్దరమూ నిన్ను నేమనేమే ॥ ఇంతి ॥ 63

బౌళి

పొందైన యింతులు లేరో పురుషులు లేరో భూమి
ఇందే కంటిమి వింత లివి గొన్ని వలెనా ॥ పల్లవి ॥

వేడుకా నొకకొంత విసుపూ నొకకొంత
ఆడనుండే పతి మాటలాడించఁగా
తోడ నలయించుకంటె తొల్లిటిఅలుకే మేలు
వాడికె నీసతి కింతవలెనా అగడు ॥ పొందై ॥

నెలవిన వ్వాకకొంత చి(చె?)క్కుచేయీ నొకకొంత
సొలసి ముందర నిల్చి జోలిదవ్వఁగా
నిలుచుండి యేఁచుకంటె నీవు రానన్నా మేలు
వలచినచెలి కింతవలెనా తగవు ॥ పొందై ॥

నిండుఁగళ లొకకొంత నిట్టూర్పు నొకకొంత
అండ నీవు కాఁగిలించి అటు గూడఁగా
కొండల శ్రీవేంకటేశ కోమలిపై నీమేలు
వండుదేరెఁ జెలి కింతవలెనా వెరగు ॥ పొందై ॥ 64

శంకరాభరణం

ఇప్పటనుంటినేల యెడమాట కానీకానీ
ముప్పిరి నే నవ్వితేఁగా మొగకళ లెక్కుత ॥ పల్లవి ॥

పొలసి పొలసి లోఁగి పొంచి పొంచి తలవంచి
సెలసి సెలసి తాను చిమ్మి గోర
అలసి సొలసి యిప్పు డాడనేల తాను నేను
కలసినప్పుడుగదా కడమలు నిండుత ॥ ఇప్ప ॥

జునిఁగి జునిఁగి లేచి మునిఁగి మునిఁగి యేసి
పెనఁగి పెనఁగి పాసి ప్రేమ చల్లీని
పొనిఁగి పొనిఁగి తన్ను బోదించనేల నేను
పెనఁగినప్పుడుగదా బిరుదు వొగడుత ॥ ఇప్ప ॥

మానిమాని కరఁగీని మగుడ కాలుఁ దొక్కి
ఆనిన శ్రీవేంకటేశుఁ డంతలో నిదే
కోనకోనచన్నులపైఁ గొంక కిట్టె చేయివేసీ
నానినవలపులఁ గా నానాఁట మెచ్చుట ॥ ఇప్ప ॥ 65

కాంబోది

ఎగ్గువట్టీ నిదియేమే యీతఁడు
సిగ్గువడ్డనాలోనిచింత లెంచవలదా ॥ పల్లవి ॥

మనసు చంచలమైతే మాటాడఁ గొలుపునా
ననుపైనవిభుఁడేల నన్ను దూరీనే
తనువు కాఁకరేఁగితే దగ్గరి రాఁగొలుపునా
తనపనే చూచెఁగాని తగ వెంచవలదా ॥ ఎగ్గు ॥

పాయపువేఁకముచేతఁ బలుకఁగఁ గొలుపునా
చాయల సన్నల నేల సాదించీనే
రేయి విరహానఁబొంది రిచ్చఁ జూడఁ గొలుపునా
నాయెడ రాజస మెంచి నన్ను నెంచవలదా ॥ ఎగ్గు ॥

కడుజెనుట నిండితే కాఁగిలించఁ గొలుపునా
బడివాసి యిప్పుడేల పైకొనీనే
అదరి శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁగూడె
విడువ నిరతు లెంచి వేళ యెంచవలదా ॥ ఎగ్గు ॥ 66

రేకు 1012 రామక్రియ

వలపించి తిప్పేవు వాడవాడలను మమ్ము
యిల గొంత గుట్టు వద్దా యేలోయి విట్ఠలా ॥ పల్లవి ॥

వొల్లనే మగలవద్దనున్నగొల్లెతలను
పిల్లఁగోవిసన్నలనే పిలిచేవు
చల్లలమ్మఁబొయ్యేచోట జాణతనా లాడేవు
బల్లిదుఁడ వౌదువయ్యా పండరంగివిట్ఠలా ॥ వల ॥

వైపులఁ గొలనాదేటివారిచీరలు దీసి
రాఁపుచేసి నీవొద్దికి రప్పించేవు
యేపున వీదినుండితే యెలయించేవు చూపుల
బాపు బాపు మెచ్చితిఁగా పండరంగివిట్ఠలా ॥ వల ॥

కన్నచోట నెవ్వరైనాఁ గాంతలైతేఁ గూడేవు
చిన్ననాటనుండి యిటె చెనకేవు
యెన్నఁగ శ్రీవేంకటాద్రి నిటు విట్ఠలాన మమ్ము
పన్నుకవుండి కూడితి పండరంగివిట్ఠలా ॥ వల ॥ 67

సామంతం

ఒక్కరీతి నుండదోయి వోవిట్ఠలా
వుక్కువంటి నీచిత్తము వోవిట్ఠలా ॥ పల్లవి ॥

పొద్దువోయి వచ్చేవు పూఁచి బాసలు సేసేవు
వొద్దన్నా మానవేల వో విట్ఠలా
కొద్దిమాలి తిరిగేవు కొంగువట్టేవు మమ్ము
వుద్దండా లేలోయి వో విట్ఠలా ॥ ఒక్క ॥

వెడనవ్వు నవ్వేవు వీదులెల్లా నేఁగేవు
వొడఁబాటు లింకానా వో విట్ఠలా
కడుఁబరాకయ్యేవు కదిసేవు కమ్మరాను
వొడలు మోపకువోయి వో విట్ఠలా ॥ ఒక్క ॥

కప్పురాలు చల్లేవు కాఁగిటిలో భ్రమసేవు
వొప్పితి నీసుద్దులకే వో విట్ఠలా
యిప్పుడె శ్రీవేంకటాద్రి నిరవై కూడితి విదె
వుప్పటించఁజాల నిఁక నో విట్ఠలా ॥ ఒక్క ॥ 68

శంకరాభరణం

పట్టకురా అంత నీవు పనిలేదు
దిట్టవై నీగుణమెల్లాఁ దెలిసినమీఁదను ॥ పల్లవి ॥

చెక్కునొక్కాఁ బనిలేదు సేసవెట్టఁ బనిలేదు
గక్కన నే నలిగినకాఁకమీఁదను
నిక్కిచూడాఁ బనిలేదు నిలుచుండాఁ బనిలేదు
తక్కించి నీవు రాక తడసినమీఁదను ॥ పట్ట ॥

నవ్వు నవ్వాఁ బనిలేదు నాఁటఁజూడాఁ బనిలేదు
దవ్వులుగ బొంకినయంతటిమీఁదను
రవ్వసేయాఁ బనిలేదు రాజసాలూఁ బనిలేదు
పవ్వళించి పానుపుపైఁ బలుకనిమీఁదను ॥ పట్ట ॥

కాఁగిలించాఁ బనిలేదు కరఁగించాఁ బనిలేదు
మాఁగినరతుల నన్ను మన్నించుమీఁద
దాఁగక శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
వీఁగ నిఁకఁ బనిలేదు వేడుకలమీఁదను ॥ పట్ట ॥ 69

గుండక్రియ

నీవూ నీయంతనే నేనూ నాయంతనే
కావలసినట్లయ్యీఁ గడమ లింకేలా ॥ పల్లవి ॥

దవ్వులఁ జూచితివి తనివిఁబొందితి నేను
నవ్వు నవ్వితివి నీవు నమ్మితి నేను
పువ్వుల వేసితివి పులకించితి నేను
రవ్వగా నింకానేల రతికిఁ దీసేవు ॥ నీవూ ॥

కన్నుల మొక్కితివి కరఁగి కైకొంటి నేను
సన్నలు సేసితివి సమ్మతించితి
కిన్నెర మీఁటితివి కిమ్ములఁ జొక్కితి నేను
పన్ని యింకానేల నీవు పైకొని పిలిచేవు ॥ నీవూ ॥

మోవి నీవు చూపితివి మోహము చేకొంటి నేను
వావి నీవు చెప్పితివి వలచితిని
తావుల శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
తోవల నింకానేల దొమ్ములు సేసేవు ॥ నీవూ ॥ 70

శంకరాభరణం

విన్నపాలు సేయకురే వేగుదాఁకాను
అన్నిటా నిచ్చకములే యాడుదముగాని ॥ పల్లవి ॥

మంతనాలాడకురే మనసుదెలియుదాఁకా
కాంతుఁడు దా నేమనీనో కందముగాని
పంతాలు నెరపకురే పదఁతిఁ గలయుదాఁకా
చెంతనుండి ప్రియములే చెప్పుదముగాని ॥ విన్న ॥

తత్తరించి పిల్వకురే తానే వచ్చినదాఁకా
యిత్తలఁ గానికె సారె నిత్తముగాని
మొత్తమి నాతని నంతమోవనాడి దూరకురే
బత్తితోడ మీఁదఁ మీఁదఁ బైకొందముగాని ॥ విన్న ॥

సన్నలు సేయకురే సంగడి నవ్వినదాఁకా
యెన్నిక ముందరికత లెంతముగాని
చెన్నుమీర నింతిఁ గూడె శ్రీవేంకటేశుఁ డిట్టె
వన్నెకెక్కఁ బొగడరే వద్దన్నదాఁకాను ॥ విన్న ॥ 71

బౌళి

అనుమానా లిఁకనేల అంపరాదా నీ-
మనసు దెలిసితిమి మమ్ము నంపరాదా ॥ పల్లవి ॥

చెలిమాఁట విన్నపము సేసితిమి నీచిత్త-
మలరఁగ నానతిచ్చి అంపరాదా
బలిమి సేయఁగరాదు పట్టరాదు నిన్ను నేము
మలకలమాఁటలేల మమ్ము నంపరాదా ॥ అను ॥

అకె నీవు నెదురైతి రండనున్నారము నేము
ఆకొలఁది నీవెఱిఁగి యంపరాదా
యేకతాన యిద్దరునే యెఱుఁగుకొందురు గాని
మాకతలు యిప్పుదేల మమ్ము నంపరాదా ॥ అను ॥

మంచముపై నున్నారు మారుమోము లవి యేల
అంచెల శ్రీవేంకటేశ అంపరాదా
మించుల దోమతెరలో మేనుమేను సోఁకె మీకు
మంచిదాయ నిట్టె వుండి మమ్ము నంపరాదా ॥ అను ॥ 72

రేకు. 1013. శంకరాభరణం

అతని కివెల్లా నలవాటు
ఋతవులు చేసే యించుక నిలవే ॥ పల్లవి ॥

మొనసినమాఁటలె యెఱుకలు
మనసురావివే మఱపులు
తనిసితి మిఁక నింతటఁ బదవే। తన-
నను పుఁబ్రియములకు నవ్వితిఁగదవే ॥ అత ॥
4

కూరిమి గలచో కూటములు
వేరై తేనే వెడవెడలు
తారుకాణ లివె తడవకువే। తా
మేరమీరఁగా మెచ్చితి నిపుడే ॥ అత ॥

సమరతులై తేఁ జవు లవును
అమరనివై తే నలపవును
క్రమమున శ్రీవేంకటపతి గూడెను
తమితో నే నిఁక దక్కితి నవునే ॥ అత ॥ 73

నాదరామక్రియ

ఎచ్చరించవయ్యా నీవు యింతి తన్నుఁ దా మఱచె
మచ్చికనాయకుఁడ నీమందెమేళములను ॥ పల్లవి ॥

పలుకఁగ మఱచెను పడఁతి నిన్నుఁజూచి
పలుకరాకున్నమతి భ్రమయించఁగా
సెలవి నవ్వ మఱచె చెలువుఁడ నీపేరు
తలఁచి తలఁచి చొక్కి తమకంబునను ॥ ఎచ్చ ॥

అడుగువెట్ట మఱచె నంగన నీ కెదురేఁగి
కడు నీకు సన్నచేసె కాతరానను
అడరి విన మఱచె నప్పుడే నీమాఁటలు
పడఁతి పానుపు చేరె పరవశమునను ॥ ఎచ్చ ॥

యిప్పుడే మెచ్చమఱచె యింతిని నీవు గూడఁగ
కప్పిననీరతులలో గర్వానను
చెప్పరాదు యిఁక నేమి శ్రీవేంకటేశ్వరుఁడ
తప్పులెల్లా మఱచె నీతములము వంకను ॥ ఎచ్చ ॥ 74

సామంతం

తేనెపేరు నోర నంటేఁ దీపు వుట్టీనా
  తాను నేనూఁ గలిగితేఁ దమకాన కేమే ॥ పల్లవి ॥

తనుపైఁ జేయివేసి తాప మడఁచినఁగాక
  వనితలఁ దా నంపగావచ్చీ నదేమే
  కనుఁగొని మోవి నంటి కప్పుర మిచ్చినఁగాక
  అనుఁగుమాటలవల్ల నైనదేమే ॥ తేనె ॥

కాఁగిట రతులఁ గూడి కరఁగించినఁ గాక
  కూఁగుల నవ్వులవల్లఁ గూడినదేమే
  మూఁగుచుఁ బానుపుమీఁద ముచ్చటలాడినఁగాక
  పీఁగి దవ్వులసన్నల వెలసినదేమే ॥ తేనె ॥

మదము లొలుక నటె మనసు లొక్కటి గాక
  యెదురు మొక్కులవల్ల నిందునేమే
  యిదివో శ్రీవేంకటేశుఁ డిట్టె మన్నించెఁగాక
  పదరి వూరక మేను పచ్చిసేసిననేమే ॥ తేనె ॥ 75

రామక్రియ

నగినగి పాడుటేల నాయమా నీకు
  మగువ వూరకుంటే సమ్మతించుటగాక ॥ పల్లవి ॥

చేయివట్టి తియ్యఁగాను చేసన్న వలెనా
  చాయల నేఁ జెప్పఁగాను సాకిరి నేల
  పాయపురమణి యెంత పక్కన నీచలమెంత
  ఆయనాయ నే రమ్మంటే ఆకె యంటగాదా ॥ నగి ॥

వాంటిఁ జిక్కివుండఁగాను వోడఁబాటు వలెనా
వెంటవెంట నే రాఁగా విన్నపాలేల
దంటతనము నీ కెంత తరుణివిరహ మెంత
అంటి నే నీకు మొక్కేది ఆకెపంపు గాదా ॥ నగి ॥

కాఁగిలించి వుండఁగాను కై మీరవలెనా
రాఁగినరతివేళలో రవ్వలేల
పాఁగినశ్రీవేంకటేశ పదఁతిఁ గూడితి విట్టె
ఆఁగి నిన్నుఁ బోకుమంటె [1]ఆకెంటగాదా ॥ నగి ॥ 76

## మాళవిగౌళ

నిజ మాడఁబోతేను నీకునీకే భ్రమసేవు
భజన మెరసితిఁగా పంతమాడి నేను ॥ పల్లవి ॥

పలుకులో నొకటి భావములో నొకటి
కలికి నీగుణమెల్లాఁ గంటిఁగా నేను
తెలిసి చింతించేవు దినము లెంచుకొనేవు
యెలమి నీవూహలెల్ల నెఱిఁగితి నేను ॥ నిజ ॥

నగవులో నొకటి నడవడిలో నొకటి
వెగటైన నీకతలు వింటిఁగా నేను
పొగరుల నలసేవు పొదుదిక్కే చూచేవు
అగడైతి విందరిలో నంటిఁగా నేను ॥ నిజ ॥

కాఁగిటిలో నొకటి కాఁకలలో నొఁకటి
కీఁగంటఁ జూచి యెఱిఁగితిఁగా నేను
దాఁగక శ్రీవేంకటేశ తగఁ గూడితివి నీవు
ఆఁగి నీసిగ్గు వాపితి నవుఁగా నేను ॥ నిజ ॥ 77

11. ఆకె+అంట

శుద్ధవసంతం

వాకిటికి వచ్చినాఁడు వనిత నీ రమణుఁడు
• కైకొని యలుకలేల కడుఁదడవేల ॥ పల్లవి ॥

కప్పురవిడియ మిదె గందవొడిబరణిదె
దప్పి మోవి యందనేల తలపోఁతేల
కుప్పలైనవిరు లవె కోరతట్టుపునుఁ గిదె
కొప్పు ముడువవిదేల కొమ్మ నీవు నేఁడు ॥ వాకి ॥

బంగారుసురటి యదె పచ్చికస్తూరి యిదె
పొంగేటిచెమట యేల బుసకొట్లేల
రంగుమీర నద్ద మదే రచనలసొమ్ము లవే
సింగారించ విదియేల చెలియరో నేఁడు ॥ వాకి ॥

చేరువనే పానుపిదే శ్రీవేంకటేశుఁడు వీఁడె
మారుమోము లిఁకనేల మంకులేల
వూరకే యాతఁడు నిన్ను నొడఁబాటు చేసి కూడె
వీరమేల కమ్మరాను పిలువవే నేఁడు ॥ వాకి ॥ 78

రేకు 1014. రామక్రియ

నే మెట్టుండితిమి నీ కేలయ్యా
దీమసాన నుండరాదా దీనత నీకేలయ్యా ॥ పల్లవి ॥

సెలవిఁబార నగుతాఁ జెలిదిక్కు చూచితేను
నిలిచి వుస్సురనేవు నీ కేలయ్యా
నలువుగాఁ బెదవిపై నాలో నే మాటాడితేను
వెలవెలఁబారె మోము వింత నీ కేలయ్యా ॥ నేమె ॥

తడఁబడఁ బేరుకొని తరుణులఁ బిలిచితే
నిడివి సిగ్గువడేవు నీ కేలయ్యా
చిడుముడి నీచెక్కులచెమట నేఁ దుడిచితే
వొడఁబరచవచ్చేవు వులుకు నీకేలయ్యా ॥ నేమె ॥

మెండుకొనఁ గాఁగిలించి మేనెల్ల నిమిరితే
నిండాఁ బులకించేవు నీ కేలయ్యా
కొండల శ్రీవేంకటేశ కూడితివి యింతలోన
పండుమోవితేనె దక్కె పంతము మా కేలయ్యా ॥ నేమె ॥ 79

## సామంతం

చెలియరో నన్ను నేనే చెప్పి పొగడుకోఁగాక
కలికినానేరుపెల్లఁ గనుకొనరాదా ॥ పల్లవి ॥

చూపుల నన్నొకమాటు చూచితేనే చాలుఁగాక
యేపదతులకు మొకమియ్యనిచ్చేనా
దాపై విభుఁడు నేను దగ్గరితేఁ జాలుఁగాక
కోపులకాంతలపొందు కొలుపనిచ్చేనా ॥ చెలి ॥

వూరకే నామాట వాఁడు వూఁకొంటేఁ జాలుఁగాక
వీరివారివిన్నపాలు విననిచ్చేనా
నారుకొన నాతోను నవ్వితేనే చాలుఁగాక
ఆరయ నెందూ సరస మాడనిచ్చేనా ॥ చెలి ॥

సరి నాకాఁగిటఁ జేయిచాఁచితేనే చాలుఁగాక
తరుణులంతలపొంత తన కిచ్చేనా
ఇరవై శ్రీవేంకటేశుఁ డీవేళ నన్నుఁగూడె
వరుస నెవ్వరికి నే వలవనిచ్చేనా ॥ చెలి ॥ 80

బౌళి

కల్లసుమ్మీ రమణుఁడ కలఁగి నిందుకే మతి
తొల్లిటినీగుణ మెట్టు తోఁచెనోకాని ॥ పల్లవి ॥

ఆడఁజుమ్మీ నిన్ను నేను అంతచులుకనిమాట
వాడికె నీకెట్టు నిందవచ్చెనోకాని
తోడ వేగువెట్టసుమ్మీ దొరవు నీమీఁద నేను
యేద నిన్నెవ్వతె సందేహించెనోకాని ॥ కల్ల ॥

నవ్వఁజుమ్మీ నే నిన్ను నాతులయీసభలోన
అవ్వల నీమీఁద నెట్టు అంటెనోకాని
యెవ్వరితోఁ జెప్పఁజుమ్మీ యిట్టునట్టు అని నిన్ను
దవ్వుల నీకాఁక యెట్టు తగిలెనోకాని ॥ కల్ల ॥

చూడఁజుమ్మీ నిన్ను నేను చురుకన గుండెనాఁట
ఆడనే నీవెట్టు గుటియైతివో కాని
వేడుక శ్రీవేంకటేశ వెలయ నన్నుఁ గూడితి-
వాడుకో లిదేసుమ్మీ అనతిత్తుఁగాని ॥ కల్ల ॥ 81

రామక్రియ

పట్టితే[1] పదిరూపులై పాయఁడు నావొద్దఁ దాగు
యెట్టువున్న మేలు ఇఁక నెప్పుడైనా రానీవే ॥ పల్లవి ॥

కన్నులనే వొకరూపు కాళ్లఁ బెనఁగీ రూపు
వెన్నెలాఁదురుముకంటి వన్నెలరూపు
నెన్నడిమి దొకరూపు నిచ్చలు నామేని మీఁద
ఇన్నిటాఁ బాయఁడు తాను యెప్పుడైనా రానీవే ॥ పట్టి ॥

1. దీనిలో దశావతారసమన్వయము గలదు

చేతిలోని దొకరూపు చేరి నాపేరిటిరూపు
కాతరపు జవ్వనానఁ గలఁడు రూపు
పైతరవైనా బుజబలమున నొకరూపు
యీతల నాయందుఁ బాయఁ డెప్పుడైనా రానీవే ॥ పట్టి ॥

కడుబుద్ధుల నొకరూపు కలికితనాలరూపు
బడిబడిఁ బాసినాను పాయఁడు నన్ను
అడరి శ్రీవేంకటాద్రిమీఁద నన్నుఁ గూడి
యెడయఁ డెన్నివిధాల నెప్పుడైనా రానీవే ॥ పట్టి ॥ 42

ముఖారి

రేసులు వాసులును రెండు గలవా
వేసరించఁగాని నను వేగించనీరాదా ॥ పల్లవి ॥

నవ్వితే నవ్వనివాఁడు నన్నేల తప్పక చూచె
యివ్వల నాఁడువారైతే హీనమా యేమి
జవ్వనాన చంకగుదె శరణార్థిఁ దనకేల
వువ్విళ్లూరించక నన్ను నుండనీరాదా ॥ రేసు ॥

ముట్టితే ముట్టనివాఁడు ముందేల సరసమాడె
నెట్టుకొన (ని?) వలచుటే నేరమా యేమి
తొట్టి యెడఁ గత్తెరయుఁ దోడ నోర బెల్లమేల
పట్టినవ్రతముతోనే బ్రతుకనీరాదా ॥ రేసు ॥

మొక్కితే మొక్కనివాఁడు మున్నాడి నన్నేల కూడె
దక్కినవారిఁ జొక్కించఁ దడవా యేమి
చెక్కునొక్కి చెట్టవట్టి చేసన్న లిఁకనేల
మిక్కిలి శ్రీవేంకటేశు మెచ్చనీరాదా ॥ రేసు ॥ 44

శంకరాభరణం

గుట్టుతోనే వుందుగాని కోరి నేనేమిసేసినా
పట్టపురమణి నాతోఁ బదరేవు సుమ్మీ ॥ పల్లవి ॥

కోవిలలు చిగురాకు కొరుకునంటా భూమి-
నావలీవలివారెల్లా నాడుకొందురు
కోవిలకూఁతలు నీకుత్తికలోనివి గదే
కావి నీమోవిచిగురు గంటిచేసీఁజుమ్మీ ॥ గుట్టు ॥

జక్కవలు భూమిలోన చంద్రోదయమైతే
తక్కక విరహాన బెదరు నందురు
జక్కవనీచన్ను లిట్టే సరి నీపయ్యద నవె
పెక్కుచంద్రవంకలైతే బెదరీఁజుమ్మీ ॥ గుట్టు ॥

తుమ్మిదలు తామెరపైఁ దోలినానుఁ బోవందురు
దొమ్ముల శ్రీవేంకటాద్రి తుమ్మిద నేను
కొమ్మ నీతుమ్మిదవంటికురులు నీనెమ్మోముఁ
దమ్మిమీఁదఁ జెదరి యంతటఁ గూడెఁజుమ్మీ ॥ గుట్టు ॥ 84

రేకు 1015. సామంతం

మాఁజితేను జవ్వనము మట్టున నిలుచునా
[1]రాఁజిరాఁజి వలపు లాఁౘడిఁ బెట్టుఁగాక ॥ పల్లవి ॥

చెలి నీవు మోవితేనె సిగ్గువడి దాఁచితేను
వెలయఁ బలుకుఁదేనై వెళ్ళఁబారీని
సెలవులనవ్వులవి చిత్తములో నడఁచితే
కొలఁకులఁ దెలిచూపై కుమ్మరించీ నదిగో ॥ మాఁజి ॥

---

1. సాధు-శకటరేఫల సాంకర్య మీవాఙ్మయమున నపురూపమే. సాధువుగ నుండిన 'అరడి' యా?

పడఁతి నీ తమకము బయటనే మొరఁగితే
నిడుదనిట్టూర్పులై నిగ్గుదేరీని
బడి కుచముల వుబ్బు పయ్యదలోఁ గప్పితేను
వెడలుఁ బులకలై వెల్లివిరిసీని ॥ మాఁజి ॥

కామిని నీ కోరికలు [1] కాఁగిటిలోఁ దలఁచితే
నామనసులోఁ దోఁచి నారుకొనీని
వేమరు శ్రీవేంకటాద్రివిభుఁడ నేఁగూడితిని
యీమేలెల్లా నీపై నినుమడించీని ॥ మాజి ॥ 85

## భైరవి

తనువులో దైవము దయదలఁచు టెప్పుడో
తనివోనితమకాన తడఁబాటు లివిగో ॥ పల్లవి ॥

చెక్కునొక్కి చెలిమీఁద చేయివేసి సారె సారె
మక్కళించి మక్కళించి మాటాడు టెపుడో
మొక్కుచుఁ గన్నుల నట్టె ముచ్చట దీరఁగ లోలో
చిక్కనినవ్వులు నవ్వి చెలఁగుట యెన్నఁడో ॥ తను ॥

మోము చూచి సన్నచేసి మోహములు చల్లి చల్లి
నామువారఁ జొక్కేటినను పెప్పుడో
దీమసపుఁగోరికలు దిష్టముగాఁ గొనసాగ
ఆమనిసరసములు ఆడుట యెన్నఁడొకొ ॥ తను ॥

కాఁగిటిరతులలో కరఁగించి మానినికి
మాఁగినమోవియిచ్చేమన్న నెప్పుడో
దాఁగక ఇంతటిలోనే తరుణి యేతెంచి కూడె
పాఁగి శ్రీవేంకటేశ పంతము లిఁకెన్నఁడో ॥ తను ॥ 86

1. ఎతలోనా:

## శ్రీరాగం

ఆడుకోఁగలితేఁ జాలు నందరితో పెద్దరిక –
. మేదనైనాఁ దనచిత్త మిట్టట్టనఁజెల్లునా ॥ పల్లవి ॥

మెచ్చినంతే చాలు వాఁడు మీరేమి ననకురే
అచ్చమైనఇల్లాల నంతే నేను
యిచ్చినంతే చాలుఁ జన వేమనఁగలనే వాని
పచ్చిగా వలచితిని పంత మింకఁ జెల్లునా ॥ ఆడు ॥

నవ్వినంతే చాలుఁ దాను నాయ మేమీఁ జెప్పకురే
రవ్వపడ్డమేనవావిరమణిని నేను
దవ్వులఁ గన్నంతే చాలు తగుఁదగ దనకురే
మువ్వంక మొగమోడితే మొక్కలము చెల్లునా ॥ ఆడు ॥

కొంగు వట్టినంతే చాలు కొప్పు వీడె ననకురే
కుంగనిసిగ్గరిపెండ్లికూఁతుర నేను
అంగవించి శ్రీవేంకటాద్రిపతి నన్నుఁ గూడె
రంగుమీరితిని మచ్చరము లిఁకఁ జెల్లునా ॥ ఆడు ॥ 87

## శుద్ధవసంతం

కాలము లారునుఁ గలిగి నీకు నిదె
బాలకియందే పైపై నీకు ॥ పల్లవి ॥

సతికొప్పువిరులు జలజల రాలిన
లతల వసంతకాలము నీకు
కతగాఁ దనమైకాఁకలు చూపిన
అతివేసవికాల మప్పుడే నీకు ॥ కాల

కాఁగిటిచెమటల కడు నినుఁ దడిపిన
కాఁగల తొలుకరికాల మది
వీఁగనిచూపుల వెన్నెల చల్లిన
రాఁగినమతికి శరత్కాలంబు ॥ కాల ॥

అంచపుఁబులకల లలన సీరతుల
కంచపుహేమంతకాల మది
మెంచఁగ శ్రీవేంకటేశ వలపుసతి
వంచ శిశిరకాలవైభవ మాయ ॥ కాల ॥ 88

## సౌరాష్ట్రం

నే నొకటి సేయఁగాను నీవొకటి సేయకువే
మానిని నీచేఁతలకు మారుమలసెను ॥ పల్లవి ॥

కన్నులకాటికెతోడ కసరకువే నా-
వెన్నెలమోమునవ్వుల విసరేను
కిన్నెరమీఁటుల గిలిగించకువే నా-
సన్నపుధైర్యము వెదచల్లేను ॥ నేనొ ॥

చెరుసగముమాటలు పైఁ జిమ్మకువే । నీకు
యిరవైన మోవితేనె లిచ్చేను
సరసాల విరసాల సాదించకువే నా-
మెరవడివినయాల మెప్పించేను ॥ నేనొ ॥

పానుపుపై నన్నుఁ గూడి భ్రమయించకువే । కానఁ-
గానే గోరఁ దారుకాణించేను
అని శ్రీవేంకటేశుఁడ నలయించకువే
పూనిపటి నిన్ను నిట్టె బుజ్జగించేను ॥ నేనొ ॥ 89

శంకరాభరణం

ఎన్నటి కెన్నటివాదు లేలపెంచే వింకాను
. యెన్న నీకుఁ బంతమిచ్చె నింత చాలదటరా ॥ పల్లవి ॥

నిక్కిచూచి పేరఁబిల్చి నీమన సొక్కటిగాఁగ
మక్కువ చలితి నింకా మటి యేమనేవురా
చెక్కునొక్కి బుజ్జగించి చేతిమీఁదఁ జేయివేసి
మొక్కి మొక్కినా నీవు మోమేల వంచేవురా ॥ ఎన్న ॥

సన్నచేసి కానుకిచ్చి సారె నీతో నవ్వు నవ్వి
కన్నులారిచితి నీకు కడమ లేమాయరా
నిన్ను నట్టె మెచ్చి మెచ్చి నెయ్యముతో మాటలాడి
యెన్నినేసినా మనసేల కరఁగవురా ॥ ఎన్న ॥

కాలుదొక్కి వేగిరించి కాఁగిటిలో బిగియించి
లాలించినా నాతోను లావుచూపే వేలరా
మేలిమి శ్రీవేంకటేశ మించి నీవే నన్నుఁ గూడి
యీలీల నేలినవాఁడ విట్టె మన్నించరా ॥ ఎన్న ॥ 61

రేకు 1016. దేసాళం

మీఁదమీఁద వలపెక్కి మేలుమేలోయి
చీఁదర రేఁచేవు నన్ను చెల్లులేవోయి ॥ పల్లవి ॥

నిద్దురో నివ్వెరగో నేనేమో చెప్పఁగాను
వొద్దనుండే వూఁకొనవు వోయి మేలోయి
పెద్దరికమో బీరమో బెట్టిపిదె మడిగితే
కద్దనవు లేదనవు గర్వమేలోయి ॥ మీఁద ॥

కాఁకతో పీఁకలో కడు నేను నవ్వినను
మాఁకువలె నున్నాఁడవు మతక మౌనోఇ(యి?)
వేఁకమో వెరపో వేగ నేఁ జేయివేసితే
కేఁకరించి ములిగేవు గేలి యేలోయి ॥ మీఁద ॥

ఆసలో వాసులో అంద నేను నిలుచుంటే
మేసులఁ గాఁగిలించేవు మెత్తిలేవోయి
వాసతో శ్రీవేంకటేశ పంతాన నన్నుఁ గూడితి
వేసములెల్లాఁ దీరె వింతలాయనోయి ॥ మీఁద ॥ 91

## శ్రీరాగం

కాఁక సేయఁ దగవా కలయఁగఁ దగుఁగాక
మూఁకలాయఁ బులకలు మొకమియ్యరాదా ॥ పల్లవి ॥

రమణుని ఆడనీడ రవ్వ సేయఁ దగవా
తమి నట్టే బుద్ధిచెప్పఁదగుఁగాక
నెమకి యాతఁడు వేరో నీవు వింతదానవో
చెమరించె మీమేనులు చిత్తగించరాదా ॥ కాఁక ॥

చేసుకొన్నమగనినిఁ జిమ్మిరేఁచఁ దగవా
వాసులై సరసమాడఁ దగుఁగాక
మోసము నీకుఁ గలదో మోహ మాతనికి లేదో
సేసకొప్పు అవె వీడెఁ జేకొనఁగరాదా ॥ కాఁక ॥

యేలిన శ్రీవేంకటేశు కెదురాడఁ దగవా
తాలిమి నిట్ల గూడఁదగుఁగాక
సీలాగు నే నెఱఁగనో నీవే అతఁడవు గావో
కాలుఁగాలుఁ దొక్కితిరి కరుణించరాదా ॥ కాఁక ॥ 92

## కేదార గౌళ

కూరిమి గలితేఁజాలు కోపించినా మేలువో
•ఆరయ నోరమణుఁడ అంతాను మేలువో ॥ పల్లవి ॥

మనసున నీవు నన్ను మఱవకున్నాఁజాలు
యెనసి నీ వేడనున్నా నియ్యకోలే పో
ననుపువలపు నీవు నాపైఁ ఇల్లితేఁ జాలు
వెనక నీ వేమన్నా వేడుకలే పో ॥ కూరి ॥

పాయము నీమేనిమీఁద పచ్చిగా నుండితేఁ జాలు
రాయడి విరహమైన రాజ్యపదవి
యేయెడ నీచూ పొకమాటిటు పైఁబారితేఁ జాలు
నాయములు దప్పి నీవు నడచినా మేలువో ॥ కూరి ॥

పానుపుపై కూడి నాకు పంతమిచ్చితేఁ జాలు
కాననికన్నుల నీబింకాలు మేలేపో
ఆనిన శ్రీవేంకటేశ అంతలో నన్నేలితివి
కోనల నీకొనగోరిగుఱుతులు మేలువో ॥ కూరి ॥ ౧౩

## దేసాళం

ఒక్కమాఁటి కింతేసి కోపరా నేను
వుక్కువంటిది నీ చిత్త మోపఁగా నేను ॥ పల్లవి ॥

యెట్టైనా నే నుండే యేమైనాఁ జేసేఁగాని
వొట్టి విన్ను బాసగొన నోపరా నేను
పట్టినపంతము లిచ్చే పలుమారు నిన్ను మెచ్చే
అట్టె నీకెదురు మాటాడఁగ నే నోపను ॥ ఒక్క ॥

పొందుకైనా నియ్యకొనే యిఁ (యిం?) పైన నీ సతిఁ దెచ్చే
వొందిలి వేగించ నంత వోపరా నేను
పందె మెంతికైనా వేసే పాదములకైనా మొక్కే
బొందిలోనిమాట నీతో బొంకలేఁగా నేను ॥ ఒక్క ॥

వెరవైనా నడిగేను వేడుకకైనా నవ్వే
వొరటు నీతో నింక వోపగా నేను
యిరవై శ్రీవేంకటేశ యింతలో నన్నుఁ గూడితి-
అరమఱచి చొక్కితినా అద్దిరా నేను ॥ ఒక్క ॥ 94

భైరవి

ఇటమీఁదికడమెల్లా నిఁక నీవు దీర్చవయ్యా
పటుకునఁ జెలి నీకుఁ బాలువెట్టీ నిదిగో ॥ పల్లవి ॥

నెలఁత మంచముపై కిన్నెర వాయించి వాయించి
తలకొని నీవు రాఁగాఁ దలవంచెను
సొలసి చెలులతోడ సుద్దులు దాఁ జెప్పిచెప్పి
చెలఁగి నీమోము చూచి సిగ్గువడీ నిదిగో ॥ ఇట ॥

పడఁతి నీమీఁదిపాట పాడిపాడి అర్థము నీ-
వడిగితే నవ్వలి మోమై నవ్వీని
అడియాలములరూపు అద్దములోఁ జూచి చూచి
కడు నీవు కొంగువట్టఁగా భ్రమసీని ॥ ఇట ॥

సతి యేకతాన నుండి జవ్వాది పూసిపూసి
రతి నీవు గూడఁగా సరసమాడీని
ఇతవైన శ్రీవేంకటేశ నీ వాపెఁ గూడఁగా
పతి చూచి యిప్పు డిట్టె పక్కున నవ్వీని ॥ ఇట ॥ 95

ఆహిరి

రమణిభాగ్యము నేఁడు రచ్చలకెక్కె
తమకపువలపు సీతల కేల యెక్కదో ॥పల్లవి॥

చెలితలఁపులోచింత చెక్కిటిచేతికి వచ్చె
యెలమి నీచిత్త మింకా నేల రాదో
నిలువున కాఁకలెల్లా నిట్టూరుపులఁ బుట్టె
తలిరుబోఁడిపై నీకు దయ యేలపుట్టదో ॥రమ॥

దట్టపుఁగోరికలెల్లా తనుపులకలఁ దీరె
యిట్టె విన్నపాలఁ గతలేల తేరవో
చిట్టకపువిరహము చెమటలఁ గానవచ్చె
గట్టిగా నీమోహమేల కానరాదో ॥రమ॥

నిక్కుఁగుచము లింతివి నీకాఁగిటనే మించె
యెక్కువనీసిగ్గు లిఁకనేల మించవో
ప్రక్కన శ్రీవేంకటేశ పడఁతిఁ గూడితి విట్టె
తక్కించి మన్నించ నీకుఁ దరి యెట్టాయనో ॥రమ॥ 96

రేకు 1017. రామక్రియ

ఒల్లనని మానరాదు వొలసి పైకొనరాదు
వెల్లవిరి ఆయ నావేగిరపుఁదనము ॥పల్లవి॥

యెవ్వరికో విన్నపము యిదివో నేము
నవ్వుతాఁ జిత్తాన నవి నాటెనో లేదో
అవ్వలఁ దమచేఁత లవి చూచుకోరు గాని
నివ్వటిల్లీ నేఁడు నా నిష్ఠూరపుఁదనము ॥ఒల్ల॥

యెక్కడనో చూచితిమి ఇదిగో నేము
వక్కణించి అది గానవచ్చెనో లేదో
తక్కరితమగుణాలు తాము చూచుకోరుగాని
మొక్కలమై వున్నది నాముంగోపితనము ॥ఇల్ల॥

యేమిటికో వుపచారా లిదిగో నేము
కామించి శ్రీవేంకటేశ కలదో లేదో
సీమవసులోనివెల్లా నీవెఱుఁగుదు । నాకు
నేమమాయ నిన్నుఁగూడి నివ్వెఁరగుఁదనము ॥ఒల్ల॥ 97

బౌళి

చాలుఁజాలు రోఁతలూ సటలాయఁ బనులూ
తాలిమిలేనిదానను తడవకువయ్యా ॥పల్లవి॥

మాటలాడితివా లేదో మగువతో నేఁ జూడఁగ
మాట లిఁక నాకు నీతో మఱి యాల
తేటగా నవ్వితా లేదా తేరకాని ఆకేతో నే
యీటుకు నీతో నవ్వ నిఁకనేలయ్యా ॥చాలుఁ॥

తప్పక చూచితా లేదా తరుణిమొగ మప్పుడు
యిప్పుడు నే నిది చూడ ఇత వవునా
వొప్పి దగ్గరితా లేదా వున్నచో ఆకెను నీవు
యిప్పుడు నిన్ను దగ్గర వింపవునటయ్యా ॥చాలుఁ॥

కాఁగిలించితివా లేదా కాంత నల్లనాఁడు నీవు
కాఁగిలించితి నేఁడు కమ్మటినిన్ను
వీఁగక శ్రీవేంకటేశ వేమారు సాదించనోప
మాఁగినరతులఁ బెనుమాయ లింకేలా ॥చాలుఁ॥ 98

బౌళి

వలచినపతి వాఁడే వచ్చినదాన నే నిదె
తలఁపులుఁ దలపులు తారుకాణ లెన్నఁడే ॥ పల్లవి ॥

పుచ్చఁబుచ్చఁ బున్నమలు పొలఁతి నీనవ్వులు
యిచ్చట నీపతిఁ జూచే దిఁక నెన్నఁడే
నిచ్చ నిచ్చఁ గొత్తలాయ నెలఁత నీజవ్వనము
మెచ్చి మెచ్చి ఆతనితో మేలమాడు టెన్నఁడే ॥ వల ॥

వండవండ నట్లాయ వాడిక నీవలపు
నిండినపతికాఁగిట నించు టెన్నఁడే
వుండ నుండ నొగరాయ వువిద నీజంకెనలు
అండ నాతనికి వినయాలు సేయు టెన్నఁడే ॥ వల ॥

తినఁదినఁ దీపులాయ తెరవ నీమోవిజున్ను
పొనిఁగి శ్రీవేంకటేశుపొందు లెన్నఁడే
ననిచి యాతఁడే నేఁడు నయముల నిన్నుఁ గూడె
మనికి మీలోలోన మందలించు టెన్నఁడే ॥ వల ॥ 99

శంకరాభరణం

ఏలో తెలియదు యేలినవాఁడవు నీవే
మేలుమేలు జాణవౌదు మేర నడపినను ॥ పల్లవి ॥

ఆలించఁదగవా అప్పుడే నావిన్నపము
వాలాయించి నీవు వలెనంటేను
పాలించఁ దగవా పైకొని నన్నిప్పుడిట్టె
తాలిమితో నీమతిఁ దలచితేను ॥ ఏలో ॥

యియ్యకొనఁ దడవా యిప్పుడే నాకూరిములు
యియ్యెడ నింతట నీకు నితవై తేను
నెయ్యమాడఁ దడవా నీవు నేను నవ్వుతాను
చయ్యన నీకే నేఁడు సమ్మతై తేను ॥ఏలో॥

కాఁగిలించఁ దడవా కందువరతులలోన
వీఁగక యిట్లా నీకు వేడుకై తేను
దాఁగక శ్రీవేంకటేశ తగఁ గూడితివి నన్ను
ఆఁగి నవ్వఁ దడవా అబ్బురమైతేను ॥ఏలో॥ 100

ముఖారి

వలపు తొలఁకరించె వనితపై నిదె నేఁడు
చెలువుఁడ వింతట విచ్చేయవయ్యా ॥పల్లవి॥

పడఁతివిరహవేళ పానుపుపైఁ దెగి రాలే-
వడిముత్యపుసరులే వడగండ్లు
చిడుముడి మేనిమీఁదచిప్పిలేటిచెమటలు
జడివాన గురిసీ విచారించవయ్యా ॥వల॥

నిరతిఁ దురుముమొయిలు నిలువెల్లా ముంచుకొనె
గరిమ నిట్టూర్పుపెనుగాలివంకను
నిరతపుఁబులకల నీరుబుగ్గలవి మించె
సిరులఁ గన్నీటిసోన చినుకులవంకను ॥వల॥

యిద్దరికాఁగిటిలంకె యింద్రధనువులు మించె
వొద్దనే మాచెలిఁ గూడి వుండేవంకను
నిద్దపుశ్రీవేంకటేశ నిండెఁ జిత్తపుమదుగు
కొద్దిగా మోహరసాలు కురిసినవంకను ॥వల॥ 101

పాళంగం

కంటిమిగా నీగుణాలు కడసారెను । నేఁడు
నంటు నీవు సేయరాఁగా నవ్వువచ్చీఁ బనులు ॥ పల్లవి॥

యెదుటనే వచ్చియున్న దెలఁగవైతి వప్పుడు
కది శాకెవద్దనుండేగర్వానను
ఇదిగో యిప్పుడు నాకు నిచ్చకాలు నేసేవు
పదవయ్య యిఁకనేల బయలాయఁ బనులు ॥ కంటి ॥

మునుప నే పేరఁ బిల్చి మొక్కినాఁ గైకోవయితి
పనివ డాకె మాఁటాడేపరాకునను
వెనక నిప్పుడు నాకు విడె మియ్యవచ్చేవు
పెనఁగ నే నోపనయ్య ప్రియమాయఁ బనులు ॥ కంటి ॥

కాఁగిలించి మోవి గంటిగాఁ జేసే దెలఁగవైతి
పాఁగి తొల్లాకెఁ గూడినభ్రమవల్లను
వీఁగక శ్రీవేంకటేశ వేగమే నన్నుఁ గూడితి
రాఁగిన తమకముతో రవ్వాయఁ బనులు ॥ కంటి ॥ 102

రేకు 1018 శంకరాభరణం

ఘనుఁడు దానేకాక కలరా నాకు దిక్కు
అనరమ్మ చెలులార ఆతనితో మీరు ॥ పల్లవి ॥

చిత్తము నలసెను చెక్కు చెమరించెను
కొత్తగాఁగఁ దనదాక కోరి కోరి
వత్తియాయ దేహము వానలాయఁ గన్నీళ్లు
తత్తరపుఁబతికేల దయ పుట్టదో ॥ ఘనుఁ ॥

తాలి మెందో దాఁగెను తలపోఁత రేఁగెను
ఆలకించి తన అడియాసలఁ జిక్కి
తెలుపడె నూరుపులు దిష్టమాయ వెరగులు
యీలాగు నన్ను మన్నించే దిఁక నెన్నఁడో ॥ ఘను ॥

పాయముఁ బైకొనెను భావము దాకొనెను
ఆయముతో నన్నుఁగూడి అంటఁగాను
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁగూడె
పోయినఁ బోనీ కెవ్వరు బోదించరో ॥ ఘను ॥ 103

## భైరవి

ఇంతలో రమణుఁడ నీ వేమి గట్టుకొంటివి
కాంతఁజూచైనాఁ గొంత గరఁగరాదా ॥ పల్లవి ॥

సేసకొప్పు వెడజారె చెక్కులఁ జెమటలూరె
పాసియున్న నీయింతితోఁ బలుకరాదా
రాసులుగాఁ బులకించె రామ నిన్నుఁ దిలకించె
బేసబెల్లియెలు గత్తి పిలువరాదా ॥ ఇంత ॥

చెలిమేను కడుఁగాఁగె చిత్తములు తమిరేఁగె
నలిరేఁగి యాకెతోడ నవ్వరాదా
వలపులు గడుమించె వాడుమోముమిప్పుడు వంచె
వెలి నాకెపైఁ జేయివేయరాదా ॥ ఇంత ॥

కఁదువ నీకాలు దొక్కె కామిని నీపాలఁ జిక్కె
మందలించి యిఁక నీవు మన్నించరాదా
అంది నామాటలు విని యంగనఁ గూడితి విట్టె
ముందె శ్రీవేంకటేశ మోవి ఇయ్యరాదా ॥ ఇంత ॥ 104

మాళవి

[1] ఎట్టు నేరిచితివయ్య యిన్నివాహనములెక్క
గట్టిగా నిందుకే హరి కడుమెచ్చేమయ్యా ॥ పల్లవి ॥

గరుడునిమీఁద నెక్కి గమనించితివి నాఁడు
అరుదైన పారిజాతహరణానకు
గరిమతో రథమెక్కి కదలితి వల్లనాఁడు
సొరిది బ్రాహ్మణపడుచుల నుద్ధరించను ॥ ఎట్టు ॥

చక్కఁగాఁ గుబేరుని పుష్పక మెక్కి కదలితి
మక్కువ సీతాదేవి మరలించను
తక్కక వాయుజు నెక్కి దాడివెటితివి నాఁడు
చొక్కపువానరులపౌఁజులు చూడను ॥ ఎట్టు ॥

కొట్టఁగొన నీవు రాతిగుఱ్ఱము నెక్కి తోలితి-
పట్టియెడ నధర్మము నడఁచఁగను
మెట్టుక శ్రీవేంకటాద్రిమీఁదఁ బల్లకి యెక్కితి-
విట్టె యిందిరఁ గూడి యేఁగుఁబెండ్లి యేఁగను ॥ ఎట్టు ॥ 105

రామక్రియ

దేవుఁడవు నీవు నీదేవులమ్మభాగ్య మింతే
చేవదేరెఁ బనులెల్లా చిత్త మెట్లున్నదో ॥ పల్లవి ॥

విన్నపాల కెదలేదు వేగిరించఁ బొద్దులేదు
అన్నిటా నింత కేమని యానతిచ్చేవో
సన్న సేయఁ బనిలేదు సాదించఁ దరిగాదు
మెన్నినకోరికలెల్ల నెట్టుసేసేవో ॥ దేవు ॥

1 ఇది అధ్యాత్మకీర్తనలభాయలో నున్నది

నవ్వగ నోపికలేదు నాయములుఁ జవిగావు
చివ్వన నీటాస లెట్టు చెల్లించేవో
రవ్వసేయఁ జోటులేదు రాజసాన కిమ్ములేదు
పువ్వువంటిచెలి నెట్టు బుజ్జగించేవో ॥ దేవు ॥

నిక్కిచూడ నంకెగాదు నెలఁతకు నీకుఁ బోదు
మక్కువ నెట్లా నీవు మన్నించేవో
వొక్కటై శ్రీవేంకటేశ వువిదఁ గూడితి విట్టె
యిక్కువఁ గెమ్మోవి యాని యేవగఁ జొక్కేవో ॥దేవు॥106

## భైరవి

ఎఱఁగక నిన్నునంటి నిందాఁకాను । నీ-
కెఱుకసేసితి నిఁక నీవింటికి రావయ్యా ॥ పల్లవి ॥

నీమీఁదాఁ దప్పులేదు నిద్దురాఁ గంటికి రాదు
దోమటి నప్పటి నిన్ను దూరకపోదు
దీమసము నాకు లేదు తెగనాడఁగాఁ గాదు
యేమిసేతు నింతట మాయింటికి రావయ్యా ॥ ఎఱఁ ॥

నాకు మోహింతువు నీవు నవ్వులు నా కింపుగావు
దీకొని నిన్నొరయక దిష్టాలు రావు
నీకు మంతనమే తావు నేఁడు మరునమ్ము పూవు
యేకపటములు నేర నింటికి రావయ్యా ॥ ఎఱఁ ॥

తనువు లింతేవేరు తలఁపు లొక్కేతీరు
పనివడి యిఁకను నాపానుపు చేరు
యెనలేక శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
యినుమడించె వలపు యింటికి రావయ్యా ॥ ఎఱఁ ॥ 107

సామంతం

ఓరిచితేఁ జుట్టరిక మొల్లకుంటేఁ జెట్టరిక -
మీరసపువాపోటు లీడనేల ॥ పల్లవి ॥

మాటల కెగ్గులు లేవు మనసులోఁ బెరరేఁచె
కూటువకోపాలలోనికొలఁదు లింతే
నేటనే తప్పదు మీకు నెయ్యపుదంపతులాల
యీటులేనిమారుమోము లిప్పుడే యేల ॥ ఓరి ॥

చేఁతలకుఁ దప్పులేదు చేయారఁ దమలోని -
పూఁతలపంతాలు రేఁగె బూటకా లింతే
రోఁత యింతేసివొట్లు రుచిగాదు జాణలాల
యీఁతలాయఁ జలములు యింకానేల ॥ ఓరి ॥

చూపులో దోసములేదు సూటిగాఁ గందమ లోని -
కోపు బొమ్మజంకెనల గుణము లింతే
యేపున శ్రీవేంకటేశ యిందిరా నీవూఁ గూడితి -
రాపనులెల్లాఁ దీరె నడుగనేల ॥ ఓరి ॥ 108

రేకు 1019 ధన్నాసి

నీవు మన్నించఁగా నే నింతయితిఁ గాక
కావరించి నీతో నవ్వఁగలనా నేను ॥ పల్లవి ॥

ఘనుఁడ విదె మియ్యఁగా కాదనరాదు గాని
చెనకి నీసొమ్ము లంటఁజెల్లునా నాకు
చనవిచ్చి మాటాడఁగాఁ జాలుననరాదు గాని
తవర నీతో నేకతాలదానునా ॥ నీవు ॥

వరుస నీవు రాఁగా వద్దనఁగారాదు గాని
తర మెఱిఁగి రప్పించఁదగునా నాకు
వొరసి చేయివేయఁగా నోపననరాదు గాని
సరి నింతదీమసపుసతినా నేను ॥ నీవు ॥

నీవు కాఁగిటఁ గూడఁగా నేమానరాదు గాని
యీవేళ మఁదెమేళా లెమ్మెలా నాకు
శ్రీవేంకటేశ నీవు సేసినట్టే సేతుగాని
చేవదేర మెచ్చి సంతసించకుండఁగలనా ॥ నీవు ॥ 109

## సామంతం

కన్నులు పెంచవచ్చునా కలంతే కాక
యెన్నిక [1]నియ్యాలనైతి నెట్టైనాఁ జేయరా ॥ పల్లవి ॥

చెంది నీమతిఁ గూరిమి సేసిపెట్టవచ్చునా
కందువఁ దన్నుఁదానే కలితేఁ గాక
అంది నీకు నే మొక్కితే నాకడి (డ?) పరాకైతి-
విందుకంటే నూరకుండే నేమైనాఁ జేయరా ॥ కన్ను ॥

వినయాలు నాలుకపై వి తించవచ్చునా
కనుఁగొనఁ దనంతనే కలితేఁగాక
ననుపై నే మాటాడితే నాలి నీవూరకుంటివి
యెనలేక నవ్వు నవ్వే నేమైనాఁ జేయరా ॥ కన్ను ॥

పోయినరాతిటిరతిఁ బోగుసేయవచ్చునా
కాయములోఁ దలపోఁత కలితేఁ గాక
యీ యెడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
యీయరానిబాస లిచ్చే నేమైనాఁ జేయరా ॥ కన్ను ॥ 110

---

శ్రీగీతగల యక్షరము చిలుము దిన్నది. 1 నీ+అలనైతి. వింత్రిక సంధి.

ఆహిరి

సతమైనదానఁగాక సటలా నేను। నీ-
మతిలో మెలఁగకుంటే మగువనా నేను ॥ పల్లవి ॥

మందలించి యిందరిలో మాయసేసి మేకులకు
సందడిఁ గాలుదాక్కేటిసతినా నేను
అందుకోలుమోవి యిచ్చి ఆసరేఁచి సారె సారె
చందమామగుటుకలసతినా నేను ॥ సీత ॥

కన్నులఁ దప్పకచూచి కడగడలనే వుండి
సన్నలనేపొద్దువుచ్చేసతినా నేను
వన్నెల నీమీఁద నిట్టె వలపులు చల్లి చల్లి
చన్నులమొనలుచూపేసతినా నేను ॥ సీత ॥

శిరసు వంచి నవ్వి సిగ్గులువిడిచి నీ-
సరుసలనిటచుండేసతినా నేను
నిరతి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడఁగాను
వురమెక్కినదాన వేరొకతెనా నేను ॥ సీత ॥ 111

లలిత

రాఁపుసేయక చెలులు రారే మీరు
యీపొద్దే మేలయ్యీని యెడయ నే నోపను ॥ పల్లవి ॥

వేసరుకోకురే మీరు విభుఁడే మన్నించీఁగాక
సేసవెట్టి పెండ్లాడి చిన్నఁబుచ్చీనా
ఆసల నెదురుచూచి ఇప్పటికి రాకుంటే
యీసురేఁగు వానిమీఁద నింతకు నే నోపను ॥ రాఁపు ॥

తలపోఁత మనకేలే తానే వచ్చీఁగాని
పిలువనంపినవాఁడు బిగిశుండీనా
చలాలకుఁ బెనఁగఁగా సరసము ఘనమైతే
అలుగవలయు వాని కంతకు నే నోపను ॥ రాఁపు ॥

విన్నవించకురే మీరు వెలితి దీర్చీఁగాని
పన్ని నాకు బాసయిచ్చి పాడిదప్పీనా
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
యెన్నఁగ వాని సొలయ ఇంతకు నే నోపను ॥ రాఁపు ॥ 112

## పాడి

ఏపులును రాఁపులును యెందాఁకనే
చాపకిందివెల్లువాయఁ జాలదా సరసము ॥ పల్లవి ॥

యెదమాట లాడేది యెందాఁకనే
అడియాసలఁ బెట్టే దదెందాఁకనే
కడకుఁ దొలఁగరాదు గక్కనఁ బైకొనరాదు
జడిసీఁ జిత్తము నాతో చాలదా సరసము ॥ ఏపు ॥

యెలయింపుఁగొసరులు యెందాఁకనే
అలిగి కోపము నాతో అదెందాఁకనే
వలపు చల్లఁగరాదు వడి మూఁటగట్టరాదు
చలములు పతి నాతో చాలదా సరసము ॥ ఏపు ॥

యేడలేని వినయాలు యెందాఁకనే
అడుకోలు నిజబాస లవెందాఁకనే
కూడెను శ్రీవేంకటాద్రి గోవిందుఁ డిదె నన్ను
జాడలెల్లాఁ గంటి మిఁకఁ జాలదా సరసము ॥ ఏపు ॥ 113

ముఖారి

నే నెంతతమకినైనా నీకు నోరువక పోదు
• కానీవే తీగెకు కాయ కడువేఁగైవుంటునా ॥పల్లవి॥

చన విచ్చితివి గాన సరసమాడితిఁ గాని
ననిచి దొరలతోడ నవ్వఁదగునా
నను మన్నింతువు గాన నమ్మి కడిగితిఁగాని
యెనసి యేనుగతోడ యేలాట మున్నదా ॥నేనెం॥

సమ్మతింతు వటుగాన సరసఁ గూచుంటిఁగాని
యెమ్మె నీ ముందరఁ జేసే దితవా నాకు
రమ్మని పిల్తువుగాన రాజసాన నుంటిఁగాని
తమ్మి సూర్యోదయమైతేఁ దలవంచఁ జెల్లునా ॥నేనెం॥

నీవే నే నందువుగాన నిన్ను నేఁ గూడితిఁ గాని
దేవుఁడవు నిన్ను నంటఁదీరునా నాకు
శ్రీవేంకటేశుఁడవంటా సేవలు చేసితిఁగాని
తేవల మందె మేళమైతేఁ బ్రియాలు చెల్లునా ॥నేనెం॥ 114

రేకు 1020 తెలుఁగుఁగాంబోది

నీ వెటువలె మన్నించేవో
భావము నిలువదు పంతానకైనా ॥పల్లవి॥

అలసీతో విరహాన నలసి మరి
కొలుపడు చిత్తము కొఁ (కొం?) తైనా
తలఁచి తలఁచి నిన్నుఁ దప్పకచూచిన
నిలువదు కన్నీరు నిమిషంబయినా ॥నీవె॥

కయ్యపుకాఁకలఁ గాఁగి నవ్వులకు
యియ్యకొనదు తను వేమైనా
కొయ్యమాఁటలను గొణఁగిననాలిక
నెయ్యము వలుకదు నిజానకైనా ॥నీవె॥

మహి నీకాఁగిలి మరిగిన చేతులు
సహజము విడువవు సటకైనా
యిహమున శ్రీవేంకటేశ కూడితివి
మహిమలు వొగడెద మాఁటలనైనా ॥నీవె॥ 115

లలిత

ఏమరించి యింత చేసి యేలుకొంటివి
నేమము చెల్లించితివి నీవే పో జాణవు ॥పల్లవి॥

యెందుఁ బరాకై వింటివో యిప్పుడు నావిన్నపాలు
అఁది కమ్మరా నన్నే యడిగేవు
పొంది యింతవడికైనా బుద్ధివుట్టెఁగా నాపై
నింద దీర్చుకొంటి విఁక నీవేపో జాణవు ॥ఏమ॥

యేడనుండి వచ్చితివో యిప్పుడు మాయింటికాడ
తోడఁ బారుపత్యాలెల్లఁ దూరి సేసేవు
వోడక యిన్నాళ్ళకైనా వొక్కపైతివిగా నాతో
[1]నీడ నన్ను మెచ్చితివి నీవేపో జాణవు ॥ఏమ॥

యెట్టు వలచితో నాకు యెక్కువ నీకాఁగిటిలో
ఇట్టిగొని యిచ్చకాలు సారెఁ జల్లేవు
యిట్టె శ్రీవేంకటేశ యెదయవుగా నన్ను
నెట్టన నావాఁడవైతి నీవేపో జాణవు ॥ఏమ॥ 116

1. 'ఈడ' చేయరాదు; యతి భంగము. 'నీడ' శబ్దము సరిపోదు.

శ్రీరాగం

తానే నేనైనవాఁడు దాఁగవలెనా
కానుకవలపులతోఁ గాఁగిలించవలదా ॥పల్లవి॥

యింత తమకించేవాఁడు యేఁటి కప్పు దలిగెనే
చెంతల నేఁ జెప్పినట్టు సేయవలదా
పంత మిప్పు డిచ్చేవాఁడు పైకొనేల తిట్టీనే
సంతసపుసరసాల చన వియ్యవలదా ॥తానే॥

తగవు దప్పనివాఁడు తప్పిబ్బు లాడనేలే
నగుతా నే నన్నమాఁట నమ్మవలదా
పొగడేటివాఁడు తనబోగపురాజసమేలే
అగడు మాని నాయంకెకు రావలదా ॥తానే॥

యిటు నన్నుఁ గూడేవాఁడు యీడనాడ నేలుండెనే
తటుకన తా నాకు దక్కవలదా
ఘటన శ్రీవేంకటాద్రిఘనుఁడు నన్ని దె కూడె
సటలెల్లాఁ దీరి యింత సతముగావలదా ॥తానే॥ 117

శంకరాభరణం

రాజసాలే తలఁచాయ రావే నీవు। తన-
వోజ యిట్టిదొ తెలఁగ వోయమ్మ తాను ॥పల్లవి॥

పతి నింత దూరకువే పదవే నీవు। నేఁ
దతి నింత వగవఁగఁ దగదే నాకు
కతలాయ నాబదుకు కదవే నేఁడూ। తన-
యితవయినట్టు సేయనీ యెట్టయినాఁ దాను ॥రాజ॥

వెంటవెంటఁ దిరుగక విడవే నీవు । యిందు -
కంటిపట్టి మిమ్ము నేమి ననవే నేను
దంటతనము నాకెందో దాఁగెనే నేఁడు । తన -
నంటు చెల్లి తేఁజాలు నగనీవే తాను ॥ రాజ ॥

మాట లింత కోపరాదు మానవే నీవు । యిట్టె
వోటలేక వెరగుతో నుండే నేను
నాటకా లిన్ని విడిచి నన్నుఁ గూడెను । వాదు -
లేఁటికి శ్రీవేంకటేశుఁ డింతవాఁడా తాను ॥ రాజ ॥ 118

## వేళావళి

ఎందాఁకా నీచల మేమి గట్టుకొంటివి
యిందువంకనే దొర విన్నిటా నీ వైతివి ॥ పల్లవి ॥

పలుకరాదా కొంత పరాకు మానరాదా
[1]పిలిచి పెదవులెల్లా బెండుపడెను -
పెలవుల నవ్వరాదా చెం(చేఁ?)తల దగ్గరరాదా
నిలువు నివ్వెరగాయ నీకుఁగానే ప్రేమను ॥ ఎందాఁ ॥

చక్కఁగాఁ జూడఁగరాదా చలము మానఁగరాదా
మొక్కి మొక్కి చేతులెల్లా మొన(మోటు?)లాయను
మక్కువతో వినరాదా మన్నన లియ్యఁగరాదా
యిక్కువలు విన్నవించి యెలుఁగెల్లా రానెను ॥ ఎందాఁ ॥

యింటి కిట్టె రారాదా యిటు నన్నుఁ గూడరాదా
వెంటవెంటఁ దిరిగాడి వేసటాయను
అంటి ముట్టి శ్రీవేంకటాధీశ యేలితివి
నంటున నీతోడిరతి నాభాగ్యమాయను ॥ ఎందాఁ ॥ 119

---

1. 'పిలిచి పిలిచి' అని యుండఁదగు.

సామంతం

అయ్యో నీకు వగచినదే దోసమా
  ఇయ్యెడ నీకు వలచుటిదే దోసమా ॥ పల్లవి ॥

వాలాయించి మొక్కేవు వాదులకే నిక్కేవు
  బాలే నీతో నవ్వినదే దోసమా
  సోలగిలఁ జూచేవు చొక్కిచొక్కి లాచేవు
  యీలాగై నీవద్దనుండే దిదే దోసమా ॥ అయ్యో ॥

బొమ్మల జంకించేవు పూఁటవూఁటకు మించేవు
  అమ్మరో నీయాలనైన దదే దోసమా
  రమ్మనుచు మరపేవు రాజసాలు నెరపేవు
  యిమ్ముల నిన్ను నమ్మినదిదే దోసమా ॥ అయ్యో ॥

యేకతానకుఁ దీసేవు యేమన్నా నోరుమూసేవు
  ఆకుమడిచియిచ్చిన దదే దోసమా
  పైకొని శ్రీవేంకటేశ పచ్చిగా నన్నుఁ గూడేవు
  యీకడ నీవే నేనై తిదే దోసమా ॥ అయ్యో ॥ 120

సామంతం

తానేదో మననేదో తత్తరము లవి యేదో
  పానిపట్టి ఇటువంటి(భమ యింత గలదా ॥ పల్లవి ॥

సుదతి విభునిమోము చూచె పరాకున
  అదనఁ గ(ప్రపుభర ణద్దమంటాఁ జూచీనే
  పదకము నడుమఁ బైపైఁ బెట్టి మొల్లనూలు
  కదిసి హారమంటాఁ గటుకొనెఁ జూడవే ॥ తానే ॥

---

(శ్రీగిఠగం యుక్షరము చిలము దిన్నది.

యేఁటవెట్టి పతితోడ మాటలాడి వేగిరాన
  గాఁటపుటందెలు తనకరములఁ బెట్టీనే
పాటియైనవుంగరాలు పాదపువేళ్ళఁ బెట్టి
  యీటుగా మట్టెలు వేళ్ళ నిదియేల పెట్టీనే ॥ తానే ॥

కామిని శ్రీవేంకటేశుఁ గదిసేటివేడుకను
  వేమరు మాణిక్యములు విడెమంటా నిచ్చీనే
ఆమనిరతిఁ దనిసి అంతలో నన్నీఁదెలిసి
  సామజగమన ఇన్నీఁ జక్కఁజేసుకొనెనే ॥ తానే ॥ 121

భైరవి

మనసురానిది యాల మానఁగరాదా
  చనవిచ్చి నాకు వేరేసతులఁ దేవలెనా ॥ పల్లవి ॥

పొమ్మనఁగరాదా పోయేము మాయింటికి
  దిమ్ములమాటల వాదుదియ్యవలెనా
వుమ్మడి నుండనీరాదా వుండేము మాయింటిలోనే
  కమ్మటిని వచ్చివచ్చి కాఁకరేఁచవలెనా ॥ మన ॥

మోనాన నుండనీరాదా మొక్కేము నీకాళ్ళకు
  నానఁబెట్టి వలపులు నగవలెనా
నే నొల్లననరాదా నిన్నేమీ ననరాను
  ఆనవెట్టించుక నన్ను నణఁకించవలెనా ॥ మన ॥

చేసన్న చేయరాదా చేరి అప్పుడే కలతు
  యీసుతేఁచి యింతవడి నేఁపవలెనా
వాసికి శ్రీవేంకటేశ వద్దనక కూడితివి
  యీసరి నితరకాంత లిఁకమీఁద వలెనా ॥ మన ॥ 122

ముఖారి

ఏల పూరకున్నా(డవో యెఱఁగము నేము నిన్ను
చాలా నమ్మి శరణంటే సమకూడరాదా ॥ పల్లవి ॥

తాలు గరఁగించు నీఅట్టడిపాచము
కాలుచాఁచి సతులఁ గరఁగించు టరుదా
కీలించి మిన్నునేల దొంగిలిన నీ చేయి
తాలిమి సతులమతి దక్కఁగొనలేదా ॥ ఏల ॥

మాఁకులలోనైనా నుండి మాటలాడేనీనోరు
కాఁకలమాఁటలఁ జెలి గారవించు టరుదా
మూఁకవనితలసిగ్గు ముంగిటవేసేకన్నులు
ఆఁక నీసతి మోహ మందుకొనలేదా ॥ ఏల ॥

ముంచి కాంత నురమున మోచుకుండేనీమేను
ఇంచుకుపరిసురత మిందు కోర్చుటరుదా
యెంచఁగ శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
మంచముపై నుండి మీరు మమ్ము నంపవలదా ॥ ఏల ॥ 123

రామక్రియ

గుట్టుతోడిబ్రదు కొకకొలఁదైనఁ జాలురా
గట్టిగా నీవు మన్నించేకరుణే చాలురా ॥ పల్లవి ॥

మొదల వలుగలేను ముంచి నీకు మొక్కలేను
కదిసియున్న పెద్దరికమే చాలురా
పెదవులఁ దిట్టలేను పెంచి పంతమియ్యలేను
అదన నీవు నవ్విన ఆపాటే చాలురా ॥ గుట్టు ॥

బిగిసియుండఁగలేను ప్రియముచెప్పఁగలేను
మొగము చూడఁగలిగేముచ్చటే చాలురా
తగవులు చెప్పలేను తగ నిచ్చలాడలేను
తగువైన వావులతో తత్తరాలే చాలురా ॥ గుట్టు ॥

అటు పరాకు గాలేను ఆనవెట్టుకోలేను
యిటు నిన్నుఁ గూడితి నాకిది చాలురా
ఘటన శ్రీవేంకటేశ కరఁగించి మానలేను
తటుకున నీవు నాకు దక్కినదే చాలురా ॥ గుట్టు ॥ 124

## లలిత

ఏమి సేతు రమణుఁడ యెట్టైనా మేలు
దీమసము యింతంతని తెలియలేఁగాని ॥ పల్లవి ॥

నిను నే దూరుటకంటె నిచ్చలాన నుంటే మేలు
మనసిజుఁడు రేఁచక మానలేఁడుగాని
మనవి చెప్పుటకంటె మోనాన నుండితే మేలు
తనువులో తలపోఁత తమకించీఁగాని ॥ ఏమి ॥

కలసి పాయుటకంటె కడల నుండితే మేలు
తలఁపు నాజవ్వనము తగిలించీఁగాని
పిలిచి వాదించుకంటె బిగువుతో నుంటే మేలు
చెలులబుద్దులు నన్నుఁ జిమ్మిరేఁచీఁగాని ॥ ఏమి ॥

నిక్కి చూచి వేఁగుకంటె నిద్రవోయిన మేలు
మొక్కలపుటాస కన్ను ముయ్యనీదు గాని
చక్కని శ్రీవేంకటేశ సతిఁ గూడితివి మేలు
పక్కన సిగ్గు లిందాఁకా భ్రమయించీఁగాని ॥ ఏమి ॥ 125

నాదరామక్రియ

ఇదె యదె యవిబొంకే దెందాఁకానే
కదిసె నన్నిపనులుఁ గానీ కానీ తాను ॥ పల్లవి ॥

తొరపై తాఁదిరిగాడే లెందాఁకానే। నేఁటి-
వరుస కీడకు రావలెఁగా తాను
యెరపరికపుపొంకు లెందాఁకనే। ఇట్టె
గరిమ నామోము చూడవలెఁగా తాను ॥ ఇదె ॥

యేడో పరాకుచేసే దెందాఁకనే। నన్ను
వాడిక విడె మడుగవలెఁగా తాను
యీడ నిట్టె యెడమాఁట లెందాఁకానే। నాతో
యీడుకుఁ బొత్తుకు వచ్చే దిప్పుడేకా తాను ॥ ఇదె ॥

యెనలేనిసిగ్గు దన కెందాఁకనే। తన
వనిత నయితిఁ గైకొనవలెఁగా తాను
యెనసె(సీ?) శ్రీవేంకటేశుఁ డెందాఁకానే। నాకుఁ
జనవిచ్చి నయాలే జరపెఁగా తాను ॥ ఇదె ॥ 126

రేకు 1022 రామక్రియ

పో పో అదేమోసి పొద్దువోదటే
రాఁపులేల వొద్దు యింతరాజసాలు చెల్లవే ॥ పల్లవి ॥

అతనిపై నాస గత్తే నాడకే పోదువు గాని
నాతో మాటలాడేవేళ నవ్వరాకువే
పాఁతుక నీ కంతబడి గలవేళ నన్నిఁ
జేతువు గాని నీ బలువు చెప్పకువే నాకు ॥ పో పో ॥

పొత్తుల నీకుఁ బత్తైతే భోగింతు గాని యేఁ (యెం?) దైనా
హత్తి మాయింట నుండఁగా నంటరాకువే
చిత్తములో రేసు గత్తే చెలులఁ గూడుకవచ్చి
వొత్తి సాదింతువుగాని వుద్దండాలు మానవే ॥ పో పో ॥

వానికి నీ కంత గలితే వాడలోఁ జెప్పదుగాని
యీవేళ నావరు సింతే యేఁకారకువే
శ్రీవేంకటేశుఁడు నన్నుఁ జేరికూడె నిప్పు డిట్టె
కోవర ముందువు గాని కుచ్చితాలు మానవే ॥ పో పో ॥ 127

గౌళ

ఎందాఁకా జోలి దవ్వే నేఁటికనరే
విందానఁ దొల్లి నేను విడువరే మీరు ॥ పల్లవి ॥

వద్దు వద్దు తాను వట్టినిద్రతొడుసు
అద్దో మాయింటికి నన్నంపించరే
యిద్దరము నిద్దరమే యెకసెక్కెములకైతే
తిద్దలేరు మాగుణాలు తిరిగి పోఁగదరే ॥ ఎందాఁ ॥

ప్రియములేనిమాట పెదవికి సంగరము
నయగారా లివియెల్లా నమ్మనోపనే
జయ మొకరొకరిలో చలములే వెగ్గళాలు
లయ లెరఁగరు మీరు లాగు లటు చూడరే ॥ ఎందాఁ ॥

కారణములేనినవ్వు కనుచూపులకొలఁది
తేరెఁ బను లన్నిటాను తేజ మనరే
యీరీతి శ్రీవేంకటేశుఁ డిప్పుడిట్టె నన్నుఁ గూడె
మారుకొనక మీ రొక్కమనసున నుండరే ॥ ఎందాఁ ॥ 128

సామంతం

మేలు మేలు విభుఁడా మెచ్చితి నిన్ను నిపుడు
చాలునన్నా వినయాలు సారె సారె వలెనా ॥ పల్లవి ॥

నిన్ను నేఁటిపొందులా నీవే నేఁ గానా
మన్ననల నింతేసి మరిగించవలెనా
వన్నె నీపోలికే కానా వావు లొక్కసరి గాదా
పన్ని యిఁక నన్ను నొడఁబరచఁగ వలెనా ॥ మేలు ॥

దాసచేసుకొనమా భావములు వెలితా
సేసవెట్టి నీ గుణాలు చెప్పవలెనా
ఆసలెల్ల దక్కవా అప్పుడే మొక్కవా
వేసర కింకా నన్ను వేడుకొనవలెనా ॥ మేలు ॥

గక్కన మోహించమా కన్నులఁ దనియమా
చెక్కు నొక్కి బుజ్జగించి సేవ సేయవలెనా
యిక్కవ శ్రీవేంకటేశ యింతలోనె కూడితివి
నిక్కి నిక్కి చూచి నవ్వ నేఁడే నాతో వలెనా ॥ మేలు ॥ 129

భైరవి

వెనక నీవు చెప్పినట్టు వినేఁగాని
ననిచి నాతో నంత నవ్వకుమీ విభుఁడా ॥ పల్లవి ॥

అసము దించక మాఁటలాడేఁగాని నీతో
విసిగితి నీవిరహవేదనలను
రసికులై నవారు రామల నలఁగించితే
పసురువేసీనందురు పట్టకుమీ విభుఁడా ॥ వెన ॥

పీడనాడఁ జాలక నే వీడె మిచ్చేఁగాని నీకు
తాడుపడె నామనసు తమకానను
వేడుకకాఁడైనవాఁడు వెలఁదుల నేఁచితేను
గోడు దాఁకీ నందురు తక్కులకోప విభుఁడా ॥ వెన ॥

గుట్టు మానలేక నీతోఁ గూడేఁగాని నేను
తొట్టీ నిట్టూర్పులు నీదొమ్మిరతుల
యిట్టె శ్రీవేంకటేశ యేలినవాఁడువారి-
పట్టుకు దయసేతురు పాయకుమీ విభుఁడా ॥ వెన ॥ 130

శ్రీరాగం

ఏమీ నెఱఁగనిసతి నింత సేతురా
కోమలపుమనసులు కొలఁది నిలుచునా ॥ పల్లవి ॥

దగ్గరి నీవు నవ్వితే తరుణి కొప్పెల్లా వీడె
సిగ్గరి పెండ్లికూఁతురుఁ జిమ్మిరేఁతురా
దిగ్గన నీవు చూడఁగ దేహమెల్లాఁ జెమరించె
అగ్గల మాయ వలపు అంత కోపునా ॥ ఏమీ ॥

చెలితో మాటలాడఁగ చెక్కులెల్లాఁ బులకించె
పలుమారు నిందరిలోఁ బచ్చిసేతురా
నిలువున నొరగితే నిట్టూర్పు లవి రేఁగె
మలసితేఁ దమకాలు మట్టున నిలుచునా ॥ ఏమీ ॥

పంతానఁ జేయివేసితే భామ నివ్వెరగుఁ బొందె
కాంతుఁడవు వొకమాటే కరఁగింతురా
వింతగా శ్రీవేంకటేశ వేడుకతోఁ గూడితివి
సంతసాలు మతిలోనఁ జాలునంటే మానునా ॥ ఏమీ ॥ 131

పాడి

నీకంటే మునుపను నిన్ను నేరమ్మనఁగానే
 .వాకుచ్చి పిలిచేవు వలెరా యీవలపు ॥ పల్లవి ॥

వొక్కటయ్యే ననఁగానే వొద్దికిఁ జెలి నంపేవు
 చిక్కనినవ్వులు వచ్చీ సేయరా సేఁత
 నిక్కిచూచేననఁగానే నీవే విచ్చేసితివి
 చెక్కులెల్లాఁ జెమరించెఁ జెప్పరా మాఁట ॥ నీకం ॥

వీడెమిచ్చేననఁగానే వేగమే చేయి చాఁచేవు
 జోడుగా మఱిఁ బులకించె చూడరా చూపు
 వేఁడుకొనే ననఁగానే వేగమే నాకు మొక్కేవు
 వాడుదేరె నామోము వంచరా నీకరుణ ॥ నీకం ॥

కాఁగిలించే ననఁగానే గక్కున నన్నేలితివి
 మాఁగె నాచిత్తమంతయు మానరా జోలి
 దాఁగక శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
 చేఁగదేరెఁ బనులెల్లా చెల్లించరాదా ॥ నీకం ॥ 132

రేకు 1023 రామక్రియ

నిన్ను మంచివాఁడవన నేరుతుము గాని నేము
 సన్నలఁ దిట్టను విన(జా?)లమయ్యా ॥ పల్లవి ॥

ఆవులమందలలోన ఆడుకొనేసుద్దులు
 వేవేగ విట్టలుఁడ వినవయ్యా
 చేవదేర నీదొంగచేఁతలెల్లా వీరు వారు
 వోవవుచ్చే రివి విననోపమయ్యా ॥ నిన్ను ॥

కొలనికరత నీకు గురుతైనరవ్వలు
తలఁచుకో విట్ఠలుఁడ తగదయ్యా
యెలమిఁ బువ్వులవారియింటికాడినిందలు
తెలిపేరు యెట్టు సమ్మతింతుమయ్యా ॥ నిన్ను ॥

నిండార రుకుమిణి నీ కంపినలేకలు
పండరంగివిట్ఠలుఁడ పట్టవయ్యా
అండనే శ్రీవేంకటాద్రి నందరిఁ గూడితివి
యెండలెల్లా నీడలాయ నేమనేమయ్యా ॥ నిన్ను ॥ 133

భైరవి

[1]ఎదురైతి మిద్దరము యిఁకనేఁటిదే
పదిమారులు దూరఁబనిలే దనరే ॥ పల్లవి ॥

నెట్టన నీళ్ళపై వ్రాఁత నిజమా సరసాలు
వట్టిమోపు లింత గట్టవద్దనరే
దట్టముగ వట్టిజోలి దవ్వకొనవద్దనరే
గుట్టుచేసి సందెకాడ గుంపించకుమనరే ॥ ఎదు ॥

మిక్కిలియటమటాల మేను వెంచవద్దనరే
పక్కన దారామోనఁ జూపకుమనరే
గక్కన చేఁతల తాయి గరఁగించవద్దనరే
దక్కనిదొంగగుణాలు తగవుగాదనరే ॥ ఎదు ॥

యేడలేనిబుద్ధులకు యెడములేదనరే
వేడుకపరువులెల్లా విడుమనరే
యీడనే శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁ గూడె
యీడుజోడై యివి యెన్నికాయననరే ॥ ఎదు ॥ 134

---

1. ఇందు దశావతారసమన్వయము గలదు

శంకరాభరణం

[1] ఎఱఁగఁడు గాక తన్ను నిందరు నాడుకొనేది
.తఱితో నామాఁట తానే తలఁచుకొమ్మనవే ॥ పల్లవి ॥

తగునా పొలసుమేనఁ దట్టుపుణుగు
సొగయుబట్టతలకు చుట్టు తపారమేలే
అగడుసెలసుమోర కమరునా చిరునవ్వు
సగముమానిసికేలే చక్కఁదనాలు ॥ ఎఱఁ ॥

పుట్టుతిరిపేనకేలే భూషణములు
యిట్టె బ్రహ్మచారికేలే యింతులపొందు
నెట్టన యెంగిలీ నోఁట నిచ్చల ఘటనలేలే
తిట్టులఁబడేవానికి దీవనలేలే ॥ ఎఱఁ ॥

సిగ్గువిడిచినమీఁద చీర గట్టవలెనా
వెగ్గళమై గెరదాఁటేవిచారమేలే
నిగ్గుల శ్రీవేంకటాద్రినిలయుఁడు నన్నుఁ గూడె
యెగ్గులెల్లాఁ బాసె నిఁక యెడమాఁటలేలే ॥ ఎఱఁ ॥ 135

కాంబోది

అందుకేమి దోసమా నే మంతేసి కోపముగాక
నిందవేసుకోనేల నిన్నుఁ జూడరాదా ॥ పల్లవి ॥

చిక్కనినవ్వులు నవ్వి చెక్కులెల్లాఁ జెమరించె
చక్కనివాఁడ వౌదువు చాలించరాదా
మొక్కలపుమాట లాడి మోవియెల్లాఁ బొక్కనిదె
మిక్కిలిజాణ వౌదువు మేర నుండరాదా ॥ అందు ॥

1. ఇందు దశావతార సమన్వయము గలదు.

తేరకొన నన్నుఁ జూచి దేహమెల్లాఁ బులకించె
తారుకాణలాయ నిఁకఁ దలఁగరాదా
గారవించఁ జెయివేసి కరఁగె నీచిత్తమెల్లా
తేరెఁదేరె నీమోహము తెలుసుకోరాదా ॥ అందు ॥

పానుపుమీఁదికి వచ్చి పక్కన నీకొప్పు వీడె
మాన వింకాఁ బంతములు మన్నించరాదా
కోనేటిశ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
మానరానిపొందులాయ మమ్ము మెచ్చరాదా ॥ అందు॥ 136

## పాడి

బలిమి సేయకురే పదరే మీరు
చలము సాదించనోప సారె మొక్కేఁ జాలునే ॥ పల్లవి ॥

ఆనవెట్టుకొనేవాఁడు ఆకెవద్ద నేలవుండె
దానికేపో కోపగించఁదగదా నాకు
వానిసుద్దు లిట్లానే వలసినట్లా నాడు
యేనెపము వేయనోప యీాడ నుండేఁ జాలునే ॥ బలి ॥

నన్ను వలసినవాఁడు నాఁడేల పరాకాయ
కన్నుల నిందుకేపో నే గద్దించరాదా
యెన్ననేల వానిగుణా లెట్టువలసినా వచ్చు
తన్ను నేమీ ననవోప తాలిములే చాలునే ॥ బలి ॥

దగ్గరి పైకొనేవాఁడు తారుకాణ లింత యేలే
యెగ్గువట్టి యిందుకేపో యెలయించితి
నిగ్గుల శ్రీవేంకటాద్రినిలయుఁడు నన్నుఁ గూడె
సిగ్గులెల్లాఁ దీరెఁ దాను చెప్పినట్టె చాలునే ॥ బలి ॥ 137

ఆహిరి

ఒక్కటైన యప్పటిజోక నుందాము గాక
నిక్కి(జూపు( దలవంపు నీ కేలరా ॥పల్లవి॥

కన్నుసన్న నొక్కమాట కాయములో నొక్కమాట
నిన్ను( జూచి చూచి యాడ నే నోపరా
వన్నెలకు నొంతే(టవాదులేల యీచోట
నిన్నటిమొన్నటిలోనే నీ కేలరా ॥ఒక్క॥

చేరితేనే వొకచే(త చేరకుంటే నొకచే(త
నేరిచి నీయెడ( జేయ నే నేరరా
ఆరీతివలపులీ(త అంతలోనే పైపూ(త
నీరువంకతుంగవలె నీ కేలరా ॥ఒక్క॥

మోవిమీ(దితేనెలు మోనములో కేనములు
నీవద్ద( బచరించ నే నేరరా
శ్రీవేంకటేశ్వరు(డ చేకొని కూడితి నన్ను
నేవళపు(జిలునవ్వు నీ కేలరా ॥ఒక్క॥ 138

రేకు 1024 ముఖారి

ఆలిదీ(బెట్టీ మమ్ము నంతేకాదా
జాలికున్నా మొక్కవచ్చీ సట లింతేకాదా ॥పల్లవి॥

అప్పసము వేగుదా(కా నాకు మడిచి ఇచ్చితి-
నప్పటి నన్ను( బిలిచీ నంతేకాదా
పిప్పిగా( దనపాదాలే పిసికితి నిందా(కా(
జెప్పకవచ్చితిననీ( జెప్ప( గొత్తగాదా ॥ఆలి॥

జాముదాఁకాఁ దనకు వెంజామరము వేసితి -
నేమిసేయుమనీ నన్ను నింతేకాదా
దోమటినవ్వులు దనతో నే మారు నవ్వితి
యేమో పరాకైతిననీ నిది వింతగదా ॥ ఆఅ ॥

చేయారఁ బెనఁగితి చెరఁగు నన్నుఁ బట్టఁగా
ఆయము లంటీ గోర నంతేకాదా
యీయెడ శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
వేయిటికి నానవెట్టీ వేసా లింతేకాదా ॥ ఆఅ ॥ 139

సామంతం

నిచ్చా నిచ్చా విట్ఠలా నీ కేల యీ అట్టు
మచ్చము నేఁ జూపితేను మాతోనే నవ్వులా ॥ పల్లవి ॥

వల్లెవాటు పైఁడిచీర వనిత శ్రీసతి నీకు
చల్లలమ్మేవారితోడ జాణతనాలా
చెల్లఁబో కొండ గొడుగుచేసి యెత్తేనీవు
గొల్లెతల చీరలెల్లాఁ గోరి ముచ్చిలేదా ॥ నిచ్చా ॥

అందరి నేలేగోపనందనుఁడవై ననీవు
చెంది చీఁకటితప్పులు సేయఁబొయ్యేదా
గొందినే దేవతలు గొనియాడేదట నిన్ను
మందవారిపాలఁ జిక్కి నిందలఁ బడేదా ॥ నిచ్చా ॥

కొనబుకాఁడవు నీవు కొమిరెవయసు నేను
పనిలేక వొంటినుంటేఁ బైకొనేదా
ననుపై శ్రీవేంకటేశ నన్ను నిట్టె కూడితివి
మనలోఁ దగవు దేరె మరియింకాఁ గొసరా ॥ నిచ్చా ॥ 140

నాట

అప్పటికప్పుడే కాక ఆస లింతేలే
.కప్పురమే గనమైతే కాయమున కితవా ॥ పల్లవి ॥

అలసి నిద్రించఁబోతే ఆకకేల రమ్మనీనే
వలసినప్పుడే (ఋ?) నేనే వచ్చేఁగాక
బలుదొర దానైతే బతుకనీ మాకేమి
బలిమిఁ బిసుకఁబోతే పసురౌఁబో విరులు ॥ అప్ప ॥

ఇంత నే మోనాననుంటే యేల మాటాడించీనే
పంతము చెల్లినమీఁదఁ బలికేఁగాక
అంతజాణ దానైతే అవుఁగాక మాకేమి
చెంతఁ గడుఁగరఁచితేఁ జేదౌఁబో తేనెలు ॥ అప్ప ॥

యెదురుగా రాఁగానే యేల కొంగువట్టీనే
కొదదీరఁ దనతో నేఁ గూడేఁగాక
అదన శ్రీవేంకటేశుఁడైతేఁ దానౌఁగాక
వెదకి నన్ను మన్నించె విరివవుఁ బనులు ॥ అప్ప ॥ 141

రామక్రియ

ఎంతనేర్చెనే యీలేమ పువు -
బంతివాట్లనే బడలీని ॥ పల్లవి ॥

వాలుకచూపులు వంచి చెలి పతిఁ
గోలుముందుగా గొణఁగీని
చాలుగ నడచి సారెకు నిలిచి
పిలుచుఁ బయ్యెద విసరీని ॥ ఎంత ॥

చెదరిననెరు లటుచెరిగి యిటు నటు-
నుదుటునఁ జెలిపై నొరగీని
కొదలుచుఁ బలికి కోపమె చిలికి
చెదరగ నవ్వులు చిందీని ॥ ఎంత ॥

సరసపు సిగ్గులు చల్లీని తన-
కరము చెక్కుపైఁ గప్పీని
యిరవుగ శ్రీవేంకటేశుఁ గలసి తా-
నరమరపున ముదమందీని ॥ ఎంత ॥ 142

సాళంగనాట

తగవు నీ వెఱఁగవా తప్పు నాయం దిఁకలేదు
వెగటైనవారితోడ వియ్యమంద వచ్చేమా ॥ పల్లవి ॥

పంతము దప్పీనా పలికితేను నీవు
రంతు మగనాలవు రాఁపునేసేమా
పొంతపొరుగునసుండేపొందుసతి వని కాక
మంతనాన నందరితో మాఁటలాడ వచ్చేమా ॥ తగ ॥

జవ్వనము వెలితౌనా సారె నాతో నవ్వితేను
రవ్వ నీ దొరతనము రాఁపునేసేమా
యివ్వల నొక్కవయసే యిద్దరికినని కాక
దవ్వులవారితో జాణతన మాడవచ్చేమా ॥ తగ ॥

కాయము కొంతరగీనా కాఁగిలించితే నన్ను
రాయడి నీతమకము రతి దూరేమా
వేయిటిశ్రీవేంకటాద్రివిభుఁడనయిననన్ను
చాయలఁ గూడితి వింక సారె మెచ్చకుందేమా ॥ తగ ॥ 143

లలిత

ఎంత మీఁదుకట్టెనో యింతి నీకు జవ్వనము
కాంతుఁడ వేమిసేసితో కానుక లంపెఁ జెలి ॥పల్లవి॥

నిద్దిరించవలసినా నీకాఁగిటనే కాని
వొద్ద నిన్నుఁ బాసి వొంటినొల్లదు చెలి
కొద్దిగా మాఁటాడినాను కోరి నీతోనేకాని
ముద్దిరించి పరులతో మోనమే చెలి ॥ఎంత॥

ఆరగించవలసినా అటు నీపొత్తునఁగాని
వూరకే వేరైతే నొల్లదు చెలి
సారె విడెమిచ్చినాను సగమాకు నీ కియ్యక
చేరి వేరేతమ్ములము చేయదు చెలి ॥ఎంత॥

కొమ్మ పయ్యద గప్పినాఁగూడ నీతోఁగాని
వుమ్మడిఁ దనంతనైతే నొల్లదు చెలి
యిమ్ముల శ్రీవేంకటేశ యింతలోఁ గూడితిఁగాని
బిమ్మరవెట్టినా నీకుఁ బాయదు చెలి ॥ఎంత॥ 144

రేకు 1025 ముఖారి

అందపువిభుఁడు దాను అంగన నేను
కందువ కేఁగినఁజాలుఁ గదిసీఁ బనులు ॥పల్లవి॥

సేయనీవే చేఁతలెల్లా చెంగటఁ జూచేఁగాక
నాయాలకు వచ్చేనా నవ్వేనింతే
[1]వేయిటిపై జవ్వాదివో వేగిరించనేల నాకు
దాయము వచ్చినప్పుడు తలఁపించేఁ బనులు ॥అంద॥

---

1. వేయిటిపై జవ్వాది = ఇక్కడ; ప్రకరణమును బట్టి పదిలో పదకొండు అన్నట్లు తోచుచున్నది. చూ: 24 సంపుటము, 399 పాట.

ఆడనీవే మాటలెల్లా అన్నియు వినేఁగాక
సూడువట్టఁబోయేనా చొక్కెనింతే
వోడఁగట్టుదూలమువో వోపనన నాకునేల
వీడె మిచ్చేయప్పుడైనా వెలయిఁచేఁ బనులు ॥ అంద ॥

రానీవే తా నీడకు రవ్వగాఁ గూడేఁగాక
కానీకానిమ్మనేనా కైకొనే నింతే
యీనెపాన శ్రీవేంకటేశుఁడు గలసె నన్ను
మేనుమేనుఁ బెనఁగించి మెప్పించేఁ బనులు ॥ అంద ॥ 145

సాళంగం

వాసి వంతుకుఁ బెనఁగేవనితలము
నేసవెట్టితివి ఇఁకఁ జెప్పనేల విభుఁడా ॥ పల్లవి ॥

చల్లనివెన్నెలనవ్వు చల్లితివి నేఁడు నీవు
మొల్లమిగా నంత నేము మోవఁగలమా
నల్లనిచూపులు నీపై నాటేము మారుకు మారు
తెల్లమి నీగుట్టు మాకుఁ దెలియదు విభుఁడా ॥ వాసి ॥

మొగిఁదేనెవంటిమాఁట మోపేవు మామీఁద
మిగులా నిందుకు నిన్ను మెచ్చఁగలమా
యిగురుఁగారపువీడె మిచ్చేము నేమైతే
తగునో తగదోకాని తలఁచుకో విభుఁడా ॥ వాసి ॥

పెద వుంగరాలచేయి వేసేవు మామీఁద
అదరి నిన్నిఁక నొఁగాదనఁ గలమా
విడువక నిన్ను నే శ్రీవేంకటేశ కూడితిని
బడిబడి నిఁక నిన్నుఁ బాయలేను విభుఁడా ॥ వాసి ॥ 146

శుద్ధదేశి

ఎట్టు నమ్మవచ్చు నిన్ను నిటువంటియందగాని
పట్టపగలే నీచేఁత పచ్చాయఁగా ॥ పల్లవి ॥

మల్లడి నీతో నలిగి మారుమోమై యున్నవేళ
చల్లువలపులు నీకుఁ జవులాయఁగా
యిల్లిదె యింతలో నీతో నేకము నేనైనవేళ
వెల్లవిరి నవియెల్లా వెగటాయఁగా ॥ ఎట్టు ॥

చెఱఁగుమాసి నేఁ జెక్కుచేతితో నున్నవేళ
యెఱుకతో సరసాలే యింపాయఁగా
చిఱుతనై నాలుగునాళ్లు చేసియున్నవేళఁ జూచి
మొఱఁగులపనులెల్లా మొగచాట్లాయఁగా ॥ ఎట్టు ॥

కాఁగిటికి నెదుగక కన్నె నేనై యున్నవేళ
తోఁగిచూపులే నీకు తొడుసాయఁగా
వీఁగక శ్రీవేంకటేశ వెస నేఁ గూడినవేళ
మాఁగినతొల్లిటివెల్లా మఱపాయఁగా ॥ ఎట్టు ॥ 147

బౌళిరామక్రియ

అన నింకేమున్నది అలుగ నేమున్నది
కనుఁగొనలనే చూచి కరఁగుట గాక ॥ పల్లవి ॥

నవ్వు నవ్వాఁజెల్లును నాలిసేయఁజెల్లు నీకు
రవ్వగా నే మోహించి రాఁపైనయందుకు
యెవ్వరితోఁ దగవూ లేఁక నాదే నేను
జవ్వనాన నొంటి నేను జడియుట గాక ॥ అన ॥

బిగియా నమరునూ బీరాలు నమరునూ
తగవులెంచక నిన్ను దగ్గరినయందుకు
జగడమూఁ జెల్లదూ సాదించఁ జెల్లదూ
మొగమోటమున నేనే ములుగుటగాక ॥ అన ॥

సరసము దక్కెనూ చనవెల్లా నెక్కెనూ
మరిగి నీకాఁగిట నేను మఱచినయందుకు
తెరయెత్తఁ బనిలేదు దిష్టము శ్రీవేంకటేశ
సరుగ నీరతిఁ జిక్కి సతమౌటగాక ॥ అన ॥ 148

మంగళకౌశిక

సారె దూరఁజాలనూ చలముల కోపనూ
చేరితి మాచనవోలిచెన్ను నిభ్రమలను ॥ పల్లవి ॥

యీడకుఁ బిలుపించెను యేమిసేయుమనీనే
వోదక తనయెదుట నున్నదానను
పాడితో నీట ముంచనీ పాల ముంచనీ తాను
వాడుఁదనవలపులవలకు లోనైతిని ॥ సారె ॥

మాఁట నన్ను నాడించెను మన సెట్టుదెలిసీనే
యేఁటికైనా నియ్యకొంటి నిదివో నేను
నాఁటిమాఁట చెల్లించీనా నగనీ తెగడనీ
మేఁటిపాయము తనకే మీఁదుగా నెత్తితిని ॥ సారె ॥

కాఁగిట నన్ను నించెను కళదాఁకె నిఁకనేలే
దాఁగక తనకు నిట్టె దక్కితి నేను
పీఁగక శ్రీవేంకటాద్రివిభుఁడు దా నన్నుఁగూడె
యేఁగించనీ రేఁగించనీ యిరవైతి నేను ॥ సారె ॥ 149

రామక్రియ

ఎదురుగుదురుగా నిది యేమే
పెదవులు గదలఁగఁ బెనఁగీఁ దాను ॥ పల్లవి ॥

పక్కన నగఁగాఁ బంతము లాడితి
యెక్కువతక్కువ లే[1] విందు
ముక్కనఁ దనకే ముంగోపము మరి
తక్కరిరమణుఁడు తగునా తనకు ॥ ఎదు ॥

సొరిదిఁ జూచితే సూడిటు వట్టితి
యిరవగుతగవులు యే విందు
సరుగన తానే సాకిరి చెప్పీ
కెరలినజగడమె గెలుపా తనకు ॥ ఎదు ॥

యీడకు వచ్చిన నిన్నియు మఱచితి
యీడుగానిపను లే విందు
వేడుకతో శ్రీవేంకటరమణుఁడు
కూడి మొక్కె నిది గుఱుతా తనకు ॥ ఎదు ॥ 150

రేకు 1026 దేసాళం

ఎప్పుడు మీకే పోదు యింతవలెనా
కొప్పువట్టితే అప్పుడు కొంచెము గావలెనా ॥ పల్లవి ॥

పలుకుల కొదదీరె పరాకు లిఁకనేలే
చెలువుఁడు చెప్పినట్టు సేయరాదా
నిలుచున్నాఁ డిదె వచ్చి నిదుర నీ కింత యేలే
బలిమిఁ బట్టినమీఁద భ్రమయఁగవలెనా ॥ ఎప్ప ॥

1. ఏవి + ఇందు.

మనసు కోపమువాసె మరి చింత లికనేలే
ఘనునిప్రియములెల్లఁ గైకోరాదా
తనుఁదానె వీడెమిచ్చి తలవంచ నీకేలే
చెనకి చేయిచేసుకొంటే సిగ్గువడవలెనా ॥ ఎప్ప ॥

కాఁగిటిలో కొాదదీరె కమ్మర జంకించనేలే
పీఁ(వీఁ?)గక శ్రీవేంకటేశుఁ బిలువరాదా
రేఁగి యాతఁడు నవ్వీని రిచ్చలఁ గొంకఁగనేలే
మూఁగి యాతఁడు ముంచితే మొగమోట వలెనా ॥ఎప్ప॥ 151

ముఖారి

అప్పటి మానవు బింకా లౌనయ్యా
కప్పేవు పచ్చడ మిట్టె కమ్మటి నౌనయ్యా ॥ పల్లవి ॥

వూని రేపుమాపుదాఁకా పూరెల్లాఁ దిరిగి వచ్చి
ఆనలువెట్టవచ్చేవు అవునయ్యా
మానాన మణిఁగి నే మౌనముతో నుండఁగాను
కానీకావిమ్మనేవు కమ్మటి నౌనయ్యా ॥ అప్ప ॥

పొద్దువోనివాఁడ విట్టేపోకలనెల్లాఁ బోయి
అద్దము చూపుమనేవు ఔనయ్యా
నిద్దురతోఁ బానుపుపై నే నిట్టె వుండఁగాను
గద్దించి ఆయా లంటేవు కమ్మటి నౌనయ్యా ॥ అప్ప ॥

కాంతలఇద్దరిలోనికనుసన్న దెలిపితే
అంతేపో నవ్వునవ్వే వౌనయ్యా
చింతదీర నన్నుఁ గూడి శ్రీవేంకటేశ నేఁడు
కంతుముద్రలు మోపేవు కమ్మటి నౌనయ్యా ॥ అప్ప ॥ 152

పాడి

పొమ్మంటేఁ గాని వూరకే పోయివచ్చేనంటేను
సమ్మతించలేనోయి సంగడీఁడ ॥ పల్లవి ॥

యిత్తల నీవు నేను యిటు గూడినకూటమి
చిత్తాన మఱవకుమీ చెలికాఁడ
మత్తిలి నీవు నేఁడే మాపటంత రాకుంటే
వత్తుఁజుమ్మీ మీయింటికి వగకాఁడా ॥ పొమ్మం ॥

ఆవేళ నీవు నేను ఆడుకోలుమాటలెల్లా
నీవే తలఁచుకొమ్మీ నేస్తకాఁడా
యేవంక చూచినా యిప్పుడు కోమటిమేన-
వావిసుమ్మీ నీకు నాకు వన్నెకాఁడా ॥ పొమ్మం ॥

వాకిటికిఁ బోయి యిటువచ్చి నన్నుఁ గూడితివి
నాకంటే మేలుగదోయి నాటకీఁడా
చేకొని శ్రీవేంకటేశ చెల్లుఁజెల్లు యిది నీకు
యేకాలముఁ బాయకుమీ యిచ్చకీఁడా ॥ పొమ్మం ॥ 153

కేదారగౌళ

పొయ్యేవో పోవో అంతేపో బాలుఁడా
వొయ్యన చేరేవు నే మోపమయ్య బాలుఁడా ॥ పల్లవి ॥

చంక నెత్తుకోఁబోఁగా సంది జీరువారుఁ జేసు
అంకెలబాలుఁడ మమ్ము నంటకువయ్యా
పొంకమున నీయెదుటఁ బొలయరాదా చెలులు
కొంకక నాపైఁ బడేవు కొయ్యవుగా బాలుఁడా ॥ పొయ్యే ॥

ముద్దువెట్టుకోఁబోఁగా మోవి పల్లు నాటుఁ జేసు
వొద్దువొద్దు బాలుఁడా నే మొల్లమయ్యా
అద్దో యశోదతోడ ముచ్చటాడరాదా మాకు
వుద్దండానఁ బైపడేవు వుండరాదా బాలుఁడా ॥ పొయ్యే ॥

అప్ప లప్పలనఁబోఁగా నాయము కరఁగుఁ జేసు
తప్పక మాకుచములు దాఁకీనయ్యా
చెప్పఁగానే వుద్దండానఁ జెలఁగువట్టితి విదె
వొప్పితి శ్రీవేంకటాద్రి వొరపరిబాలుఁడా ॥ పొయ్యే ॥ 154

## సామంతం

చంక గుదియయు మరి శరణాగ్తియునేల
సంకెలేక నీపంతమె సాదించుకోరాదా ॥ పల్లవి ॥

యేడనుండో వచ్చి నీవు యేమీ నే ననకుండా
వాడుమోము నీవు ముందే వంచవలెనా
వేడుకదొరవు నీవు వెరపు నీ కింతయేల
యీడుగాఁ జేసినచేఁతే యీడేర్చుకోరాదా ॥ చంక ॥

సొలసి నీమేనిపచ్చి చూచి వెంగెమాడకుండా
అలయకముందే వుస్సురనవలెనా
బలవంతుఁడవు నీవు పరితాప మిఁకనేల
చెలఁగి తొల్లిటిచేఁతే చెల్లించుకోరాదా ॥ చంక ॥

అరవిరై వచ్చి నీవు అదేమీ నే ననకుండా
గరిమఁ గాఁగిట నన్నుఁ గలసేవు
యిరవై శ్రీవేంకటేశ యిన్నిసుద్దు లిఁకనేల
పరగ నన్నేలితివి పాయకుండరాదా ॥ చంక ॥ 155

శ్రీరాగం

పొద్దువోక కిటు పొలసితిని
అద్దమునీడల నాఁగేవా ॥ పల్లవి ॥

పెనఁగఁగ నేఁటికి పిలువఁగ నేఁటికి
ననుపున నూరక నవ్వితిని
చనవరికాంతవె చాలు నీకు నిఁక
కనుకలి వినుకలి గాణాచా ॥ పొద్దు ॥

పట్టఁగ నేఁటికి పయికొననేఁటికి
చుట్టపు వరుసలఁ జూచితిని
పెట్టువలపులే ప్రియములు నీ కిఁక
జట్టిబేరములు సతమవునా ॥ పొద్దు ॥

బాసలిఁకేఁటికి బచ్చన లేఁటికి
వాసివంతులకె వచ్చితిని
ఆసల శ్రీవేంకటాధిప కూడితి-
వేసతులును నా కిట(కీడ?)య్యేరా ॥ పొద్దు ॥ 156

రేకు 1027 నాదరామక్రియ

సింగారరాయఁడ వౌదు చెన్నకేశా[1]। యింకఁ
జెంగకుమీ మారతుల చెన్నకేశా ॥ పల్లవి ॥

చిమ్మలచుట్లతోనే చెన్నకేశా। మాకు
చిమ్మిరేఁచేవు వలపు చెన్నకేశా
చెమ్మఁజెమటచెక్కుల చెన్నకేశా। మాపైఁ
జిమ్మకు గోళ్ళ నీవు చెన్నకేశా ॥ సింగా ॥

---

1. చూ - 60 వ పాట.

సెలవిలేనగవుల చెన్నకేశా। మాకే
సెలవనేవు వయసు చెన్నకేశా
చెలఁగి పసిడిదట్టి చెన్నకేశా ! యీ -
చెలువము నీకే చెల్లె చెన్నకేశా ॥ సింగా ॥

చెప్పరానిమహిమల చెన్నకేశా । మాకు
చెప్పిలేమోవి యిచ్చితి చెన్నకేశా
యిప్పుడే శ్రీవేంకటాద్రి నిందు మాచనవోలిలో
చెప్పఁగా నన్నేలితివి చెన్నకేశా ॥ సింగా ॥ 157

సామంతం

విన్నపమిదెపో వింటివో వినవో కాని
కన్ను గిరిపే వేమికారణమో కాని ॥ పల్లవి ॥

మాఁటలివి మంచివేపో మనసే తెలియఁగాని
ఆఁటదానఁ బుణ్యపాప మది నీదేపో
నాఁటినసెలవులను నవ్వులు నవ్వే విది యాఁటో
యేఁటికొఁతా వెనకముం దెంచలేము గాని ॥ విన్న ॥

ననుపెల్లా మంచిదేపో నడవ దెఱఁగఁగాని
యెనసితి పరభారా లిఁక నీవేపో
నను నీవు సారెసారె నమ్మించే విది యాఁటో
కొనయౌతా మొదలౌతా గుట్టెఱఁగఁగాని ॥ విన్న ॥

పాయమిది మంచిదేపో పంతము లెఱఁగఁగాని
ఆయమంటి కూడితి నీయాసఁ గంటిఁటో
యీయెడ శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
రేయి - పగ లిదియని రీతెఱఁగఁ గాని ॥ విన్న ॥ 158

శంకరాభరణం

ఇద్దరికిఁ బోవునా ఇదియూఁ గొంతా
అద్దుకొన్న వలపౌత అది నీవెఱఁగవా ॥ పల్లవి ॥

పంతము దప్పినా పక్కన నవ్వితే మాతో
కొంతగొంత నవ్వునవ్వి గుక్కుకొనేవు
మంతనాన నొకవేళ మాటమాట జగడాలు
అంతనంతనే పాసె నది నీ వెఱఁగవా ॥ ఇద్ద ॥

దొరతనము వోయీనా తొంగిచూచితే మమ్ము
ధర పులుకనఁ జూచి తలవంచేవు
విరస మేమిగల్లాను వేళవేళనే పాసె
అరగొరత లిఁకేల అవి నీవెఱఁగవా ॥ ఇద్ద ॥

పాకము దప్పినా పలికితే మాతోను
మాకువలె రతిఁజొక్కి మఱచేవు
యేకమైతి శ్రీవేంకటేశ మమ్ముఁ గూడితేను
ఆకతలే చెప్పనేల అది నీ వెఱఁగవా ॥ ఇద్ద ॥ 159

రామక్రియ

ఇప్పుడు వేగిరమేలే యింతిలోఁ దాను
కొప్పు వీడె నిదె నాకుఁ గూడవచ్చేఁ బదవే ॥ పల్లవి ॥

నాటకాన బూటకాన నవ్వివచ్చితి నిందాఁక
యేఁటికిఁ బిలువనంపె నిట్టే తాను
కాటుకతన్నుల నాకు కమ్మీ నిద్దుర నేఁడు
నేఁట నే తప్పినా రేపు నే వచ్చేఁ బదవే ॥ ఇప్ప ॥

పొంతనాల మంతనాల పొద్దువుచ్చితి నిందాఁక
అంతలో లేకలేలంపె నప్పుడే తాను
చెంతల కస్తూరిబొట్టు చెదరె నీవేళ నాకు
వంతుకు నే మాపటంత వచ్చేఁ బదవే ॥ ఇప్పు ॥

వొడఁబాటు తడఁబాటు నొప్పి వచ్చితి నిందాఁక
బడి నీడకేల వచ్చెఁ బదరి తాను
యెదచొచ్చి శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁగూడె
వడి మీమనసులెల్లా వచ్చెఁగద పదవే ॥ ఇప్పు ॥ 160

బౌళి

[1] చెల్లుబడి గద్దంటాఁ జేసేవు గాని
వొల్లమన్నాఁ బోరుసుమ్మీ వుద్దండమైనాను ॥ పల్లవి ॥

చిట్లుగురుగులతో చిలుపాలు గొల్లెతలు
వుట్లపైఁ బెట్టినారు వోకృష్ణుడా
కొట్లుగొట్టేవు నీవు గోపాలకులఁ గూడి
తిట్లు దిట్టేరుసుమ్మీ దేవరవైనాను ॥ చెల్లు ॥

అట్టువపైఁ జక్కిలాలు అట్లును నురుగులు
కట్టిపెట్టి దాఁచినా రిక్కడఁ గృష్ణుఁడా
మెట్టుకొని కొల్లలాడి మెఱసేవు వీదులను
పట్టుకొనే రిఁకఁ జుమ్మీ బల్లిదుఁడవైనాను ॥ చెల్లు ॥

తోవల తేనెలు-నేయి దొంతులుగఁ బెట్టినారు
శ్రీవేంకటాద్రిమీఁదిచిన్నికృష్ణుఁడా
వావారి జోరునవచ్చి వంచి-ముంచి పోసేవు
పోవిడువ రేలికవై పోకులఁబోయినాను ॥ చెల్లు ॥ 161

---

1. ఇది ఒకపాటి అధ్యాత్మకీర్తనలలోనిదే కావచ్చు.

నారాయణి

నవ్వనవ్వె రమణుఁడు ననుపుగాఁ బొందుసేసె
    రవ్వల నింతచాలదా రాతిరి రమ్మనవే ॥ పల్లవి ॥

చెక్కునొక్కి సేసవెట్టె చేయివేసె బుజముపై
    జక్కవనాచన్ను లంటె చాలదా యింత
    యెక్కువేది - తక్కువేది యిప్పుడే కావలెనా
    చుక్కకెదు రీవేళ చూచుక రమ్మనవే ॥ నవ్వ ॥

కాలుదొక్కి - కాఁకరేఁచెఁ గన్నులఁ దప్పకచూచె
    చౌలుగా మాఁటలూ నాడె చాలదా యింత
    వేళలేదు - పొద్దులేదు వేగిరించీ నింతలోనే
    యీలకూర కుప్పవేసే నిటుండి రమ్మనవే ॥ నవ్వ ॥

కొంగువట్టె - గాఁగిలించెఁ గూడె సమరతులను
    సంగతాయ నన్నిటాను చాలదా యింత
    చెంగలించె నిన్నిటాను శ్రీవేంకటేశ్వరుఁడు
    ముంగిట నున్నాఁడు యిట్టె మొక్కి రమ్మనవే ॥నవ్వ॥ 162

రేకు 1028 సాళంగం

తడవకు మము నటు తలవయ్యా
    పిడికెడునడుములఁ బెనఁగేమయ్యా ॥ పల్లవి ॥

పంతము మాతోఁ బలుకఁగఁ బలుకఁగ
    దొంతులు బెదరీఁ దొలవయ్యా
    కాంతల మింతే కన్నులు పెద్దని
    బంతులఁ జూపిటు బలికేమయ్యా ॥ తడ ॥

అంచె జాణతన మటు నీవాడఁగ
మంచము మురిగీ మానవయ్యా
కొంచపుమోమున గురిగా కళలే
నించుక మెరసేనెలతలమయ్యా ॥ తర ॥

కాఁగిటి కొయ్యనె కదియఁగఁ గదియఁగ
వాఁగీ నందెలు వద్దయ్యా
ఆఁగుచు శ్రీవేంకటాధిప కూడితి
మాఁగినరతి మెయి మఱచేమయ్యా ॥ తర ॥ 163

ముఖారి

పోపో యిదేడసుద్ది పొద్దునఁ రాఁగదవే
యీపాటిదానవు ముందేల పిలిచితివే ॥ పల్లవి ॥

మంతనము లేమిటికే మారుమాట లేమిటికే
కాంతుఁడు వాకిట వచ్చి కాచుకుండఁగా
యింతులకు మగవానియిచ్చకమే వలెఁగాక
యెంతలేదు నీచలము యేమి గట్టుకొంటివే ॥ పోపో ॥

అలుక లింకేమిటికే అవ్వలిమో మేమిటికే
నలిరేఁగి పతి నీతో నవ్వు నవ్వఁగా
చెలులకు పతి కట్టె సేవ సేయవలెఁగాక
యెలమి నెగ్గులువట్టే వింతేసి కద్దటవే ॥ పోపో ॥

చెక్కుచేతు లేమిటికే సిగ్గులింకా నేమిటికే
వొక్కటై శ్రీవేంకటేశుఁ డొప్పఁజెప్పఁగా
తప్పక సతికి పతితగులమే వలెఁగాక
ఇప్పుడే కూడితిరి ఇంకఁ జెప్పనేఁటికే ॥ పోపో ॥ 164

లలిత

ఒద్దనుంటేఁ జప్పనౌను వోపము నేము
 •సుద్దులు చెప్పినంతనే చొక్కేము నేము ॥ పల్లవి ॥

కలిగితే మోహమెల్లా గాదెఁ బోసుకొమ్మనవే
 సొలపుమాటల మాకుఁ జూపఁగనేల
 చెలులాల మనసెల్లాఁ జిల్లులాయ నిందుననే
 తలఁచి దవ్వులపొందే తనివాయ మాకు ॥ ఒద్ద ॥

రాజస మెంతగల్లాను రాసి చేసుకొమ్మనవే
 జాజుకొన మాయెడఁ బచరించ నేల
 వోజతోడ నిందుననే వుడుకెత్తె మేనెల్లా
 తేజానఁ బెండ్లినాఁడే తేఁకువాయ మాకు ॥ ఒద్ద ॥

మంచి నవ్వులేమిగల్లా మూఁటగట్టుకొమ్మనవే
 వంచి మాపైనేల చల్లీ వరుసఁ దాను
 యెంచఁగ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
 మించి వుర మెక్కించుటే మేలాయ నాకు ॥ ఒద్ద ॥ 165

ఆహిరి

నిలువుఁ గొలువులేల నివ్వెరగు లిఁకనేల
 చలము మాని విభునిఁ జక్కఁజూడరాదా ॥ పల్లవి ॥

పంత మొక్కటేకాక పలుమాఁట లిఁకనేల
 మంతనాన పతితో మాటాడరాదా
 చింత లిన్నియునుఁ బాసె చెక్కునొక్కినప్పుడే
 కొంత సెలవుల నవ్వి కూచుండరాదా ॥ నిలు ॥

వాడ(బా టొక్క_టేకాక వున్నవిచారము లేల
బెడ(గులేక యాతని( బిలువరాదా
కడమలిన్నియు( బాసె కప్పురమిచ్చినప్పుడే
విడువరానిపతికి విడెమియ్యరాదా ॥ నిలు ॥

కూటమి వొక్క_టేకాక కొఱఁత లింకానేల
చోటిచ్చి శ్రీవేంకటేశు( జొక్కించరాదా
బూటకములెల్లా( బాసె పొందిపొస(గినప్పుడే
పాటించి యాతని నిట్టె పచ్చిసేయరాదా ॥ నిలు ॥ 166

మాళవిగౌళ

ఏమాయ నిందుకు నీ వెగ్గులేల పట్టేవు
కామిని నీచెక్కు నొక్కి కైకొనవయ్యా ॥ పల్లవి ॥

పద(తి నోరెత్తితేను పగడాలే రాసులయ్యా
యెదపు నిన్ను( దిట్టితే నేమాయనయ్యా
కదలేనిరత్నాలు గానుకవచ్చిననీవు
తదవి బండారాన దా(చుకోవటయ్యా ॥ ఏమా ॥

మగువచూపులవంక మాణిక్యాలే రాలీని
తగ( గోపించి చూచితే తప్పటవయ్యా
సొగిసి మణులు దా(చి సొమ్ములు నీ కిచ్చితేను
జిగి మేన ధరియించి చెల(గవటయ్యా ॥ ఏమా ॥

మంచి చెలి నవ్వితేను ముత్తేలే రాలీని
యించుక గేలిసేసితే నేమాయనయ్యా
పెంచెపుశ్రీవేంకటేశ పెండ్లిముత్యాలనేస
వంచి కూడి చెలి మానవచ్చునటయ్యా ॥ ఏమా ॥ 167

రామక్రియ

ఏమని చెప్పుదు నిరుగుపొరుగుతో
గామిడితనమునఁ గదిసీని ॥ పల్లవి ॥

మలయుచు నే నటు మంద కేఁగఁగా
తొలఁగక యెదురుగఁ దుమ్మీని
యెలమి మగుడి మాయింటికిఁ బోతే
బెళకక యిలు గడెవెట్టీని ॥ ఏమ ॥

జడిగొని పీదుల చల్లలమ్మఁగా
తొడిఁబడ దూడలఁ దోలీని
వడి నందుకు నే వద్దని కసరిన
అదరి జాణతన మాడీని ॥ ఏమ ॥

ఏకతమున నే నిటు నీళ్ళాడఁగ
కైకొని నాచీర గట్టీని
కాకుగ శ్రీవేంకటగిరికృష్ణుఁడు
దాకొని నన్నిటు తగఁ గూడీని ॥ ఏమ ॥ 168

రేకు 1029 కాంబోది

నేవచ్చినపనేమి నీవుసేసినచేఁతేమి
ఆవలఁ జెలేమనునో అవునయ్య చాలును ॥ పల్లవి ॥

పిలిచేవ నుంటిఁగాని పెనఁగే దెఱఁగనైతి
చెలికత్తెఁ బచ్చిసేయఁ జెల్లునా నీకు
తొలుతే వేడుకకాఁడు దోస మెఱఁగఁ డనేటి-
పలుకు నీయందే కంటిఁ బదవయ్య చాలును ॥ నేవ ॥

నగేవంటా నుంటిఁగాని నాకుఁ జేయిచాఁచే దెఱఁగ
జిగినే స్తకత్తెనంటాఁ(టఁ?) జెల్లునా నీకు
జగములోన వలపు చవెఱఁగ దన్నమాట
తగవు నీయందే కంటిఁ దలవయ్య చాలును ॥ నేవ ॥

వూరకంటా నుంటిఁగాని వొడివట్టే దెఱఁగను
చేరి దూతికిలఁ గూడఁ జెల్లునా నీకు
అరయ శ్రీవేంకటేశ అట్టె ననుఁ గూడితివి
మేరమీరితివి నీవు మేలయ్య చాలును ॥ నేవ ॥ 169

ముఖారి

ఇంకనేల దూరుమాట లింతేకాక
కొంకుదీర నిన్ను నిట్టె కూడఁగలఁగాక ॥ పల్లవి ॥

తప్పులెంచి నీగుణాలు తగదనేనా । మోము
తప్పకిట్టె నిన్నుఁ జూచి తనిసేఁగాక
అప్పుడు నీ వన్నమాట కాఁగఁబోయేనా । నా-
నొప్పిదీర నీచెక్కు నొక్కఁగలఁగాక ॥ ఇంక ॥

యేమి సేసినాను నిన్ను యెగ్గువట్టేనా
నాముదేర నెలవుల నవ్వేఁగాక
బూమివారివలె నీకు బుద్ధిచెప్పేనా
వేమారు నీపై మేను వేయఁగలఁగాక ॥ ఇంక ॥

పానుపుపై నీతో నింక పంతమాడేనా । నీ-
సోనలమోవితేనెలఁ జొక్కేఁగాక
కానీలే శ్రీవేంకటేశ కాదనేనా । నీ-
మేనుసోఁకినరతుల మెచ్చఁగలఁగాక ॥ ఇంక ॥ 170

భైరవి

చిత్తము వచ్చినట్టు నేఁ జేసేఁగాని
బత్తి గొట్టానఁబెట్టేవు పదరకు చాలును ॥ పల్లవి ॥

నీరువంక తుంగవంటినీమాటలనే మమ్ము
వూరకే మోచి దించేవు వోపఁబో నేను
మోరతోపుఁదనమున ముట్టివచ్చితేఁగనక
గోర గీరితే నేరాను కొంగుముట్ట కిఁకను ॥ చిత్త ॥

మూడిఁజొచ్చి వాతవెళ్లేముడికారితనముల
వోదక పంతమాడేవు వోపఁబో నేను
యేడనైనా వచ్చి నీవు యెన్నికతో బాసగాని
యీడుగానిపనులకు నెమ్మెలు సేయకుమీ ॥ చిత్త ॥

మాయలనే భ్రమయించి మానము చేకొంటి.విదె
వోయయ్య కాలుదొక్కేవు వోపఁబో నేను
యీయెడ శ్రీవేంకటేశ యింతసేసి కూడితివి
పాయము నీకే సెలవు పదిఁ (దిం?) బదిగాను ॥ చిత్త ॥ 171

సామంతం

అండనే నిలుచుంటి నే నప్పుడుగాదా
మెండుకొన్న ఆనలేల మేలుమేలు గాదా ॥ పల్లవి ॥

తొయ్యలి యెవ్వతో నీతొడమీఁదఁ బవళించి
అయ్యెడ నీకు మోవిచ్చె నప్పుడు గాదా
నెయ్యాన నాకుమడిచి నీ వందిఇయ్యఁగాను
పయ్యదకొంగప్పుడు నీపైఁ గప్పెఁగాదా ॥ అండ ॥

చెక్కు చెమరించఁగా నీచే సురటి విసరించి
అక్కరతో నేదదేరె నప్పుడు గాదా
వొక్కపై నీ నెన్నడుము వొక్కచేతఁ గాఁగిలించి
మొక్కె నప్ప దొక్కచేత ముచ్చటాడికాదా ॥ అంత ॥

దిట్టయై తమకమునఁ దేలించి నిన్నుఁ జూచి
అట్టె తెరవేయించె నప్పుడు గాదా
నెట్టన శ్రీవేంకటేశ నీవు నట్లానే
పట్టి నేఁడు గూడితి వాభావమేకాదా ॥ అంత ॥ 172

సాళంగనాట

అప్పటి నాకే వలతు నందువు నీవు
చిప్పిల నావద్ద నేఁడే చెల్లె నీప్రతాపము ॥ పల్లవి ॥

జూటరివై యాకెమోము చూచి చూచి పలికేవు
యేఁటిమతకములౌతా నెవ్వఁ డెఱుఁగు
నాఁటకమేమోకాని నవ్వునవ్వే వేమన్నా
ఆఁటదాని నింతసేసే వౌ నీప్రతాపము ॥ అప్ప ॥

అదె మాయింటికి నాకె నడిగడిగి వచ్చేవు
యెదుటి నీవెడమాయ లెవ్వఁ డెఱుఁగు
చదివి వచ్చితోకాని సరసాలే నెరపేవు
సుదతులకే చూపేవు సొంపు నీప్రతాపము ॥ అప్ప ॥

అకెతో నేకతమాడి అంతలో నన్నుఁ గూడితి
వీకడ నీతమకము లెవ్వఁ డెఱుఁగు
దాకొని శ్రీవేంకటేశ తలఁచుకొంటివోకాని
నీకతలు రతికెక్కె నిండె నీప్రతాపము ॥ అప్ప ॥ 173

పాడి

తడవీ నూరక తగ దనఁడు
.బడిబడి రమణుఁడు పయిపై పీడఁడు ॥పల్లవి॥

మంతన మొకతెతో మాఁటలాడుతా
బంతికిఁ బిలిచీఁ బతి నగఁడు
సంతత మాకెతో సరసమాడుతాఁ
జెంత వీడె మొసఁగీ సిగ్గువడఁడు ॥తడ॥

పానుపున నొకతెపైఁజెఱఁ గంటుచు
లోనికిఁ బలిచీ లోఁగఁ డిదే
ఆనుకొని యాకెయధరము గ్రోలుచు
మానము దొడికెను మాఁటా వినఁడు ॥తడ॥

పురమున నొకసతి నునుచుక కాఁగిట
ధరనుఁ గూడీఁ దడఁబడఁడు
యిరవుగ శ్రీవేంకటేశుఁ డిద్దరిని
సరిగాఁ గూడెనుఁ జాలూ ననఁడు ॥తడ॥ 174

రేకు 1030 దేశాక్షి

ఏలరా యింతవలపు యేమిటాఁతి నే నీకు
సోలి నాపె నొరగేవు చొక్కనాథ లేలే ॥పల్లవి॥

పొలసితే నంతలోనే పొదిగి కాఁగిలించేవు
మొలుఁగించితే తలయెత్తి చూచేవు
తలఁకితే విరహాన దక్కి చీఁకటి దవ్వేవు
నలిరేఁగి దగ్గరితే నవ్వులు నవ్వేవు ॥ఏల॥

చక్కఁ బయ్యెద వెట్టితే చాఁచేవు చేయి సారె
దిక్కులెల్లా సాదించి తెంకిచూపేవు
చొక్కి నే నేదనుండినా చొప్పులెత్తుక వచ్చేవు
పెక్కురతులనే నన్నుఁ బెనఁగఁజొచ్చేవు ॥ ఏల ॥

చేరఁబిలువకే వుంటే సిగ్గయినా విడిచేవు
గారవించినంతలోనే కాలుదొక్కేవు
వోరి శ్రీవేంకటగిరినుండి వచ్చికూడితివి
మేరతో [1] నెలఁదలూరిమేటిచొక్కనాథా ॥ ఏల ॥ 175

సాళంగం

తెలిసెఁగా నీగుణము తేటఁగా మీఁదటికైనా
బలురాజసాలు చూపేపంతము లెఱఁగరా ॥ పల్లవి ॥

వొంటి నేను వేగించఁగా నూరకే యల్లాడ నీకు
కంటికి నిద్దుర వచ్చెఁగా; చెల్లఁబో
నంటున నాతో నీవు నవ్వే(ది?)వనుచు నే-
నుంటిఁగాని యిట్టవుత నొకటీ నెఱఁగరా ॥ తెలి ॥

వెలసి నేఁ బానుపుపై విరహానఁ బొరలఁగా
కొలువు సేయించుకోఁ గోరికాయఁగా
పిలిపించే విటు నాకే వలతు వనుంటిఁగాని
వొలిసినొల్లములెంత వొకటీ నెఱఁగరా ॥ తెలి ॥

అద్దరిపాటుండఁగాను అంతలో విచ్చేసి కూడి
సుద్దులు చెప్పవచ్చేవు సుగుడవౌదు
ముద్దుల శ్రీవేంకటేశ మొరఁగే వనుంటిఁగాని
వొద్దికైతి వింతకతొ ల్లొకటీ నెఱఁగరా ॥ తెలి ॥ 176

---

1. నెందలూరా?

కాంబోది

అనలేలయ్య నీవాడినట్టె ఆడేము
 పూనిననీమనసులో పూఁపక మేదయ్యా ॥ పల్లవి ॥

సన్నల నాకెకు నీకు సాకిరి చెప్పుమనేవు
 అన్నట్టే నీమాట లవిగోవయ్య
 మిన్నక తిట్టే వందుకుమించి వెంగెములంటా
 యిన్నిటా దొరవు నిన్ను నేమనందునయ్యా ॥ అన ॥

అప్పటి మొక్కించుమనే వాకెనే నీముందట
 చెప్పినట్టెల్లా నింకఁ జేసేమయ్యా
 రెప్పవెట్టక చూచేవు రేసు నెరపేనంటా
 దెప్పరాలు నీకునీవే తెలుసుకోవయ్యా ॥ అన ॥

కందువ నీ వెదురేఁగి కాఁగిలించితి వాకెను
 అందరికి వొక్కమన సాయనయ్యా
 అందపుశ్రీవేంకటేశ అంతలో మమ్ము మెచ్చేవు
 విందువంటిమావంక వెలుతు లేవయ్యా ॥ అన ॥ 177

సాళంగం

అదే రాముఁడు సువేలాద్రిపై నిలిచె
 యెదిరితివి సీత యిఁక నేమమ్మా ॥ పల్లవి ॥

దనుజులు వారేరు తలఁకేరు లంకలో
 వనజాప్తకులుఁడు వచ్చెనమ్మా
 వినవచ్చెను కపివీరులయార్పులు
 వెనుకొని పవుఁజులు విడిసెనమ్మా ॥ అదే ॥

కదనములో కుంభకర్ణా(ర్ణా?)ది వీరులు
మదమున బయిపడి మడిసిరమ్మా
చిరమఁగ రావణుచేతులుఁ దలలు
నిదులనెల్లా విన్ను నిండెనమ్మా ॥ అదే ॥

పతి విభీషణునిఁ బట్టముగట్టెనమ్మా
అతఁడు నిన్నుఁ బిలువనంపీనమ్మా
కతగా శ్రీవేంకటగిరిమీఁదను
యితవుగఁ గూడరొ యిపుడేమమ్మా ॥ అదే ॥ 178

మాళవిగౌళ

పూవుటమ్ములు మరుఁడు పూఁచినాఁ దేమరఁడు
రావే నామాఁట విని రవ్వపడనేఁటికే ॥ పల్లవి ॥

వద్దే నీచలము వలపించఁగలము । నీ-
కొద్ది దెలిసినదాఁకా గొంకే మింతే
అద్దో యిటువలె నలిగేవా సెంతలేదు
చద్దికి వేఁడికి నవి సాగ వింతేకాక ॥ పూవు ॥

యింతేలే నీకోపము యిందుకెల్లా నోపము । నీ-
పంతము చూచినదాఁకా పాటించే నింతే
యెంతోబిగువుతోడ యెలయించే దెంతలేదు
సంతతము పతివద్ద జరగదుగాక ॥ పూవు ॥

మానవే నీబిరుదు మాకు నివి యరుదు
నానఁబెట్టి కొంతవడి నవ్వితి నింతే
నేనే శ్రీవేంకటగిరినిలయుఁడఁ గూడితిని
దానికేమి నీకు నాకుఁ దగు లింతేకాక ॥ పూవు ॥ 179

---

త్రికీతగల యక్షరము చిటము దిన్నది.

లలిత

చెలులాల యీమాఁట చెప్పఁగదరే। నే-
•నలసితే తా సొలసీ నది యేఁటిదే ॥ పల్లవి ॥

చేతుల మొక్కితి నేను చెంగావిచూపులు చూచె
యీతల నాతల నాకు నేది దగవే
యేతుల నేఁ బలికితే నింతలోనె నవ్వేఁ దాను
నీతి విచారించి మాఁట నిలుపరే ॥ చెలు ॥

పూరకే నే నుసురంటే నొరగి తాఁ జెమరించె
యీరీతి మాలో నికేది దగవే
కోరి నేఁ గొప్పువట్టితే కొంగువట్టీ నింతలోనె
నేరమేది యీమాఁట నిలుపరే ॥ చెలు ॥

అంగము నే మఱచితే నంతలోనే నన్నుఁ గూడె
యింగితాన నిద్దరికి నేది దగవే
సంగతి శ్రీవేంకటేశు సమరతిఁ గూడితిని
నింగిమోవ సంతసము నిలుపరే ॥ చెలు ॥ 180

రేకు 1031 భైరవి

కటకటా మామాఁట కాదందురా
కుటిలకుంతలివి(లవు?) యీగుణ మేఁటికే నీకు ॥ పల్లవి ॥

చాలుఁజాలు చలము నీకు। పతి నింత
నాలిఁబెట్టుట నాయమా
వాలుఁజూపులు వంచేఁ గదవే। అతనిపై -
నేలే అలుకలు యింతలో నీకు ॥ కట ॥

---

క్రీగీతలు గంవి చిఱమురిన్నవి.

మానగదవె మంకులింకా । పతిగుణము
కానకే కలఁగఁదగునా
ఆనవెట్టె నతఁడు నేఁడు । తప్పదనె
మోనమున పతి కింక మొక్కఁగదవె మగువా ॥ కట ॥

యింకాఁ దగదు యెరవు లింతా । కూడె నిదె
కొంకక శ్రీవేంకటేశుఁడు
వంకలొత్త మాకునేల వడి నీకుఁ బోదు
కంకణము లిద్దరికిఁ గలిగెఁగదె మగువా ॥ కట ॥ 181

సాళంగనాట

పేరఁటాండ్లు వాడరే పెండ్లి వేళ
సారెసారె నిద్దరికి సంతోషవేళ ॥ పల్లవి ॥

చిత్తజుతల్లికి వేగ సింగారించరె మీరు
తత్తరించే రిదె ముహూర్తపువేళ
హత్తి తలఁబాలు నారాయణునిఁ బోయుమనరే
పొత్తుల నిద్దరికిని బువ్వపువేళ ॥ పేరఁ ॥

పాలవెల్లికూఁతురుకు పసపులు నలఁచరే
చాలించరే జోలి వీడు చదివేవేళ
పాలుపడి పరపులు పరచరే దేవునికి
నాలుగోదినము నేఁడు నాగవెల్లివేళ ॥ పేరఁ ॥

అంది బాగాలియ్యరే అలమేలుమంగకును
కందువ శ్రీవేంకటేశుఁ గలసేవేళ
గందమూఁ గస్తూరి నీరె ఘనరతి నలసిరి
కుందక యిద్దరు నిఁకఁ గొలువుండేవేళ ॥ పేరఁ ॥ 182

రామక్రియ

అంత నీవు పంతములు ఆడుకోకు నాయెదుట
సంతవేదాలనీమోవి చప్పరించివేతుఁబో ॥ పల్లవి ॥

మనసు చూచితిఁగాక మంతనాన నీచెఱఁగు
తనివోక నేఁ బట్టితే దాఁటిపోయేవా
మును రామావతారమున మునులలో నీవుండిన -
వెనకటివ్రతమెల్లా విడిపింతుఁబో ॥ అంత ॥

వచ్చేవంటా నుంటిఁగాక వడి నీపైఁ జేయివేసి
కచ్చుపెట్టి చెనకితేఁ గాదనేవా
పచ్చిగాఁ గృష్ణుఁడవై పలుయజ్ఞాలు నేసిన -
మెచ్చులఆచారములు మీఁదుకిందు నేతుఁబో ॥ అంత ॥

యిప్పుదే కూడితిఁగాక యించుకవడి యుండితే -
నప్పటి నే దగ్గరితే నాసమానేవా
నెప్పున శ్రీవేంకటేశ నీవు యోగీంద్రులతోన
కప్పినరతిజడ్డు కమ్మటి మానుతుఁబో ॥ అంత ॥ 183

సామంతం

ఎట్టుండునో నీచిత్త మిదియెల్లా గర్వమంటా
పట్టినపంతమేకాక పచ్చినేయు నేర్తుగా ॥ పల్లవి ॥

నీమోము చూచినంతనే నిలువెల్లా మఱచితి
నేమానఁ బ్రియము చెప్పనేర్తునా నేను
కామించి నీమాఁట విని కన్నులు దేలవేసితి -
నేమైనా వెనకముందు యెంచనేర్తునా ॥ ఎట్టుం ॥

వొద్దికి వచ్చినప్పుడే వొరగితి నీమీఁద
బుద్ధితోడ నీకు మొక్కఁ బొద్దుగలదా
అద్దివో నీవు నవ్వితే నంతలోనే కళదాఁకె
అద్దపునీచెక్కు నొక్కి ఆదరించనేర్తునా ॥ ఎట్టుం ॥

చేయివట్టి తీసితేనే సేసవెట్టితి నంతలో
చాయల నిన్నెదురుకో సందుగలదా
యీయెడ శ్రీవేంకటేశ యింతలోనే కూడితివి
వేయిటికైనా నింక వెలితున్నదా ॥ ఎట్టుం ॥ 184

బౌళి

కానీ కానీ యిఁకనేల కదిసినపనులకు
మానువలె నిగిరించె మాఁటలకే మేను ॥ పల్లవి ॥

కాలుదాఁకితే నేమాయ కాంతల మింతే నేము
మూల నిందిరపాదాలు మోవవా నీవు
లేలే పెద్దరికాలు లెక్కలేవు నీవొద్ద
యీలకూర కుప్పచాల దిందుకేపో నాకు ॥ కానీ ॥

మేను మోచితే నేమాయ మెలుఁత నింతే నేను
మోనాన భూకాంత మేను మోవవా నీవు
పోనీ పోనీ యెవ్వరితో బూటకాలు సేసేవు
నానదాయ గొడ్డ లేమి నవ్వులనే నాకు ॥ కానీ ॥

మోవి మోపితే నేమాయ ముదితలయెంగి లింతే
మోవి నీవు గొల్లెతల మోపవా తొల్లి
భావించి శ్రీవేంకటేశ పైకొని నిట్టె కూడితివి
చేవ గలిగినట్టాయ చిగురందే నాకు ॥ కానీ ॥ 185

శంకరాభరణం

దిమ్మరిమాట లాడీనే తిమ్మరాయఁడు
కొమ్మని వరము లిచ్చీఁ గొండలరాయఁడు ॥ పల్లవి ॥

గద్దెమీఁద నల్లవాఁడే కంటిరటే చెలులాల
పొద్దొకసింగారాలభోగరాయఁడు
యిద్దరుసతులమీఁదా నిమ్ములఁ జేతులు చాఁచి
సుద్దులు చెప్పీఁగదే సుగుడరాయఁడు ॥ దిమ్మ ॥

నిక్కిచూచీ నేఁటికో నెలఁత లదేమనరే
చక్కనిమోవినవ్వులజాణరాయఁడు
వెక్కసపురాజసాన విఱ్ఱవీఁగీఁ గొలువులో
చెక్కులచెమటతోడ చెలువరాయఁడు ॥ దిమ్మ ॥

మెండగుకళలమేనిమెఱుఁగులు చల్లీని
నిండుసరసములకోనేటిరాయఁడు
దండిగా నురముమీఁదితరుణికాఁగిట వాఁడే
వెండిపైఁడిమేడలో శ్రీవేంకటరాయఁడు ॥ దిమ్మ ॥ 186

రేకు 1032 వరాళి

విచ్చేయరాదా వెలఁదికడకు నీవు
యిచ్చ నాసపడువారి నెలయించఁదగునా ॥ పల్లవి ॥

నిలిచి నిలిచి నీకు నిక్కి యెదురుచూచీని
వలచినసతి నీవు వచ్చేవంటా
మలసి మలసి నీమాఁటలే ఆలకించీని
యెలమి నేమని యానతిత్తువో యనుచు ॥ విచ్చే ॥

చిమ్మి చిమ్మి నీయింటికి చేతులే చాఁచీని
తెమ్మల ఆసన్న నీవు తెలుతువంటా
కుమ్మరించి కుమ్మరించి గుట్టు మాని నవ్వీని
పమ్మి నీవు తనకొంగు పట్టుదువో యనుచు ॥ విచ్చే ॥

పూఁచిపూఁచి నీవద్దికి పొఅఁతుల నంపీని
యేఁచక నీ విప్పుడిట్టె యేలుదువంటా
రేఁచి రేఁచి వలపులు రేసువాయఁ గూడితివి
దాఁచెను శ్రీవేంకటేశ తమక మేలనుచు ॥ విచ్చే ॥ 187

సామంతం

నగుఁబాటు లివిగొన్ని నడపేవుగాక యీ -
అగడుఁజేఁతలు సేసి ఆడిక కెక్కుదురా ॥ పల్లవి ॥

మగువనే కట్టుకొంటి మంగళసూత్రము గాను
యెగసక్కెలగొల్లెత లేమందురో
జగములో నెవ్వరైనా సతులకుఁ బురుషులు
తగఁ గట్టుదురు గాక తాము గట్టుకొందురా ॥ నగుఁ ॥

ఆకెపుట్టినిల్లే నీకు నాకరము సేసుకొంటి -
వీకడఁ బోఁ(బొం?)దైనసతు లేమందురో
యేకమై తమసతుల యిల్లు నించుకొంటగాక
యేకడా ఘనులైనవా రిల్లిటము లుందురా ॥ నగుఁ ॥

అలమేలుమంగవల్ల నన్నిసిరులూ నందితి -
విల నీకూటపుసతు లేమందురో
కలవి శ్రీవేంకటేశ కాంతల కిత్తురు గాక
అలరి సతులసొమ్ము కాసపడఁజూతురా ॥ నగుఁ ॥ 188

లలిత

చిత్తజగురుఁడ నీకు శ్రీమంగళం । నా -
చిత్తములో హరి నీకు శ్రీమంగళం ॥పల్లవి॥

బంగారుబొమ్మవంటిపడఁతి నురముమీఁద
సింగారించిననీకు శ్రీమంగళం
రంగుమీరఁ బీతాంబరము మొలఁగట్టుకొని
చెంగలించేహరి నీకు శ్రీమంగళం ॥చిత్త॥

వింతనీలములవంటివెలఁది నీపాదముల -
చెంతఁ బుట్టించిన నీకు శ్రీమంగళం
కాంతులకౌస్తుభమణి గట్టుక భక్తులకెల్లాఁ
జింతామణివైననీకు శ్రీమంగళం ॥చిత్త॥

అరిదిపచ్చలవంటియంగన శిరసుమీఁద
సిరులఁ దాల్చిననీకు శ్రీమంగళం
గరిమ శ్రీవేంకటేశ ఘనసంపదలతోడి -
సిరివర నీకు నిదె శ్రీమంగళం ॥చిత్త॥ 189

మంగళకౌశిక

వద్దువద్దు నవ్వ కలవాటయ్యీ నేఁడు
బుద్దులు చెప్పకు నీవు పులకించీ నాకు ॥పల్లవి॥

యెదురైతి మిద్దరము నేమనే విఁక నీవు
పొదుగ కానతీరాదా పోవలె మాకు
పదరి పయ్యదకొంగు పట్టకు మంతేసి నీవు
చెదరీ కురులు మేను చెమరించీ నాకు ॥వద్దు॥

ఆయఁ గన్నులఁ జూచితి మంతేచాలు మాకు
పోయి రమ్మనఁగరాదా పొద్దున మమ్ము
చేయివేయ కంత నీవు చిత్తమొకలా గయ్యీని .
ఆయములు సోఁకి సోఁకి యాసలు రేఁచీని ॥ వద్దు ॥

మాటలాడితిమి చాలు మరి యేమిగావలె
నేఁటనే తప్పెనా మాకు నిండెఁ గూరిమి
గాఁటపు శ్రీవేంకటేశ కరుణించి కూడితివి
ఆఁటదాన నింతే నేను అలయికయ్యీని ॥ వద్దు ॥ 190

శ్రీరాగం

విరహ మొక్కందమాయ విచ్చేయవయ్యా
నిరతి నాకెఁ జూచి నీవంటా మొక్కితిమి ॥ పల్లవి ॥

చెక్కిటిచెయ్యే చెలికి శేషపరియంక మాయ
జక్కవచన్నులు శంఖచక్రము లాయ
వుక్కచెమటే జలధి వునికిసేసుక నిన్నుఁ
జక్కనిసతి దలఁచి సారూప్య మందె ॥ విర ॥

చలువకస్తూరిపూఁత సరి నీలవర్ణ మాయ
మెలుఁతనివ్వెర గనిమిషదృష్టాయ
తొలుత చిగురుపాన్పు తులసిపూజాయ నిన్ను
జలజాక్షి తలపోసి సారూప్య మందె ॥ విర ॥

సిరులఁ గట్టినతాళి శ్రీధరభావ మాయ
వరుస వలపు భక్తవత్సల మాయ
యిరవై శ్రీవేంకటేశ యింతలో నీవు గూడఁగా
సరుస నిన్నంటినాకె సారూప్య మందె ॥ విర ॥ 191

శంకరాభరణం

వలసినప్పుడు నేనే వచ్చేఁగాని
.చలివేఁడిసరసాలు చాలుఁజాలు నేలయ్య ॥ పల్లవి ॥

అంటిఁబో మాతెరువురా కాకెవద్ద నుండుమని
నంటున నూరకె మాతోనవ్వేవుగాని
యింటికేల వచ్చితివి యెన్నటి కెన్నటిపొందు
రంట దెప్పరములేల రాకురాకు పోవయ్యా ॥ వల ॥

సెలవిచ్చితిఁబో నీకు చెల్లినట్టె సేయుమని
వెలినుండే నన్ను గారవించేవుగాని
అలుకేల తీర్చేవు అనలేల పెట్టేవు
బలువుఁడ వన్నిటాను పదపద యిఁకను ॥ వల ॥

మొక్కితిఁబో యిప్పుడిట్టె మోహించి కూడినందుకు
చెక్కునొక్కి నన్ను అట్టునేసేవుగాని
అక్కరతో శ్రీవేంకటేశ ఆయము లేలంటేవు
చొక్కితి నన్నిటా నన్నుఁ జూడుచూడు మిఁకను ॥వల॥ 192

రేకు 1033 ముఖారి

నాఁడే కన్నదిగాదా నవ్వేఁగాక
నేఁడు నిన్నాడఁగఁబోతే నేర మింతేకాక ॥ పల్లవి ॥

మనసువచ్చినఁగాక మాటలు విన నింపౌనా
పనిమాలినట్టివట్టిపరాకేకాక
యెనసివుండినఁగాక యేకతము లింపౌనా
తనివోనిదానఁగాన దగ్గరేఁగాక ॥ నాఁడే ॥

యిచ్చగలిగినఁగాక యింటికిరా నింపౌనా
పెచ్చుపెరిగి వూరకే పిలిచేఁగాక
నిచ్చఁ గూడుండినఁగాక నెయ్యములు సతమవునా
పచ్చిసేసి నిన్నుఁ గడుఁ బైకొనేఁగాక ॥ నాఁడే ॥

కాఁకలు రేఁగినఁగాక కన్నులఁ జూడనింపౌనా
తాఁకుమాఁ కెఱఁగక వాతప్పితిఁగాక
యేఁకట శ్రీవేంకటేశ యెఱిఁగి కూడితివిట్టె
తేఁకువ యిదేకాదా తెలియలేఁగాక ॥ నాఁడే ॥ 193

రామక్రియ

వెన్న పేసినట్టివారి వెస రాతవేసినట్టు
యెన్నికలు మీరి వచ్చీ నేమందు నితని ॥ పల్లవి ॥

చిగురుఁబెదవి వంచి నెలవినవ్వులు ముంచి
తగినమాటాడితిని దాఁచితినటే
మొగమెత్తనైతినంటా మోము చూడనైతినంటా
జగడాలకే వచ్చీ సారెకు నిదేమే ॥ వెన్న ॥

తొలుతనే కానుకిచ్చి తొంగలిరెప్పలు విచ్చి
కొలువులో నే నుంటిఁ గొంకితినటే
అలరి దగ్గరనంటా నంది విడె మియ్యనంటా
అలుకమోమున నున్నాఁ డౌనౌనే తాను ॥ వెన్న ॥

చిత్తమెల్లా నీరై చెలులలో దూరై
తత్తరించి కలసితి తక్కితినటే
అత్తిన శ్రీవేంకటేశుఁ డట్టె మఱచితినంటా
వొత్తి గోర నెచ్చరించీ నోయమ్మ తాను ॥ వెన్న ॥ 194

శంకరాభరణం

పట్టినపంతమె బలువనవే
చుట్టపువరుసలు చూచితిననవే ॥ పల్లవి ॥

తానూఁ జూచెను తనువూ నాఁటెను
కాసీకాసీ కద్దనవే
నానితిఁ జెమటల నవ్వుల మునిఁగితి
పూని యిద్దరికిఁ బోదనవే ॥ పట్టి ॥

మారు మాఁటాడెను మనసున నిలిచెను
ఆరీఁ దేరీ నవుననవే
తీరవు పులకలు తెగదిది తమకము
భారము దనపైఁ బడెననవే ॥ పట్టి ॥

కాఁగిటఁ గూడెను కళలను గరఁగితి
దాఁగనేల యిఁకఁ దగుననవే
వీఁగనైతి శ్రీవేంకటపతి రతి
చేఁగదేరె నిఁకఁ జెల్లుబడనవే ॥ పట్టి ॥ 195

పాడి

ఇంతినే తప్పకచూడు మిందే ఇన్నిఁ గానవచ్చీ
వంతువాసుల నేమేల వాదించేమో కానీ ॥ పల్లవి ॥

చెలియవిరహమెల్లా చెక్కుచేతనే వున్నది
వెలయ నేమేల విన్నవించేమో కానీ
నెలకొన్నతమియెల్లా నిలువుననే తోఁచీ
కెలసి యేమని యెఱిఁగించేమోకానీ ॥ ఇంతి ॥

కమలాక్షిమోహమెల్లా కనుచూపుల నున్నది
అమరని మాఁటలేల ఆదేమోకానీ
జమళికాఁక లవెల్లా చల్లుఁజెమట నున్నది
తమితో నేమేల యెడతాఁకేమో కానీ ॥ ఇంతి ॥

ముదితకూటములెల్లా మోముకళనే వున్నది
చెదర నిన్నేల కలఁచితిమోకానీ
యెదుటనే శ్రీవేంకటేశ కూడితి విప్పుడే
యిదె మాసతిని యేల యెఱుఁగమోకానీ ॥ ఇంతి ॥ 196

సామంతం

చూడరమ్మ చెలులాల సుదతి చక్కఁదనాలు
కూడుకొన్నపతికాంతిఁ గురుతే పోలెను ॥ పల్లవి ॥

మొగము చందురుఁ బోలె మించినయీయిందిరకు
తగినతోడఁబుట్టు గా(నా?)తఁడే కనక
నగ వమృతముఁ బోలె నలినాక్షి కదియును
తగినపుట్టినయింటిధనమే కనక ॥ చూడ ॥

సతిగుణమింతాను సముద్రమునే పోలె
తతి నాతఁ డీకెకు తండ్రిగనక
మితిగాఁ గన్నులు గండుమీనములఁ బోలె నవి
గతి గూడి తమవారికడవేకనక ॥ చూడ ॥

తరుణిపాదాలు కల్పతరువుచిగురుఁ బోలె
పరగఁగఁ దనవెనుబలమంటాను
గరిమ శ్రీవేంకటేశుఁ గైకొని పెండ్లాడి యీపె
సరవు లాతనిఁ బోలె సరసుఁడంటాను ॥ చూడ ॥ 197

శంకరాభరణం

మెచ్చితి నిన్నిటాను మేలురా నీవు
రచ్చకెక్కె వలపులు రారా నీవు ॥ పల్లవి ॥

చిప్పిల నీదేహమెల్లాఁ జెమరించఁగఁ జేసితి -
నప్పటి నాదేవు బీరా లౌరా నీవు
వుప్పతిల్లఁ జొక్కించి వూదితి నీమేన గోరు
యిప్పు డేమో తాఁకెననే వేరా నీవు ॥ మెచ్చి ॥

యింతరాజసపునిన్ను యింటికి రప్పించితి
వంతులు వాసులు నెంచేవు వద్దురా నీవు
చింతమోము కళదేర సెలవుల నవ్వించితి
మంతనాలు మఱఁగులు మానరా నీవు ॥ మెచ్చి ॥

యిట్టె కాఁగిటఁ గూడి యిన్నిటాను మెప్పించితి
పట్టినచలము చెల్లెఁ బదరా నీవు
వొట్టుగా శ్రీవేంకటేశ వొక్కటయితి మిద్దరము
మెట్టుకొన్నదొర వవుదు మేలురా నీవు ॥ మెచ్చి ॥ 198

రేకు 1034 రామక్రియ

దగ్గరినప్పుడే అన్నీఁ దారుకాణించే నేనే
సిగ్గుతో నుండుటేచాలు చెప్పితి నే ననవే ॥ పల్లవి ॥

తా నాడ నే నీడ తమకించఁ బనిలేదు
నానఁబెట్టీ తా వలపు నవ్వితిఁబోవే
నే నటు వచ్చేనంటే నెలఁత లెవ్వరుఁదురో
మోనాన నుండుటే మేలు మొక్కితి నే ననవే ॥ దగ్గ ॥

మాట లిందు మన సందు మగుడించఁ జోటులేదు
నాటువేసీ ననుపులు నయమేలేవే
యీటుగా సతి నంపితే నెవ్వ రేమిబోదింతురో
మేటిగుట్టు చాలు నింక మెచ్చితి నే ననవే ॥దగ్గ॥

కాఁగి లిదే కందు విదే కాదుగూడ దనరాదు
పాఁగితిఁ దనరతులఁ బదపదవే
దాఁగి శ్రీవేంకటేశుఁడు తానే వచ్చి నన్నుఁ గూడె
చేఁగదేరె మీఁదటికి చిత్తగించు మనవే ॥దగ్గ॥ 199

బౌళి

వద్దు వద్దు నీ కింతేసివట్టిసొలపు
సుద్దులు చెప్పఁగఁబోతే సూటిఁబడ దిఁకను ॥పల్లవి॥

నగితిఁ జాలదా నీతో నాలోఁ గోపించుకొనక
మగుడిఁ గమ్మటి నీవే మమ్ము దూరేవు
మొగమోడితిఁ జాలదా మొక్కలీఁడ [1]నియ్యేడకు
వొగరులాడ వచ్చేవు వోపము నే మిందుకు ॥వద్దు॥

మాటాడితిఁ జాలదా నే మారుమోము సేసుకోక
నీటున నప్పటి నీవే నేర మెంచేవు
చాటువఁ బేరుకొంటిని చాలదా నిన్నిందరిలో
తేటతెల్లమాయఁ బని తెలిసితి మిపుడే ॥వద్దు॥

పూరకుంటిఁ జాలదా వొంటి నన్నుఁ జెనకఁగ
కేరడాల నీవు నన్నుఁ గెరలించేవు
ఆరితేరి శ్రీవేంకటాధిప కూడితి విట్టె
చేరె నీపంతములెల్లాఁ జింతలేల యిఁకను ॥వద్దు॥ 200

1. నీ+యెడకు. ఈవాఙ్మయములో ఇదియొక వింతత్రికసంధి

గౌళ

ఎట్టుగూడెఁ బెండ్లియోగ మిద్దరికి నీవేళ
అట్టె లక్ష్మినారాయణయోగము ॥ పల్లవి ॥

నెలఁత కమలవాసి నీవు కమలాక్షుఁడవు
పొలఁతికి నీకుఁ గూడె పొంతనాలు
వలుదచక్రవాకాలు వనితకుచాలు నీవు
యెలమిఁ జక్రాయుధుఁడ విద్దరికిఁ దగును ॥ ఎట్టు ॥

తరుణి నీలకుంతలి(లః) తగునీలవర్ణుఁడవు
సరుస మీకే తగు సమ్మంధము
నిరతి హేమవర్ణాకె నీవు పీతాంబరుఁడవు
సరవి నిద్దరి కొక్కజాతియ్యము ॥ ఎట్టు॥

పాలవెల్లిఁ బుట్టె నాకె పాలవెల్లి యిల్లు నీకు
మేలుమేలు యిద్దరికి మేనవావి
యీలీల శ్రీవేంకటేశ యింతి నీవు గూడితివి
సోలి మాకుఁ బెట్టరాదా సోబనవిడేలు ॥ ఎట్టు ॥ 201

సామంతం

ఎప్పటివాఁడవేయంటా యెనసి మాటాడితిని
తప్పు నే నెఱుఁగనైతి తలఁపులో నుందును ॥ పల్లవి ॥

సెలవి నే నవ్వితేనే సిగ్గువడే వింతలోనే
కలిగెనో నీవాళ్ళఁ గల్లయేమైనా
తొలఁగక యీసుద్ది తొలుతనే చెప్పవద్దా
కొలఁదితో నీగుణాలు గుట్టునేతు నపుడే ॥ ఎప్ప ॥

తప్పక నేఁ జూచితేను తలవంచే వింతలోనే
చెప్పరాక నేసితివో చేఁత లేమైనా
అప్పుడే నే నెఱిఁగితే నంత నిన్నుఁ బచ్చిసేయ
తొప్పఁదోఁచి యిందరిలో దొరఁ జేతు నిన్నును ॥ ఎప్ప ॥

గక్కున నేఁ గూడితేను కన్నులు దేలవేసేవు
మొక్కల మేమైనా నీపై మోచెనో మాట
చక్కని శ్రీవేంకటేశ సంతమయితి వప్పుడే
వెక్కసాలు మానితేను వెంగెమాడ నిన్నును ॥ ఎప్ప ॥ 202

దేసాళం

ఇన్నిసుద్దులును వింటి మింకా రాఁడా
యెన్నిక కెక్కించేఁగాని యింకా రాఁడా ॥ పల్లవి ॥

కాంతునిఁ బిలువనంపి కడవాకిటనే వుండి
యింతి యెదురుచూచీని యింకా రాఁడా
చింతతో మెయి చెమరించె చెక్కులెల్లాఁ బులకించె
యెంతలేదు తనగర్వ మింకా రాఁడా ॥ ఇన్ని ॥

అప్పసము తనతో నేనమ్మ విడె మంపేనంటే
యిప్పుడే వచ్చేననె యింకా రాఁడా
ముప్పిరి నిటూర్పు మూఁగె ముదితమై కాఁకరేఁగె
ఇ(ఎ?)ప్పటివలె నుండునా ఇంకా రాఁడా ॥ ఇన్ని ॥

కందువపానుపుమీఁద కాచుకున్నది లేమ
ఇందరుఁ బిలువఁబోరే ఇంకా రాఁడా
అందపుశ్రీవేంకటేశుఁ డంతలో విచ్చేసికూడె
ఇందుఁ గొలువుచావడి కింకా రాఁడా ॥ ఇన్ని ॥ 203

పాడి

తొలుతనే లోనైతి తొక్కుమె ట్లిఁకనేల
బలిమిసేయఁబోతేను పట్టరాదు పాయము ॥ పల్లవి ॥

చేయివేయకుమీ నీవు చెమరించె నామేను
ఆయములు దాఁక మాటలాడఁగాను
మోయనీకుమీ గోరు ముంచుకొనెఁ బులకలు
ఆయెడ నీమేన నివి యంటీఁజుమ్మీ ॥ తొలు ॥

కొంగువట్టి తియ్యకుమీ గుబ్బతిలీ నూరుపులు
ముంగిటనుండి తప్పక మోము చూడఁగా
నింగిమోవ నవ్వకుమీ నిలువెల్లాఁ గాకరేఁగె
సంగడి నా ప్రేమ నిన్ను జట్టిగొనఁ జేసును ॥ తొలు ॥

కాఁగిట బిగించకుమీ కళవట్టె నిదె నాకు
రేఁగిరేఁగి వలపులు రేఁచఁగాను
యేఁగివచ్చి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
పాఁగిననాయధరము పచ్చాయ నిదివో ॥ తొలు ॥ 204

రేకు 1035 శంకరాభరణం

తగుదువమ్మ నీ వందపుమరుతండ్రికి
మొగిఁ దచ్చినమృతము మోవి నుందిగాన ॥ పల్లవి ॥

కోమలి నీజవ్వనము కొలఁదిపెట్టఁగరాదు
ప్రేమమున మీఁదమీఁదఁ బెరిగీఁగాన
ఆమని నీసింగార మంతఇంత యనరాదు
వేమారు నీచూపు వెల్లివిరిసీఁ గాన ॥ తగు ॥

తొయ్యలి నీవొరపులు తులదూఁచి చెప్పరాదు
నెయ్యపునీతురు మిదె నిక్కఁగాన
చయ్యన నీసొబగు లిచ్చట నియమించరాదు
అయ్యెడ నీపిఱుఁదున కలవిలేదుగాన ॥ తగు ॥

వనిత నీభావ మిఁక వర్ణించిపలుకరాదు
కొన నీసాదములు చిగురులుగాన
తనరునీభాగ్యము తలఁచ నలవిగాదు
ఘనుఁడు శ్రీవేంకటేశుఁ గలసితిగాన ॥ తగు ॥ 205

రామక్రియ

వలవనిజోలింక వద్దనరే । తన -
తలఁపులోన నేఁ దగిలితిని ॥ పల్లవి ॥

పిలువరె పిలువరె ప్రియునీ । తా -
నలిగి యలిగి కడ నరిగీని
తెలిసినవే తనతెగువలూ । నే
నలుగడ నిందుకు నవ్వితినే ॥ వల ॥

అడుగరె యడుగరే యతనీ । నేఁ
దొడరిపట్టినాఁ దొలఁగీని
విడువుమనవె తనవిద్యలూ । తా
బడిబడి నిందుకె భ్రమసితినే ॥ వల ॥

తలఁగరె తలఁగరె దగ్గరీ । నేఁ
గలసిన తా నిఁకఁ గాదనునా
అలరెను శ్రీవేంకటాధిపుఁడూ । నా -
యిలు చొచ్చి కలసె నెఱిఁగితి నేను ॥ వల ॥ 206

ముఖారి

అనుమానానకు నోపనపుడు నేనూ
తనివోని నీతలఁపు తలపోసుకొమ్మా ॥ పల్లవి ॥

పిలిచేవు సారెసారెఁ బెదపెదయెలుఁగున
నెలవుల నీమాఁట నిక్కమావోయి
వెలయ నన్నే యవునో వేరొకతెనేనంటానో
తెలియఁజూతువుగాని దిష్ట మిటురమ్మా ॥ అను ॥

చూచేవు దవ్వులను సూటిఁబడ్డచూపులను
యేచి నే నమ్మేదునా యిదైనా నోయి
కాచి యిదేపనో నీకు కాక తాళనాయమో
ఆచెంతే విచారింతు పంద కిటురమ్మా ॥ అను ॥

కూడితివి కాఁగిటను కూరిమి చేతులు చాఁచి
జాడతో నీకిఁక నేనే సతమా వోయి
వేడుక శ్రీవేంకటేశ వింతలాయ నీచేఁత
జాడతో నీమోవితేనెచవి యింకా నిమ్మా ॥ అను ॥ 207

సౌరాష్ట్రం

ఎంతవేగిరకాఁడే యేమే వీఁడు
కాంతరో తాఁ జెప్పితేను కాదనేనా నేను ॥ పల్లవి ॥

నొడిగినమాఁట నోటిలోనే వుండఁగాను
తొడిఁబడ నామోవి దొమ్మి సేసీనే
విడుముడిఁ జేసన్న చేతిలోనే వుండఁగాను
అడరి పైకొని నన్ను నలమీనే వీఁడు ॥ ఎంత ॥

తలఁపులో మనసు తనువులో నుండఁగాను
కళవట్టించి చొక్కించి కాకునేసీనే
చలిమిఁ బయ్యదకొంగు చన్నులపై నుండఁగాను
చిలుకుగోర నూఁది చిన్నలునేసీనే ॥ ఎంత ॥

పట్టినట్టికాఁగిలి పట్టినట్టే వుండఁగాను
బెట్టుగఁ బెక్కుబందాలఁ బెనఁగీనే
యిట్టె శ్రీవేంకటేశుఁ డింతనేసి నన్నుఁ గూడె
అట్టె తా నెంతయినా నలయఁడే వీఁడు ॥ ఎంత ॥ 208

పాడి

నేనెఁగా దైవము నీచేతిమీఁదుగా నేఁడు
వేసితిఁగా పైఁజేయి వింతలేమీ నెంచక ॥ పల్లవి ॥

వొంటి నేను రాతిరెల్లా వొక్కతెనే వుండినాను
కంటిఁగా వేగైనా నిన్నుఁ గన్నులెదుట
దంటవై నీ వెంత మతిఁ దలఁచకుండినా నేనే
వుంటిఁగా నీవద్ద వచ్చి వున్నవేమీ నెంచక ॥ నేనెఁ ॥

పాడిపంతాలను నీవు పరాకుతో నుండినాను
ఆడితిఁగా నీతో మాట లప్పుడే నేను
యీడుగాని సతులతో నెగసక్కెలు నేసినా
కూడితిఁగా నీమతానఁ గోపగించుకొనక ॥ నేనెఁ ॥

పాఁగినచెమట నెంతపచ్చయి నీవు వచ్చినా
కాఁగిలించితిఁగా నిన్ను గక్కన నేను
వీఁగనిరతుల శ్రీవేంకటేశ కూడితివి
దాఁగనేల ఇదె నీకె దక్కెఁగా చలము ॥ నేనెఁ ॥ 209

సాళంగం

[1] వద్దు వద్దు మమ్ము నీవు వట్టిజోలిఁ బెట్టనేల
సుద్దులనే తనిసి నేఁ జొక్కివున్నదానరా ॥ పల్లవి ॥

మాఁటలు నెఱఁగవచ్చు మరి కొండ మోవవచ్చు
మేఁటిదొరవు నిన్నైతే మెప్పించరాదు
దూఁటు కెఁ(కెం?)దైనాఁ దూరి తోఁచినందే వుండవచ్చు
ఆఁటదాన నిన్ను నొఁగాదనలేనురా ॥ వద్దు ॥

ఆకస మందుకోవచ్చు అరుల సాదించవచ్చు
నాకు నీతో నింతేసి నవ్వరాదురా
వాకుగా జలది(ధి?) గట్టవచ్చు మాయచూపవచ్చు
పైకొని నిన్నొకయింత పలికించరాదురా ॥ వద్దు ॥

అట్టయి తిరుగవచ్చు జాతరూపు గావచ్చు
యిట్టె నీరతులమేలు యెంచరాదురా
నెట్టన శ్రీవేంకటేశ నీకు వలవఁగవచ్చు
పట్టినచలాన నిన్నుఁ బాయరాదురా ॥ వద్దు ॥ 210

రేకు 1036 సామంతం

అండకేఁగి బుజ్జగించి యడుగవయ్యా
కొండలరాయఁడ ఇది కోపమో సంతోసమో ॥ పల్లవి ॥

చిక్కనినవ్వులు నవ్వి చెలియ నెమ్మోము చూచె
యెక్కువ తక్కువ నీమై నేమిచూచెనో
మొక్కుమొక్కి యంతలోనే మోనానఁ దలవంచె
తక్కరినీచేఁత లేమిదలఁచుకొనియెనో ॥ అండ ॥

1. ఇందు దశావతారసమన్వయము గలదు.

మాటలాడి మాటలాడి మంతనాన సన్న సేసె-
నేఁటికి గుట్టువెట్టెనో యెంతమర్మమో
కూటువ నీవద్దనుండి గోరఁ జెమటలు మీటె
గాఁటముగ నీవు సేసేకాఁకల నలసెనో ॥ అంద ॥

చేయిచాఁచి చెంగలించి నిన్నుఁగూడె
చాయల నీచన వెంత సతి నమ్మెనో
పాయపుశ్రీవేంకటేశ పసగానే కూడితివి
కాయమును కడుఁజొక్కి కళలేదఁ దాఁకెనో ॥ అంద ॥ 211

## శంకరాభరణం

ముట్టకు ముట్టకు మొక్కేను
చుట్టపువరుసల చూపులె చాలు ॥ పల్లవి ॥

నెయ్యము నీతో నెరపఁగఁ గుచములు
అయ్యెడ జగడము లడిచీని
వొయ్యనె చెనకకు వొమ్మదు మాకిది
ముయ్యెడ మాటల ముచ్చటె చాలు ॥ ముట్ట ॥

నంటున నీతో నవ్వఁగఁ జూపులు
పెంటల నూరక బెదరీని
వొంటదు యింతేసి కోపము నే మిటు
జంటలఁ బైపైసరసమె చాలు ॥ ముట్ట ॥

కాఁగిట నే నిటు కలయఁగఁ గలయఁగ
మాఁగి నాతనువు మఱచీని
ఆఁగుచు శ్రీవేంకటాధిప కూడితి
మూఁగి చవిగొనేటిమోవులె చాలు ॥ ముట్ట ॥ 212

ముఖారి

చెలువుఁడు వచ్చె వీఁడె సింగారించరే వేగ
చెలియకుఁ దమకమే చిత్తములో నిండెను ॥ పల్లవి ॥

తుమ్మెదలఁబోలేటితొయ్యలితురుమునకు
సమ్మతిఁ దామెర లీరే సంపెఁగలేల
కొమ్మకలువకంటికిఁ గూడుఁ జంద్రగావిచీర
బొమ్మదు వుదయరాగ మొద్దేలే యిపుడు ॥ చెలు ॥

మగువసింహమధ్యకు మలయజ మలఁదరే
మృగమద మియ్యకురే మెచ్చుగా దేల
అగుఁ గొలఁకులపెండె మటు కరియాన కీరే
మొగపులసింహాలమొలనూ లేల ॥ చెలు ॥

యిదె పికవాణి విడె మిచ్చి యాకు మడి చీరే
చెదరుఁబన్నీటితోడి చిత్తడి యేల
యెదుట శ్రీవేంకటుఁ డింతలో విచ్చేసి కూడె
యిది యది యని యెంచ నిఁకనేల ॥ చెలు ॥ 213

రామక్రియ

అలిగితినా నీతో నలసి నే నుంటి నింతే
యెలమి నీవు రాఁగా నే నెదురురాకుందునా ॥ పల్లవి ॥

నీ మోము చూచి చూచి నివ్వెరగందితి నింతే
యేమాటకైనా నుత్తర మియ్యకుందునా
కామించి నీమేను సోఁకి కళవట్టి వుంటిఁగాక
నామతి నీచేఁతలకు నగకుందునా ॥ అలి ॥

చేతికి వీడె మియ్యఁగాఁ జెమరించి వుంటిఁగాక
ఘాతలఁ గాఁగిలించక కడనుందునా
బూతుల నన్నుఁ దిట్టఁగఁ బులకించి వుంటి నింతే
కాతరాన మోవి ఇచ్చి కాఁకసేయకుందునా ॥ అలి ॥

సరుగ నీవు గూడఁగ సమ్మతించి వుంటి నింతే
గరిమఁ జిత్తమురా మొక్కకవుందునా
ఇరవైన శ్రీవేంకటేశ నీరతుల నేను
మరిగి మెచ్చితిఁగాక మరి జోలిసేతునా ॥ అలి ॥ 214

సాళంగనాట

దొరతోఁ బొందుసేసిన తొయ్యలుల కేది వాటు
నెరపిననిజమే నిష్ఠూరముగా ॥ పల్లవి ॥

పేరుకొని పిలిచేవు పెదమొకము వెట్టేవు
యేరా నీవు సేసేవి యేఁటిచేఁతలు
చేరువకు రారాదు చెంగిచెంగి పోరాదు
సారె సారె చలివేఁడి చల్లేవుగా ॥ దొర ॥

పకపక నవ్వేవు పలికితే మానేవు
యెకసక్కేలేలివి మాతో యింతయేలరా
వెకలివై మీరరాదు వేసారుకొనఁగరాదు
వొకటఁ జేదునుఁ దీపు వునిచేవుగా ॥ దొర ॥

పానుపునఁ గూడేవు పరవశము నందేవు
మానవు గా యిటువంటిమాయలు నాతో
సోనగా శ్రీవేంకటేశ చొక్కించితివి రతుల
కానఁగానే పాలు నీరూఁ గలపేవుగా ॥ దొర ॥ 215

నాదరామక్రియ

కానీ కానీలేవే కలికీ । నే
పూని నీతోఁ బలికితే పూఁచి నీవు నగరా ॥ పల్లవి ॥

మాఁట చెప్పే రావే మగువా । ఆ-
మాఁటలు నే నెఱుఁగుదు మానరా నీవు
యేఁటికె యీబిగువులు యిట్టే వుండీనా । నీ-
చోటికిఁ గిందుపడితే చూపి నీవు నగరా ॥ కానీ ॥

పనిగద్దు రావే పడఁతీ । ఆ-
పనులు నే నెఱుఁగుదు పదరా నీవు
పెనఁగకువే నాతోఁ బెక్కుమారులూ । నా-
మనసు మెత్తనిదైతే మరి నీవు నగరా ॥ కానీ ॥

కాఁగిలించే రావే కాంతా । తొల్లె
కాఁగిటనే వున్నదానఁ గదరా నేను
ఆఁగి యిందాఁకా నేల అంటివే నీవూ । నీకు
వీఁగితి శ్రీవేంకటేశ వికవిక నగరా ॥ కానీ ॥ 216

రేకు 1037 వరాళి

మించె మందెమేళములు మేలుమేలు[1] నే
కొంచ కింత వలపించుకొంటి విది మేలునే ॥ పల్లవి ॥

మాన కిట్టిదొరపాటిమగనితోఁ గొంకులేల
మేనిమీఁద నొరగేవు మేలుమేలునే
సానఁబట్టినచూపులు చల్లిచల్లి యేఁటికైనా
ఆనవెట్టేవు నీపై నది మేలునే ॥ మించె ॥

---

1. 'మేరేనే' అను పఠుకుబడి కావచ్చు.

పక్కనను రాజసపుఁబతితో మేలములాడి
మిక్కిలిఁ బెనఁగే విది మేలుమేలునే
చిక్కనినవ్వులు నవ్వి చేతి కాకుమడిచిచ్చి
నిక్క నీమోవి నందుకొనేవు మేలుమేలునే ॥ మించె ॥

దార కానఁ గొంగువట్టి దంతపుటింటికిఁ దీసి
మేర గదెవెట్టుకొంటి మేలుమేలునే
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతటివానిఁ గూడి
సారె నుర మెక్కితివి చనవిది మేలునే ॥ మించె ॥ 217

గౌళ

పూఁచిపట్టి యీయింతిఁ బొగడరమ్మా
కోఁచక మేఘములోనిక్రొమ్మెఱుఁగువలెను ॥ పల్లవి ॥

చెమటఁ గస్తురిబొట్టు చెదరి చెక్కుల జారీ-
నమరఁ బోలుచరమ్మ అంగన కిది
తమితోడ నీపె ముందె దంతియానగనక యీ-
సమయావ మదములు జారినట్లున్నవి ॥ పూఁచి ॥

కలికి కొప్పుననుండి కమ్మనివిరులు రాలీ
చెలఁగి యేమనవచ్చుఁ జెప్పరే యమ్మ
పొలఁతి లతాంగిగాన పువ్వులు నిలువునను
జలజలరాలినట్టిసంగతాయ నిదివో ॥ పూఁచి ॥

కాఁగిట శ్రీవేంకటేశుఁ గమ్మకొని విఱ్ఱవీఁగీ
పాఁగినయీభావములు పలుకరమ్మా
దాఁగక కలువయునుఁ దామరయుఁ బెనగొవి
మూఁగినపరిమళము ముంచినట్లున్నవి ॥ పూఁచి ॥ 218

ఆహిరి

తానే యెఱుఁగు నాతనువే యెఱుఁగును
వీనులారఁ దనతో నే విన్నవించేదేమే ॥ పల్లవి ॥

ముంచినది విరహము మోచినది జవ్వనము
చుంచునఁ బతి నేమని సొలసేనే
వంచినది నాశిరసు వాడినది నామోము
యెంచఁగ నామే నిట్లయ్యీ నెందుకు వగతునే ॥ తానే ॥

పుట్టినది తమకము పూఁచినవి పులకలు
యిట్టె తనకుఁగానే యేమిసేసేనే
తొట్టినది కన్నీరు తోఁచినది నివ్వెరగు
చిట్టకాలు చెలిచేతఁ జెప్పిపంపే దేమే ॥ తానే ॥

చెమరించేవి చెక్కులు చెదరేది నాతురము
అమరించి తనతో నే ననఁగా నేమే
అమలుఁడు శ్రీవేంకటాద్రీశుఁ డిటు గూడె
సముకాన సణఁగులు చల్లే దిదేమే ॥ తానే ॥ 219

భైరవి

ఏమిసేతు నమ్మలాల ఇట్టాయ నావలపు
ప్రేమము చెప్పఁగరాదు పిలువక పోదు ॥ పల్లవి ॥

మంతనాన నేనుంటే మనసులో నిలిచీని
కాంతుఁడు నే నిద్రించితేఁ గలలోన వచ్చీని
పంతమో పాడో తనకు బాలకి నన్నింతసేయ
రంతులఁ దానూ రాఁడు రానివాఁడు గాఁడు ॥ ఏమి ॥

పాడుతాఁ బరాకై తేఁ బదాలలో ముద్రచూపీ
గోడ చూచినఁ జిత్తరుకూటములోఁ బొడచూపీ
సూడో పాడో తనకు సొరిది న న్నింత సేయ
యీడా నుండఁడు చూడ నింటనే వున్నాఁడు ॥ ఏమి ॥

వూరకే నే నుండితేను వుంగరాన నెచ్చరించీ
ఆరయ శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
నేరుపో నెయ్యమో నన్ను మన్నించి వురమున మోచె
తారుకాణించఁగరాదు తన కింకఁ బోదు ॥ ఏమి ॥ 220

## దేసాళం

ఏమి సేయుమనేవే ఇంకా నీవు
కోమలపురమణుని కోలువూఁ జేసితిని ॥ పల్లవి ॥

ముంగిట నాతనితోడ ముచ్చటలాడితి నే-
నంగవించి యిందాఁకా నది చాలదా
జంగిలిసతులలోన సరసమూ నాడితిని
యెంగిలివలపులాయ నిఁక నేలే నేను ॥ ఏమి ॥

నంటుదోఁచఁ బతితోడ నవ్వులు నవ్వితిని
ఇంటికిఁ బిలువనంపె నింతలో నేలే
కంటఁ గంటఁ దనమోము కన్నులారఁ జూచితిని
అంటఁగాకుండితి నంటి నదివో నామాట ॥ ఏమి ॥

ఇప్పుడిట్టె తా రాఁగా నెదురుగా వచ్చితిని
తప్పనియలుక నాకుఁ దనతో నేదే
చెప్పరానిబాస ఇచ్చి శ్రీవేంకటేశుఁడు గూడె
తప్పులెల్లాఁ దీరె నిఁక తలపోఁతలేలే ॥ ఏమి ॥ 221

లలిత

అప్పుడే నే నంటిగా అండనుండే నీగుణము
.అప్పళింతువు కాఁగిట న దేపాటౌను ॥ పల్లవి ॥

పేరుకొనకు మంటిఁగా బెట్టి (ట్టు?) ఇందరిలో మమ్ము
కారణము నీకు నాకుఁ గద్దా యేమైనా
సారె నవ్వకు మంటిఁగా సందుల గొందుల నీవు
వారు వీరుఁ జూచితేను వట్టిరట్టౌఁ బనులు ॥ అప్ప ॥

సన్న నేయకు మంటిఁగా చాలుజాలు నీకు నాకు
కన్నచోట నేమైనఁ గద్దా పని
నన్ను ముట్టకు మంటిఁగా నామన సెఱఁగరు
కన్నవారు విన్నవారు కాకుగా నాడుదురు ॥ అప్ప ॥

మంచ మెక్కకు మంటిఁగా మాటలు చెప్పుదుగాని
కంచముపొత్తు మనకు గద్దా భేదము
పొంచుక శ్రీవేంకటేశ పోసి కిట్టె కూడితివి
చంచలము లే కదే సతమాయ నిపుడు ॥ అప్ప ॥ 222

రేకు 1038 పళవంజరం

అందుకు సరికిసరి ఆయనోయి
పందెమాడినట్లాయఁ బదరకు మిఁకను ॥ పల్లవి ॥

మోవి నాకుఁ జవిచూపి ముచ్చటలన్నియుఁ దాపి
ఆవేళ మాటాడఁజూచే వౌనోయి
తావివీడెపురసము తగ నీపుక్కిట నించి
యీవిధాన గెలిచితి నేమినేనే విఁకను ॥ అందు ॥

పయ్యదలోఁ జేచాఁచి పక్కనఁ గళలురేఁచి
అయ్యెడ నామోము చూచే వౌనోయి
చెయ్యారఁ గాఁగిట నొత్తి చెక్కు చెక్కున నదిమి
నెయ్యానఁ జొక్కించితి నీళ్లేల యిఁకను ॥ అందు ॥

రతి నన్ను మఱపించి రాతిటిసుద్దు లడిగేవు
అతినేరుపరితన మౌనోయి
యితవై శ్రీవేంకటేశ యిందుకు మారుకుమారు
తతిగా నిన్నే కూడితి తలఁచుకో ఇఁకను ॥ అందు ॥ 223

వరాళి

నాటివాఁడవె కాదా నాకు వెఱవ నీకేల
యేఁటికని మావారు యెదురాడఁ గలరా ॥ పల్లవి ॥

వాకున సరసమాడి వలపులే చల్లేవు
చేకొని యేమిసేసినాఁ జెల్లదా నీకు
లోకములో గొల్లెతల లోనుసేసుకొన్న చేఁత
సేకరముగా నీకుఁ జెల్లదాయనా ॥ నాటి ॥

ముంగిటనే సన్నసేసి మోవిఁదమ్మ చూపేవు
చెంగటఁ గొంగువట్టితేఁ జెల్లదా నీకు
దొంగిలి వారిచీరలు తొడికితీసినచేఁత
సింగారరాయఁడ నీకుఁ జెల్లదాయనా ॥ నాటి ॥

సారె నన్నొడఁబరచి చనవిచ్చి కూడితివి
చేరి బలిమిసేసితేఁ జెల్లదా నీకు
దూరుగా రుకుమిణి నెత్తుకవచ్చిననీచేఁత
చేరువ శ్రీవేంకటేశ చెల్లదాయనా ॥ నాటి ॥ 224

వరాళి

ఈరుఁదియ్యఁ బేనువచ్చు నిదియేఁటిదే
సారెసారె నిది యేడ సంగరమోయమ్మా ॥ పల్లవి ॥

చూతమంటాఁ బిలిచితే చుట్టరికాలే చెప్పీని
వాతెర విచ్చి యడుగవస్తినా నేను
రాతి రేడనుంటివంటే రతికేల పిలిచీనే
పోతరీఁడు వీనికేల పొద్దువోదోయమ్మా ॥ ఈరుఁ ॥

మాఁటలాడఁ బిలిచితే మర్మము లేలంటీనే
వాఁటమైనతనుఁ జెనకవస్తినా నేను
యీటుకు వీడెమిచ్చితే నేల కొంగువట్టీనే
నేటిలోనే వీనికింత నీఁటు లేలోయమ్మా ॥ ఈరుఁ ॥

పందెమాడఁ బిలిచితే పచ్చిసేసి నన్నుఁ గూడె
వందనతోఁ దన్ను ముట్టవస్తినా నేను
అందగాఁడు శ్రీవేంకటాద్రీశుఁ డింతసేసె
పొంది పొరుగున నుంటే పోనీఁ డోయమ్మా ॥ ఈరుఁ ॥ 225

బౌళి

నూటి కొక్కటే నూలిపోఁగని
కూటువలై కై కొను టీఁకఁగాక ॥ పల్లవి ॥

చెనకుచుఁ దొలఁగెనుఁ జేరఁగ వచ్చెను
తను నీఁక నేమని తడవేనే
వెనకకి కోపము వేఁడుక లిప్పుడు
కనుఁగొన మింగినకడి కీఁకఁ జవులా ॥ నూటి ॥

బిగువూఁ జూపెను ప్రియమూఁ జెప్పెను
తగవులఁ బెట్టఁగ తతి గాదే
తెగువలె అప్పుడు మొగమో టిప్పుడు
జగడము దీరెను సాదించవలెనా ॥నూటి॥

కాఁకలు రేఁచెను కాఁగిటఁ గూడెను
సోఁకుచు నిఁక మరి సొలసేనా
యేఁకట శ్రీవేంకటేశుఁడు వాపెను
చీఁకటి వాసెను చేదీపమేలే ॥నూట॥ 226

## పాడి

పదపద ఇఁకనేలే తనతోఁ బతిమాటలు దగునా
యెదురెదురనె తా నాడినమాటలు యెంచఁగ వసమౌనా ॥పల్లవి॥

చాలుఁజాలు నగవూ ఇఁక సారెసారె నేలా
తాలిమి నొకసతిపై నొరగుండియు తగదు వేరొకతెఁ బిలువఁగను
కేలుచాఁచి మొక్కీతిఁ దనకూ నను గెరలించఁగఁ దగదు
వాలుఁగన్నులను మొక్కినయందుకు వడి మనసున నే దీవించితిని ॥ప॥

ఆయనాయఁ బ్రియమూ ఇఁక నంతకోప నేనూ
మాయలచూ పొకసతిపై నిలుపుక మాటలు నాతో నాడీనా
కాయపుఁగాఁకలు ఘనమాయా తాఁ గలిగినపల మిదివో
చాయల సన్నల వలపులు చల్లిన జాణతనముల నే కలసితిని॥ పద॥

చెల్లెఁజెల్లె జింతా ఇఁక సెలవుకెక్కెఁ బనులు
కల్లకాదు శ్రీవేంకటరమణుఁడు కలసెఁ గళలు మీరా
కొల్లలాయ నిక్కువరతులూ నాకోరిక దైవారె
మొల్లమిఁ దననామోవితేనియలు మునికి మునిలు గాఁగా ॥ప॥ 227

రామక్రియ

మేలే చెలియా మేలుగాల మిది
తాలిమి లేదిదె తతిపో నాకు ॥ పల్లవి ॥

వెన్నెల గాసీ వెలఁది నేఁడిపుడు
పున్నమచంద్రుఁడు పొడచెనటే
కన్నెకోవిలలుకలకల మయ్యా
వన్నెవసంతము వచ్చెనటే ॥ మేలే ॥

కడఁగి చక్రవాకంబులు మూఁగీ
పుడమిఁ బొద్దిపుడు పొడచెనటే
ముడివడి చకోరములు కడుఁ బొలసీ
అడరి సందెవేళాయనటే ॥ మేలే ॥

చినుకులు రాలీ చితజునెండల
కనుఁగొన వానలకాలమటే
యేనసితి శ్రీవేంకటేశుఁడ నే నిటు
వనిత నీరతికి వరుసిది యటవే ॥ మేలే ॥ 228

రేకు 1039 రామక్రియ

[1] ఇదె శిరసుమాణిక్య మిచ్చిపంపె నీకు నాకె
అద నెఱిఁగి తెచ్చితి నవధరించవయ్యా ॥ పల్లవి ॥

రామ నినుఁ బాసి నీరామ నేఁ జూడఁగ నా –
రామమున నినుఁ బాడె రామరామ యనుచు
ఆమెలుఁత సీతయని యపుడు నేఁ దెలిసి
నీముద్రవుంగరము నే నిచ్చితిని ॥ ఇదె ॥

1. ఇది అధ్యాత్మకీర్తనల దాయలోనిది. వనిబూని శబ్దాలంకారము లింపినట్లున్నది.

కమలా ప్తకులుఁడ నీకమలాక్షి నీపాద -
కమలములు దలపోసి కమలారి దూరె
నెమకి యాలేమ నే నీదేవి యని తెలిసి
అమరంగ నీసేమ మటు విన్నవించితి ॥ ఇదె ॥

[1]దశరథాత్మజ నీవు దశశిరునిఁ జంపి యా -
దశనున్నచెలిఁ గావు దశదిశలుఁ బొగడ
రసికుఁడ శ్రీవేంకటరఘువీరుఁడ నీవు
శశిముఖిఁ జేకొంటివి చక్కనాయఁ బనులు ॥ ఇదె ॥ 229

నాట

[2]కలదా తొల్లి మీకతలు చెప్పేరు నేఁడు
బలువాఁడు గదవమ్మ పాయపునీమగఁడు ॥ పల్లవి ॥

జడల సొల్లెము సుట్టి సరి వీఁకవిల్లు వట్టి
వెడదవా[3] తంపపొది వీఁపునఁ గట్టి
పొడలమెకము నేసి పొదవాటిరాకాసి
గొడవలఁ దీసెనట కోరి నీమగఁడు ॥ కల ॥

నారపట్టుసీర గప్పి నవ్వు నెలవుల గుప్పి
సారె రుషులకు బాసలు నేసి
కూరగాయపొలమాడి కొనబుతమ్మునిఁగూడి
మేరమీరెనట నాడు మేసులనీమగఁడు ॥ కల ॥

కోఁతులమూఁకల నేలి కొంకక బూమికి సాలి
నీతోడ సుట్టాలుఁ దాను నిదులఁ దేలి
యీతల సివేంకటాద్రి యెక్కి మమ్ముఁ గిపఁ (కృప?) జూచె
బాఁతితో ని న్నెద మోచె బాగ్యపునీమగఁడు ॥ కల ॥ 230

1. మూడవపాదమున ప్రాసభంగము. 'శ–స' లకు భేదములేనివ్రాతగావున గనునింపలేదో' వీరిమతము దీనినంగీకరించెనో?

2. పనిబూని వ్రాసిన అచ్చతెనుగు బాస అధ్యాత్మ కీర్తనమా? 'రుషుల' లో 'షు' భేదిస్తుంది. 3. వెడదవాతి+అంపపొది

ఆహిరి

ఓయమ్మ తనపొందు వోపనంటినా
చేయివట్టి తియ్యనేలే చెలులు నన్నిపుడు ॥ పల్లవి ॥

దగ్గరి మారాడ నాకుఁ దడవా నేఁడు దనతో -
నెగ్గుదప్పు లౌనని యెంచేఁగాక
నిగ్గుల సరసమాడ నేరనా కొంతయినా
సిగ్గరితనానికే నేఁ జింతించేఁగాక ॥ ఓయ ॥

సొలపుఁజూపులఁ దన్నుఁ జూచు టరుదా తన -
తలఁపు దెలియలేక దాఁగేఁగాక
సెలవినవ్వు దనపై చిలికించనేరనా
కొలఁది మీరునోయని కొంకేఁగాక ॥ ఓయ ॥

కాఁగిలించి యిట్లానే కరఁగించకుందునా
మూఁగినయాసలు చూపి మోపితిఁగాక
తోఁగెను చెమట నాకుఁ దోడనె శ్రీవేంకటేశు -
నాఁగి రతిఁ జొక్కించితి నందుకే కాక ॥ ఓయ ॥ 231

శ్రీరాగం

రవ్వ మాని ఆయనాయ రారే మీరు
అవ్వలఁ దన్నుఁ బిలిచేయంతవారమా ॥ పల్లవి ॥

తడవీనా మమ్మతఁడు తరుణులఁ, గడమా
పడఁతు లాతనికై తే పాదలేఖువు
బడిబడి నే వలచి పైఁబడేఁగాని తనకు
చిడుముడిఁ జెట్టదువఁ జేటఁదేసిసతులు ॥ రవ్వ ॥

వలచీనా నా కతఁడు వనితలు లేరా
వలచివచ్చేవారే [1]వనమెల్లాను
వెలయ నేఁ దనపొందు విడువఁగలేఁ గాక
చిలికితే నేమిటాఁతి చెలువలేయాతనికి ॥ రవ్వ ॥

మానీనా నన్నతఁడు మగువ లెందరుండినా
పూని యాతనిసతులే భూమెల్లాను
యీనెపాన శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
కానికగాఁ బూజగొంటే గంపెడేసిసతులు ॥ రవ్వ ॥ 232

సామంతం

వంచకువే శిరసు వలవనినెరుసు
పంచచెటు మందుగాదు పలుకులింకేలే ॥ పల్లవి ॥

పట్టినదే చలమా పంతమె నీఫలమా
చుట్టపుచెలుల మింత చూడఁగలమా
యిట్టె యాతఁడు వచ్చిన నిద్దరును నొక్కఁటే
[2]అట్టు వొలకమ్మకెక్కె యిట్టెమాసు మిఁకను ॥ వంచ ॥

పొద్దులిట్టె జరపేవు బూటకాలే నెరపేవు
గద్దించి బుద్దులు మాకుఁ గరపేవు
వద్దువద్దు మాఁటలనే వలపులయేరు వారి
మద్దులు మారేళ్ల మోఁచె మానరాదా యిఁకను ॥ వంచ ॥

యింకనైతే బిగుపూ యియ్యకొంటే తగవూ
వుంకువాయ మీకు నెలవులనగవూ
పొంకపుశ్రీవేంకటేశుఁ బొందితి వింతటిలోన
చంక గుదె శరణార్తి చాలుఁజాలు నిఁకను ॥ వంచ ॥ 233

1. "వన" శబ్ద మిక్కడ సమూహార్థమా? ఈ వనమందంతటా అనియా?
2. ఈ జాతీయము స్పష్టము గాలేదు.

శంకరాభరణం

తనిసితి మిఁక మముఁ దడవకురా
చనవుకు మనవికి సరికిసరి ॥ పల్లవి ॥

నలుగడ నీవిటు నవ్విననవ్వులు
అలిగినవేళకు నవి సరియే
వలపులు చల్లేవు వాదుకు వచ్చేవు
చలువకు వేఁడికి సరికిసరి ॥ తని ॥

వరుస నాకిచ్చితి వద్దికి వచ్చిన
సరవులఁ బెట్టిన సరికిసరి
మరిగినాఁ బోసీవు మాటలు నాదవు
సరసము విరసము సరికిసరి ॥ తని ॥

తమకంబున మనతనువు లిద్దరికి
సమరతి వుపరతి సరికిసరి
అమరిన(శ్రీ)వేంకటాధిప యిటు మన-
సముకపుమఅపులు సరికిసరి ॥ తని ॥ 234

రేకు 1040 మధ్యమావతి

అతనిమన్న నే చూచే వప్పుడె నీవు
యితవై మీయిద్దరిలో యెంతసమ్మతములో ॥ పల్లవి ॥

చెలువునిమోము చూచి నెలవులఁబార నవ్వి
చెలితో మాటలాడేవు చెల్లఁబో నీవు
అలవోకఁ బవళించి యాకుమడిచిచ్చేవు
అల వెఱఁగవు పతి నౌనే నీవు ॥ అత ॥

కాటుక దీరుచుకొంటా ఘనునితోఁ బలికేవు
నేటివలె నుండునటె నేరవు నీవు
నీటున నొయ్యారిబాగై నిలుచుండి మొక్కేవు
వోటలేదు దొరచిత్తా లోకరీతి నుండునా ॥ అత ॥

తొడమీఁదఁ దొడవేసి దొరతనమే చూపేవు
నడుమ శ్రీవేంకటేశునంటున నీవు
జడికొని దోమతెరచాటునఁ గూడి మాకు-
నడియాలాలు చూపేవు అంతలో నీవు ॥ అత ॥ 235

సాళంగం

ఆడరాదు పీడరాదు అంతమాట
వేడుకవలపు లింతే వేసాలు మానరా ॥ పల్లవి ॥

బిగిసేవు దగ్గరితే పిలిచితే నవ్వేవు
తెగనాడరా మాట తెలియ నేను
మొగము చూచితి నింతే మోనాన నుందాన నింతే
చిగురుసీమోవికిని సిగ్గులేల వచ్చెరా ॥ ఆడ ॥

ములిగేవు పైకొంటే మొక్కితేనే నీలిగేవు
వాలసీనొల్లముల్లైతే వొద్దురా పొందు
నిలుచుండి వుంటి నింతే నేరము లెంచుకొంటి నింతే
వలుదకన్నులరెప్పవంపు లేల వచ్చెరా ॥ ఆడ ॥

చెనకితే వీఁగేవు చెఱఁగువట్టితే రేఁగే-
వనుమాన మేమిగల్లా నాడరా నాతో
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి వప్పటిని
మనసు లొక్కట్లాయ మఱి యానలేలరా ॥ ఆడ ॥ 236

గుజ్జరి

ఏల మమ్ము భ్రమయించే రింకా మీరు
 యేలినవాఁడు హరి యెంచి చూడరాదా ॥ పల్లవి ॥

సెలవుల నవ్వేది చెక్కుచేత ములిగేది
 కలికికాంతల కివి కలవేకావా
పలుకుల నొరసేది భావముల మురిసేది
 జలజాక్షులకు నివి సహజమే కాదా ॥ ఏల ॥

వోరగండ్లఁ జూచేది వొంటిఁ జెయిచాఁచేది
 దారకపుసతులకుఁ దగవేకాదా
వోరికొట్లు కొట్లేది వున్నట్లే సిగ్గువడేది
 కోరికసతుల కివి గుణములేకావా ॥ ఏల ॥

యెంగిలిమోవు లిచ్చేది యిటు చన్నులఁ గుచ్చేది
 ముంగిటిరమణులకు ముక్కుమేకాదా
సంగతి శ్రీ వేంకటేశు శరణంటి మిఁక మీ-
 వెంగలిచేఁతలు మాతో విరసమేకాదా ॥ ఏల ॥ 237

సాళంగనాట

సవతిపోరుల కోపఁజాలనయ్యా
 జవళితో నీకు మొక్కే సమ్మతించవయ్యా ॥ పల్లవి ॥

గచ్చురేఁగి నీవే యింకాఁ గొన్ని దిట్టవయ్యా
 మచ్చరాలు నీతోను మాకేలయ్యా
చెచ్చెర నీ కూడిగాలు సేసేవా రుండఁగాను
 నిచ్చలుఁ బయికొసరు నే నేలయ్యా ॥ సవ ॥

కలవి లేనివి నీవే గడియించుకోవయ్యా
మలసి నీతోఁ బలుక మాకేలయ్యా
తలఁ బొక్కట నుండఁగ దగ్గరనేఁటికి మమ్ము
వలపులు చప్పనాయ వద్దేలయ్యా ॥ సవ ॥

కందువ దెలిసి నీవే కయికొని కూడవయ్యా
మందెమేళానఁ జెనక మాకేలయ్యా
యిందులోన శ్రీవేంకటేశ నీకు లోనైతి
సందడిఁ బెండ్లాడితివి జాణవవుదువయ్యా ॥ సవ ॥ 238

మాళవిగౌళ

నీరువట్టు గొన్నచోట నేయి మందుగా దెపుడు
నేరుచుక వత్తుగాని నీవు వోయిరారా ॥ పల్లవి ॥

ఆడినట్టుండదు మాఁట అవురా మీఁదటికి
పాడి విచారించుకొనేఁ బట్టకుండరా
వేడుకకానికి మరి వెసలఁ బెట్టుమనక
పీడనే వగరించేవు నీవు వోఇరారా ॥ నీరు ॥

చెప్పినటువలె రాదు చేచేతఁ గాలము
దప్పిగొంటి నీకతలఁ దలరా నీవు
వుప్పు గప్పురముతోడ నొక్కసరి నేయక
నిప్పు చెదలంటీనా నీవు వోయిరారా ॥ నీరు ॥

రాజపై వయట్టుండదు రతికేళి నేయువేళ
వోజతో నే నియ్యకొంటి నోపననకు
తేజపుశ్రీవేంకటేశ తెలిసి కూడితి నన్ను
నీజాడలెల్లాఁ గంటి నీవు వోయిరారా ॥ నీరు ॥ 239

శంకరాభరణం

అతని మీరే యిది యడుగరే
చతురతఁ దానే జంకించీనే ॥ పల్లవి ॥

పెదవికెంపు లవి ప్రియమున నడిగిన
యెదురు గుదురుగా నిటు దిట్టీనే
నిదురకన్నులవె నిదిరించు మనిన
అదనఁ దానె మఱి యలిగీనే ॥ అత ॥

చెక్కుల చెమటలు చేతులఁ దుడిచిన
గక్కన నూరక కసరీనే
పక్కనఁ బులకలు పయ్యదఁ గప్పిన
చిక్కనిగోళ్ళఁ జిమ్మీనే ॥ అత ॥

కళలు చూచి నేఁ గాఁగిట నించిన
మలసి మలసి మయిమఱచీనే
చెలువరాయఁ డిదె శ్రీవేంకటపతి
నలుగడ నన్నే నవ్వీనే ॥ అత ॥ 240

రేకు 1041 ఆహిరి

చెల్లఁబో యింత పచ్చిసేయవలెనా
వుల్లములో మీకుమీకే వొప్పుగొనఁదగదా ॥ పల్లవి ॥

కూడిపాయరానిచోట కోపగించితే నేమాయ
సూడుఁబాడు పతితోనే చూపవలెనా
మేడెపుదంపతులకు మేరదప్పితే నేమాయ
జాడతోనే అతనికిఁ జనవియ్యఁదగదా ॥ చెల్లఁ ॥

యేకచిత్తాలైనచోట నేమి సేసిన నేమాయ
పై కొన్న విభునితోనే పంతమా నీకు
నీకు నీకుఁ[1] బ్రాణప్రాణనేస్తమైనచోట
చౌకగా కతనికి నిచ్చకమాడఁదగదా ॥ చెల్లఁ ॥

తనువులంటినచోట తమకించితే నేమాయ
ననిచినచోట నిది నాయమా నీకు
యెనసీ శ్రీవేంకటేశుఁ డిటువంటిమీచోట-
ననఁగి పెనఁగి ఇట్టె ఆదరించఁదగదా ॥ చెల్లఁ ॥ 241

పాడి

ఈఁడ మాతో నింతయేల యెగసక్కెలు
వేడుకకాఁడవు నీవు వేసాలు మానరా ॥ పల్లవి ॥

వద్దన్న మానవు యేరా వాదులకే వచ్చేవు
కొద్దిమాలి నిన్నుఁ బేరుకొంటిమా నేము
పెద్దరికాలకు నీతోఁ బెనఁగేటివారితోనే
చద్దికి వేఁడికి నీవు సరసము లాడరా ॥ ఈఁడ ॥

చాలునన్న మానవేరా జాణతనా లాడేవు
కేలుచాఁచి నిన్నుఁ జెనకితినా నేను
నాలితనమున నీతో నవ్వేటివారితోనే
కోలుముందుగా వారికూటములే సేయరా ॥ ఈఁడ ॥

వోపనన్న మానవేరా వుద్దండానఁ గూడితివి
కోపగించవలెనని కొసరితినా
యేపున శ్రీవేంకటేశ యేడవారినైనా వట్టి-
చూపులు చూచితి వికఁ సుద్దులవి మానరా ॥ ఈఁడ ॥ 242

1. ఇట్టి చిల్లరదోషాల కీవాఙ్మయమున పట్టింపులేదు.

దేశాక్షి

ఎంత చెప్పినా వినవు యేలే నీకు
మంతనాన రమణుఁడు మనసిచ్చీ నీకును ॥ పల్లవి ॥

నిండినకళలమోము నివ్వెరపరచకువే
కొండవంటిపతి నిన్నుఁ గొంగువట్టఁగా
యెండకంట నీడకంట నేల చూచేవే యాతని
పండువంటిమోవి చూచి పాలార్చీ నిన్నును ॥ ఎంత ॥

బంగారువంటిమేను పయ్యద మూసుకోకువే
సింగారపురమణుఁడు చేయిచాఁచఁగా
చెంగి పచ్చిమాటలు వెచ్చినమాటా నాడకువే
అంగమంటి చెక్కునొక్కి యాదరించీ నిన్నును ॥ ఎంత ॥

తుమ్మెదవంటిబొమ్మలు తోద ముడివెట్టకువే
నెమ్మి శ్రీవేంకటపతి నీతో నవ్వఁగా
సమ్మతించి చనవిచ్చి సమరతి వీఁగకువే
కమ్మరఁ గమ్మరఁ గూడి కరగించె నితఁడు ॥ ఎంత ॥ 243

ఆమరసింధు

దైవమే యెఱుఁగుఁగాక తలవే నీవు
వేవేలు వచ్చెఁ జాలు విడవే నీవు ॥ పల్లవి ॥

మనసు లేకములైతే మరి యెందువోయీని
తనసు ద్దేఁటికిఁ జెప్పీ తలవే నీవు
చనవు గలితేఁ జాలు సాదించఁ బొద్దులేదా
వినివిని వేసరితి విడవే నీవు ॥ దైవ ॥

తానే విచ్చేసునట తగులేల పాసీని
దానికేమి గొంటాయ తలవే నీవు
నాననీవే వలపులు నాకుఁ దన కెందువోయీ
వీనులెల్లాఁ జల్లనాయ విడవే నీవు ॥దైవ॥

కాయములు సోఁకితేనే కరఁగక మానీనా
దాయగాఁ డింతే తాను తలవే నీవు
పాయపు శ్రీవేంకటాద్రిపతి నన్ను నిదె కూడె
వేయకు నిష్ఠూర మిఁక విడవే నీవు ॥దైవ॥ 244

శుద్ధవసంతం

కానీకానీలేరా కడమయి వుండనీరా
నేను నీవు నిట్లానే నిలుచుంటేఁ జాలురా ॥పల్లవి॥

ముంచి మాటలాడేది మోవితేనె చిందుదాఁక
యెంచినప్రియాలు పానుపెక్కుదాఁకానే
పంచలనవ్వేనవ్వులు పైఁ జేయివేయుదాఁకా
ఇంచుకంత గడచితే నీడ నుండఁబొయ్యేవా ॥కానీ॥

కప్పురమియ్యవచ్చేది కాఁగిట నించినదాఁక
తప్పకచూచుట నన్ను దగ్గరుదాఁకా
అప్పటి నానవెట్టేది ఆయముమోచినదాఁకా
దప్పులుదేరినమీఁద తలఁచఁబొయ్యేవా ॥కానీ॥

చెక్కులు నొక్కెదెల్లా చేరి నే లోనైనదాఁకా
మొక్కులు మొక్కేది తుదిముట్టినదాఁకా
అక్కరతో శ్రీవేంకటాధిప కూడితి విట్టె
వొక్కమనసైనమీఁద నొడఁబాట్లేలరా ॥కానీ॥ 245

నాదరామక్రియ

పూవులవేసినవారి బొగ్గిట వేతురా
నీ వేమి నేసినాను నిందనవ్వీ నతఁడు ॥ పల్లవి ॥

కాని కాని తిట్లు కాఁకలతో వొట్లు
మానుమన్నా మానవేలే మాటిమాఁటికి
పూనినట్టిమొక్కులూ పూఁటపూఁట చొక్కులూ
తేనెలమాటల నిన్నుఁ దీవించీ నతఁడు ॥ పూవు ॥

పనిలేనినేరాలు పలుకుల కారాలు
అనకుమన్నా విడువ వంతకంతకు
తనివోనివలపులు తరితీపుసొలపులు
ననుపుఁ గూరిమి నిన్ను నాఁటించీ నతఁడు ॥ పూవు ॥

కాంతలతో పంతనాలు కాఁగిటిలో మంతనాలు
యెంతయినాఁ బోనీవు యింత యేఁటికే
యింతటికి శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడె
సంతతము నీకు నిట్టె చనవిచ్చె నతఁడు ॥ పూవు ॥ 246

రేకు 1042 దేసాళం

ఎడమాటలే బెట్టు యేమి నేసీనే
అడియాలములు చూపి యానవెట్టి రారే ॥ పల్లవి ॥

ఇక్కువ మమ్మ నిలిపె యింతవొద్దాయ రాఁడు
యెక్కడఁ బనిగలిగె నేమినేసీనే
మక్కువలు మఱచెనో మరుఁ దెచ్చరించెనో
అక్కడికే నే వత్తునో అడిగిరారే ॥ ఎడ ॥

అంచే ననఁగరాదు ఆసల నేమముఁ బెట్టి
యింటిలో నున్నాఁడు యేమిసేసీనే
వింటలేదో నీమాట వేరొకతెఁ గూడున్నాఁడో
వొంటినున్ననాతపసు వొప్పగించి రారే ॥ ఎద ॥

విందువలె విచ్చేసి వెనక నిలుచున్నాఁడు
ఇందులో నే నెఱఁగనా యేమిసేసీనే
అందపుశ్రీ వేంకటేశుఁ డాయమంటి నన్నుఁ గూడె
ముందువెనకపనికి మొక్కితి నే ననరే ॥ ఎద ॥ 247

### నారాయణి

ఎంతైనా నెఱఁగవు యెమ్మెలు చూపేవు నీవు
అంతటా నీకె యాకె అప్పణియ్యవలెనా ॥ పల్లవి ॥

తప్పకచూచీ నీతో తలవంపే చాలదా
వుప్పటించి నిన్ను వేరె వొరయఁగవలెనా
పిప్పిగట్టఁ బెదవులఁ బేరఁ దిట్టవలెనా
కప్పురగంది నిన్నుఁ గసరఁగవలెనా ॥ ఎంతై ॥

వూరకుంటేఁ జాలదా వువిద నీతో నిప్పుడు
గోరపెట్టి సారెసారెఁ గోపగించవలెనా
నీరాక దెలిసియు నిద్దిరించెఁ జాలదా
బీరమాడి నిన్ను రతి బెండుసేయవలెనా ॥ ఎంతై ॥

చేత మొక్కెఁ జాలదా చేకొని నిన్నుఁక వేరే
రాతిరిఁ బగలుఁ గడురాఁపుసేయవలెనా
నీతితో శ్రీ వేంకటేశ నిన్నుఁ గూడెఁ జాలదా
యీతరుణి నేఁడే నీయింటికి రావలెనా ॥ ఎంతై ॥ 248

రామక్రియ

సేసినది చేఁతగాక చేతికి లోనైనవేళ
యీసున నిందుకుఁ బతి కెదురాడనేఁటికే ॥ పల్లవి ॥

తత్తరించి కూడేవేళ తాలిము లున్నవా
హత్తి కాఁగిలించేవేళ నానలు మరున్నవా
ఇత్తల నవ్వేవేళ యెగ్గుదప్పు లున్నవా
కొత్తగాఁ బతి నిందుకుఁ గోపగించనేఁటికే ॥ సేసి ॥

చెఱఁగువట్టినమీఁదఁ జేసన్న లున్నవా
కఱతలరతివేళ ఘాత లెంచ నున్నదా
మఱఁగువాసినవేళ మఱి సిగ్గులున్నవా
వుఱకె యిందుకుఁ బతి నుప్పటించనేఁటికే ॥ సేసి ॥

రతికేళిసేయువేళ రాజసము లున్నవా
తతివచ్చినప్పటికి దాఁచఁ జోటు లున్నవా
యితవై శ్రీవేంకటేశుఁడిట్టె నిన్నుఁ గలసె
అతని నిందుకుఁగాను అదలించనేఁటికే ॥ సేసి ॥ 249

దేవగాంధారి

ఏలే మనసుద్దులు యెఱిఁగినవే కావా
యీలాగు అలుక నీ కింత చెల్లునా ॥ పల్లవి ॥

వాలుఁజూపు నామీఁద వంచితే నేమాయ నీకు
నాలిగా నెలవిఁ గొంత నవ్వితే నేమీ
ఆలించి వొకమాట ఆడితే నేమాయ నీకు
వాలాయించి నేఁబట్టిన వద్దనఁగఁజెల్లునా ॥ ఏలే ॥

జట్టిగాని నాపైఁ జేయిచాఁచితే నేమాయ నీకు
గుట్టుతో నామంచముపైఁ గూచుండే నేమి
వుట్టిపడి నాకతలు వూఁకొంటే నేమాయ నీకు
అట్టె నేఁ గాఁగిలించితే నొఁగాదనఁగలవా ॥ఏలే॥

పొత్తుకు వచ్చినాతో బోఁ(బొం?)దైతే నేమాయ నీకు
హత్తి రతిఁ దనిపితే నందుకూ నేమి
బత్తితో శ్రీవేంకటాద్రిపతి నేనే బుజ్జగించి
చిత్తమురాఁ గలసితి సిగ్గు లిఁకనేఁటికి ॥ఏలే॥ 250

శంకరాభరణం

నీవు ముందు చెనకకు నిన్నతఁడు చెనకితే
కైవశమై లోలోనే కరఁగుదుగానీ ॥పల్లవి॥

కన్నుల నిన్నుఁ జూచితే గక్కన నవ్వేవుసుమ్మీ
వన్నెగా నందుకుఁ దలవంతువుగానీ
మన్నించి చేయివట్టితే మందెమేళ మెుద్దుసుమ్మీ
యిన్నిటాఁ బతిచేఁతకు నియ్యకొందుగానీ ॥నీవు॥

దగ్గరఁ బిలిచితేను తమకించేవుసుమ్మీ
వొగ్గి చేతులువట్టుక వుందువుగానీ
అగ్గలపుసరసాల కవుఁగాదనేవుసుమ్మీ
సిగ్గువడి చెక్కుచేత చింతనుందుగానీ ॥నీవు॥

అంది రతిఁ గూడితేను అలఁతఁ బొందేవుసుమ్మీ
చెంది నీవు యిచ్చకమే సేతువుగానీ
విందుగ శ్రీవేంకటాద్రివిభుఁడు గలసె నిన్ను
అందపుఁజెలితో ముచ్చటాదేవుసుమ్మీ ॥నీవు॥ 251

రామక్రియ

నాఁటికి మరి నను నగరాదా
గీఁటి కన్ను మఱి గిలుపఁగరాదా ॥పల్లవి॥

మలసి నీకు నే మనవులు చెప్పిన
నలుగడ నీవే నగరాదా
వలపు చల్లి యిఁక వడి నినుఁ గొసరిన
నిలువుకు నీవే నిలుగఁగరాదా ॥నాఁటి॥

కనుఁగొనలఁ జూచి కాఁకలు చల్లిన
నను నీ వప్పుడు నగరాదా
ఁనియక నే నిను తగవు లడిగినను
కినిసి బొమ్మల జంకించఁగరాదా ॥నాఁటి॥

వేమరు రతులకు వెనకతీసినను
నా మొగము చూచి నగరాదా
గామిడి శ్రీవేంకటపతివి నీవు
కామించి కూడితి కానీరాదా ॥నాఁటి॥ 252

రేకు 1043 దేవగాంధారి

నేనే వాడఁబరచే నెలఁతఁ గొంతవడికి
నానితేనే మెత్తనయ్యీ నవ్వకురే మీరు ॥పల్లవి॥

మనసులోపలి [1]వేద మాటలలోపలివూద
కనుఁగొనలనే [2]గోద కానరాదా
వనిత యిప్పుదేమన్న వాదులకే వచ్చుఁగాని
వినదు మీమాటలెల్ల విడువడరే ॥నేనే॥

---

1, 2. ఇక్కడ 'వెద-కొద' పాఠము లనుకూలములైనను, అనుప్రాసభంగము గలుగును.

కాయముమీఁదటికాఁక కడునిట్టూర్పులమూఁక
చేయి చెక్కుమీఁదివీఁక నేనె నిందాఁక
యీయెడఁ జెలి నేమన్న నీసడించఁ జూచుఁగాని
చాయకు రాదు మీచేఁత చాలుఁజాలునే ॥ నేనే ॥

గుబ్బలపై మెరుఁగూ గుణములలో కరఁగూ
వుబ్బరతితెఱఁగూ వువి దెఱుఁగూ
గొబ్బునఁ గూడితి నిట్టె కోరి శ్రీవేంకటేశుఁడ
అబ్బురపుతొంటిమాట లాయనాయనే ॥ నేనే ॥ 253

## నారాయణిదేశాక్షి

తగవో నగవో తలఁపిదివో
జగడము లేఁటికి సతమగుపనికి ॥ పల్లవి ॥

పిలిచినయపుడే ప్రియమునఁ బలికితి
కలదో లేదో కనుఁగొనరే
అలుకయుఁ దనదే ఆఱడిఁ దనదే
తెలిసెనో తెలియదో తేరినపనికి ॥ తగ ॥

కవకవనవ్వినఁ గైకొని మొక్కితి
అవునోకాదో అడుగరే
అవల నివలఁ దనయాసలు మానఁడు
చివుకన నేఁటికిఁ జేసినపనికి ॥ తగ ॥

మనిపే ననఁగా మాటలు నమ్మితి
అనెనో అనఁడో అదెకదరే
యెనగొని శ్రీవేంకటేశుఁడు గూడెను
నను నొరయకురే ననిచినపనికి ॥ తగ ॥ 254

ఆహిరి

ఏమిసేతు నిఁక నేను యేమిసేతు
వాములైనతననవ్వు వద్దనేమా ॥ పల్లవి ॥

అప్పుడే తా రాకుండఁగ నలఁగఁగఁబోతేను
యెప్పటి పతిచిత్తము యెంతనొచ్చునో
దప్పిదేరి తనమోము దప్పకచూడఁబోతేను
చిప్పిల లోలో నెంతసిగ్గువడునో ॥ ఏమి ॥

కడుఁగాఁక తనమేను గాఁగిలించఁబోతేను
యెడసి మదనరేక లేఁద రేఁగునో
జడియ కాతనితోనే సరస మాడఁగఁబోతే
వెడఁగుఁదనాల నెట్టి వెంగెములై తోఁచునో ॥ ఏమి ॥

మించినరతికేలిని మేను మఱపించఁబోతే-
నించుకంత దెలిసి నన్నేమనునో
అంచల శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁగూడె-
నెంచరానితలపోఁత లేమిదలఁచునో ॥ ఏమి ॥ 255

రామక్రియ

ఏలే రమణునికి నివి గొన్నిరోఁతలా
పోల బొంకనైనరాదా పోదిసేయవలెనా ॥ పల్లవి ॥

చెదరెఁ బతికురులు చెరుగరాదా మీరు
అదివో చూచినవారు ఆడవలెనా
తుద చెమరించెఁబో తుడువరాదా మీరు
సుదతు లీతనికాఁక చూచి తిట్టవలెనా ॥ ఏలే ॥

పులకించెఁబో మేను పుప్పొడైనాఁ జల్లరాదా
నలువంకఁ గన్నవారు నవ్వవలెనా
తెలిగన్ను లాయఁబో తెరయైనా వేయరాదా
పలుమారు నతనిమై పచ్చిదోఁచవలెనా ॥ఏలే॥

కడురతి నలసెఁబో కప్పురమైనా సీరాదా
కడవా రీతనిచేఁత కానవలెనా
అడరి శ్రీవేంకటేశుఁ డందులోనె నన్నుఁ గూడె
బడలిక వాపరాదా పైపై నే వలెనా ॥ఏలే॥ 256

ముఖారి

అప్పటి కప్పుడే చెప్పే వందుకేమి
నొప్పులుఁ దప్పులు నీకే వొప్పగించేమయ్యా ॥పల్లవి॥

కన్నుల[1] జంకెలు గొన్ని కారపుబొంకులు గొన్ని
నిన్నటనుండీ పడేము నీచేతను
వెన్నెలనగవు గొంత వేసాలతగవు గొంత
యెన్నిచెప్పినా మాన విఁకఁ జూడవయ్యా ॥అప్ప॥

పచ్చిమాఁట లొకకొన్ని వెచ్చినమాఁటలు గొన్ని
నిచ్చనిచ్చఁ బడలేము నీచేతను
వచ్చి సన్నసేసేవు వలపులే పూసేవు
మెచ్చుగాదన్నాఁ బోవు మేరమీరేవయ్యా ॥అప్ప॥

మోనపుతిట్లు గొన్ని మోహపుటొట్లు గొన్ని
నేనే లోనైతిఁగా నీచేతను
కానీలే శ్రీవేంకటేశ కాఁగిటఁ గూడితి నన్ను
మానరానిపొందులాయ మఱియేఁటికయ్యా ॥అప్ప॥ 257

1. 'జంకెనలు' కాబోలు.

మాళవిగౌళ

పొద్దువో దతఁడు పొందు లెఱఁగఁడు
కొద్దిమాలి మముఁ గొసరీని ॥ పల్లవి ॥

వెన్నెతామెరలు వెదచల్లితిఁబో
కన్నులఁజూచినగతి యాయ
పున్నమవెన్నె పోఁజెరిగితిఁబో
చిన్నినవ్వనుచుఁ జెనకీ నతఁడు ॥ పొద్దు ॥

పలుమరుఁ జిలుకలఁ బలికించితిఁబో
వలపుమాటలని వచ్చీని
అలమి జక్కవల నల్లార్చితిఁబో
అలరుఁగుచములని అంటీని ॥ పొద్దు ॥

తమ్మితూఁడులను తను బిగిసితిఁబో
చిమ్ముఁగౌఁగిలని చెలఁగీని
యిమ్ముల శ్రీవేంకటేఁడు గూడియు
నెమ్మది నావద్ద నెలకొనె నతఁడు ॥ పొద్దు ॥ 258

రేకు 1044 లలిత

[1] ఎవ్వరు సాకిరి చెప్పిరివే నీతక్కుఁదనాలు
వువ్విళ్లూరేటిబాస లొల్లరా నేను ॥ పల్లవి ॥

యిందరిలో మమ్ము నింత యేల అట్టుసేసేవు
ముందర నెవ్వరికైనా మొక్కరా నీవు
గొందులనే వెంగేలు కొలువులో వినయాలు
యెందు నేరిచితివి ని న్నేమందు నిఁకను ॥ ఎవ్వ ॥

1. "వేనితక్కుఁదనాలు" అంటే యతి భంగము; 'సాకిరివే, అంటే అర్థమంతగ సరిపోదేమో "ఛందోభంగం నకారయేత్" గదా.

నెయ్యపుసొమ్ము నాయింట నునిచితివి తనిసితి
యియ్యరా యెవ్వరికైనా యీవులు నీవు
కయ్యము లోలోనే గారవా లిందరిలోన
కొయ్యసాదుఁదనములు కూడునా నేఁ డిఁకను ॥ ఎవ్వ ॥

గక్కన నన్నింతలోనే కాఁగిలించవచ్చేవు
యెక్కువఁ గాఁగిలించరా యేమైనా నీవు
తక్కించి శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
చక్కనాయఁ బనులెల్లాఁ జాలు నీవేసాలు ॥ ఎవ్వ ॥ 259

దేసాళం

నే నిదె నీ విదె నెగులేలే
నానాఁదే తగులాయ నవ్వు లింకా నేలే ॥ పల్లవి ॥

అంగన నీ కరచేత నడఁగెను చందురుఁడు
యింగితాన నీ కింకానేలే చింత
పొంగేటి జలనిధులు పుడిసిటికి వచ్చెను
కొంగువట్టితీసితేనే కోప మింకా నేలే ॥ నేని ॥

[1] పెంచెపుటాకసము నీపిడికిటిలోనిది
యెంచరానివెడదైన్యమేలే నీకు
చంచులకొండలు నీ సందిటిలోనే చిక్కె
వంచిననీకెమ్మోవి వాడఁబారనేలే ॥ నేని ॥

కోరి మదనాస్త్రిలు కొనగోరిలోనఁ జొచ్చె
యీరీతి నివ్వెరగులేలే నీకు
చేరితి శ్రీవేంకటపతిఁ జిక్కితి నీపాలిట
నారుకొనెఁ బులకలు నయగారా లేలే ॥ నేని ॥ 260

1. ఔపోలిక నేయార్థము.

కాంబోది

మాపుదాఁకా సుద్దులేల మఱఁగు మొఱఁగులేల
చేపట్టి నీ వింకఁ జేసినట్టు చేయరా ॥ పల్లవి ॥

వంపునీగోరిగుఱుతు వా(వ్రా?)సుకొన్నది నా మేన
యింపులఁ గాచినది నీయింటివాకిలి
ముంపున నాతురుము నీముఁ(ముం?)జేతి నేసలకే
చెంప జారె నీ వింకఁ జేసినట్లు సేయరా ॥ మాపు ॥

యెత్తినవి నాచేతు లివె నీమొక్కులకే
పొత్తు నీకాఁగిటికి నాపూఁపచన్నులు
హత్తిననాజవ్వనమంతా నీకే మీఁదు
చిత్తగించి నీ వింకఁ జేసినట్టు సేయరా ॥ మాపు ॥

యిచ్చితివి నీరూవు యిదె నామతికి దక్క
వచ్చితివి నేఁడు నావద్దికి నీవు
యిచ్చగించి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
చెచ్చెర నేమైనా నింకఁ జేసినట్టు సేయరా ॥ మాపు ॥ 2[illegible]1 ॥

శంకరాభరణం

కన్నెవయసుమీఁదనే ఘనజవ్వనము వచ్చె
విన్నకన్న చోటనేల వెరగందేవే ॥ పల్లవి ॥

పూచినవెన్నెలనవ్వు పుప్పొడి తేనెమాటలు
కాచినచన్నులనిమ్మకాయ లవిగో
యేచినవసంతకాల మిప్పుడే నీమేన నిండె
చేచేత నిఁకనేల సిగ్గువదేవే ॥ కన్నె ॥

కందువచిగురుమోవి కప్పినకన్నులకావి
మందపునిట్టూర్పులమంచిగాలి
అందపునీమేనిమీఁద నామనికాలము వచ్చె
[1] యిందులో నీపతి వచ్చె నేలకొంకేవే ॥ కన్నె ॥

పండినపులకపంట పాయపుఁగళలపచ్చి
మెండగుబాహులతలు మేరమీరెను
నిండి శ్రీవేంకటపతి నిన్నుఁ గూడెఁ దతికాల -
మండనే నీమేనఁ దోఁచె ననుమానమేలే ॥ కన్నె ॥ 262

వరాళి

కానీ కానీ యందుకేమి కైతప్పినా
సానఁబట్టి నీగుణము జవదాఁట నిచ్చినా ॥ పల్లవి ॥

చిమ్ముఁజూపు చూచి యిట్టె సిగ్గువడెఁగాక నేఁడు
కొమ్మ నీపైమోహములోఁ గొఱఁతున్నదా
నెమ్మది నీమాఁటలకే నివ్వెరగు నొందెఁగాక
అమ్మరో నీపంతమెల్లా నట్టునిట్టు సేయదా ॥ కానీ ॥

నవ్వినందుకే నీతో నలుపు నటించెఁగాక
[2] జవ్వనినీపొందులకు సరియున్నదా
చివ్వనఁ జేయివేయఁగ చిత్తము మఱచెఁగాక
పవ్వళించేపానుపుపై పచ్చి నిన్నుఁ జేయదా ॥ కానీ ॥

నిద్దురకన్నుల నిట్టె నీపై నొరగెఁగాక
గద్దరిచెలియమేన గర్వ మున్నదా
వొద్దిక శ్రీవేంకటేశ వువిదఁ గూడితిగాక
తిద్దని నీచేఁత తేటతెల్లమిగాఁ జేయదా ॥ కానీ ॥ 263

---

1. 'ఇంతలో' అంటే ప్రాసభంగము. ఇందులో = నీజవ్వనములోనే ? నీపతి = మాధవుడు, వసంతుఁడు ? 2. జవ్వనియొక్క నీయొక్క పొందులు ?

సాళంగనాట

అప్పటి నొడఁబాటేల యితఁడయ్యీ నే నయ్యే
వొప్పులుఁదప్పులుఁ దీరె వుండరే మీరు ॥పల్లవి॥

బగ్గనఁ దానే యింకఁ బచ్చితిట్టు తిట్టినాఁడు
యెగ్గులు సిగ్గులుఁ బాసె నేలే యింక
వెగ్గళించి యేమన్నా వెల్లవిరులయ్యీ మాఁట
దగ్గరిగాఁ బనిలేదు తలరే మీరు ॥అప్ప॥

నిమ్మపంట వేసినాఁడు నెట్టన నాకొంగు దాఁకె
యెమ్మెలు నేతులుఁ జెల్లె నేలే యింక
కుమ్మరించి నవ్వఁబోతే గుట్టుచెడీ నిఁక నేఁడు
బొమ్మలజంకెలె చాలుఁ బోరే మీరు ॥అప్ప॥

చెక్కులు తా నొక్కినాఁడు చిత్తము నేఁ గరఁగితి
యెక్కువ తక్కువ దీరె నేలే యింక
అక్కరై శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
మక్కళించె వలపులు మానరే మీరు ॥అప్ప॥ 264

రేకు 1045 వరాళి

ఇరవైనసిరాక కెదురైతిరా । నీ-
పరిణాములే చూడఁ బాలాయరా ॥పల్లవి॥

నిద్దురకన్నుల రాఁగా నీమొగముచూచి నేను
అద్దిరా జాగరమంటా నలిగితిరా
చద్దివిడెము పుక్కిట సవరించుకొని రాఁగా
వద్దిక మాఁటాడవంటా నుస్సురంటిరా ॥ఇర॥

సారెకు నిట్టూరుపుతో సదమదమై యుండఁగ
నీరువంకతుంగవంటా నిలిచితిరా
మేరతో వాసనలెల్లా మేన వాసించుకరాఁగా
తేరెఁ బనులెల్లానంటాఁ దిరిగితిరా ॥ ఇర ॥

కాంతుల నీమోము చంద్రకళలుదేరఁగఁ జూచి
వింతలెల్లాఁ గంటినంటా వెరగైతిరా
యింతలో శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడఁగాను
పంతమెల్లాఁ జెల్లెనంటాఁ బైకొంటిరా ॥ ఇర ॥ 265

దేవగాంధారి

రమణుఁడ ఇంతట రారాదా
సమరతిఁ దేరీ జగడము లిఁకను ॥ పల్లవి ॥

కోవిలతిట్లగొణఁగుల చేతను
తావులు దప్పెను ధైర్యములు
మావుల చిలుకలమాటవెంగెముల
వావులుమాలెను వలపులు చెలికి ॥ రమ ॥

కొంచెపువాయువుకుంటెనతనముల
చంచల మందెను సతిమనసూ
పంచలతుమ్మెదబలములపొంచుల
యించుకించుకే యెక్కెను చలము ॥ రమ ॥

విరులశరంబులవేండ్లవాండ్ల
మరులునుఁ దెలువులు మగువకును
యిరవుగ శ్రీవేంకటేశ కూడితివి
సరసపుమాఁటలు సాగెను కొనకు ॥ రమ ॥ 266

సాళంగం

ఎటువంటివలపో యేమిసేయఁగలదో
కుటిలపుఁదనలోనిగుణమెల్లాఁ గరఁగె ॥ పల్లవి ॥

కలికి దనవిభునికడ కేఁగె వేగిరాన
తిలకము కస్తూరి తిద్దమఱచె
మలసి యాతనితోనే మాటాడేతమకాన
నిలువునఁ దనచేతినిమ్మపండు వదలె ॥ ఎటు ॥

సొగిసి చక్కనిరూపు చూచె పరాకున
మొగి పీడినతురుము ముడువదాయ
జిగిమించ నతనితోఁ జేరి నవ్వె సందడిని
తగఁ జెలియిచ్చినకై దండయును విడిచె ॥ ఎటు ॥

కందువ శ్రీవేంకటేశుఁ గాఁగిలించే వేడుకను
అందపుఁబులకపువ్వులందు మునిఁగె
చిందేటిమోవితేనె చేకొనేటిదప్పితోడ
పందెమాడి తనతో నీపంతమెల్లా నొసఁగె ॥ ఎటు ॥ 267

సామంతం

నీకేలే మాగొడవ నీయంత నుండువుగాక
ఆకొలఁది కాకొలఁది అయ్యీఁగాక ॥ పల్లవి ॥

చొక్కపునీమోము చూచేచూపులకు నడ్డమా
చెక్కుకుఁ జేయడ్డమైతేఁ జెల్లెఁగాక
యిక్కవసెలవినవ్వు లిందులోనాఁ గొంచెమా
నిక్కి నగుము కొంచెము నీకుఁ జెల్లుఁగాక ॥ నీకే ॥

మాటలాడేయందుకు మఱఁగా, నీగుబ్బలకు
మాఁటు పయ్యదైతే నమరుఁగాక
కూటమి నామనసుకు గుఱుతా నీకొనగోరు
కోటిచంద్రవంకలకు గుఱుతింతేకాక ॥ నీకే ॥

చిమ్మురతికాఁగిటికి సిగ్గులా, నీలోలోనే
వుమ్మగిలి వొకచోటి కొదుగుఁగాక
తెమ్మగా శ్రీవేంకటాద్రిదేవుఁడ నేఁ గూడితిని
వమ్మువోనినీకుఁ బరవశములేకాక ॥ నీకే ॥ 268

పాడి

ఇన్నియు నీ కలవాటే ఇంత సేయఁజెల్లదా
సన్నమేమి దొడ్డేమి సడిసన్నవారికి ॥ పల్లవి ॥

చెల్లదా నీకు నాచెఱఁగువట్టి తియ్యఁగ
గొల్లెతలచీర లందుకొన్ననీకును
చెల్లఁబో నీవు నాతో చేరి నవ్వఁజెల్లదా
తల్లిఁగూఁతు నొక్కవావిఁ దగులనవ్వేనీకు ॥ ఇన్ని ॥

వెక్కసాన నీవు నన్ను వేసుకొన్నాఁ జెల్లదా
గక్కునఁ బదారువేలఁ గైకొన్ననీకు
తెక్కులఁ దిట్టి నాచేతఁ దిట్టించుకోఁజెల్లదా
వొక్కట నూరుదిట్లు కోరిచిననీకు ॥ ఇన్ని ॥

తెగి నన్ను నీమీఁదికిఁ దీసుకొన్నాఁ జెల్లదా
మోగి శ్రీసతి నురాన మోచిననీకు
తగురా శ్రీవేంకటేశ దక్క నన్నుఁ గూడితివి
నగ నీకఁ జెల్లదా నాటకపునీకు ॥ ఇన్ని ॥ 269

శ్రీరాగం

వలెనా ఆతనితోవాదులు నీకు । వో-
లలనా నీమనసు లక్కవంటిది ॥పల్లవి॥

తగవా ఆతనితోఁ దారుకాణలు । వో-
మగువా ఆతఁ డెంత మన్నించినాను
నగవు నేసుక నీవు నడచుటింతే కాక
బిగువు చెల్ల దింత ప్రియునితో నీకు ॥వలె॥

అలుకలు యింకనేలే ఆతనితోను । వో-
కలికీ పిలిచితేఁ గాదనరాదు
పలుకఁదేనె చల్లి పైకొనుటింతే కాక
చిలుకఁజలములు చెల్లవిఁక నీకు ॥వలె॥

కలయకుండఁగనేలే కాంతునితో । వో
చెలియా ఆతఁడట్టె చేయిచాఁచఁగా
వెలయువలపులవేడుక శ్రీవేంకటాద్రి-
నిలయుఁ డిదె కూడె నిట్టూర్పేలే నీకు ॥వలె॥ 270

రేకు 1046 నాట

అందుకే పో నీచేత నగడైతిమి
యిందరిని మొఱఁగేవు యేడ చొచ్చేదే ॥పల్లవి॥

పంతమే కావలెనొండె పతితో నిప్పటివేళ
సంతమే కావలెఁగాక సటలేఁటిదే
వంతులకుఁ బెనఁగేవు వాదులకు వచ్చేవు
యింతలో రెండూనైతే యేడ చొచ్చేదే ॥అందు॥

నగవే కావలె నొండె నడుమ సీతనితోడి -
తెగువ గావలెఁగాక తిట్టులేఁటిదే
మొగమునుఁ జూచేవు మోనానఁ దలవంచేవు
యెగదిగపోఁతలైతే నేడ చొచ్చేదే ॥ అందు ॥

సిగ్గులే కావలె నొండె శ్రీవేంకటేశు నిట్టె
దగ్గరి కూడుటేకాక తచ్చనేఁటిదే
అగ్గమై కూడితివి అన్నిమాఁట లాడితివి
యెగ్గులు నెమ్మెలునైతే నేడ చొచ్చేదే ॥ అందు ॥ 271

## భైరవి

అది నాభాగ్యమేకాక అతఁ డేమిసేసునే
అదనై నందాఁక నింతే అతఁ డేమిసేసునే ॥ పల్లవి ॥

కలువకన్నులఁ జూచె ఘనుఁ డాతఁ డవె నాకు
అలరుబాణములైతే నతఁ డేమిసేసునే
పలుకుఁదేనెల నాతోఁ బలికె నవె నాకు
చిలుకుబాసటమైతే సేయుమనే దేమే ॥ అది ॥

వెన్నెలనవ్వులు నవ్వె విభుఁ డాతఁ డవె నాకు -
నన్నువట్టియెండలైతే నాతఁ డేమిసేసునే
సన్నిధిఁ గప్రము చల్లె సరసపువేళ నాకు -
నన్నిటాఁ జొక్కుమందైతే నాతఁ డేమిసేసునే ॥ అది ॥

కొంగువట్టి తీసి నన్నుఁ గూడె నాతఁ డది నాకు -
నంగమెల్ల మఱపించె నాతఁ డేమిసేసునే
ఇంగితపుశ్రీవేంకటేశుఁడు మోహించఁగాను
అంగడి కెక్కె వలపు అతఁ డేమిసేసునే ॥ అది ॥ 272

రామక్రియ

ఇంటికి వచ్చితి నీకనేలే
జంటలమనలో జగడము దీరె ॥ పల్లవి ॥

చాయలఁ దిట్టకు సన్నలఁ గొణఁగకు
చేయిని వేసితి చెక్కును నొక్కితి
మాయలు సేయకు మతకము నెరపకు
నాయంత నవ్వితి నను పును నాయ ॥ ఇంటి ॥

శిరసును వంచకు చింతలఁ బొరలకు
కురులునుఁ జెరిగితి కుంకుమ వూసితి
నెరుసులు వెదకకు నేరము లెంచకు
వొరసితి నీతో నొక్కటులాయ ॥ ఇంటి ॥

చిమ్మకు చూపులు సిగ్గునఁ బొరలకు
కమ్మఁర గాఁగిటఁ గలసితి వెలసితి
యిమ్ముల శ్రీవేంకటేశుఁడ నే నిదె
రమ్మని పిలిచితి రతికెక్కితిని ॥ ఇంటి ॥ 273

సామంతం

ఇంచుకంతవడిలోనే యిన్నియుఁ దేరీఁగాని
కొంచ కాతనిసంగడిఁ గూచుండఁబెట్టరే ॥ పల్లవి ॥

చెక్కుల నున్నది చింత చిత్తాన నున్నది యాస
వుక్కుమీరి మేనిమీఁద నున్నది కాఁక
యిక్కడి కిందాఁక రాక యిప్పుడు విచ్చేసెఁ బతి
మక్కువఁ జెలియమారు మాటాడరే చెలులు ॥ ఇంచు ॥

మోమున నున్న దలుక ముక్కున( గోప మున్నది
దీమసపు(జూపులలో తిట్లున్నవి
వేమరు విరహమున విభు( డింత సేసెనంటా
కామిని దగ్గరిపోదు కదియరే మీరు ॥ ఇంచు ॥

కన్నుల నున్నది మొక్కు కాఁగిట నున్నది మేలు
సన్నల నున్నది రతిసరస మిది
యెన్న(గ శ్రీవేంకటేశు( డీయలమేల్మంగను
వున్నతి( గూడె నవ్వుతా నుండరే మీరు ॥ ఇంచు ॥ 274

## శ్రీరాగం

ఏ(టికి నన్ను భ్రమయించే వింకా
కూటపుసరసమే గుఱుతులాయరా ॥ పల్లవి ॥

చలమున వలపులు చల్ల(గ( జల్ల(గ
నిలువున బులకలు నిండె నిదె
పలచనియెలుఁగున( బాడ(గ నామెయి
చెలమలచెమటలు చెరువులాయరా ॥ ఏ(టి ॥

చిక్కనినవ్వులు చింద(గ( జింద(గ
ముక్కున నుసురులు ముంచె నిదె
కక్కసించి యిటు కన్నులార్చ(గా
మిక్కిలితమకము మేరమీరెరా ॥ ఏ(టి ॥

బిగువు(గాఁగిటిటను( బిసుక(గ( బిసుక(గ
పొగరుకుచగిరులు పొడవాయ
అగపడి కూడితి వలమేల్మంగను
పగటు శ్రీవేంకటపతి మరిగితిరా ॥ ఏ(టి ॥ 275

రీతిగౌళ

కొన్నదె కొనఁగఁబోతే కోపము సరకుగాదు
వన్నెమీఁద వన్నెలేలే వాసులివి చాలదా ॥ పల్లవి ॥

మోపులుగా మాటలన్ని మూఁటగట్టివేసీని
ఆఁప లేజవ్వనభార మది చాలదా
పూఁపవలపులు నాపై పొద్దువొద్దుఁ బూసీని
పోపో విరహపుఁగాఁక పూసె నాఁడే చాలదా ॥ కొన్న ॥

కన్నచూపుమెఱుఁగులగంపఁ గమ్మి నన్ను నిట్టె
యెన్నికె గంపంతకొప్పు ఇది చాలదా
కన్నెపచ్చిసేఁతలనే కలగూర లేరీని
వున్నది నామేనఁ బచ్చి వూరకింత చాలదా ॥ కొన్న ॥

తనతో నవ్వఁగఁబోతే తరితీపునేసీని
దినము నామోవిమీఁదితీపు చాలదా
యెనయ శ్రీవేంకటేశుఁ డిపు డిట్టె నన్నుఁ గూడె
మనసిచ్చితి నలమేల్మంగ నేనే చాలదా ॥ కొన్న ॥ 276

రేకు 1047 సామంతం

అయలేరా పంతమాడేయంచు కేమిరా
యేమెడ నెంతోరిచినా నెఱఁగవుగాక ॥ పల్లవి ॥

అంటిముట్టి సరసము లాడలేనా నీమేను
వొంటిఁ గాలు దాఁకుఁ జేసు వొద్దనికాక
వెంటవెంటఁ దిప్పి నిన్ను వేగ వలపించలేనా
నంటున నన్నిందరు నవ్వేరని కాక ॥ అయ ॥

ముందు నిన్నుఁ దమిరేఁచి మొక్కించుకొనలేనా
అందరిలో నిది దోసమనికాక
పందెమాడినటు నీమై పచ్చిగాఁ జేయఁగలేనా
అందపునీమేను రేకలయ్యీ నని కాక ॥ ఆయ ॥

మోవిఇచ్చి పుక్కిటఁదమ్మలము నే నించలేనా
భావించి నాలోనే సిగ్గువడికాక
శ్రీవేంకటేశ నీవే చేరి నన్నుఁ గూడితివి
యీవల నలమేల్మంగ నిరవైతిఁగాక ॥ ఆయ ॥ 277

శంకరాభరణం

దయదలఁచేవాఁడు తానేకదవే
నయగారికపతైన నాకు తానేకదవే ॥ పల్లవి ॥

యిక్కడ నే నలిగితే యేల పగచాటినే
తక్కులఁబెట్టేవాఁడు తానేకదే
వుక్కున నే నూరకుంటే పొట్టేల పెట్టుకొనీనే
యెక్కుడుసేఁత సేసితే నింకఁ దానేకదవే ॥ దయ ॥

వగల నేఁ దిట్టితేను వాదుకేల వచ్చీనే
తగవువెట్టేవాఁడు తానేకదవే
నగుతా గోరనూఁదితే నను నేల దూరీనే
యెగసక్కేలాడేవాడు యిఁకఁ దానేకదవే ॥ దయ ॥

బలిమి నేఁ గూడితేను పంతము లేలాడీనే
తల మోచి వచ్చినాఁడు తానేకదవే
అలమేలుమంగ నేను ఆతఁడు శ్రీవేంకటేశుఁ-
డిల నన్నుఁ గూడి చొక్కె నింకఁ దానేకదవే ॥ దయ ॥ 278

బౌళి

మానిపండ్లు మఱి మానికిందనే వుండు
తానేమన్నా తనకే యనరే ॥ పల్లవి ॥

చిగురులమాఁటల చిల్లులువోయను
తగుఁ బెదవులపై తనకే అది
మగటిమి యింకా మాతో నేఁటికి
జగడము లడిచీఁ జాలించు మనవే ॥ మాని ॥

కారపుఁజూపుల కొలువలాయను
దారలచెమటలఁ దనమేన
పోరుచు మాతో బొంకఁగ నేఁటికి
దూరులఁబడితిమి తొల తొలమనవే ॥ మాని ॥

కొనగొనచేతులు గురులయి తగిలెను
తననాకాఁగిట తనఁదనకే
యెనసెను శ్రీవేంకటేశుఁడు నన్నిటు
ఒనికయి అలమేల్మంగ నేఁ గదవే ॥ మాని ॥ 279

హిందోళం

సాదించఁ బొద్దులేదు చుంకించ వేళలేదు
యీదెస రమణునికి ఇంతలో లోనైతి ॥ పల్లవి ॥

అలిగి నే రాఁగా నప్పుడే మొగము చూపి
తెలిఁగన్నుల నవ్వితే తీరెఁ గోపము
తలవంచుకుండఁగానే దగ్గరనే నిలుచుండి
కలకల మాఁటాడితే గక్కున నే నవ్వితి ॥ సాదిం ॥

ఆకడిమోహమై వుండే ఆయములు గరఁగంగ
కైకొని పైనొరగితే కందువానెను
చీకాకునిట్టూరుపుల చిముడఁగ వెనకకు
కోకవట్టి తీసితే గక్కన సమ్మతించితి ॥ పాదిం ॥

చెక్కుచేర నే నుండఁగా చేయిఁజేయిఁ గిలించి
తొక్కినపాదములోనే దొరసెఁ బొఁ(బొం?)దు
యిక్కువ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
గక్కన నలమేల్మంగఁ గనక మోహించితి ॥ పాదిం ॥ 280

మలహరి

నాటివాఁడవేకాదా నాకడ నేఁడును
కూటము లింకాఁ గొసరఁగవలెనా ॥ పల్లవి ॥

నాకు నావాఁడవై ననిచితి విట్టై
యేకడ నెవ్వరి కెట్టుందువో
ఆకడ వస్త్రాపహరణమువేళను
జోకగఁ జేసినసుద్దులు వినమా ॥ నాటి ॥

చేరి నామాఁటలే చెల్లించే విట్టే
యేరీతి నెందరి కెటువలెనో
కూరిమి రేపల్లెగోపికలయడనే
తేరె నీగుణము తెలిసితి మిపుడు ॥ నాటి ॥

కాఁగిట నాకునుఁ గరఁగే విట్టే
యేఁగి కడసతుల కేమందువో
లోఁగ కిప్పు డలమేలుమంగఁ గూడితి -
వాఁగి శ్రీవేంకటేశ అంతరాత్మవు ॥ నాటి ॥ 281

నాదరామక్రియ

పోసీపోసీ ఇఁక నేల పోయినసీళ్ళకుఁ గట్ట
నేనే యింతకుఁ జొచ్చితే నిన్నుఁ బారనిత్తునా ॥ పల్లవి ॥

పదవోయి నీమాఁటపట్టు నీకే వచ్చెను
వదల కెప్పుడును నీవారమే నేము
కదిసి నీ విందుకొరకా వలపించితివి
యిది నే నెఱిఁగితేను యింతా మెచ్చుసేయనా ॥ పోసీ ॥

చాలునోయి యిందాఁకా నీసరితలే చూచితిమి
యీలాగుల నీకు నే మీఁదెత్తితి మేను
తాలిమి నీచేసన్న లింతకువచ్చెనా నేఁడు
నాలినీగుణము గంటే నాఁడే మెచ్చుసేయనా ॥ పోసీ ॥

తగునోయి నీకు-నాకుఁ దతివచ్చె మితివచ్చె
మొగి నిన్ను నేడఁగన్న మొక్కేము నేము
అగడు శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
నిగిడి నన్నుఁ గూడితి నీకే మెచ్చుసేయనా ॥ పోసీ ॥ 282

రేకు 1048 సౌరాష్ట్రం

వరుసకు రాకుంటే వావిదప్పీనా
వెర విందు కేది గోవిందరాజా ॥ పల్లవి ॥

చిందేటితేనెమోవితో చెలి నీతో మాటలాడె-
నందుకంటె నేమిసేసు నది చాలదా
ముందే మొల్లచూపులను ముంచి చల్లఁగాఁ జూచె
కందువైన దిందుకంటె కలదా ప్రియము ॥ వరు ॥

[1]వెన్నెలనెంవితోడ వెలఁది నీతో నవ్వె
యిన్నిటా నీయానోద మిఁక నెంతయ్యా
అన్నువచంద్రునివంటిఆననము నీకుఁ జూపె
యిన్నేసిచేఁతలు సేసె నిఁకనేమి గదమ ॥ వరు ॥

చిగురుఁదీగెలవంటిచేతులు నీపై వేసె
తగవులన్నియుఁ దేరె తారుకాణేలా
పగటుశ్రీవేంకటాద్రిపతి విట్టె కూడితివి
జగడాలిన్నియుఁ బాసె చనవింత చాలదా ॥ వరు ॥ 283

వరాళి

ఇంతలాయ వింతలాయ నెందాఁక సరసాలు
చెంతలఁ జేరఁగరాదా చెలి జవ్వనమున ॥ పల్లవి ॥

చిత్తరువు వ్రాఁతలాయ చెలినివ్వెరగులు
ముత్తెపుముగ్గులాయను మోహాములెల్లా
వొత్తులశేనియలాయ వొలఁతిపలుకులెల్ల
చిత్తగించి చూడరాదా చెలియభావములు ॥ ఇంత ॥

విడువనిజడులాయ వెలఁదిమెయిచెమటలు
తడఁబడేసంపదాయ తమక మది
కదివోనివిరులాయ కందువకోరిక లివి
తొడిఁబడఁ జూడరాదా తొయ్యలిచందములు ॥ ఇంత ॥

పూచినవెన్నెలలాయ వొలఁతినెలవినవ్వు
చూచినటల్లానాయ సొంపుకళలు
యేచినశ్రీవేంకటేశ ఇట్టె ఇంతిఁ గూడితివి
రాచిలుకవంటిదాయ రమణి నీరతిని ॥ ఇంత ॥ 284

1. వెన్నెలను నెంవి కుపమానముచేయుట క్రొత్త. 'పన్నెలకు' వ్యావహారికము గావచ్చు.

పాడి

నీవల్లఁ గడమ గద్దా నేనే యాసగించేఁగాక
భావ మొక్కటేకాదా పంతమాడేఁగాక ॥పల్లవి॥

యెఱఁగనా నీవు నాపై నిటుగలమోహము
గుఱిగా మఱచి ఇఁకఁ గొసరేఁగాక
మఱి కరఁగనా నీమంతనపుకాఁగిటిలో
జఱసి తనియ కిట్టె జంకించేఁ గాక ॥నీవ॥

ఇయ్యకొననా నీవు ఇచ్చినచనవులెల్లా
తియ్యనిసిగ్గున నేనే తిట్టితిఁగాక
నెయ్యపునీగుణమెల్లా నేఁ గన్నదేకాదా
పయ్యదజారినందుకే పదరితిఁగాక ॥నీవ॥

వినవా నీవాడినట్టివినయపుమాటలెల్లా
ననుపుమందెమేళాన నగితిఁగాక
యెనయఁగ శ్రీవేంకటేశ నేనూఁ గూడనా
పెనఁగేయందుకే నేను ప్రియపడేఁ గాక ॥నీవ॥ 285

గుండక్రియ

కానీకానీ యందుకేమి కడమ దేరీఁగాక
నానఁగాఁ గోపము దీరి నవ్వువచ్చేఁగాక ॥పల్లవి॥

అనలేనా నిన్ను నే ననఁగలమాఁటలెల్లా
మనసు నొచ్చీనంటా మానితిఁగాక
చెనకలేనా నీవు సేసినచేఁతకుఁ జేత
తనువు పచ్చొనంటా దయవుట్టెఁగాక ॥కానీ॥

---

1. మోసగించు బోలికతో 'ఆసగించు' వ్యావహారికమై యుండవచ్చు.

బొమ్మల జంకించలేనా పుక్కిటితమ్మటుచూచి
నెమ్మి సిగ్గువదేవంటా నే నుంటిఁగాక
చెమ్మఁజెమటలు చూచి చేరి యలుగఁగలేనా
వుమ్మడిఁ జింతించేవంటా నొక్కటైతిఁగాక ॥ కానీ ॥

పంతమాడలేనా నీపరవశములు చూచి
కొంత నీవెఱఁగేవంటాఁ గూడితిఁగాక
యింతటా శ్రీవేంకటేశ యేకమైతి మిద్దరము
వంతువాసు లెంచలేనా వలచితిఁగాక ॥ కానీ ॥ 286

లలిత

బాపు బాపు జాణఁడా పైకొంటి నేఁడు
యేపుమీరె నాసోద మిఁకనెంత నేఁడు ॥ పల్లవి ॥

శిరసు నెత్తితివి చెక్కు నొక్కితివి
అరయ నీ కొక్కమన సాయఁగా నేఁడు
వెరవు చూపితివి వెన్నెలనవ్వు నవ్వితి-
వరిది నొక్కమన సాయఁగా నేఁడు ॥ బాపు ॥

బొమ్మల జంకించితివి బూతునఁ దిట్టితివి
అమ్మరో నీకోరినట్టె ఆయఁగా నేఁడు
తమ్ములము వెట్టితివి దక్కఁగ మోవిచ్చితివి
అమ్ముడువలపు సతమాయఁగా నేఁడు ॥ బాపు ॥

గక్కనఁ గూడితివి కన్నులఁ జొక్కితివి
అక్కరఁ దనివి నీ కాయఁగా నేఁడు
గక్కన శ్రీవేంకటేశ కలకాలమెల్ల నన్ను
అక్కన నిలిపితివి అరుదాయ నేఁడు ॥ బాపు ॥ 287

దేసాళం

నీవే చనవిచ్చితివో నెలఁతగర్వమో యిది
  వావాఁత మాఁటలాడి వలపుచల్లీ నిదె ॥పల్లవి॥

మొకమెత్తి చూచీని నీమోహాన ముద్దుచూపీని
  నకనకవాడి వాడి నవ్వు నవ్వీని
  చికురము దువ్వీదువ్వి చేసన్న నేసీని
  యెకసక్కెమో నాతో నెవ్వతెరా నేఁడు ॥నీవే॥

కన్నులు దేలవేసీని కడుఁగేకరించీని
  చన్నుమొనలు చూపీని జరసీని
  కిన్నెరలు మీఁటీని కిందుపడి మొక్కీని
  యిన్నేసిమాయలు నేసీ నెవ్వతెరా యిది ॥నీవే॥

కప్పురవిడె మిచ్చీని కాఁగిలించవచ్చీని
  నెప్పున శ్రీవేంకటేశ నీతో నిదె
  అప్పుడే నన్నుఁ గూడితి వండ నేనూ నున్నదాన
  చిప్పిలీ నిదెవ్వతెరా సిగ్గువడ దిపుడు ॥నీవే॥ 288

రేకు 1049 పాడి

ఇటమీఁద నీచిత్త మెట్టువలసినఁ జేయు
  కుటిలాలకి(క?)వలపు గుఱుతాయ నయ్యా ॥పల్లవి॥

తనువు పానుపుమీఁద తలఁపెల్ల నీమీఁద
  కనుచూపు లివి నీరాకలమీఁద
  వినయాలు చెలులతో వేసట మరునితోను
  వనితవలపు లింత వన్నెకెక్కెనయ్యా ॥ఇట॥

చెక్కు_కుఁ జేయివచ్చె నెలవికి నవ్వువచ్చె
ముక్కు_మీఁదివేలితోడ మోనము వచ్చె
పుక్కిటి నూర్పులు నిండె పొందులు కోర్కు_ల నిండె
చక్క_నింతివలపు లీచందమాయనయ్యా ॥ ఇటు ॥

కళలు మోమున నెక్కె_ కాఁగిలి నీకు నెక్కె_
తలకొన్నసంతసము తలకెక్కె_
యెలమి శ్రీవేంకటేశ ఇంతి నీవు గూడఁగాను
జలజాక్షివలపులు సతమాయనయ్యా ॥ ఇట ॥ 239

## శ్రీరాగం

నిమిషముఁ బాయలేరా నిన్నెడసి యొకచోట
తమకమేకాని నాధైర్యమేఁటిదిరా ॥ పల్లవి ॥

వాకిటి కంపించుకొని వత్తుఁగాని నీచేత
ఆకడ మగుడ నీయండకు రాకుండలేరా
కైకొని తప్పక చూచి కనురెప్ప వేతుఁగాని
జోకలఁ గమ్మర నిన్నుఁ జూడకుండలేనురా ॥ నిమి ॥

మాటలాడి నీతోను మానినట్టే వుందుఁగాని
పాటించి అంతటిలోనే పలుకక వుండలేరా
పాటిసిగ్గునను నాపయ్యదఁ గప్పుదుఁగాని
వూటచమట నాచన్నుల నొత్తకుండలేనురా ॥ నిమి ॥

మంతనపు నీరతుల మనసు చొక్కు_దుఁగాని
అంతలోఁ దెలిసి మరి యాసపడకుండలేరా
అంతట శ్రీవేంకటేశ అదెతిఁగి కూడితివి
చింతలో నీమేలు నేను చింతించకుండలేరా ॥ నిమి ॥ 290

శ్రీరాగం

రమణుఁడ చెప్పుమా రమణి నీయెదను
జమళి రెండొకటఁ జల్లీ వలపు ॥ పల్లవి ॥

మోతుగు వూచెనో మొల్ల వూచెనో
కాతరపుచెలి కన్నులను
చూతము వూచెనో సురపొన్న వూచెనో
ఘాతల నీసతికాయమున ॥ రమ ॥

పగడము వండెనో పైమోవి పండెనో
అగపడి యీకాంతఅధరమున
పొగరునిమ్మలో పోకలు వండెనో
మగువ కిదివో నెమ్మదిఁ జన్నులను ॥ రమ ॥

తమలపుఁజిగురో దాడిమచిగురో
అమరెఁ గరములనె అంగనకు
చెమటలఁ గూడితి శ్రీవేంకటేశ్వర
సమరతి మీయిచ్చలు చిగిరించె ॥ రమ ॥ 291

రామక్రియ

చెప్పరాదు మీపొందులు చిగురు చేఁగైనట్టు
ఇప్పుడే మెచ్చితిమి నే మిద్దరిఁ జూచి ॥ పల్లవి ॥

చెలిఁ జూచితివి నీవు చెలియూ నిన్నిటు చూచె
కలువలుఁ దామరలుఁ గలసినట్టు
పలికితి వింతితోడ పడఁతియు మాటలాడె
చిలుకలుఁ గోవిలలు చిమ్మిరేఁగినట్లు ॥ చెప్ప ॥

అప్పుడే నీవు నవ్వితి వంగన నీతో నవ్వె
 కప్పురాలూ వెన్నెలలుఁ గలపినట్టు
 నెప్పునఁ జేయివేసితివి నెలఁతయుఁ జేయివేసె
 వొప్పగుఁదీగెలుఁ దూంట్లొనగూడినట్లు ॥ చెప్ప ॥

పట్టితి వీకెపయ్యెద భామయు నీచేయి వట్టె
 గట్టి హేమాద్రి నీలాద్రిఁ గలసినట్టు
 ఇట్టె శ్రీవేంకటేశ యీసతి నీవురముపైఁ
 బెట్టితి వాకె నిలిచెఁ బెండ్లాడినట్లు ॥ చెప్ప ॥ 292

ఆహిరి

ఏడనున్నా నీవారమే యెరవుసేయకు వయ్య
 మోడామోడితనమున మొక్కేము నీకు ॥ పల్లవి ॥

పాయము నీ కిచ్చితిమి పంతములదానఁ గాను
 పోయివచ్చేమయ్యా పొద్దున నేము
 కాయ మిది నీసొమ్ము కడమ నే నెఱఁగను
 మాయింటికి రావయ్యా మరి చెప్పేఁగాని ॥ ఏడ ॥

మనసు నీ కొప్పనాయ మారుమాట లెఱఁగము
 వెనక వచ్చేమయ్యా విడిదికిని
 దినము నీకే సెలవు దేవరచిత్త మీఁకను
 ననుఁ జూడవయ్యా నవ్వు నవ్వేఁగాని ॥ ఏడ ॥

నేస నీపైఁ బెట్టితిమి చెప్పుకొనఁ బనిలేదు
 ఆసతో నుండేనయ్య ఆడనే నేను
 బాసతో శ్రీవేంకటేశ పైకొని కూడితి విందే
 వేసరక రావయ్యా వెంటఁ దిప్పేఁ గాని ॥ ఏడ ॥ 293

భైరవి

పంతము నీకిదె వచ్చె పరవశములు హెచ్చె
ఇంతటనైన మాట లియ్యకొనరాదా ॥ పల్లవి ॥

చెలిమోవిఁ దేనె లూరె చెమటలు మేనఁ గారె
చలము లింతటనైనఁ జాలించరాదా
నెలవి నవ్వులు చిందె సిగ్గులు చేతికి నందె
అలివేణి నీకనైన నాదరించరాదా ॥ పంత ॥

విట్టూర్పు లివె మించె నివ్వెర కన్నులఁ బెంచె
వట్టిజాలి యింకనేల వరు సీరాదా
మట్టుమీరెఁ దలపోఁత మానిని వలపు యీఁత
యిట్టె విచ్చేసి యింతి నీకఁ జేకోరాదా ॥ పంత ॥

పున్నమకళలు నిండె పులకపంటలు పండె
మన్నించి వనితతోడ మాటాడరాదా
వున్నతి శ్రీవేంకటేశ వొక్కటైతి వీకెతోడ
యిన్నిటా యేకచిత్తాన యింక నుండరాదా ॥ పంత ॥ 294

రేకు 1050 మంగళకౌశిక

క్షీరాబ్ధికన్యకకు శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయమునకు(యకును?) నీరాజనం ॥ పల్లవి ॥

జలజాక్షిమోమునకు జక్కవకుచంబులకు
నెలకొన్నకప్పురపునీరాజనం
అలివేణితురుమునకు హస్తకమలంబులకు
నిలువుమాణిక్యములనీరాజనం ॥ క్షీరా ॥

చరణకిసలయములకు సకియరంభోరులకు
నిరతమగుము త్తెలనీరాజనం
అరిదిజఘనంబునకు నతివనిజ(నత?)నాభికిని
నిరతి నానావర్ణనీరాజనం ॥ క్షీరా ॥

పగటు శ్రీవేంకటేశుపట్టపురాణియై
నెగడుసతికళలకును నీరాజనం
జగతి నలమేల్మంగచక్కఁదనముల కెల్ల
నిగుడు నిజశోభనపునీరాజనం ॥ క్షీరా ॥ 295

ఆహిరి

అవి యేమరకుమీ అనరే మీరు
తివిరి విభునిఁ దానే తెలుసుకొమ్మనరే ॥ పల్లవి ॥

కాయ మీఁద నుందిగాని కడమదొడమ నా-
ఆయమెల్లాఁ దనచేతి దనరే మీరు
చేయి చెక్కుమీఁద నాకు చేరిన దింతేకాని
చాయఁ దనమేన గోరు చక్కఁజూడు మనరే ॥ అవి ॥

మాట లీడ నాదేఁగాని మనసెల్లఁ దనమీఁద
నాటియున్న దనరే నానాయకునితో
యేఁటికో నవ్వేఁగాని యెదురై తనమీఁద
కాటుకకన్నులచూపు ఘాతసేసు ననరే ॥ అవి ॥

అవ్వలిమోమైతిఁ గాని అదియొకబంధమున
చివ్వనఁ గూడితి నని చెప్పరే మీరు
రవ్వగా శ్రీవేంకటేశు రతిఁ గొసరితిఁగాని
నవ్వుతా నే నటించిన నాటకము లనరే ॥ అవి ॥ 296

మాళవిగౌళ

నేర మింతటికి నేమైతే
 ఆరితేరినది యలమేల్మంగ ॥ పల్లవి ॥

కన్నులచూపులు కాఁకలరేఁపులు
 వెన్నెలనవ్వులు వెదచల్లీ నదె
 చన్నుల నొత్తీ సరసుఁడ నీమై
 అన్నిట జాణ యీయలమేల్మంగ ॥ నేర ॥

పెదవులముద్దుల పిలుపులయెలుఁగుల
 వదలుఁబయ్యెదనె వలపించీ నదె
 కదలుచు మెచ్చీ ఘనుఁడ నీయెదుట
 అదె నేర్పరిగా యలమేల్మంగ ॥ నేర ॥

నయములమాటల నటనలపాటల
 పయిఁ జెయివేయుచు భ్రమయించీ నదె
 నియతి శ్రీవేంకటనిలయ నినుఁ గలసె
 అయుతపురతులనె యలమేల్మంగ ॥ నేర ॥ 297

సామంతం

మించి నీవే సేతుగాక మీఁద మిక్కిలిపనులు
 పంచనే మొదల నెట్టు పైకొనేరా ॥ పల్లవి ॥

గక్కనఁ జూచినంతనే కళదాఁకె నా(నీ?)తోడ
 మక్కళించి యిఁక నెట్టు మాటలాడేరా
 మిక్కుటమై పులకించె మెరసి నీవు రాఁగానే
 యిక్కువ లెరిఁగి నిన్ను నెటు గాఁగిలించేరా ॥ మించి ॥

దవ్వుల నీవు నవ్వితే తనువెల్లాఁ జెమరించె
రవ్వగా నీతో నెట్టు రతిసేసేరా
అవ్వల సన్న నేసితే నంతలోనే భ్రమసితి
చివ్వన నీచెఱఁ గెట్టు చేతఁ బట్టేరా ॥ మించి ॥

తతితో వీడె మిచ్చితే తలకెక్కె వలపెల్లా
యితవై నీమోవి యానే దిఁక నెంతరా
అతివేడుక శ్రీవేంకటాద్రీశ కూడితివి
మతిలోఁ జొక్కుటగాక మరి యేమనేరా ॥ మించి ॥ 298

వరాళి

చేరి చూడ మాకునైతే సిగ్గులు గానీ
యీరీతి సింగారాలు యీతనికే తగునే ॥ పల్లవి ॥

నున్ననిలత్తుకవన్నె నొసలిపై నించెఁగదే
అన్నువ కిన్నెరమీఁటు లాతనిమై నంటెనే
పున్నమవెలుఁగు మోముపొంతనెల్లా నిండెఁగదే
యిన్నేసి సింగారాలు యీతనికే తగునే ॥ చేరి ॥

కుంకుమగుబ్బలపూఁతగుఱుతు మైనంటెఁగదే
అంకెల మోవికెంపులు అమరెఁగదే
కొంకక వాడుఁబువ్వులు కొప్పుమీఁద రాలెఁగదే
యింకా నిన్నిసింగారాలు యీతనికే తగునే ॥ చేరి ॥

శిరసుచెమటవానచిత్తడి పై జారెఁగదే
యెరవులసొమ్ము మేన నిదివో కదే
పరగ శ్రీవేంకటాద్రిపతి నన్నుఁ గూడెఁగదె
యిరవైన సింగారాలు యీతనికే తగునే ॥ చేరి ॥ 299

మాళవి

చెల్లినట్లు నీవే చేఁత సేతువు గాక
.యెల్లి నేఁ డనేజాగు లింకానేలే ॥ పల్లవి ॥

చెక్కులెల్లాఁ జెమరించె సేసకొప్పు వెడజారె
యిక్కడ నాతోఁ గోప మింకానేలే
మొక్క నాచేతికి వచ్చె మోవి నీకు నవ్వు చిందె
యెక్కువవెంగెపుమాట లింకానేలే ॥ చెల్లి ॥

తనువెల్లాఁ బులకించె తగునిట్టూర్పులు రేఁగె
యినుమడించినచల మింకానేలే
మును నాపంతము వచ్చె మొగి నీసిగ్గులు మించె
యెనలేనియనుమాన మింకానేలే ॥ చెల్లి ॥

వలపు కాఁగిట కెక్కె వాసులరేసులు నిక్కె
యెలయింపుఁగసరులు యింకానేలే
బలిమి శ్రీవేంకటాద్రిపతి నేఁ గూడితి నిన్ను
యెలుఁగెత్తి రట్టుసేయ నింకానేలే ॥ చెల్లి ॥ 300

రేకు 1051 సామంతం

ఎంతదవ్వయిననేమి ఇక్కడ నుండిననేమి
చింత వొక్కటైనప్పుడే చేరువౌటగాదా ॥ పల్లవి ॥

విన్నునంటినట్టిగాలి నేఁడు నామీఁదఁ బొలసె
యెన్న నది యిద్దరికి నేకముగాదా
ఇన్నిటా నొకచందురు నిద్దరముఁ జూచితిమి
కన్నులచూ పిదరికిఁ గలయుటేకాదా ॥ ఎంత ॥

యిద్దరియేలుఁగులకు యీయాకసమె గురి
అద్ది [1]మనయిదియె మాటాడుటగాదా
పొద్దుపొద పొక్కఁటే పొంచి యీయింటా నాయింటా
వొద్దనుండినట్టేకాదా వోరసిన భేదమా ॥ ఎంత ॥

భావజునమ్ములే కావా పలుమారు సోఁకేవి
చేవదేరె నవె పూవుసేసలు గావా
శ్రీ వేంకటేశ నీవే చేకొని కూడితి నన్ను
యీవేళలకు నిదె హితవుగాదా ॥ ఎంత ॥ 301

నీలాంబరి

ఉన్నవేమీ గుఱిగావు వొద్దనుండి నీవు నాతో
అన్నమాటలే గుఱుతు అప్పటికప్పటికి ॥ పల్లవి ॥

చూపులకు గుఱుతు నీసోయగమైనమేను
తీపులకు గురి నీతేనెమోవి
కోపములకు గురి నీ గోరిమదనరేకలే
చేపట్లకు గుఱి నీచెట్టాపట్టాలే ॥ ఉన్న ॥

చిత్తమునకు గుఱుతు సేసేటినీచేఁతలే
హత్తి నాయాసకు గురి అంటుఁగాఁగిలి
మొత్తపు నవ్వుకు గురి ముంచిననీసుద్దులే
గుత్తపువలపులకు గురి నీమోహములు ॥ ఉన్న ॥

పంతములకెల్లా గురి పరచినపానుపే
సంతసములకు గురి సరసములే
ఇంతలో శ్రీ వేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
మంతనాలకెల్లా గురి మతిపరవశమే ॥ ఉన్న ॥ 302

1. మనయిది=మనశబ్దము. ఈ 'ఇది' శబ్ద మీనాటికిని వ్యవహారమున గలదు. 'నాకు చాలా ఇదైంది' ఇత్యాది. ఆ ఇది శబ్దము ప్రాకరణికమైన ఏదో యర్థమునుచెప్పు చుండును. ఈ సర్వనామమునకు ముందు నామవాచకముగూడ పనిలేదు.

మాళవి

తగునయ్య హరి నీకు దానము దెచ్చుకొనిన-
 జగములో భూకాంత సౌభాగ్యలక్ష్మి ॥ పల్లవి ॥

కిమ్మల శిశుపాలుని గెలిచి చేకొంటివిగా
 సమ్మతించి రుక్మిణి జయలక్ష్మి
 అమ్మమొనను జలధి నడచి లంక సాదించి
 కమ్మరఁ జేకొన్న సీతే ఘనవీరలక్ష్మి ॥ తగు ॥

నరకాసుర నడఁచె నవ్వుతాఁ జేయివేసితివి
 సరిగా సత్యభామే పో సంగ్రామలక్ష్మి
 హిరణ్యకశిపుఁ గొట్టి యింద్రాదులకు నీచే
 వరమిప్పించినయాకే వరలక్ష్మి ॥ తగు ॥

నిండినవురముమీఁద నిఖిలసంపదలతో
 అండనుండేయాకెపో ఆదిలక్ష్మి
 మెండగుశ్రీ వేంకటాద్రిమీఁద నీసరుస నేఁగే-
 గండుమీరెఁ గళలతోఁ గల్యాణలక్ష్మి ॥ తగు ॥ 303

శంకరాభరణం

ఇంకనేలే నీకుఁ జింత యెంచి చూచుకోవు గాక
 మంకులమరుఁడు నీమనసే కాదా ॥ పల్లవి ॥

చందురుఁడు నెమ్మోము చల్లువెన్నెలనే(యే?) నవ్వు
 అందలియమృతము నీ యధరామృతం (తము?)
 పొందిననీ విభునిఁ జూసి పొడవుచందురుఁ గని
 ఇందులోనే కసరేవు హితుఁడు గాఁడా ॥ ఇంక ॥

మెఱుఁగుఁదీగె నీమేను మించుఁజిగురు చేతులు
తఱిఁ బూవుగుత్తులే తగునీచన్నులు
మెఱయ నీపతిఁ బాసి మించినతీగెలు చూచి
వెఱవనేఁటికే యివి వింతలా నీ కిపుడు ॥ ఇంక ॥

చల్లగాలి నీవూర్పు సంపెంగ నీనాసికము
వెల్లిగా నివ్విటిమీఁదా విసుగనేలే
యెల్లగా శ్రీవేంకటేశుఁ డిదివో నిన్నుఁ గలసె
బల్లిదుఁ డితఁడే నీకుఁ బ్రాణముగాఁదా ॥ ఇంక ॥ 304

## గుండక్రియ

ఇవి నీకొక్కనికేయా ఇద్దరికి సరిగాక
తవిలి మోవితేనెలే తరితీపు సేయఁగా ॥ పల్లవి ॥

నిరతి నన్నారసేవు నీ వేమిసేతువయ్యా
వొరటు నాగుబ్బలలో నుండఁగాను
యెరపరికపుగుణా లెంచ నీపైనేలయ్యా
యెరపరికము నాకు నివిగో కురులను ॥ ఇవి ॥

గుట్టుతో నీమాఁటలెల్లా కొంచపరచనేలయ్యా
అట్టె నానడుము కొంచమై వుండఁగా
అట్టయిననీచేఁత గుట్టుసేయనేలయ్యా
అట్టు నాయందెలమోఁతై యిట్టె వుండఁగాను ॥ ఇవి ॥

పలుమారు నీమేనఁ బచ్చిచూపనేలయ్యా
వులివచ్చివలపు నావొళ్ల నుండఁగా
బలిమి శ్రీవేంకటేశ పైకొని కూడితి నన్ను
నిలువున నెపుడు నే నీవురాన నుండఁగా ॥ ఇవి ॥ 305

కాంబోది

చూతుఁబో అప్పుడు నీసుగుడతనములెల్లా
కాతరాన నేఁ దిట్టితేఁ గాదనఁగలవా ॥ పల్లవి ॥

ఆవులమందకు రాఁగా నాయము లంటితిగాక
మావిటికి వచ్చి నీవు మమ్ముఁ జేసేవా
తోవనుండి నాకాలు దొక్కితి వింతేకాక
చేవదేర నేకతాన సేవ సేయఁగలవా ॥ చూతుఁ ॥

చల్లలమ్మరాఁగానే సరసమాదేవు గాక
గొల్లపల్లెలోను చొచ్చి కొంగువట్టేవా
చెల్లఁబో యమునలోన సిగ్గులు వరచితిగాక
పల్లదాన రతివేళ బలిమి చూపేవా ॥ చూతుఁ ॥

అంకులు వెట్టించుకోఁగా నఁ(నం?)ద వచ్చితిగాక
లంకెలఁ బెనఁగితేను లావు చూపేవా
యింకనేల శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
కొంతుదేరె నిఁక నీవు కొఱఁత నేసేవా ॥ చూతుఁ ॥ 306

రేకు 1052 ముఖారి

చేఁతసేసేవారు లేరా సిగ్గు విడువరుగాక
పూఁతలరోఁతలకెల్లా బుద్ధి చెప్పరాదా ॥ పల్లవి ॥

చిత్తము నొచ్చీనంటాఁ జెప్పఁగాక నీమోవి-
జొత్తు లద్దములోనైనాఁ జూచుకోరాదా
హత్తివుండేచెలులైనా నట్టె తుడువరుగాక
కొత్తచెమటలు చూచి కొమలెల్లా నగరా ॥ చేఁత ॥

తలఁచుకొనేవంటాఁ దడవఁగాక నీలోనే
అలపునిట్టూర్పులు ఆలించరాదా
నిలువునవ్వులు సారె నీమేన జారెఁగాక
చలివేఁడిపులక లెంచఁగఁ బచ్చిగాదా ॥ చేఁత ॥

నీకునీకే చెప్పేవంటా నే నడుగఁజాలఁగాక
యేకతమాడుచు గాని ఇటు రారాదా
పైకొని శ్రీవేంకటేశ బలిమిఁ గూడితి నన్ను
యీకడాకడిసుద్దులు ఇఁక నెంచనేఁటికి ॥ చేఁత ॥ 307

శంకరాభరణం

ఒట్టులేల తిట్టులేల వున్నదిగా నీమేలు
దట్టమైననామనసు తనిసే నిఁక ॥ పల్లవి ॥

వింటిఁగా నీమాటలు వీనులెల్లాఁ జల్లఁగాను
అంటి నీతో సరసములాడే నిఁక
కంటిఁగా నీగుణము కన్నులపండుగగాను
నంటున నీమాటలెల్లా నమ్మే నేనిఁక ॥ ఒట్టు ॥

తెలిసెఁగా నీచేఁత తేటతెల్లమిగాను
నలుగడ నిచ్చకమే నడపే నిఁక
నిలిచెఁగా నీవలపు నిదులై నామేననెల్లా
నలువంక నీతో నే నవ్వే నిఁక ॥ ఒట్టు ॥

చిక్కెఁగా నీమేనెల్ల చేరి నాకాఁగిటిలోన
ముక్కుమోము వంచి నీకు మొక్కే నిఁక
యిక్కువ శ్రీవేంకటేశ యిటు నిన్నుఁ గూడితిఁగా
వొక్కటై నీవురముపై నుండే నిఁక ॥ ఒట్టు ॥ 308

వరాలి

మగరూపు నాఁడురూపు మారుచుకొని రిద్దరు
పొగి [1]సెద్దము చూపరే చూచుకొనే రిద్ధరు దామే ॥ పల్లవి ॥

కలికి కస్తూరిబొట్టు కాంతునినొసల నంటె
నిలువునామము పైపై నెలఁత కంటె
అలివేణికొప్పు జారి ఆతనికొప్పుపై వాలె
అలరె నీతని(న్వి?)సిక ఆతనిపాపటపైని ॥ మగ ॥

కుంకుమగుబ్బలపూఁతగురుతు విభుని కంటె
అంకెఁ బతిరొమ్ముబొచ్చు ఆకె కంటెను
కంకణాలగాజులచేయి ఘనునిసందిటఁ జిక్కె
అంకపుసాములచేయి ఆకెసందిఁ జిక్కెను ॥ మగ ॥

మట్టెలపాదము లవె మగిడె నాతనిమీఁద
నిట్టపెద్దపాదాలు నిలిచె నందు
యిట్టె శ్రీవేంకటేశుఁ డింతిఁ గూడి పానుపుపై
పట్టపగ లిందరిని భ్రమయించి రిదివో ॥ మగ ॥ 309

తెలుఁగుఁ గాంబోది

రాఁడాయ నతఁ డిందు రాఁపులనె పొద్దు వోయ
యేఁడాయ నిమిషము ఇంతలోనే చెలియా ॥ పల్లవి ॥

కలతునొకొ పతిఁ గాఁగిట నొకపరి
తలఁచునొకొ నన్నుఁ దా నతఁడు
పిలిచి యాతఁడు నాతోఁ బ్రియమున నవ్వేనంటా
కలలోన వేగుదాఁకాఁ గంటినే వోచెలియా ॥ రాఁడా ॥

---

1. పొగిసి + అద్దము.

ముచ్చటలాడుదునొకో మోము చూచి పతితోను
చెచ్చెర నాతఁ డందేమి నేసీనొకో
గచ్చుల్చనాకన్నులకుఁ గట్టినట్లు తనమేను
పచ్చిదోఁచ నామదిఁ బాయఁడే వోచెలియా ॥ రాఁడా ॥

నేతునొకో సేయఁగలసేఁతలెల్లా నాతనిపై
యేతల దాఁగివున్నాఁడో యీడనే తాను
చేతులు మూసి కూడెను శ్రీవేంకటేశుఁడు నన్ను
యీతలఁ బాయఁ డిఁకను యిందాఁకా జెలియా ॥రాఁడా॥ 310

పాడి

ఎవ్వరూఁ దమంతనుంటే నేలవచ్చీ నింతేసి
దవ్వుల నుండినవారిఁ దడవఁబొయ్యేరా ॥ పల్లవి ॥

మామాట లాడఁగాఁబో మరుముద్ర మోవికెక్కె
కేరడానఁ జూడఁగాఁబో కెంపులెక్కెను
తారుకాణకు రాఁగాఁబో తనువెల్లాఁ బచ్చిదోఁచె
యీరు దియ్యఁ బేను వచ్చె నింతలోనే విభుఁడా ॥ ఎవ్వ ॥

నాలిఁ దలవంచఁగాఁబో నవ్వులు నెలవికెక్కె
నీలీలవంకనేపో నింద వచ్చెను
కైలాటాలు వెట్టఁగాఁబో కాఁకల నీమేను చిక్కె
మూల నున్నవారినేల ముంగిట వేసేరా ॥ ఎవ్వ ॥

కాఁగిటికి రాఁగానేపో కడువాసనలు మించె
చేఁగసరసాననేపో జీరవారెను
పేఁగుచు శ్రీవేంకటేశ వేడుకఁ గూడితి నన్ను
వేఁగగ యిట్లనే వుంటే వేరులు సేసేరా ॥ ఎవ్వ ॥ 311

గుండక్రియ

సీపాలివారము నే మెట్లున్నా
చేపట్టితి వి(క( జేరినా మేలే ॥ పల్లవి ॥

నిను నే( దడవను నీ కెదురాడను
నను నీ(క నేమన్నా మేతే
మునుపనె మొక్కితి మోహాన( జిక్కితి
చెనకి నీ వెట్ల(జేసినా మేలే ॥ సీపా ॥

జగడించను బొమ్మజంకెన చూపను
వెగటున నను నవ్విన మేలే
తగిలితి వెంటనె దగ్గరి పిలిచితి
యెగసక్కెముతో నెట్టున్నా మేలే ॥ సీపా ॥

తల(పున మఱవను తడ(బడి కొసరను
చెల(గిటు గా(గిలించిన మేలే
యిల నిను శ్రీవేంకటేశ కూడితిని
మెల(గి నీ వెట్లామెచ్చినా మేలే ॥ సీపా ॥ 312

రేకు 1053 సామంతం

మనసుకు( జల్లన నీమక్కువతల(పులె
నను బుజ్జగించకురా నవ్వితేనే చాలును ॥ పల్లవి ॥

కన్నులకు( జల్లన నీకడు(జక్క(దనమే
పన్నీరేల చల్లేవు పలుమారును
చన్నులకు( జల్లన నీ చాయలకొనగోరే
మన్ననతో గందమేల మాకు( బూసే విపుడు ॥ మన ॥

వీనులకుఁ జల్లన నీవింతవి తమాటలే
అనినఁ గప్పురమేల అప్పళించేవు
మేనికిఁ జల్లన నీమీఁదనున్నపచ్చడమే
పూని విసరించకురా పొంబట్టుసురట్ల ॥ మన ॥

కాఁగిటికిఁ జల్లన నీకాయపుసింగారమే
పాఁగినపూవులపాన్పు పఱచకురా
దాఁగక శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
చేఁగదేరఁ గొసరకు చెప్పినట్టే అయను ॥ మన ॥ 313

లలిత

నీడ చూడ నిఁకనేలే నేఁడు మమ్మడుగనేలే
జోడగుమీకూటములు చూడఁజూడఁ గొత్తలు ॥ పల్లవి ॥

చెలువపువలపులచెమటముత్యములె
చెలి నీచెక్కులకివి సింగారమే
పలసేటిపులకలమల్లెలమొగ్గలు నేఁడు
బలువుఁగుచములకు బంగారమే ॥ నీడ ॥

అసురుసురున వీడినట్టినెరిఁదుమ్మిదలు
పసగ నీవెనువెంటఁ బరివారమే
రసికుఁపుఁబతితోడ రతివేళమాఁటలెల్లా
కసుగాటునీమోవికిఁ గైవారమే ॥ నీడ ॥

పొందేటియలపు దేర పూఁటపూఁట కిచ్చేటి -
కందువనీమోవితేనె ఘనసారమే
యిందునె శ్రీవేంకటేశు నిటు గూడివుండిననీ -
విందులవెరగు మంచివిచారమే ॥ నీడ ॥ 314

శంకరాభరణం

ఏమంటే నేమంటి నింతేకదే
ధామెన ప్రియాలు నేరఁ దనకేలే యలుక ॥ పల్లవి ॥

నవ్వితే నవ్వుదును నామోము చూచితే —
నివ్వల నేనూఁ జూచే దింతేకదే
రవ్వతన మెఱఁగను రాజసాల కోపను
దవ్వులనుండి వచ్చి తనకేలే యలుక ॥ ఏమం ॥

పలికితేఁ బలికితి పైఁ జేయివేసితేను
యెలమి నేనూ వేసితి నింతేకదే
యెలయించనొల్లను యిచ్చకము నేరను
తలుపుమాటున నుండి తనకేలే యలుక ॥ ఏమం ॥

కూడితే నేఁ గూడితి కొసరితేఁ గొసరితి
యీడనే శ్రీవేంకటేశు నింతేకదే
పాడిపంతా లెఱఁగను పచ్చినేయఁజాలను
తాడుపడి యుండఁగాఁ దనకేలే యలుక ॥ ఏమం ॥ 315

రామక్రియ

ఘాత నలుపుఁ దెలుపు కన్నులందె నొంటెనట
ఆతనినీసందికోపా లంతకంటేనా ॥ పల్లవి ॥

సతి నీమోమున నదే సంపెంగతావి వలి (లె?) చీ
మితిమీరె కురులతుమ్మెదలు నందె
అతివైరమును శాంత మందులో నోరిచితివి
పతితో నేఁటికి నింకఁ బలుకవే నీవు ॥ ఘాత ॥

చెలి నీనడుమ నదే సింహముపోలికలాయ
కలసెఁ బాదాల గజగమన మందే
చలువకు వేఁడికి సరి నం దోరిచితివి
చలము సాదించి పతి జంకించ నేఁటికినే ॥ ఘాత ॥

జక్కవలే కుచములు చందురుఁడే నీమోము
వొక్కటొక్కటివైరము లోరిచితివి
యెక్కువ శ్రీవేంకటేశు నిదెఱఁగే కూడితివి
వొక్కటై చెక్కునొక్కఁగ వొద్దన నేఁటికినే ॥ ఘాత ॥ 316

బౌళి

మూసి మంతనాలమేలు మూట గట్టేవా
వాసులవంతులనే వడ్డివారీనా ॥ పల్లవి ॥

మోనమున నుండనేలే మొకము వంచఁగనేలే
నానఁబెట్టితే వలపు నయమెక్కీనా
సానఁబట్టేచూపులేలే సమ్మతిగానినవ్వేలే
యీనెపాననైనఁ గొంత యీసు వోయీనా ॥ మూసి ॥

నేలవాఁ(వ్రాఁ?)త లిప్పుడేలే నివ్వెరగు నీ కేలే
మూలవేసితే వయసు మొదలయ్యీనా
తాలిము లింతేసేలే తడవు సేయఁగనేలే
కాలము గడపఁగాను కండగట్టీనా ॥ మూసి ॥

నెలవి నవ్వితివేలే చేతివిదితింపులేలే
మొలపించేవు సిగ్గులే మొనలయ్యీనా
బలిమి శ్రీవేంకటాద్రిపతి నేఁ గూడితి నిన్ను
పలుకఁబంతాన నింత పరిణామమా ॥ మూసి ॥ 317

నారాయణదేశాక్షి

కంటిమి నీజాడలెల్లా కానీవయ్యా
జంటలే చాయకు వచ్చి చవివుట్టెనా ॥పల్లవి॥

నవ్వేటినీనవ్వులను నయగారిమాఁటలను
దివ్వెలెత్తుఁబొద్దులాయ తెల్లవారెను
పువ్వులవేట్లచేత పొరుగుపోరచేత
దవ్వులే చేరువలై తతివచ్చెనా ॥కంటి॥

పొలిసీనొల్లములను వొడఁబాటుబాగులను
పొలసి యమాసవోయ పున్నమ వచ్చె
తలపోఁతచేత మంచితనువుసోఁకులచేత
చలివాసి వలపులు సరివచ్చెనా ॥కంటి॥

యిచ్చేటివీడెములను యితవై నఆనలను
నచ్చినపెండ్లి నేఁడే నాగవల్లాయ
అచ్చపు శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
పచ్చిగాఁ గూడఁగా నేఁడు ఫలియించెనా ॥కంటి॥ 318

రేకు 1054 సాళంగనాట

అటువంటిని న్నేమందు ఆపె నేమందు
తటుకున మీసిగ్గులు తడవ నేమున్నది ॥పల్లవి॥

శ్రీసతి కాఁగిటనుండి జిడ్డుగొల్లైతలనెల్ల
బాసలిచ్చి కాఁగిలించి పాలించితి
మోసపుచ్చి అందులోన మొఱఁగఁగఁ జోటులేదు
యీసరియాఁడువారిలో నింతబందు గలదా ॥అటు॥

భూమిదేవిని పీఁపున పూఁచి మోచి అచ్చరల
దోమటిఁ బదాఱువేల దొమ్మిఁ గూడితి
బూమెలుసేసి నీ కంతబొంక నిందు యెడలేదు
భామినులపొందికలు పచ్చిసేయఁదగునా ॥ అటు ॥

శిరసుపై తులసిని చెక్కుక మఱె దరైన
తరుణులఁ గూడితి నన్నుఁ దగఁ గూడితి
యిర వెఱిఁగుండఁగానే యింత భ్రమయించరాదు
నిరతి శ్రీవేంకటేశ నీకే తెలుసును ॥ అటు ॥ 319

బౌళి

తతివచ్చె నిఁక దయదలఁచరాదా
యితరులవలెఁ జెలి యింత కోపఁగలదా ॥ పల్లవి ॥

కేలుఁ గేలఁ గీలించి గిలిగించే వాపె నిన్ను
నాలిసేసి సారె సారె నవ్వెనంటాను
మేలములనే యలసె మేనెల్లాఁ జెమరించె
యీలావులు నీవు సూపే వింత కోపఁగలదా ॥ తతి ॥

పయ్యదలోఁ జేయిచాఁచి బలిమిఁ జన్నులంటేవు
వొయ్యనే ఆపె నీపై నొరగెనంటా
నెయ్యపుఁజేఁతలఁ జొక్కె నేరుపున నీకు మొక్కె
అయ్యెడ నీతో నూఁకొన నంత కోపఁగలదా ॥ తతి ॥

కాయము నీపే యంటి కాఁగిలించే వాపె నీపై
చాయచేసుకొని చేయి చాఁచెనంటాను
యీయెడ శ్రీవేంకటేశ యెనసి మై పులకించె
యేయెడనైనాఁ జెప్పె వింత కోపఁగలదా ॥ తతి ॥ 320

శ్రీరాగం

నిలువులమేడలో నిలుచున్నాఁ డిదె
 పిలువవే రమణునిఁ బ్రేమముతోడ ॥ పల్లవి ॥

చలివేఁడిచేమటల జలకమార్చవే
 అలసి వచ్చెఁ బతి యంతమంది
పలుకుల కప్పురపుబాగా లీవే
 తలఁపుల తమకపుదాహము గొనెను ॥ నిలు ॥

తనుపులకవిరులఁ దగఁ బూజించవే
 తనకుఁదనకె నినుఁ దగిలీని
కనుఁగొన నవ్వులగందము పూయవే
 వెనకటి విరహపువేదన దీర ॥ నిలు ॥

పొరి మోవితేనెబువ్వము దొడుకవే
 గరిమరతుల నాఁకలి గొనెను
మరిగి యితనితో మంతనమాడవే
 యిరవుగ శ్రీవేంకటేశుఁడు గూడె ॥ నిలు ॥ 321

భైరవి

చిన్నదానఁ జేసినట్టు సేయుమనవే
 విన్నపమిదే తనకు వేవేల కనవే ॥ పల్లవి ॥

సిగ్గువడ్డచిత్త మిది చేరి మాటాడనియ్యదు
 యెగ్గుపట్టఁ జేసు నాతఁ దేమిసేతునే
అగ్గలపుసతులలో అరితేరినట్టివాఁడు
 వొగ్గి తానే యిప్పుడు నావద్దికి రమ్మనవే ॥ చిన్న ॥

జవ్వనపుమద మిది సరసములాడనీదు
రవ్వఁ గాఁతాళించునేమో రతి నతఁడు
యివ్వల నావంటివారి నెదుగా నేలినతాను
మవ్వపుఁగూరిమి నన్ను మాటాడించుమనవే ॥ చిన్న ॥

తనకాఁగిటిదేహము తగులు వాయఁగనీదు
అను వెట్లనో తన క దెఱఁగనే
యెనసెను శ్రీవేంకటేశుఁ డిన్నిటాఁ దాను
మనసుమర్మ మెరిఁగి మన్నించుమనవే ॥ చిన్న ॥ 322

## సౌరాష్ట్రం

ఏమయ్యా నీదయ యెన్నఁటికయ్యా
దీమస మిచ్చి చెలియఁ దెలుపవద్దా ॥ పల్లవి ॥

చెక్కులపైఁ జెమటలు చెలికిఁ గారఁగాఁ జూచి
వెక్కసపుసురటిని విసరవద్దా
అక్కజమై నీతో మాటలాడి అలయఁగాఁ జూచి
యిక్కడఁ గప్రపుఁబలు కియ్యవద్దా ॥ ఏమ ॥

సందడిఁ జెంపలవెంట జారినసెరులు చూచి
ముందుముందే యీచెలికి ముడువవద్దా
చెంది నీకుఁగాఁ గరఁగి సిగ్గువడఁగాఁ జూచి
అందుకొని సేదపేర్చి ఆసరేఁచవద్దా ॥ ఏమ ॥

కప్పుచు బాగా లిచ్చి కాఁగిలించేచెలిఁ జూచి
దప్పివాయ మోవి యిచ్చి తనుపవద్దా
ఇప్పుడే శ్రీవేంకటేశ ఇంతసేసి కూడితివి
ముప్పిరిసంతోసా లిట్టె ముంచవదా ॥ ఏమ ॥ 323

ఆహిరి

ఏకచిత్తమున నుండు యిదివో యాపె
చేకొనుము రమణుఁడ చింతదీరె నేఁడు ॥ పల్లవి ॥

పాసి నీతో సారె సారె పంతాలాడినయాపె
వాసి దలఁచుకయైన వచ్చెఁగా నేఁడు
కాసు సేయనిపనికి కన్నులఁ దిట్టినయాపె
ఆసలు వుట్టఁగ మాటలాడెఁగా నేఁడు ॥ ఏక ॥

దగ్గరక నిన్ను నట్టె తప్పురెంచినట్టియాపె
వెగ్గళించి నీపైఁ జేయివేసెఁగా నేఁడు
వొగ్గి నీపనులకెల్ల వోడఁబడకుండినాపె
సిగ్గుదేర నిన్నుఁ దానే చెనకెఁగా నేఁడు ॥ ఏక ॥

మంచముమీఁదనే వుండి మాయలునెరపినాపె
కొంచక నీకాఁగిటఁ గూడెఁగా నేఁడు
యెంచక శ్రీవేంకటేశ యెనసితి విఁక నాపె
మించి నిన్ను లోఁగొనె మేలుగా నేఁడు ॥ ఏక ॥ 324

రేకు 1055 ఆహిరి

దేవ నీవునికి తేటతెల్లమాయను
భావించ మాకుఁ గన్నులపండుగాయను ॥ పల్లవి ॥

పన్నీటిజలకములు భామకనుచూపులును
యెన్నికఁ గూడుక నీపై నేరులై పారె
తిన్ననిచెమటెల్లా తిరుమేననెల్లా నిండె
అన్నిటా ముత్తేలపేనుహారములాయ ॥ దేవ ॥

తెల్లనికప్పురకాపు తెలవనవ్వులుఁ గూడి
పొల్లుగా నీపువ్వ్రాళ్ళపోగులాయను
మెల్లనే నీపూరుపుల మించులరవలు రేఁగె
వొల్లనే తడిసూళ్ళవొత్తులాయను ॥ దేవ ॥

అంగపుఁబుశుగుకాపు అలమేలుమంగఁ గూడి
సింగారాలాయను మించుసిరులాయను
ముంగిట శ్రీ వేంకటేశ మోహనపునీకూటమి
సంగతిఁ బూవుదండలజాడలాయను ॥ దేవ ॥ 325

## శుద్ధవసంతం

సవతైనా నాపె మేలు సరి నీకంటె
ఆవల నాపెచెప్పినఅట్టె సేయవయ్యా ॥ పల్లవి ॥

యేపున నన్ను మన్నించి యేమిసేయవలసిన—
నాపెనే యేకతమున నడుగవయ్యా
దాపుగ నాఁడుజాతికి దయగల దెప్పుడును
మాపుదాఁకా మగవాఁడు మత్తుఁడే యెంచఁగను ॥ సవ ॥

నేరుపున నీవు నాతో నెత్తమాడవలసిన
కోరి యాపె నొద్దఁ బెట్టుకొనవయ్యా
ఆ-తేరినాఁడువారి నాఁడువారే తోడునీడ
గారవపుమగవాఁడు కపటే యెపుడు ॥ సవ ॥

శ్రీవేంకటేశ్వర నన్నుఁ జేకొని కూడితి విట్టె
యేవేళ నలమేల్మంగ కియ్యకోలయ్యా
కైవశమై ఆఁడువారు కనిపించేయట్టివారు
వావులనే మగవారు వంతువా నెఱఁగరు ॥ సవ ॥ 326

గౌళ

గుట్టుతోడ నుండవయ్య కోరినకోరికలాయ
చిట్టక మింతయుఁ బాసె చింతలేల ఇఁకను ॥పల్లవి॥

మొగముచూచినందె మోహము నాకుఁ దెలిసి
నగితి నందుకుఁ దగ నానఁబెట్టి
జగడాలన్నియుఁ దేరె చనవు నా కిచ్చితివి
యెగసక్కెములు లేవు యిఁకనేల మాటలు ॥గుట్టు॥

వీడెమిచ్చినందే నీవేడ్క కెల్లాఁ గానవచ్చి
ఆడితిని సరసము లందుకుఁ దగ
ఆడుకోలుమాట చెల్లె నంగము లంటితి విట్టె
సూడుఁబాడు గాదు వట్టిసొలపేల ఇందుకు ॥గుట్టు॥

దగ్గరినందే నీతలఁపెల్లాఁ గనుకొని
వొగ్గితి నీరతులకు వొద్దికతోడ
అగ్గపు శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
సిగ్గుదేరఁ గూడితివి చేత మొక్కే నిపుడు ॥గుట్టు॥ 327

ముఖారి

చేరి యిందుకుఁగా నే నీచెక్కు నొక్కేను
నేరనివారని కన్నీ నేరుపులే పుణ్యము ॥పల్లవి॥

నీవంకఁ గడమలేదు నేనే దూరుదుఁగాని
మూవంకల నిందుకు నే మొక్కేనయ్యా
తావున మోహించినట్టితమకాన నాఁడువారు
సేవలు సేయఁబోఁగా నే చేయి కాలు దాఁకును ॥చేరి॥

తప్పవు నీ వేమిటాను తతిమీఁదు నేనై తే
యిప్పు డన్నిటికిఁ బంతమిచ్చేనయ్యా
వొప్పుగా నేకతవేళ వుండేవూడిగపువారు
ముప్పిరిఁ బాదా లొత్తఁగ మునిగోరు దాఁకును ॥ చేరి ॥

అట్టె శ్రీవేంకటపతి వలమేల్మంగను నేను
చుట్టరికము సేతువు సొలతు నేను
పట్టదేవై ననేను పానుపుపై నుండఁగాను
మట్టుమీరి పెనఁగఁగ మర్మములు దాఁకును ॥ చేరి ॥ 328

## హిందోళం

నన్ను మీరఁ డాతఁడు నమ్మినదాన నేను
పన్నినమాయల కేమీఁ బదరకువే ॥ పల్లవి ॥

పాయము గడచనదు పంత మింతలోఁ దప్పదు
ఆయములు మోవ మాటలాడనీవే
చాయకాఁ డాతఁ డూరకే చల్లువల పేఁ(పెం?)దైనా
చేయి నాచేఁ జిక్కినది చెలఁగనీవే ॥ నన్ను ॥

తలఁ పొకచో నుండదు తమి పండి పొల్లవోదు
నలుపంకవారితోడ నవ్వనీవే
సులభుఁ డాతఁడు తాను చూపుల పేరెలు వారు
నిలువెల్ల నాసొమ్ము నేరుచుకోనీవే ॥ నన్ను ॥

కోరికెకు గురిలేదు కొసరులు మీఁదువోదు
చేరి యందరితో నంటుసేయనీవే
ఆరయ శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
గారవించి నన్నుఁ గూడె కైకొననీవే ॥ నన్ను ॥ 329

ఆహిరి

ఆడఁగలమాట లాపె నాడవయ్యా నీ-
వేడుకలోనివారము వేరాకర మయ్యేమా ॥ పల్లవి ॥

చిత్తమువచ్చినవారే చేరి నవ్వఁజెల్లుఁగాక
కొత్తవారు నవ్వఁబోతే కోపముగాదా
హత్తి వూరకున్నారంటా నందవారి సొలసేవు
విత్తకతొలుతే పైరు వేరే కలుగునా ॥ ఆడఁ ॥

కడుదగ్గరినవారే కైదం దియ్యఁజెల్లుఁగాక
యెడపులవా రిచ్చితే నెరవే కాదా
తడసి కొలువువారు దగ్గరరంటాఁ దిట్టేవు
వడిగొన్నవానలేనివఱదలు గలవా ॥ ఆడఁ ॥

పురము అలమేల్మంగ వొరయఁగఁ జెల్లుఁగాక
వరుసవా రొరసితే వాసిరేఁగవా
గరిమ శ్రీవేంకటేశ కమ్మటి మమ్ముఁ గూడితి
సరసమాడినవావే సతమై నిలిచెఁగా ॥ ఆడఁ ॥ 330

రేకు 1056 కన్నడగౌళ

ఇంతటనైన మన్నించు యీమాటాడితి నేఁడు
ఇంతులకు నీకు నేను ఇచ్చలాడేదానను ॥ పల్లవి ॥

నీపై మోహపుదాన నీనెలంత లిందరును
దాపుగా నీవలెనే దయఁజూతురు
రాఁపులోనిదానఁ గాను రమణులకును నీకు
చేపట్టి యేకతవేళ సేవచేసేదానను ॥ ఇంత ॥

చేసన్నదానను నీకు చెందిననీసతుఁడను
ఆసలెల్లా నెరవేర్చి ఆదరింతురు
వేసరించేదానఁ గాను వెలఁదులఁడను నీకు
సేసలువెట్టించినట్టిచేతిలోనిదానను ॥ ఇంత ॥

అలమేలుమంగ నేను అక్కున నుందాన మీవా -
రెలమి నాపంపు నేసి ఇయ్యకొందురు
కలసితి విట్టె శ్రీవేంకటేశ నే వింతఁ గాను
పొలఁతులను నిన్ను నేఁ బొగడేటిదానను ॥ ఇంత ॥ 331

## ముఖారి

ఏల మాను నీవోఁజ యెఁ(యెఁ?)తైనాను
నాలితోడ చెలులెల్లా నవ్వేరు నిన్నును ॥ పల్లవి ॥

పొట్టుక వెన్నలనాఁడు వుట్లెక్కె పెద్దవై
యిట్టె రుక్మిణిపెండ్లితే రెక్కితివి
చిట్టకాన చిన్ననాఁడు సేసినట్టు సేసితివి
నెట్టన నింతదొరవై నేఁడు సేయవలెనా ॥ ఏల ॥

పసిబాలనాఁడు నీవు బండికిఁ బాదము చాఁచి
దెసల నర్జునుబండితేరు నెక్కితి
శిసువవై నాఁడేమిసేసినా నమరుఁగాక
కొన రింతవాఁడవై యాగుణములే వలెనా ॥ ఏల ॥

చిన్ననాఁడు గొల్లెతలఁ జేరి చనుఁగొండలెక్కి
చిన్నియారథమెక్కితి శ్రీవేంకటాద్రి
పిన్ననాఁటిచేఁతలే పెద్దనాఁడుఁ జేసితి -
వెన్న నలమేల్మంగ నెన సింతవలెనా ॥ ఏల ॥ 332

శుద్ధవసంతం

అండసుండేవారము అడ్డము నేరము
నిండుకొని మీకు మీకే నెలవుకోరయ్యా ॥ పల్లవి ॥

[1]చెలిసీలో మాటలు సిగ్గులలో తేటలు
చలివాయ వింటిమి మాసాకి రేలయ్యా
వలపులు వడ్డివారీ వాదు లెక్కడివి మీకు
చలిమి బలిమి మీరే సంతము గారయ్యా ॥ అండ ॥

మగువనీనవ్వులు మరునంపపువ్వులు
తగవు దేర్చితిమి మంతన మేలయ్యా
చిగిరించె తమకము చింత లెక్కడివి మీకు
మొగములు చూచి మీరే మొక్కులాడరయ్యా ॥ అండ ॥

వనితనీచూపులు వడిఁ దరితీపులు
మనసురాఁ జేసితిమి మఱి యేలయ్యా
అనుగుశ్రీవేంకటేశ అలమేల్మంగయు నీవు
యెనసితి రిఁకను మీ కిచ్చలాదేమయ్యా ॥ అండ ॥ 333

దేసాళం

ఎమ్మెల నాలిమగని కిద్దరికిఁ దగునయ్యా
మమ్మువంట్ల నన్నిటా మన్నించుఁడీ అయ్యా ॥ పల్లవి ॥

చేకొని మీరిద్దరు నాచేత మాటఁబడితిరి
ఆకెయు మీరు బదుకుఁడయ్యా యింక
నాకన్నులజంకెలకు నవ్వులేల నవ్వితిరి
మీకెవ్వరు యిట్టె సరి మేలు గానిమ్మయ్యా ॥ ఎమ్మె ॥

1. ఈ పాట అన్నిచరణముల ఆదిలోనిపదములు ద్వంద్వసమాసములే.

మంతనాన నుండి మీరు మచ్చిక నేఁ జూచితేను
పంతమిచ్చితిరి యిట్టె బదుకుఁడయ్యా
బంతి నేఁ గొసరితేను బాగాలు నా కిచ్చితిరి
సంతోసాలు మీ కెప్పుడు సరి గానిండయ్యా ॥ఏమ్మె॥

ఇల నాకుఁ జనవిచ్చి ఇద్దరు నాచెప్పినట్టు
పలుమారుఁ జేసితిరి బదుకుఁడయ్యా
అలమేలుమంగవు నీ వాతఁడు శ్రీవేంకటేశుఁ -
డెలమి నన్ను మెచ్చితి రిద్ద రీదేరుఁడయ్యా ॥ఎమ్మె॥ 334

లలిత

ఊడిగపువారము వూరకుండేవారము
జోడగుమీసరసాలు చూచుకుండేమా ॥పల్లవి॥

అంగన నీమోము చూచె నందుకు నీవు నవ్వితి -
వంగములు చెమరించె నంతలో మీకు
చెంగట సురటి గొని చేరి విసరేము నేము
యెంగిలిమీరతులు నే మెఱుఁగుదుమా ॥ఊడి॥

వనిత చేయెత్తి మొక్కె వలపులు చల్లితివి
మనసులు సరిదాఁకె మచ్చిక మీకు
వెనుకొని నేము నట్టె విడెము లిచ్చితి మదె
అనుగుమీయేకతాలు అడిగితిమా ॥ఊడి॥

అలమేలుమంగ మెచ్చె ఆయాలు నీ వంటితివి
కళలు రేఁగెను శ్రీవేంకటేశ మీకు
బలిమి మీరు గూడఁగ పచ్చడము గప్పితిమి
తలఁచేమికోరికలు తడవితిమా ॥ఊడి॥ 335

బౌళి

ఇంత గలుగకుండితే నేఁటిపొందులు
. వింతగా విభుఁడ నాఁడే విన్నవించమా ॥ పల్లవి ॥

చిగురుఁబెదవులనే చెలి నీతో మాటలాడీ
మొగము నీవు చూచితే మొక్కీఁ దాను
నగేటినెలవులను ననుపులు నటియించీ
తగులై నవలపులతారుకాణ లిట్టివి ॥ ఇంత ॥

వంచినట్టిశిర సెత్తి వాడికచూపులు చూచీ
ముంచి నీవు చెనకఁగ మొక్కీఁ దాను
మంచముపై వేడుకల మచ్చికలు వచరించీ
కంచపురతులలోనికాంక్షలెల్లా నిట్టివి ॥ ఇంత ॥

దప్పులువాయఁగ నిన్ను దండకుఁ దీసుకొనీని
ముప్పిరి నీవు గూడఁగ మొక్కీఁ దాను
చిప్పిలఁనీభోగముల చిమ్మిరేఁచీఁ బులకలు
తప్పని(శ్రీ)వేంకటేశ తమకము లిట్టివి ॥ ఇంత ॥ 336

రేకు 1057 దేవగాంధారి

చిత్తగించి మాపై దయసేతువుగాక
బత్తిగలవాఁడ. వింత పచ్చిసేయనేలా ॥ పల్లవి ॥

మక్కువ నీపాదాలు మరిగినదాన నేను
యెక్కువతక్కువమాఁట లిఁకనేలా
చెక్కులు నీవు నొక్కఁగా నేదదేరినట్టిదాన
పక్కన నంటేసివేరేపరాకులేలా ॥ చిత్త ॥

చేరి నీకు నేపొద్దు చెప్పినట్టు సేసేదాన
 కూరిమి నీలో వట్టిగుల్లేలా
 మేరతో నీసన్నలతో మెలఁగేటియట్టిదాన
 గారవించితివి నన్ను కడమ మరేలా ॥ చిత్త ॥

కందువనీకాఁగిటికిఁ గలిగినయట్టిదాన
 చందాలుసేసుక వట్టిజాగులేలా
 యిందుకే శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
 చెందెను నీదయ నాపై చింత లిఁకనేలా ॥ చిత్త ॥ 337

దేశాక్షి

రమణికడకు విట్టె రావయ్యా
 సముకాన నీకిన్ని చాటిచెప్పే నిఁకను ॥ పల్లవి ॥

మంతనపునీచేఁతలే మాపుదాఁకా వినివిని
 కాంత చెలులతోడ కడునవ్వేను
 వింతలై ననీగుణాలు విచారించుకొని లోలో
 చెంతలనే తలవూఁచి నేదదేరి మెచ్చేను ॥ రమ ॥

వేడుకై ననీమాఁటలే వేగినంతా నాడుకొని
 జాడతోనే సారెసారె సంతసించెను
 కూడిననీకూటములగుఱుతులు చూచుకొని
 వాడుదేరి నీమీఁద వలపులు చల్లెను ॥ రమ ॥

యిక్కువై ననీరాకకు నిందాఁకా నెదురుచూచి
 గక్కన నిన్నుఁ గని కాఁగిలించెను
 తక్కక శ్రీవేంకటేశ తతి నిట్టె కూడితివి
 పెక్కుభావముల నీపై ప్రియమే పెంచీవి ॥ రమ ॥ 338

పాడి

నీవెప్పుడూ ఘనుఁడవే నే నీచేతిలోదానను
యేవేళ నెట్లున్నా నేమాయ నీకు ॥ పల్లవి ॥

వన్నెల నన్నింత నీవు వలపించినవాఁడవు
[1]కన్నులనా చూపులకుఁ గాచుకుందువు
పన్ని తాముచేసేపైరుపంట కెదురుచూడరా
యెన్నిసేసిన నాయెడ కేమాయ నీకు ॥ నీవె ॥

తలఁపెల్ల నీ వన్నిటా దక్కఁగొన్నట్టివాఁడవు
పలుకులు నావెల్లాఁ బాలింతువు
మలసి తమచిలుకమాటలు ముద్దుసేయరా
యెలమి నాకొరకుఁగా నేమాయ నీకు ॥ నీవె ॥

కందువనారతులను కలసినట్టివాఁడవు
మందెమేళములు నావి మన్నింతువు
విందారగించేటివారు వేఁడయిన నోర్వరా
యిందులో శ్రీవేంకటేశ యేమాయ నీకు ॥ నీవె ॥ 339

వసంతవరాళి

కుచ్చితము లెఱఁగని కోమలులము
ఇచ్చనచేఁతలనేరుపరి విదె నీవు ॥ పల్లవి ॥

అప్పటినీసుద్దులెల్లా నాడుకొనఁగా నింతలో
యిప్పుడు విచ్చేసితివి యీడకే నీవు
ముప్పిరి నిన్నుఁ జూచి మొకదాకిరిని నీతో
విప్పేటిసెలవుల నవ్వే మిదే నేము ॥ కుచ్చి ॥

1. నాచూపుల, నాకన్నుంచూపు లనుట సహజము.

పంతపునీపై పదాలు పాడఁగానే యేకతాన
వింత లిదె నీకునీవే వింటివి నేఁడు
కొంత మందెమేళముగఁ గొసరఁగఁజాలక
బంతినే నీరూపము తప్పక చూచితి మిదివో ॥ కుచ్చి ॥

ప్రియమున నాలో నిన్ను పేరుకొని పిలువఁగ
దయతోఁ బలికితివి దగ్గరి నీవు
నియతి శ్రీవేంకటేశ నిన్నుఁ గూడి పాయ కిట్టె
నయమై నీసరసాన నంటుసేసే మిదివో ॥ కుచ్చి ॥ 340

కాంబోది

చిత్తముకొలఁది మరి చెలిభాగ్యము
హత్తి విన్నవించలేక అండనున్నదానను ॥ పల్లవి ॥

కొమ్మతో నీవన్నమాట కొంగుముడివేసుకొని
ఇమ్ముల నెదురుచూచీ నింటికాడను
రమ్మనఁగా నేమందువో రాజసపువాఁడవు
వుమ్మడిఁ గానుక యిచ్చి వూరకున్నదానను ॥ చిత్త ॥

కాంతతో నవ్వినవ్వు కట్టినపుత్తె సేసుక
పంతాన రతులు గోరీఁ బానుపుమీఁద
ఇంతలో కొంగువట్టితే నెట్టుండునో ఘనుఁడవు
అంత నిన్నుఁ గొసరక ఆసల నుందానను ॥ చిత్త ॥

సతికిచ్చినకాఁగిలి [1]సవరాజ్యము సేసుక
మతిలోనే నిన్నుఁ గూడీ మాటిమాటికి
రతిసేసితివి నేఁడు రమణి శ్రీవేంకటేశ
మతకరితనమున మట్టున నుందానను ॥ చిత్త ॥ 341

1. సగము రాజ్యము-గాబోలు.

పాడి

నేరుపరు లిందరును నెరజాణఁ డాతఁడు
ఆరీతి వేసరకుండా నందకుఁ దేఁగదరే ॥పల్లవి॥

వాసులేల రేఁచేరే వద్దువద్దు ఆతనితో
నేసుకొన్నమగఁడట చెప్పవలెనా
ఆసపడ్డదాన నేను ఆయ మెరుఁగు నాతఁడు
వేసట గాకుండానే విన్నవించఁగదరే ॥నేరు॥

తప్పులేల మోపేరే తగవుగా దాతనికి
కుప్పళించేవలపట కొసరనేల
కప్పురపుదాన నేను కలిగినవాఁ డతఁడు
యెప్పుడుఁ జిన్నఁబోకుండా నెఱిఁగించఁగదరే ॥నేరు॥

సిగ్గులేల పరచేరే చేతికిలోనై తానే
వొగ్గి శ్రీవేంకటేశుఁడే వొనగూడెను
తగ్గులేనిదాన నేను దయఁజూచేవాఁడు దానే
కగ్గులేకుండా నిచ్చకము లాడఁగదరే ॥నేరు॥ 342

రేకు 1058 సామంతం

నెలఁతఁ గరుణించితి నెరజాణఁడవు నీవు
నెలకొంటి వీఁక నిట్టె నిండుకొనవయ్యా ॥పల్లవి॥

కాంతపై నీచూపులనేకలువలు చల్లి
దొంతిఁబెట్టితి వలపు తొలునాఁడే
బంతెనఁగూళ్లు [1]నేఁడు పచ్చదోరణాలు [2]నేఁడు
చింతదీర భోగించి చిత్తగించవయ్యా ॥నెలఁ॥

1. 2. ఈ పునరుక్తి లక్కడక్కడ గలవు.

పోదిగాని నవ్వులకప్పురములు ముంచి చల్లి
గాదెఁబోసితి మోహాము కలనాఁడే
గాదిలిగుజ్జనఁగూళ్ళు కమ్మనిబువ్వాలు నేఁడు
యీదెస దోమటి దొడి కిచ్చగించవయ్యా ॥ నెలఁ ॥

ఆసపాటుమాటల అధరపుఁదేనె పూసి
రాసిచేసితివి మేలురతుల నాఁడే
వాసికి శ్రీవేంకటేశ వంతులవిందులు నేఁడే
నేసవెట్టి కూడితి వచ్చికములేదయ్యా ॥ నెలఁ ॥ 343

ముఖారి

మన్నించవోయి మమ్ము మంచివాఁడ
విన్నపము వినవోయి వేడుకకాఁడ ॥ పల్లవి ॥

ఆసలు మాకుఁ జూపి అంగముపైఁ జేయివేసి
వాసులు రేఁచకువోయి వన్నెకాఁడ
బాసికము గట్టితివి పైసేసవెట్టితివి
సీసటల కోపుదునా సీటుకాఁడా ॥ మన్నిం ॥

సన్నలు మాకుఁ జేసి చవులుగా మాటలాడి
పన్నకువోయి మాయలు పసకాఁడ
కన్నులనే నవ్వితివి కందువలు చూపితివి
యిన్నియు నీవెఱఁగవా యేతులకాఁడా ॥ మన్నిం ॥

మరిగించి మమ్ము నీవు మంతనానఁ బాయకుండి
యెరవు సేయకువోయి యింపులకాఁడ
కరుణించితివి శ్రీవేంకటరాయ కూడితివి
సరవి నడపవోయి చాయలకాఁడా ॥ మన్నిం ॥ 344

దేశి

కరుణగలవాఁడవు ఘనుఁడ విన్నిటా నీవు
తరుణిని నాతో నిట్టె తగులై వుండుమీ ॥ పల్లవి ॥

చెక్కులు నొక్కితి నిన్ను సేదలుదేరిచితిని
మక్కువతో నన్నిట్టె మన్నించుమీ
మొక్కులు మొక్కి నీపై మోహము నేఁ జల్లితి
తక్కక నాపై నీఁక దయవెట్టుమీ ॥ కరు ॥

కన్నుల నేఁ జూచితిని కందువలు నంటితిని
వెన్నెలనవ్వులు నాపై వెదచల్లుమీ
చన్నుల నొత్తితి నీతో సరసములూ నాడితి
యిన్నిటా మంచితన మిటు నాకుఁ జూపుమీ ॥ కరు ॥

సేవలు సేసితి నీకుఁ జెప్పితిఁ బ్రియములెల్లా
కైవశమై నీవు నాకుఁ గలిగుండుమీ
వావులు చెప్పితి నీవు వరమిచ్చి కూడితివి
శ్రీవేంకటేశ్వర నన్నుఁ జిత్తగించుమీ ॥ కరు ॥ 345

శుద్ధవసంతం

నంటున నీమేకులకు నవ్వేనయ్యా
దంటనైతి నీయెడకు తమకమేలయ్యా ॥ పల్లవి ॥

చూపులనే తనిసితి సుద్దులనే చేలఁగితి
యీపొద్దు నాతోఁ బెనఁగే విదేమయ్యా
వోపిక నీకుఁ గలదు వొరయఁగరాదు నిన్ను
తీపులాయ నామోవి తెగువలేలయ్యా ॥ నంటు ॥

మాటలనే భ్రమసితి మచ్చికలనే చొక్కితి
యేఁటికి నన్నుఁ గొసరే విదేమయ్యా
నీటుకాఁడ వౌదువు నిన్ను వదలఁగరాదు
వాటమాయ తలపోఁత వంచనలేలయ్యా ॥ నంటు ॥

రతుల నోలలాడితి రాజసానఁ బెరిగితి
యితవు నన్నడిగేవు యిదేమయ్యా
పతివి శ్రీవేంకటేశ పైపైఁ గూడితివి నన్ను
కతలాయ నామోహము కాదననేలయ్యా ॥ నంటు ॥ 346

## భైరవి

తామె యెఱుఁగుదురు తమతమభావము
చేముంచి యెవ్వరికిని చెప్పఁజూప రాదు ॥ పల్లవి ॥

మంతనపుపతిమాట మనసునఁ దలఁచుక
చింతించి చింతించి తానే సెలవి నవ్వె
వింత లీచెలివి చూచి వెరగయ్యా నీవేళ
అంతరంగములోపను లవి యెటువంటివో ॥ తామె ॥

కన్నులఁజేసినసన్న కాయమున మెరమంగ
తన్నుఁదానే పులకించి తలయూఁచీని
అన్నిటా నేమిందుకే ఆయములు గరఁగేము
మున్నిటివొడఁబాట్లముచ్చట లెట్టివో ॥ తామె ॥

దగ్గరవచ్చినమేలు తమకానఁ బెరుగఁగా
సిగ్గుతోడఁ గొంకికొంకి చేయివట్టెను
అగ్గమై శ్రీవేంకటేశుఁ డంగనఁ గూడె మెచ్చితి
మెగ్గుదప్పతేనితమయెనయిక లెట్టివో ॥ తామె ॥ 347

ఆహిరి

నీతోఁ బంతముగాదు నివ్వెర గింతేకాని
చేతులు చాఁచి యిచ్చై చిత్తగించవయ్యా ॥ పల్లవి ॥

శిరసువంచుటేకాని చెలిచూపు నీపై నదె
సరసమాడవయ్యా సారెకు నీవు
ఇరవైన ఆపెగుట్టు యెఱఁగఁజెప్పితి నీకు
విరసము లేదాపెను వేఁడుకోవయ్యా ॥ నీతోఁ ॥

పిలువకున్నదిగాని ప్రేమమెల్ల నీమీఁద
బలిమి దగ్గరవయ్య పైకొని నీవు
కలిగినదేసుమ్మీ కల్ల యించు కెఱఁగము
అలుక లేదాపె నీపై నాదరించవయ్యా ॥ నీతోఁ ॥

మాటాడకున్నదిగాని మనసెల్లా నీమీఁద
పాటించి భోగించవయ్య పైపై నీవు
చాటితి శ్రీవేంకటేశ సతి నిట్టె కూడితివి
యీటులేదు మీకిద్దరి కిట్టె వుండరయ్యా ॥ నీతోఁ ॥ 348

రేకు 1059 సింధురామక్రియ

ఎక్కువ తక్కువ లెఱఁగ మిదే
మొక్కఁగ నేరుతు మునుకొని నీకు ॥ పల్లవి ॥

కలిగినమాటకుఁ గాదనరాదు
తొలఁగక చెలితో దూరితిని
తొలుతటివిధ మది తూరీ నన్నిపుడు
మెలుపునఁ గూడఁగ మెచ్చితి నిన్ను ॥ ఎక్కు ॥

చేసినచేఁతలు చెప్పకపోదు
వేసితి నీపై వెసఁ దమ్మి
వాసి అప్పటిది వరుస నీ విపుడు
నేసలువెట్టఁగఁ జేకొంటి నిన్ను ॥ఎక్కు॥

కూడినకూటమి కొాద మరిలేదు
వోడక కాఁగిట నొత్తితిని
వేడుక లావేళ విభవము లీవేళ
యీడనే శ్రీవేంకటేశ పొగడితి ॥ఎక్కు॥ 349

నాదరామక్రియ

వట్టిదూసకములేల వాదులేల నాకిఁక
దట్టముగ నీకు మంచిదాననై వుండేను ॥పల్లవి॥

సరసుఁ డాడినమాఁట చక్కనే యందురుగాక
వొరయఁగవచ్చేరా వొకరై నను
ధరలో నే నొకతెను తప్పక నీమీఁదను
నెరుసు లెంచఁగఁబోతే నిజపట్టేరా ॥వట్టి॥

బలురాజు చేసేచేఁత పాడియుఁ బంతమెకాక
తలపోసి యెవ్వరైనాఁ దప్పుగొనేరా
వలచినదాన నేను వంతులకు నిన్ను మీరి
చలము సాదించేనంటే సాగఁబొయ్యీనా ॥వట్టి॥

మగఁడు వట్టితీసితేను మన్నించీ నందురుగాక
వెగటు లింతేఁటికి విడుమనేరా
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
నగి సిగ్గువడితేను నమ్మికయ్యీనా ॥వట్టి॥ 350

హిందోళవసంతం

కలదిదె మాట కట్టినయాట
చెలువుఁడు తనయిచ్చ సేసినట్టుసేయనీ ॥పల్లవి॥

పంతము తనతో నాడి బలిమిసేయఁగనోప
కాంతఁ దనసేవ సేయఁగలదానను
దొంతినున్నవలపులు దోమటి దొడుకుకొంటా
చెంతల నే నుండఁగాను సేసినట్టుసేయనీ ॥కల॥

మంకు దనతో నెరపి మాయలు సేయఁగనోప
అంకెఁ దనయిచ్చలోనిఆఁటదానను
లంకెలఁ దాఁ జేసినట్టిలచ్చనలు చూచుకొంటా
చింకచూపుల నుండఁగఁ జేసినట్టుసేయనీ ॥కల॥

కందువలఁ దన్నుఁ గూడి కడకుఁ బాయఁగనోప
సందడిరతుల తనజంటదానను
అందపుశ్రీవేంకటేశుఁడై నతన్నుఁ బాడుకొంటా
చెంది కాఁగిట నుందాన సేసినటుసేయనీ ॥కల॥ 351

ఆహిరి

నీ వెఱఁగని దున్నదా నెలఁతలాగు
చేవదేరి [1]చెక్కుఁటోడి చింత లివే ॥పల్లవి॥

పైపై నతివ నీకు ప్రాణమంటా నాదేవు
ఆపెచిత్తమున నున్న దామాఁటే
ఆపొందులు సిగ్గువిడిచాడఁగఁ జాలదుగానీ
మాపురేపు నెదలోనిమర్మ మిదే ॥నీవె॥

1. ఇక్కడ 'చెక్కు' శబ్దము, 'చెక్కుచేతితో' అనునర్థములో ప్రయోగించినట్లున్నది.

అలివేణిపొందులే నీ కన్నిసంపద లనేవు
తలఁపులో నాపెకు యీతమకములే
చెలులు నవ్వేరని చెనకకున్నదిగానీ
కలలోనఁ గనియేటికాను పిదే ॥ నీవె ॥

పడఁతిరతులే నీకు బ్రదుకని యెంచేవు
కడఁగి యాపెకు నిది కలగుణమే
తడవి శ్రీవేంకటేశ తానే నీవనుండెఁగానీ
బడివాయక కూడితి పంతము నిదె ॥ నీవె ॥ 352

తెలుఁగుఁగాంబోది

పొందినట్టితనమేలు పొగడే నేను
యిందరిలో యీసలిగె యెవ్వరికిఁ గలదే ॥ పల్లవి ॥

దైవశమై నాకుఁ దాను గలుగు చెఱుఁగుదును
సోవల నూరకే నేనూ సొలతుఁగాని
నావల్లఁ గొర తెంచఁడు నవ్వుతానే వుండు తాను
యీవలపు లీచనవు లెవ్వరికిఁ గలవే ॥ పొంది ॥

వేడుకతో నామాఁట వినే దెఱుఁగుదును
జాడగా బొమ్మలనే పై జంకింతుఁగాని
యేద నాతోఁ గ(న?)లఁగఁడు ఇచ్చకములే నేసుఁగాని
యీడుజోడై యీనసుపు లెవ్వరికిఁ గలవే ॥ పొంది ॥

గక్కన నన్నిట్లాను కలసే దెఱుఁగుదును
పక్కనఁ బదరి నేను పైకొందుఁగాని
వొక్కటై శ్రీవేంకటేశుఁ దొద్దనఁడు మెచ్చుఁగాని
యిక్కువలై యీభాగ్యా లెవ్వరికిఁ గలవే ॥ పొంది ॥ 353

మాళవిగౌళ

వేగిరించ మనకేల వింతవారమా
 పోగుసేతము వలపు పొందుదాఁకా నతఁడు ॥ పల్లవి ॥

చేకొని యాపెయింటిలో చెలువునిమాటలయ్యీ
 ఆకెఁ దాను యేకతములాదేరేమో
 కాకుసేసినట్లయ్యీ గక్కన నేఁ బిలిచితే
 వాకిటఁ గాచుకుందము వచ్చుదాఁకా నతఁడు ॥ వేగి ॥

పట్టెమంచమొద్ద నవే పైఁడిపావా లాతనివి
 అట్టె యాపెతో సరసాలాడీనేమో
 పట్టితిఁ జొప్పులవిగో పచ్చిసేయ నీఁకనేల
 గుట్టుతోఁ గోరుకొందము కూడుదాఁకా నతఁడు ॥ వేగి ॥

పచ్చడముసుఁ గదె పనులెల్లాఁ గానవచ్చె
 అచ్చముగాఁ గూడెనేమో ఆకె నిందాఁక
 ఇచ్చకుఁడు శ్రీవేంకటేశుఁడు నన్నిటు గూడె
 నచ్చుల గిలిగింతము నవ్వుదాఁకా నతఁడు ॥ వేగి ॥ 354

రేకు 1060 రీతిగౌళ

అన్నియు నీ వెఱుఁగుదు వద్దమాడ నే నీకు
 మన్నించనేరుతువు మారుమాట లేఁటికి ॥ పల్లవి ॥

నేసవెట్టి నీవు నాపై చెలిమిసేసినట్టి—
 వాసులకే పెనఁగేను వద్దనుండి
 నేసుకొన్నమగఁడవు చిత్తముకొలఁది ఇఁక
 రాసికెక్క నాపంతము రవ్వసేయనేఁటికి ॥ అన్ని ॥

కన్నులఁ జూచి నాతో కవకవ నవ్వినట్టి —
సన్నలకే పిలిచేను సారె సారెకు
యిన్నేసినమ్మిక లిచ్చి తెటువలసినఁ జేయు
వన్నె వచ్చె నారతికి వంకలొత్తనేఁటికి ॥ అన్ని ॥

కందువకుఁ దీసి నన్ను కాఁగిలించి కూడినట్టి -
అందాలకే తగిలేను అప్పటనుండి
పొందిన శ్రీవేంకటేశ భువి నీకృప నించితి -
వందమాయ నాజన్మము అలయించనేఁటికి ॥ అన్ని ॥ 355

శంకరాభరణం

ఎవ్వరికి విన్నప మిఁకనేల
యివ్వల నీదయ యింతటఁ గలది ॥ పల్లవి ॥

మనసునఁ బెనగొను మాఁటలకేకా
తనువునఁ దమకము తతిగొనెను
నను పున నుండిననయములకేకా
కనుఁగొనఁ జూపులు కడిమీఁ జెలికి ॥ ఎవ్వ ॥

నంటునఁ గొసరిననవ్వులకేకా
జంటల నిట్టూర్పు సతమాయ
అంటుముట్టు అడియాసకేకా
మెంటునఁ జెమటలు మిక్కిలిఁ బొలసె ॥ ఎవ్వ ॥

కూడినతొల్లిటికూటములకెకా
వీడనివేడుక వెసఁ నలిగె
యీడనె శ్రీవేంకటేశ కలసితివి
నీడలఁ గాంతకు నిర్మలమాయ ॥ ఎవ్వ ॥ 356

నాదరామక్రియ

పంతగాఁడవు నీకు బాఁలైతినా
 యింతినై నన్ను మెచ్చే విది వలెనా ॥పల్లవి॥

మచ్చికల నీతోను మాటలాడేయట్టివారు
 చెచ్చెర నెందరు లేరు నేనా సేన
 తచ్చనకు నే నీతో తలవంచుకుండఁగాను
 యెచ్చరించి వేఁడుకొనే వింత వలెనా ॥పంత॥

జంటల నీవద్దనుండి సన్నలుసేసేటివారు
 యింట నీకెందరు లేరు యింకానింక
 గుంటివెట్టి వాసులకు గుట్టుతో నే నుండఁగాను
 అంటిముట్టి చేయివట్టే వంతేసి వలెనా ॥పంత॥

గక్కన ని న్నేదనైనాఁ గాఁగిలించేయట్టివారు
 యిక్కువ నెఁ(నెం?)దరు లేరు ఇంతానంతా
 మొక్కి శ్రీవేంకటేశుఁడ ముంచి నే నిన్నుఁ గూడితి
 చొక్కించి బుజ్జగించేవు సుద్దు లిన్ని వలెనా ॥పంత॥ 357

రామక్రియ

మఱి యేమిటికిఁ గాదు మతినేల పదరేవు
 తఱిఁ దొల్లిఁటిపనులే తలఁచుఁ గాని ॥పల్లవి॥

పంతమేల యిచ్చేవు బాసలేల సేసేవు
 యింతిపిలిచినపని యిందుకుఁ గాదు
 చింతదీర నీకు నాపె సేవసేసి మెప్పించి
 అంతరంగము చేకొనేననికాని ॥మఱి॥

---

1. క్రిగీతగలయక్షరములు చిలుము తిన్నవి.

నవ్వులేల నవ్వేవు నాటకమేల సేసేవు
యివ్వల సతి మొక్కిన దిందుకుఁ గాదు
పువ్వువలె భోగించి పొదిగి నిన్నుఁ జొక్కించి
ఆవ్వల నీకృపఁ బొందేననికాని ॥ మతి ॥

చెక్కులేల నొక్కేవు సిగ్గులేల ముంచేవు
అక్కనఁ జేకొన్నది యందుకుఁ గాదు
యిక్కువ శ్రీవేంకటేశ యింతి నీవు గూడఁగాను
అక్కజమై నిను మెచ్చేనని కాని ॥ మతి ॥ 358

హిందోళవసంతం

నీగుణము చక్కనాయ నిజమా యిది
వేగినంతా నిందులకు వెరగయ్యీ నాకు ॥ పల్లవి ॥

అక్కడనుండి నాపై ఆసల నీవు కడు-
నిక్కి చూచితివియట నిజమా యిది
యెక్కడ నేరుచుకొంటి వెవ్వరు బుద్ధిచెప్పిరి
వెక్కసముగా నేఁడు వెరగయ్యీనాకు ॥ నీగు ॥

భావించి నే నున్నందుకు పంతములు నీ విచ్చితి
నీవు నన్ను మెచ్చితట నిజమా యిది
సేవ లెట్టు చేకొంటివి చిత్త మెటువలె వచ్చె
వేవేలుచందములను వెరగయ్యీ నాకు ॥ నీగు ॥

తలపోఁత కాఁగిలితగులాయముల నిట్టె
నెలకొంటి వన్నిటాను నిజమా యిది
కలసితి విదె శ్రీవేంకటేశ యేకారణమో
వెలయ యీకరుణకే వెరగయ్యీ నాకు ॥ నీగు ॥ 359

నాగవరాళి

తెలుసుకో యిఁక నీవు తెల్లవారె నీమాట
బలువుఁడ వీరెంటిపంతము నీచేతిది ॥ పల్లవి ॥

వేసరినవారితోడ వింతసుద్దులెల్లాఁ జెప్పి
వాసులేల రేఁచేవు వద్దు వద్దు
నీసరివారమా నేము నీతో మారాడేమా
వోసరించి దయఁజూచేపుణ్యము నీచేతిది ॥ తెలు ॥

వూరకున్నవారిమీఁద వుమ్మగిలఁ జేయివేసి
సారెనేల పెనఁగేవు చాలుఁజాలు
నేరుపుగలవారమా నిన్నుఁ గొసరఁగలమా
మేరతోడ నడపేటిమేలెల్లా నీచేతిది ॥ తెలు ॥

కనుసన్ననుండేవారిఁ గాఁగిటఁ జొక్కించి కూడి
పన్ని యెంతమన్నించేవు భళిభళి
నన్నుఁ గలసితి విదె నమ్మించి శ్రీవేంకటేశ
యెన్నికైనపేరుఁ గీర్తి యింతయు నీచేతిది ॥ తెలు ॥ 360

రేకు 1061 ఆందోళి

ఇద్దరము నిద్దరమె యెట్టు వెనకతియ్యము
తిద్దేవానిఁ జూతము దేవరవు నీవు ॥ పల్లవి ॥

మక్కువ నీతో నేను మాటలాడినట్టిమాట
అక్కడ నేల చెప్పితి వంతలోనే
పక్కన నప్పటి నాపెపంతము నాతోఁ జెప్పేవు
నిక్కి యీపనులు దీర్చ నీకే భారము ॥ ఇద్ద ॥

చేపట్టి నీతో నేను నెలవి నవ్వినవవ్వు
ఆపెకేల కన్నుగీఁటే వంతలోనే
తీపులుగా నా కప్పటి తిరుగ సన్న సేసేవు
నీపొందులు జరపఁగ నీకే భారము ॥ ఇద్ద ॥

కూరిమితో నే నిన్నుఁ గూడినకూటము లివి
ఆరయ యందేలసేసే వంతలోనే
యీరీతి నాపెను నన్ను ఇట్టె సమ్మతిసేసితి
నేరుపు శ్రీవేంకటేశ నీకే భారము ॥ ఇద్ద ॥ 361

పళవంజరం

చవిగానిపనికేల సాదించేరే
కవగూడినవా రింకఁ గాదంటే వినేరా ॥ పల్లవి ॥

యెగ్గులు-సిగ్గులు లేవు యెనసినవారికి
అగ్గలముగఁ గూడేటియాసలేకాని
వొగ్గి మీరేల చెప్పేరే వూరఁగలబుద్ధులెల్లా
అగ్గలపువారిద్దరి కవి యితవవునా ॥ చవి ॥

చింతలు-వంతలు లేవు చేకొన్నవారికి
వింతలుగా నవ్వునవ్వేవేడుకేకాని
వంతుకు మీరందుకేల వంక లొత్తఁబొయ్యేరే
పంతపువా రివి నేఁడు పాటివచ్చీరా ॥ చవి ॥

కడమ-దొడమ లేవి కలసినవారికి
వుడివోనిరతులలో వొద్దికే కాని
అడరి శ్రీవేంకటేశుఁ డాపె నొక్కటి
యెడమాటలేలే వారు యెఱఁగని వున్నవా ॥ చవి ॥ 362

శ్రీరాగం

ఘనుఁడవు నీవెట్టున్నాఁ గాదనేమా
.వినఁగానే మీకు విన్నవించేము గాక ॥ పల్లవి ॥

చనవిచ్చి నీవు మాకు చలివాపఁగాఁ గదా
ననుపుసేసుక సారె నవ్వేము నేము
మనసు వేరొకటైతె మాటలాడ వచ్చేమా
వొనరి దయఁజూడఁగ నొరసేముగాక ॥ ఘనుఁ ॥

మందెమేళముగా మమ్ము మన్నించఁగాఁ గదా
సందడిఁ బెనఁగేము నీసరుస నేము
అందాలకు రాకుంటే నాయములు చెనకేమా
పొంది మమ్ము మెచ్చఁగానే భోగించేము గాక ॥ ఘనుఁ ॥

వావి సేసుకొని మమ్ము వడిఁ గలయఁగఁ గదా
వోవలఁ గుచగిరుల నొత్తేము నేము
శ్రీవేంకటేశ్వర నీవు చేపట్టకుంటే మొక్కేమా
కైవశము గాఁగానే కైకొంటిమి గాక ॥ ఘనుఁ ॥ 383

మాళవిగౌళ

రచ్చలఁబెట్ట కతని రారే మీరు
చెచ్చెర నాయింటిదిక్కు చిత్తగించీఁ దానే ॥ పల్లవి ॥

అతఁ డెఱిఁగినవే అన్నిబుద్ధులును భూమి
యీతల చెలులు సారెనేల చెప్పేరే
నీతిగలవాఁ డతఁడు నిక్కలఁ గందాన నేను
యేతుల నేఁడే చనవు లిచ్చీనే తాను ॥ రచ్చ ॥

రమణుఁ డిచ్చినవే రాఁపులవిడేలెల్ల
జమళి మీరే లతని సాదించేరే
మమతగలఁ డాతఁడు మాటగొన్నదాన నేను
సమముగా నాపైఁ జేయిచాఁచీనే తాను ॥ రచ్చ ॥

శ్రీవేంకటేశ్వరుఁడే చేసినచేఁత లన్నియు
వేవేలుచందాల నేల వేసరించేరే
కావించి యీతఁడె నన్నుఁ గలసె నేను మెచ్చితి
తావుల నిట్లా నాకు దక్కెనే తాను ॥ రచ్చ ॥ 364

శంకరాభరణం

కొంకితి నందుకే కొనఁగొనలా
యింకా నీచిత్త మెట్టున్నదో ॥ పల్లవి ॥

కందువ నినుఁగని కన్నుల నవ్వఁగ
అందుకు నెంతటిదనందువో
సందడి నీతో సరసములాడఁగ
మందెమేళమని మతిఁ బెట్టుదువో ॥ కొంకి ॥

చేతుల నీపై చెనకి చిమ్మితే
యేతు లనుచు మఱి యేదుమంవో
కాతరమున నిటు కడుఁబై కొనినను
నీతలఁపుల నేనెపము లెంతువో ॥ కొంకి ॥

నిలువునఁ గాఁగిట నిను నిటు మించిన
కొలఁది మీరె నని కొంతందువో
కలసితి శ్రీవేంకటేశ నన్నిదె
మలయుచు నెటువలె మరులుగొందువో ॥ కొంకి ॥ 365

నాదరామక్రియ

ఏల వేగిరించేవు యేఁటికి నీకు నలుక
.నాలితనమెల్లా మాని నవ్వు నవ్వవయ్యా ॥ పల్లవి ॥

తిట్టినపెదవినే దీవించె నదె యాకె
పట్టినచలము మాని పలుకవయ్యా
నెట్టన నింతకతొల్లి నీవు నేసినటియా -
దట్టపుఁజేఁత లేఁటివో తలఁచుకోవయ్యా ॥ ఏల ॥

దొబ్బినచేతులనే దోసిలించి మొక్కీ నాకె
అబ్బురా లేఁటికి విడె మందియ్యవయ్యా
గబ్బితనాన నీవాళ్లఁ గలిగినయట్టియా -
తబ్బిబ్బుచేఁత లేఁటివో తలఁచుకోవయ్యా ॥ ఏల ॥

వొరసినచన్నులనే వొత్తి నిన్నుఁ గూడె నాకె
మరిగికూడితి విట్టె మన్నించవయ్యా
యెరవుల శ్రీవేంకటేశ నీచిన్ననాఁటి -
ధరలోనిపనులెల్లాఁ దలఁచుకోవయ్యా ॥ ఏల ॥ 366

రేకు 1062 సామవరాళి

నీ కెట్టు దెలుసును యీనెలఁత లెరుఁగుదురు
సాకిరి వీరు చెప్పఁగా సమ్మతౌట గాక ॥ పల్లవి ॥

ఇక్కువ లంటేటివేళ ఇద్దరము నిద్దరమె
యెక్కువ తక్కువ లెంచ నీకనేల
లక్కవలె గరఁగినలాగులును - బాగులును
చొక్కివున్న విధములు చూచుకొంటగాక ॥ నీకె ॥

చనవుమెరసేవేళ సంగడీలము మనము
మనసులు సోదించ మఱియేల
పెనఁగేటియాసలును ప్రియముల వాసులును
యెనసేటితమకాలే యెంచుకొంటగాక ॥ నీకె ॥

తతిఁ గూడేయీవేళ దంటలమే యిద్దరము
కతలు చెప్పఁగ నిఁక కదమలేల
రతిలోఁ జొక్కితి మిదె రమణ శ్రీవేంకటేశ
మితిమీరినందుకెల్లా మెచ్చు టింతేకాక ॥ నీకె ॥ 367

తోండి

చెలులము నేమన్న చిత్తము నీ కెట్టుండునో
యెలమి నీచేఁత లివె యెంచుకోరాదా ॥ పల్లవి ॥

మోవిచవిగొనేవేళ మొగము చూడఁగఁబోతే
భావించి జాణలకు కోపమురాదా
చేవదేర నిందు కాపె చేతనంటెనని దూరే -
పీవల నెవ్వరితప్పో యెంచుకోరాదా ॥ చెలు ॥

చన్నులనొత్తేటివేళ సరసములాడఁబోతే
విన్నకన్నవారికైన వెగటుగాదా
తిన్ననిమాటల నిట్టే తిట్టెనంటా నాదేవు
ఇన్నిఁటా తగవు నీవే యెంచుకోరాదా ॥ చెలు ॥

చొక్కేటిరతులవేళ సొంట్లు సోదించఁబోతే
నిక్కపుశ్రీవేంకటేశ నిన్ను దూరరా
తక్కక నీవు గూడితే తరుణి నవ్వె ననేవు
యెక్కువ తక్కువ నీవే యెంచుకోరాదా ॥ చెలు ॥ 368

లలిత

ఊరకే వున్నదాన నన్నొరయకురే
. నేరుపులు మీతో నే నెరపనేలే ॥ పల్లవి ॥

యితరు లయ్యాతని కిచ్చకములాడితేను
కుతదీర మిమ్ము నిట్టె కోపించనేలే
ఆతఁడు నేసినచేఁత కాతనినే యందుఁగాక
మితిమీరినమాఁటలు మీతోనేలే ॥ ఊర ॥

తోడువచ్చినసతులు దోమటిదొడికించితే
సూడుఁబాడు వట్టి మిమ్ముసొలయనేలే
వీడెమిచ్చేవిభునినేవెల్లవిరి సేతుఁగాక
పాడిపంతముల మిమ్ముఁ బరచనేలే ॥ ఊర ॥

బడివాయ నీయింతులు బలిమిఁ గూడింపించితే
పెడమరలి మీతోను పెనఁగనేలే
అదరి శ్రీవేంకటేశుఁ డాతఁడు నే నొక్కటైతి
విడుముడి మిమ్ము నవ్వి చిమ్మిరేఁచనేలే ॥ ఊర ॥ 369

మధ్యమావతి

ఆతఁ డదె నీ విదె అరగొరత లేఁటికే
చేతిలోనివాఁ డితఁడు సిలుగు లింకేఁటికే ॥ పల్లవి ॥

చలువైననీమోముచంద్రుఁడు వెన్నెలగా
చెలియ నీమతిలోనిచీఁక టేఁటికే
నిలువుఁగొప్పుమేఘపునీడలు నీమేన నిండె
యెలమితో విరహపుటెండ లేఁటికే ॥ ఆతఁ ॥

వుదుటునీనాసికపుటూరుపుగాలి విసరీ
చెదరుఁజెమటవానచిత్త దేఁటికే
పదరమైఁదీగె బంగారుపసిమిదేరీ
యిదె మోవిపండు వాడ నింతయేఁటికే ॥ అత ॥

పొంచిననీచెక్కులనే పులకలపంట వండె
యించుకనడిమికళ విఁకనేఁటికే
అంచెలశ్రీవేంకటేశుఁ డాతఁ డదె నిన్నుఁ గూడె
మంచపుదొమ్మలలోన మంకు లిఁకనేఁటికే ॥ అత ॥ 370

ఆహిరి

పగవారినైన నింతపరతురా యెవ్వరైన
మొగమోట దలఁచుక ముంచరాదా కరుణ ॥ పల్లవి ॥

చెక్కులెల్లాఁ బులకించె చెమరించె చెలిమేను
యెక్కడ చూచేవు చిత్త మేద నున్నది
కక్కసించి ఆపెవంకఁ గట్టుకొనే దిఁకనేమి
చక్కని చెలియమీఁద చల్లరాదా కరుణ ॥ పగ ॥

కొప్పునెరులును వీడె కూరిములు తలకూడె
ఇప్పు డెంతపనిగద్దు యీాడ నీకు
చెప్పరానిచేఁత చెలిఁ జేసి దొడ్డవాఁడ వైతి
చొప్పుగాఁగా ఆపె కిట్టె చూపరాదా కరుణ ॥ పగ ॥

నెలవుల నవ్వు నిండె చిత్తమెల్లఁ దమకించె
చలమరి వొదు విఁక చాలించరాదా
యెలమి శ్రీవేంకటేశ ఇంతిఁ జేరి కూడితివి
మొలచినట్టె యింకా ముంచరాదా కరుణ ॥ పగ ॥ 371

దేసాళం

అందుకేమి దోసమా అవునయ్యా
ఎందును రాజులకుఁ దప్పేడ లేదయ్యా ॥ పల్లవి ॥

యేకతము నీతో నాడి యెదుట నిలుచున్నది
చేకొని ఆపెకు బుద్ధిచెప్పవయ్యా
ఆకడి పరాకయ్యేవు అంద నే మున్నారమని
యీకడ వందివార్చి దొమ్మిఁక నేలయ్యా ॥ అందు ॥

సన్నలు నీతోఁ జేసి సరసములాడీని
వున్నతి నాపెకు లోనై వుండవయ్యా
తిన్ననిసిగ్గువడేవు దిష్టించి మామోము చూచి
అన్నిటా గరిడి చొచ్చి అడఁగనేలయ్యా ॥ అందు ॥

సెలవుల నవ్వు నవ్వి శిరసు వంచుకున్నది
మలసి సందేహము మానుపవయ్యా
అలరి శ్రీవేంకటేశ ఆట్టె నన్నుఁ గూడితివి
ఫలముచేకొన్నమీఁదఁ బదరనేలయ్యా ॥ అందు ॥ 372

రేకు 1063 వేళావళి

వాదులు మాతోనేల వాకిట నున్నార మిదే
సేదదేర నీ వాపెనే చెనకవయ్యా ॥ పల్లవి ॥

యెదుట నిలుచుండఁగ యేమందువోయంటా
వొదిగి మంచముమీఁద నున్నది చెలి
అదన నీ కింతలోనే అందాఁకా వేగిరమైతే
పొదిగి అక్కడి కేఁగి భోగించవయ్యా ॥ వాదు ॥

తప్పకచూచితేను దంట యిది యందువంటా
వొప్పుగ తెరమాటున నున్నది చెలి
దప్పిదేర నాపెమీఁది(దఁ?) తమకమే కలితేను
కప్పి లోని కేఁగి నీవే కాఁగిలించవయ్యా ॥ వాదు ॥

గక్కనఁ గాఁగిలించఁగ గబ్బిది యనేవంటా
వొక్కటై వోవరిలోన నున్నది చెలి
ఇక్కవ శ్రీవేంకటేశ యింతి నిట్టె కలసితి
తక్కక యిద్దరు లోన తగిలుండరయ్యా ॥ వాదు ॥ 373

కేదారగౌళ

ఎప్పుడు నీవాననే యిన్నిటా నీచిత్తము
చప్పుడు సేయుటేకాని సాదించనేరను ॥ పల్లవి ॥

చూపులకు లోనై సుద్దులకు వెలియై
నీపొందు సేసేను నిచ్చలు నేను
తీపులనే పిలుపులు తిట్లనే బులుపులు
మోపుగట్టివేసే నీపై మొరఁగనేరను ॥ ఎప్పు ॥

పలుకులకు గురై పంతానకు మరఁగై
వలపులు చల్లేను వాసికే నేను
నెలవుల నవ్వులును చేతులనే పువ్వులును
నిలువున వేసేను నెపాలు నే నేరను ॥ ఎప్పు ॥

తమకములకుఁ జిక్కి తలపోఁతలకుఁ జొక్కి
సమముగాఁ గూడేను సారెకు నేను
అమరె శ్రీవేంకటేశ అంకెలును-లంకెలును
జమళి నీపై వేసేను సటలు నే నేరను ॥ ఎప్పు ॥ 374

బౌళి

ఏకమై వుండినచోటి(ట?) యెగ్గులేఁటివి
వీకు నాకెకును సరే నేరములేలయ్యా ॥ పల్లవి ॥

మతిలో మఱఁగు లేదు మాటల కొదువలేదు
సతికి నీ విచ్చినట్టిచనవే కాని
రతివేళ నీతోడ రాజసము చూపెనంటా
చతురుఁడ వింత యాల సాదించేవయ్యా ॥ ఏక ॥

కన్నుల కసరులేదు గర్వ మించుకంత లేదు
కన్నెకు; నేరిపిననీకట్టడే కాని
వున్నతపుకొనగోరు వూఁది నీతో నవ్వెనంటా
యెన్నెసి గడించుకొనే వేడసుద్దులయ్యా ॥ ఏక ॥

వేసట యేమీలేదు వెఁ(వెం?)గెములాడేది గాదు
యీసతికి [1] కాఁగిటినీయీవులేకాని.
ఆసల శ్రీవేంకటేశ అలయించి కూడెనంటా
వాసులేల పట్టేవు వరము లీవయ్యా ॥ ఏక ॥ 375

ముఖారి

మాతో నీవు యేమనినా మాటలాడే మింతేకాక
యేతుల నెవ్వరిగొడ వేఁటికి మాకు ॥ పల్లవి ॥

రవ్వ నాపె నిన్నేమన్నా రచ్చ నీ వాపె నేమన్నా
యెవ్వరి నొఁగాదననేల మాకు
అవ్వలఁ దొండకు వెలుఁగు సాకి రింతేకాక
యెవ్వ రెఱుఁగుదురు మీయిద్దరిలో పనులు ॥ మాతో ॥

1. సమాసము ? నీకాఁగిటియీవులు అనుట సహజము

గోర నాపె నిన్నొత్తనీ కొమ్మను నీవైన నొత్తు
యీరసాన వహించుకోనేల మాకు
చేరువనూతికొలఁది చేఁతాదే యెరుఁగుఁగాక
సారె మిమ్ము నంత మాకు సాదించనేఁటికి ॥ మాతో ॥

చెలి సన్నలు సేయనీ చేరి నీవు సన్న సేయు
కలసితి విదె శ్రీవేంకటేశ నన్ను
యెలమి నీరుకొలఁది యెప్పుడు తామెర కాక
వెలుపటిమీసుద్దులు వివరించనోపము ॥ మాతో ॥ 376

గౌళ

అప్పటి నన్నేలడిగే వౌనోకాదోయంటా
నెప్పున నిన్నిందులోన నేరమెంచేవారమా ॥ పల్లవి ॥

చెప్ప నేమున్నవి నీవు చిత్తగించినవియెల్లా
కప్పురపునోళ్లఁ బొగడేవేకాక
తప్పు లెక్కడివి నీవు తగఁ జేసేపనులలో
కప్పి ఇందరును మెచ్చఁగలవేకాక ॥ అప్ప ॥

వెలుతులు గలవా నీవిద్య లిన్నిటిలోపల
కొలఁదిమీరఁగ నిండుకొన్నవే కాక
యెలమి నవ్వేవా రెవ్వ రింతటినీగుణాలకు
చెలరేఁగి రేఁగి సంతసించుటే కాక ॥ అప్ప ॥

మట్టుపెట్టనేది నీ మహిమ వెల్లివిరిసె
గుట్టున నీతోఁ బెనఁగుటేకాక
ఇట్టె శ్రీవేంకటేశ యెనసితి విదె నన్ను
ముట్టి యెప్పుడూ నీకు మొక్కుటేకాక ॥ అప్ప ॥ 378

వసంతవరాళి

వద్దన్న వా రెవ్వరు అవక్కణలేల చెప్పేవు
బద్దులమీసుద్దులకు బాఁతే నేను ॥ పల్లవి ॥

మొగము చూచి యాపె మొక్కినయప్పటిమొక్కు
తగులుగా మూలఁబెట్టి దాఁచుకో నీవు
తెగరాకుంటే నీవే దేవరవై యందుకుఁగా
వగదీర నాచెలికి వరమియ్యి యిపుడు ॥ వద్ద ॥

నిలుచుండి కొలిచిననిలువుఁగొలువులెల్లా
వలనుగా [1] కవిలేల వాయించు నీవు
అలరి యప్పటి నీవే ఆపెపాలిటిరాజవై
మలసి మలసి మెచ్చి మన్నించు మిపుడు ॥ వద్ద ॥

యీవల నన్నుఁ గూడితి వీపెసేసినసేవలు
పోవులుగాఁ గొన్ని కూడపోసుకో నీవు
శ్రీవేంకటేశ యింకా నా చెలికి విటుఁడవై
సావధానమున సరసములాడు మిపుడు ॥ వద్ద ॥ 378

రేకు 1064 దేవగాంధారి

చెప్పినట్టు సేతుఁగాక చింతలు నా కేఁటనేల
పట్టినచలములకుఁ బగదాననా ॥ పల్లవి ॥

మాఁటలు నీ వాడఁగాను మంకులు నా కేఁటనేల
నాఁటకపుసెలవుల నవ్వేదుఁగాక
యేఁటికి నొడఁబరచే వెడమాటలను నన్ను
గాఁటాన నీతో నలిగి కట్టుకొనేదేమి ॥ చెప్పి ॥

1. కవిలె (కపిలె) కవిలె=కపిలె, ఎలా=కపిలెతోఁ అనప్పుడు పాడేయేలపాట?

వలపులు చల్లఁగాను వాదులు నా కిఁకనేల
బలిమినైన నీకొాంగు పట్టుదుఁగాక
వఱదు నీ కింతయేల వట్టియానలెల్లా నేఁడు
సళిపి ని న్నిందువంక సాదించేదేమి ॥ చెప్పి ॥

చేరి నీవు గూడఁగాను సిగ్గులు నా కిఁకనేల
గారాబునీరతులెల్ల కై కొంటిఁగాక
వేరులేదు మనకు శ్రీవేంకటేశ మెచ్చేవు
దూరి నిన్ను నిందులోనె దొమ్మి సేసేనా ॥ చెప్పి ॥ 379

గౌళ

వద్దువద్దు నీకేల వట్టివాసులు
తిద్దే నేను నీయందు తీరనికడమలు ॥ పల్లవి ॥

అంగన నీతోనాడిన అప్పటి మాటలకా
చుంగులువారఁగఁ దలఁచుక నవ్వేవు
యెంగిలిసేసినమోవి యింపులచేఁతలకా
సింగారపుఁగళలతో శిరసువంచేవు ॥ వద్దు ॥

చెలి నీపై వినోదాన చేయివేసినందుకా
వెలలేనివువ్వుల నివ్వెర గందేవు
చలముతో బొమ్మలను జంకించినందుకా
చిలుకుఁగాఁకలుదేర చెమరించేవు ॥ వద్దు ॥

కాంత నిన్నందరిలో కాఁగిలించినందుకా
పంతపుమాట లాడుచు బయలీఁదేవు
యింతలో శ్రీవేంకటేశ యే నిన్నుఁ గూడినందుకా
మంతనానఁ బవ్వళించి మనసుచూచేవు ॥ వద్దు ॥ 380

పాడి

తాముఁ దా మెరఁగరా తరవాతిపనులు
 దోమటి వారిబుద్ధుల తోడనేలే ఇఁకను ॥ పల్లవి ॥

ఇంతిమోము చూచి మోహ మీతనిపైఁ జల్లె నిదె
 అంతలో నవ్వు లీతఁ డాపెపైఁ జల్లె
 వింత లిద్దరికి లేవు వేడుకచెలుల మింతే
 మంతనపువిన్నపాలు మనకేలే ఇఁకను ॥ తాముఁ ॥

వెలఁది యీవిభునికి వీడెము చేతికిచ్చె
 చెలువుఁ డాకుమడిచి చెలికిచ్చెను
 తలఁపు లిద్దరికిని తారుకాణలాయ నిదె
 చలివాసె వేఁడుకొను(న?) సారెనేలే మనకు ॥ తాముఁ ॥

అంగన శ్రీవేంకటేశు నంకెలఁ గాఁగిలించె
 సంగతి నాతఁడే కూడి చనవిచ్చెను
 ఇంగితాన నిద్దరికి యెరవులు లేవిఁక
 ముంగిటనున్న మనకు మొరఁగేలే యిఁకను ॥ తాముఁ ॥ 381

శంకరాభరణం

ఎమ్మెలు నెరపి యాపె యెంతసేసెనో
 కమ్మర నింతిగుణాలు కంటిఁగా విభుఁడా ॥ పల్లవి ॥

తనకే వలతువని తరుణి యాడుకొనఁగ
 కొనమాటలకే నిన్నుఁ గోపగించితి
 ననిచి యప్పటిఁ గొంతనవ్వేవు నాయెదుటను
 నిను భావించఁగలేక నిజమంటా నుంటిని ॥ ఎమ్మె ॥

యేదో ముద్దుటుంగరము ఇచ్చితివని చూపఁగ
ఆదరానిమాటలెల్లా నాడితి నిన్ను
కూడుక తా మాసరిఁ గూచుండె నావేళ గొంత
యీడుపడి నీచేఁత లివియంటా నుంటిని ॥ ఎమ్మె ॥

పిలువనంపితినని పెద్దరికాలు చెప్పఁగ
చలములెల్లా నిన్ను సాదించితిని
అలరి శ్రీవేంకటేశ అంతలో నన్నుఁ గూడితి-
వెలమి నాపెచేఁతలు ఇప్పు డెఱిఁగితిని ॥ ఎమ్మె ॥ 382

## భైరవి

ఇది గొంతవలెనా యిందుకుఁ దోడు
మదనమెత్తించీ నన్ను మంచివానివలెనే ॥ పల్లవి ॥

అచ్చలానఁ దన్నుఁజూడ ఆడకు నే రాఁగానే
ఇచ్చటికేల విచ్చేసె నింతలోఁ దాను
కచ్చుపెట్టి విన్నవారు గర్వియని నన్నందురు
మచ్చిక నెఁ(నెం?)తసేసీనే మంచివానివలెనే ॥ ఇది ॥

చేకొని తన్నుఁజూచి చేతులెత్తి మొక్కఁగానే
వాకునఁ [1]దానేల మొక్కె వద్దంటాఁ [2]దాను
యీకడ లోకమువారు యెంతటిది ఇదనరా
మా కెంతదూరు గట్టీనే మంచివానివలెనే ॥ ఇది ॥

తిరమై తనవారమై తెరలోని కేఁగఁగానే
సరుగఁ గాఁగిట నించె సరుసఁ దాను
అరుదై శ్రీవేంకటేశుఁ డౌనే నన్ను నిటు గూడి
మరిగించె నిన్నిటాను మంచివానివలెనే ॥ ఇది ॥ 383

1, 2. రెండు 'తాను' శబ్దములు. ఈపునరుక్తులక్కడక్కడ గలవు.

శ్రీరాగం

చిత్తగించు రమణుఁడ చేరి యెదమాటలేల
చిత్తరుపతిమను నీచిత్తము నాభాగ్యము ॥ పల్లవి ॥

చొప్పగునావలపు చూపిచెప్పరాదు నన్నుఁ
గప్పి కాఁగిలించుకొంటేఁ గానవచ్చీని
వుప్పతించ నే నేర వూరకుండఁగాఁ జెమట
చిప్పిలీ నామేనను నీచిత్తము నాభాగ్యము ॥ చిత్త ॥

అందికూడేతరితీపు అంతిం తనఁగరాదు
కందువ నీ వంటఁగానే కానవచ్చీని
మందలించ నే నేర మరిగి నే నుండఁగాను
చిందేటిజవ్వనిని నీచిత్తము నాభాగ్యము ॥ చిత్త ॥

చొక్కేననావేడుకలు సూడిదిపట్టఁగరాదు
గక్కన నీ వెనసితేఁ గానవచ్చీని
వొక్కటైతివి శ్రీవేంకటోత్తమ నే మెచ్చనేర
చిక్కి నీకు నుండఁగా నీచిత్తము నాభాగ్యము ॥ చిత్త ॥ 384

రేకు 1065 సాళంగనాట

నేరుపరి వౌదువమ్మ నిజలక్ష్మి
పేరడిమహిమలను బెరసితివి ॥ పల్లవి ॥

మనసు రంజిల్లఁ జేసి మారుగొండ లెక్కివుండి
ననుపుసేసుకొంటివా నాయకునిని
చనవిచ్చి తొడమీఁద సరి నాతఁ డిడుకొంటే
పెనఁగి కూడితివమ్మ ప్రియురాలవు ॥ నేరు ॥

చేయిచాఁచి [1]రాఁగిలించి చిత్తగించి మోము చూచి
ఆయము లంటితివా ఆతనిని
చాయలకు నాతఁడు చల్లినినవ్వు నవ్వితే
దాయపుమో విచ్చితమ్మ తగుజాణవు ॥ నేరు ॥

శ్రీవేంకటాద్రి యిది శ్రీనరసింహదేవుని
ఆవటించి కూడితి వాలవుభళానను
వోవరిగా నాతఁడు నిన్నురమునఁ బెట్టుకొంటే
భావించి మెచ్చితివమ్మ పంతపుటిందిరవు ॥ నేరు ॥ 385

పాడి

అందుకేమి దోసమా అట్టే కానీ కానీవయ్య
చెంది యీపెతోడ నేము చెప్పకుందేమా ॥ పల్లవి ॥

పైపై యీపెకు నిట్టె బత్తులెల్లఁ జేసేవు
చూపులఁ దప్పక ఆపెఁ జూడవా నీవు
యీపొద్దే అన్నియును బయిటవేయరాదుగాక
తీపునీగుణా లందరుఁ దెలియనివా ॥ అందు ॥

వంకలొత్తి యీపెతోను వట్టిబాసలు సేసేవు
అంకెమాట లాపెతోడ నాడవా తొల్లి
బింకాన మీలో వాదులుపెట్ట దోసమనికాక
ఇంకా మామరఁగువాఁడ వెఱఁగవా నీవు ॥ అందు ॥

ఇట్టె కాఁగిలించి యీపె నిక్కువకుఁ దీసేవు
గుట్టున నిట్లా నాపెఁ గూడవా ముందు
నట్టనడుమఁ గూడితి నన్ను శ్రీవేంకటేశ
రట్టు నిన్నుఁ జేసేనా నెట్టుకొనెఁ బనులు ॥ అందు ॥ 386

1. 'రాఁగు' ధాతువు, దానిపై స్వార్థమున 'ఇలి'' దానిపై ప్రేరణార్థమున 'ఇంచు' కావచ్చు

ఆహిరి

అందరివంటిది గాదు అంగనయీవి
చిందల నీగుణములు నెరపకుమీ ॥ పల్లవి ॥

నెలవుల నవ్వునవ్వి చెక్కులు గోర నొక్కి
వలపులు చల్లితివి వనితమీఁద
నిలువున నమ్మె నాపె నిజమరివని నిన్ను
తలఁపులు మరివేరే తలఁచకుమీ ॥ అంద ॥

అందపుమాట లాడి ఆయములు సోఁకించి
విందుగా మోవిచ్చితివి వెలఁదికిని
కందువలఁ జొక్కె నాపె [1]కాణాచి దీడ న(నా?)కని
అందాలకుఁ బరులపొం దాలించకుమీ ॥ అంద ॥

గక్కనఁ గాఁగిటఁ గూడి కైకొని శ్రీవేంకటేశ
యెక్కించితి వురముపై యీరమణిని
మొక్కె నాపె నీవే తనమోహపుసింహాసనమని
పక్కన నేమిటా నిఁకఁ బదరకుమీ ॥ అంద ॥ 387

రామక్రియ

ఎఱుఁగుదు నిదె విడె మిందవయ్యా
వెరగాయ వలపులు వేగిరమే లిపుడు ॥ పల్లవి ॥

పచ్చిదేరీ మోవులను పాలుగారీ చెక్కులను
రచ్చకెక్కె నీబతుకు రావయ్యా
నిచ్చ నిచ్చ కొత్తలాయ నిన్ను నేమీనన నిఁక
విచ్చనవిళ్లేకాక వెఱపేల ఇఁకను ॥ ఎఱుఁ ॥

1. కాణాచి + ఇది + ఈఁడ.

సిగ్గుదేరీ మోమునను చెమరించీ నొసలను
మెగ్గులేదు నీకు మొక్కె మియ్యకోవయ్యా
వొగ్గితి విన్నిటికిని వొరసి నే నేమనే
నిగ్గులుదేరుచేకాక నేరమేది యిందును ॥ ఎలుఁ ॥

చొప్పులెత్తి నీవురము సొంపుదేరెఁ బులకల
కొప్పు వీడె వద్దనిట్టే కూరుచుండవయ్యా
అప్పుఁడ శ్రీవేంకటేశ అన్నిటా నన్నుఁ గూడితి —
వుప్పతిల్లు సంతోసాలే వొనగూడె మనకు ॥ ఎలుఁ ॥ 388

శంకరాభరణం

తనకు నాకు నిటు భేదము గలదా
మనసుమంకు లిటు మాన్పఁగరాదా ॥ పల్లవి ॥

చెలి నిటురమ్మని చెప్పితి నీతో
కలదో లేదో కమలాక్షి
తలఁచనై తినని తా నను దూరీ
తెలిసినమాటలు తెలుపఁగరాదా ॥ తన ॥

యివలఁ దనకుఁగా యెదురు చూచితిని
అవునో కాదో అలివేణి
తివిరి నే రానని తెగువలు వలికీ
కవగూడఁగ మముఁ గలపఁగరాదా ॥ తన ॥

అగపడితి శ్రీవేంకటాద్రీశుఁడ నిది
తగునో తగదో తనుమధ్య
నగవుల నెలవుల నాపైఁ జిలికీ
పగటులెల్ల నేర్పరచఁగరాదా ॥ తన ॥ 389

తెలుఁగుఁగాంబోది

ఇరవయి నే మెఱిఁగిన వింతాను। నీ-
వరుసవంతేకాక వాదించఁదగునా ॥పల్లవి॥

పలుకులతుదనేలే పంతాలు। నీపతి-
వలపులమీఁదనే వంచరాదా
నిలుచుండే విదియేమే నీవు నావద్ద। నీ-
చలము లక్కడనే సాదించరాదా ॥ఇర॥

కన్నులచూపులనేలే కసరులు
నిన్నింతసేయువానిపై నెరపరాదా
నన్నుఁ జుట్టి నీకేలే నాయాలు। నీ-
పన్నుగడ లక్కడనే పచరించరాదా ॥ఇర॥

చెక్కులచేతులనేలే సిగ్గులు। నీకుఁ
జిక్కినయాతనివద్దఁ జేయరాదా
యిక్కువ శ్రీవేంకటేశుఁ డిటు గూడె నన్ను। నీ-
మొక్కు లాడ మొక్కి ప్రియములు చెప్పరాదా ॥ఇర॥ 390

రేకు 1066 ఆహిరినాట

తానెంత నేనెంత దగ్గరేపాటిదా
పానిపట్టి నీవు చేపట్టఁగానేకాక ॥పల్లవి॥

మచ్చిక నీతో నాపె మాటలాడఁగాఁగదా
వొచ్చెమని ఆవేళ నూరకుంటిని
మెచ్చి అంతనాతోను యెదురాదేపాటిదా
నిచ్చలు నసమిచ్చిననీవల్లఁగాక ॥తానెం॥

యిరవై అంగన నీయింటిలో నుండఁగగదా
సరవితో నావేళకు సమ్మతించితి
పొరుగుపొంతలనుండి పొందుసేసేపాటిదా
మరిగి కాచుకున్న నీమన్నించఁగఁ[1] గాక ॥ తానెం ॥

పనివేళ నీకుఁ జెలి పాదాలొత్తఁగఁగదా
కని పూడిగపుదని కైకొంటిని
యెనసి శ్రీవేంకటేశ నన్ను యింతటిదా
ననలుగా నీవు గొంత నవ్వఁగాఁ గాక ॥ తానెం ॥ 391

కాంబోది

ఆదేబొమ్మలు వారు ఆడించేసూత్రము నీవు
యేడో ఇన్నాళ్లు నేను ఇదెఱఁగనైతిని ॥ పల్లవి ॥

నీవు చెప్పినబుద్దుల నెలఁతలు నడవఁగా
ఆవలివారి దూరితి నయ్యో నేను
చేవదేర తాలముచేయి నీచే నుండఁగాను
వేవేలుచోట్లను వెదకితి నేను ॥ ఆదే ॥

కన్నుగీఁటి నీవు వారి కైకొని మొక్కించఁగా
సన్నల వారి దొబ్బితి సాదించి నేను
పన్నినకూఁకటివేరై పారి నీవు వుండఁగాను
వున్నతిఁ గొనలకు నీ రొగ్గి నేఁ బోసితిని ॥ ఆదే ॥

కోరి పెండ్లాడినపెండ్లికొడకవు నీవుండఁగా
గారవించితిని వారిఁ గరుణ నేను
యీరీతి నన్ను శ్రీవేంకటేశ నీవు గూడుండఁగా
కారణ మిందరునంటాఁ గడల మెచ్చితిని ॥ ఆదే ॥ 392

---

1. నీ (నీవు) మన్నించఁగన్ అని సమసించుట వింత. 'నీవు మన్నించఁగన్' అని యుండదగును. అయినచో మాత్రయెక్కువ. తమిళములోని 'నీ'వలె నున్నది.
2. ఈ పాదము సమన్వయించుట లేదు.

బౌళి

ఇంకనేలే కొంక నీకు ఇద్దరముఁ గూడితిమి
అంకెకువచ్చినట్టెల్లా నందువుగాక ॥ పల్లవి ॥

పంతము నెరపనేల పలుమారు నీతోడ
చింతదీర నేమైనాఁ జేతువుగాక
వింతవా రెవ్వ రున్నారు వీరిందరిలో నీకు
అంతరంగములో మాటలాడుదువుగాక ॥ ఇంక ॥

సన్నల జంకించనేల సమ్మతించినపనికి
వెన్నెలవలపు నాపై వేతువుగాక
కన్నులనాజంకెనలు కదిసి నిన్నేమిసేసీ
మన్ననలన్నియు నాపై మక్కళింతుగాక ॥ ఇంక ॥

కందువలు చెప్పనేల కైకొని కూడితివి
పొందికలు మాకు నేరుపుదుగాక
యిందులోన శ్రీ వేంకటేశ నీకు మఱఁగేది
చెందినట్లనే దయనేతువుగాక ॥ ఇంక ॥ 393

సామంతం

అన్ని నీవే తెలుసుకో అటమీఁదిపనులు
కన్నులనే నిన్ను మెచ్చి కాచుకుండే నేను ॥ పల్లవి ॥

పంతాలు నీతోఁ జెప్పి పలుమారు కొసరఁగ
యెంతటిరట్టడియని యేమందువో
మంతనాన నీరూపు మనసునఁ దలఁచుక
చింతదీర నూరకుండి చేత మొక్కేను ॥ అన్ని ॥

ఆయములు నన్ను నంటి అంకెలకుఁ దియ్యఁగాను
యీయెడ నిల్లాలి కింత యేలందువో
చేయార నీసేవ చేసి చేరి నీపానుపువద్ద
తోయరానిసిగ్గుతో నెదురుచూచే నేను ॥ అన్ని ॥

నీవు గాఁగిలించుకోఁగా నిట్టునీలిగి వుండేను
యీవనిత గర్వియని యేమందువో
శ్రీవేంకటేశ నీచేతికిలోనై కూడితి
భావించి యేపొద్దు నిట్టె పాయకుండే నేను ॥ అన్ని ॥ 394

సౌరాష్ట్రం

నీవే యెఱుఁగుదువు నే విచ్చి చెప్పనేల
కైవశమైనందుకెల్లా కడమలు లేవు ॥ పల్లవి ॥

వింతలైనసుద్దులెల్లా విన్నపాలు సేసితిని
మంతుకెక్క మఱవకు మతిలో నను
చింతదీర నీకు నే చేతులెత్తి మొక్కితిని
అంతటాను దయపెట్టు మందుకే నామీఁదను ॥ నీవే ॥

కందువలు చూపిచూపి కానుకలు నీకిచ్చితి
అందముగ వదలకు హస్తము నను
సందడిలో నిన్ను నిట్టె సన్నల నే వేఁడుకొంటి
పొందికతో నీయిచ్చల భోగించు నన్నును ॥ నీవే ॥

సారె సారెఁ గాఁగిలించి సరసములాడితిని
కోరికలింకా నానతీ గుఱుతుగాను
యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నిన్నిటు గూడితి
గారవించి రక్షించుమీ ఘనుఁడవు నన్నును ॥ నీవే ॥ 953

లలిత

నేఁ బరివి నౌదువు నెరజాణ వౌదువు
.మేరమీరేనంటే నన్ను మేకులఁ బెట్టితివి ॥ పల్లవి ॥

మచ్చరించి నే నీతో మారుమాట లాడఁగాను
కుచ్చి కాఁగిలించుకొంటి కోపగించక
ఇచ్చకుఁడ వౌదువు ఇంతవాఁడవు గాకున్న
వచ్చేరా పదారువేలు వలచి నీ వెంటను ॥ నేరు ॥

పెక్కులాగులను నీతో పెనఁగి తప్పించుకోఁగా
ఇక్కువ లంటితివి నీ వెగ్గుపట్టక
తక్కరఁడ వౌదు వింతదంటతనము లేకున్న
మొక్కుదురా గోపికలు ముంచి సిగ్గువిడిచి ॥ నేరు ॥

పంతాన నేఁ బానుపుపై పవ్వళించి వుండఁగాను
చింతదీరఁ గూడితివి సిగ్గువడక
శాంతుఁడ శ్రీ వేంకటేశ సరసమింత లేకున్న
ఇంతిని నీ వురముపై నిరవైతి నరుధా ॥ నేరు ॥ 396

రేకు 1067 దేసాళం

ఆయనాయ యింద వీడె మందుకోవయ్యా
యీయెడ నీమాయలు యేలసేసే విఁకను ॥ పల్లవి ॥

సన్నసేసినవాఁడవు సారెఁ గాచుకుందు గాక
వన్నెలఁ బిలిపించుకోవలెనా నీకు
అన్నిటా నేలినవాఁడ వండఁ గూచుందువు గాక
యేన్నేసిపరాకులు యెంతసేసే విపుడు ॥ ఆయ ॥

నవ్వినట్టివాఁడవు నను పేసేతువు గాక
పవ్వళించివుండ నింతపంతమా నీకు
రవ్వసేసినవాఁడవు రతికే వత్తువు గాక
యెవ్వరికిఁ దరితీపు లేలసేసే విఁకను ॥ ఆయ ॥

చెక్కునొక్కినవాఁడవు నేసవెట్టుదువు గాక
వెక్కసాన మే మఱవ వేడుకా నీకు
తక్కక శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
యిక్కువంటి అప్పటి న న్నేమడిగే విపుడు ॥ ఆయ ॥ 397

## దేశాక్షి

వింటిరా వోచెలులాలా విభునితగవులెల్లా
దంటతనసరితలు తా నెఱఁగఁడా ॥ పల్లవి ॥

మొగము చూచినవాఁడు మోహామే పైఁజల్లుఁగాక
చిగురుఁజేఁతలతోడి సిగ్గు లేల
నగితిఁబో నే నందుకు నన్నడుగ నిఁకనేల
తగుఁదనవొళ్లికల్ల తా నెఱఁగఁడా ॥ వింటి ॥

యిచ్చకమాడేటివాఁడు యేమనినా వినుఁగాక
వచ్చివచ్చి తానే తలవంచనేల
యెచ్చరించితిఁబో నేను ఇందుకుఁ దా ననసేల
తచ్చితే నాకాఁపిరము తా నెఱఁగఁడా ॥ వింటి ॥

కాఁగిలించుకొన్నవాఁడు కడుఁదమకించుఁగాక
వీఁగనియాసలతో నివ్వెరగులేల
ఆఁగుచు శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
దాఁగనితనమహిమ తా నెఱఁగడా ॥ వింటి ॥ 398

పాడి

రాతిరే చెప్పియంపితి రమ్మనవే
యేతులు పచరించఁగ నిఁకనేలే ॥ పల్లవి ॥

మనసు మర్మము సోఁకె మాటలెల్లఁ దేటలాయ
తనకు నా కిఁక వేరే తగవేలే
వెనకటిసుద్దు లవి వింతవింతలాగు లివి
తనిసితి నన్నిటాను తారుకాణలేలే ॥ రాతి ॥

చూపులు రూపై నిలిచె సూట్లు వాఁటాన కెక్కె-
వోపిక లిద్దరివాయ వొట్లేలే
తీపులపైఁ దీపు తొల్లి తేనెలపై తేనె, నేఁడు
యీపస నే నెఱుఁగుదు యెచ్చరించనేలే ॥ రాతి ॥

తనువులు జంటలాయ తమకము పెంటలాయ
చనవిచ్చెఁ దా నాకు సటలేలే
వినుకలాయ నప్పుడు కనుకలాయ నిప్పుడు
యెనసె శ్రీవేంకటేశుఁ డింకా నేలే ॥ రాతి ॥ 399

ఆహిరి

నేసినపాటే చాలు చెల్లాటాలు
వాసులు రేఁగితే మరి వడిఁబడుఁజుమ్మీ ॥ పల్లవి ॥

చెలువుఁడు పిలువఁగ నెలవి నీవు నవ్వఁగ
యెలయింపుసరసము లెందాఁకనే
బలిమి నేసు నాతఁడు పట్టుదు వెగ్గులు నీవు
కలి ముదిరి మెదిదకలయ్యీఁ జుమ్మీ ॥ నేసి ॥

నీపతి వేగిరించఁగ నీవు సిగ్గులు చల్లేవు
యేపుమీరి జాణతనా లెందాఁకనే
పై పైనున్నాఁ డాతఁడు పంతాలు చూపేవు నీవు
పూఁపలు ముదురఁగాను పులుసయ్యీఁ జుమ్మీ ॥ నేసి ॥

శ్రీవేంకటేశుఁ డంట చేయి నీవు పట్టుకోఁగ
యావల నలమేల్మంగ యెందాఁకనే
భావించి కూడె నతఁడు పైకొంటివి నీవు నట్టె
చేవదేరినపనులు చెప్పరాదుసుమ్మీ ॥ నేసి ॥ 400

భైరవి

మరిగే విప్పుడును ఆమాట లింకాను
దొరతో సరిమాటాడేదోసమే చాలదా ॥ పల్లవి ॥

చెక్కునొక్కి నన్ను నీవు చేరి వేఁడుకొనే విదే
మొక్కే నందుకు నేను ముమ్మాటికి
యెక్కుడిసుద్దులు యింకా నేలతడవేవు సారె
తొక్కితి నీపాదము ఆదోసమే చాలదా ॥ మరి ॥

కలకల నవ్వునవ్వి కరఁగించే విందుకు నే
భళియని పొగడేను పదిమారులు
వలెనా ఇవియుఁ గొన్ని వద్దు వద్దు రేఁచనేల
తొలుత నేసవెట్టినదోసమే చాలదా ॥ మరి ॥

కమ్మర నాకొంగు వట్టి కాఁగిలించితి విందుకు
నమ్మె నలమేల్మంగ నున్నతి వేమారు
వుమ్మడి నుండనీ మాట లూరకే శ్రీవేంకటేశ
దొమ్మినేసితి రతుల దోసమే చాలదా ॥ మరి ॥ 401

కేదారగౌళ

ఇటువలె నీవుండితే నెట్టుదెలుసు
ఘటనలు పెరచోటఁ గానవచ్చీ నపుడు ॥ పల్లవి ॥

మాటలెల్లా మంచివే నీమన సెట్లానోకాని
యీటున నీమోహము యెట్టు దెలుసు
ఆఁటదాని నొకతె నీయందఁ బెట్టి చూడఁగాను
గాఁటమున నీబుద్ధులు కానవచ్చీ నపుడు ॥ ఇటు ॥

గుట్టులెల్లా మంచివే గుణమెట్లానో కాని
యిట్టి నిన్ను వొక్కమాటే యెట్టు దెలుసు
అట్టే వొకతెచే నీకు ఆయము లంటింపించఁగా
గట్టియైననీపంతాలు కానవచ్చీ నపుడు ॥ ఇటు ॥

కలసితివి మంచిది కడమెట్లానో కాని
యెలమి శ్రీవేంకటేశ యెట్టు దెలుసు
అలమేలుమంగను నేను అవ్వల నెవ్వతెనైనాఁ
గలయకుండితే నిన్నుఁ గానవచ్చీ (చే?) నపుడు ॥ఇటు॥ 402

రేకు 1068 మాళవి

ఎంతగద్దు నీయాస యింకా నోయి
వింతవారమా నేము వెరవకు వోయీ ॥ పల్లవి ॥

పొరుగున వేగినంతా పొలఁతిఁ గూడుండి, మాతో
సరసములాడేవు వేసరవా వోయి
అరసి ముచ్చటాదేవు అందుఁ జాలక ఇక్కడ
వరుసకు నీనోరు నొవ్వదా వోయి ॥ ఎంత ॥

వొట్టుక ఇందాఁక ఆపెవద్ద నుండి, మాదిక్కు-
నిట్టచూపు చూచేవు తనియవా వోయి
బెట్టుగా నాపెచన్నులు పిసికి, నాచన్ను లంటే-
విట్టే వుక్కునఁ జేసిరా యీచేతు లోఇ ॥ ఎంత ॥

నాఁట నాపెఁ గాఁగిలించి నన్నుఁ గాఁగిలించితివి
పూఁటవూఁట కింతేసి వోపుదువా వోయి
నీటున శ్రీవేంకటేశ నే నలమేల్మంగనని
పాటించి చెక్కునొక్కేవు పైకొసరా వోయి ॥ ఎంత ॥ 403

హిజ్జిజి

ఆకెకు నీకుఁ బోవునటవయ్యా
చేకొని నెరులనున్న చిక్కు దీర్చవయ్యా ॥ పల్లవి ॥

నలినాక్షి నీ వప్పుడు నవ్వించినప్పటనుండి
యెలమిఁ దొల్లిటికోపమెల్ల మానెను
కులికి తనలోపలి(లః) గుట్టున నున్నదిగాని
చలము లేదిఁకను ముచ్చటలాడవయ్యా ॥ ఆకె ॥

ఇంతికి నీవు విడెమిచ్చినయప్పటనుండి
పంతపుటలుకలతాపము మానెను
చెంతలఁ గన్నెరికపుసిగ్గున నున్నది గాని
వంతువాసి గాదు నీవు వద్దికి రావయ్యా ॥ ఆకె ॥

అలమేలుమంగఁ జేతనంటినయప్పటినుండి
సిలుగులెల్లను మానె శ్రీవేంకటేశ
బలిమి నీవు గూడినపంతాన నున్నది గాని
బెళకు లేదిఁకను నీ ప్రేమ నించవయ్యా ॥ ఆకె ॥ 404

పాడి

ఏఁటికి అనుమానాలు యెందాఁకాను
వాఁటమైతే వలపుల వన్నెలు దీసీనా ॥ పల్లవి ॥

సిగ్గువడివున్న చెలిఁ జేయివట్టి తియ్యరాదా
వొగ్గి యెంతవడిదాఁకా నూరకుండేవు
వెగ్గళించి యాపె నిన్ను వేసరించన[1] నున్నది
బగ్గనఁ జెనకితే నీపంతము దప్పీనా ॥ ఏఁటి ॥

వొంటినున్న నీవనితవొద్దనే కూచుండరాదా
అంటిముట్టక యెందాఁకా నడ్డాఁకలు
గొంటరియై యాపె నిన్నుఁ గొసరఁజాలకున్నది
నంటుసేసితే నిన్ను నవ్వరా నీసతులు ॥ ఏఁటి ॥

మలకున్న దలమేలుమంగఁ గాఁగిలించరాదా
సెలవిన వ్వెందాఁకా శ్రీ వేంకటేశ
కలసితి వాపె నీకుఁ గడుమేరతో నున్నది
అలపుదేరిచితే నీయాయము సోఁకీనా ॥ ఏఁటి ॥ 405

సాళంగనాట

[2] సేవింపరో జనులాల చేరి మొక్కరో
భావింప నున్నాఁ డిందరిభాగ్యమువలెను ॥ పల్లవి ॥

జలకమాడి వున్నాఁడు సర్వేశ్వరుఁడు నిగ్గు –
గలిగినమంచినల్లకలువవలె
యెలమిఁ గప్పురకాపు ఇదె చాతుకున్నవాఁడు
వెలలేనియట్టిపెద్దవెండికొండవలెను ॥ సేవిం ॥

1. వేసరించను + అని + ఉన్నది. 2. ఇదిఅధ్యాత్మకీర్తనగా నుండదగును.

అందముగఁ దట్టుపుణుఁ గలదుక వున్నవాఁడు
కందువ ఇంద్రనీలాలగనివలెను
ముందరివలెనే తా సొమ్ములు నించుకున్నవాఁడు
పొందినసంపదలకు పుట్టినిల్లువలెను ॥ నేవిం ॥

మించి యలమేలుమంగ మెడఁగట్టుకున్నవాఁడు
పొంచి బంగారుతామెరపువ్వువలెను
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డిదె కొలువై వున్నవాఁడు
నించినదాసులపాలినిధానమువలెను ॥ నేవిం ॥ 406

దేసాళం

ఏమి దప్పిపోయ నీవు ఇయ్యకోరాదా
సాములు సేయుచు తాను జట్టిగొనీ నిన్నును ॥ పల్లవి ॥

మచ్చిక నీమాటలు మనసునఁ బెట్టుకొని
కచ్చుపెట్టి నవ్వే నదె కలికి
ఇచ్చకపునీవిభుడు యెఱఁగమి సేసుకొని
అచ్చలాన చదురంగ మాడుమనీ నిన్నును ॥ ఏమి ॥

తగ నీవున్నలాగులు తనలోనే దాఁచుకొని
మొగము దప్పకచూచి ముంచీ (మురిసీ?) వనిత
వగదీర తన్నుఁగానివానివలెనే పతి
పగటున మెచ్చిమెచ్చి పాడుమనీ నిన్నును ॥ ఏమి ॥

యెంచఁగ నీ ప్రేమ తనయెదఁ బెట్టుకొని నిన్ను
మించి వురమెక్కె నలమేలుమంగ
నించి శ్రీవేంకటేశుఁడు నేరుపు సేసుక నీమో-
వంచెల నిమ్మనుచును ఆదరించీ నిన్నును ॥ ఏమి ॥ 407

సామంతం

ఏలలోఁగీ నేలవీఁగీ నేలమొక్కీనే
తాలముచేయి వున్నది తనచేతఁగాదా ॥ పల్లవి ॥

చలమరిదానఁ గాను [illegible]దానఁ గాను నాకు
వలెనా యింతేసితనవన్నెప్రియాలు
బలువుఁడు దనకు నేఁ బడఁతినై వుందానను
యెలమిఁ దాఁ జేసినవే యిచ్చకము గాదా ॥ ఏల ॥

వేసాలదానఁ గాను వెక్కసపుదానఁ గాను
పోసరించి నన్ను నింతపొగడనేలే
దాసినై వుందాన నేను తానె నన్ను నేలినాఁడు
వాసితోఁ దనతగవే వన్నె నాకుఁ గాదా ॥ ఏల ॥

పంతమాడేదానఁ గాను పాసివుండేదానఁ గాను
పొంతనుండి తను నింతపొదుగనేలే
యింతలో శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్నుఁ గూడె
సంతతము తనమాటే చవి నాకుఁ గాదా ॥ ఏల ॥ 408

రేకు 1069 వరాళి

మేలు నీకంటె నాకెను మెచ్చితి నేను
తాలిమి గలదీ నౌను దయగల దవును ॥ పల్లవి ॥

అంగన నీకు నేఁడు అప్పణ ఇయ్యఁగఁబోలు
చెంగక మాయింటికి విచ్చేసితి విటే
అంగవించి అందువంక అన్నిటా వెరపుదేరి
రంగుగా యీడ నిట్టే రచ్చనేనే విపుడు ॥ మేలు ॥

ఆపె నీకునేరిపినఆసుద్దులే కాఁబోలు
పైపై నన్ను వేఁడుకొని పాలించితివి
తీపులుగా నందులకే తిరమైనసొమ్ము లిచ్చి
చేపట్టి యందరుఁ జూడ సేసవెట్టే విపుడు ॥ మేలు ॥

నీసతి నీవెంట వచ్చి నెపముసేయఁగఁబోలు
వాసితోడ నన్నుఁ గూడి వలపించితి
ఆసతో శ్రీవేంకటేశ అందుకే నన్ను మన్నించి
వోసరించ కిద్దరు నావొద్దనున్నా రిపుడు ॥ మేలు ॥ 409

బౌళి

ఎంతవేగిరకాఁడవు యేరా నీవు
పంత మంతేకలితేను బతికేము మనము ॥ పల్లవి ॥

మొకము చూడఁగానే మొరఁగేవు నాతోడ —
నెకసక్కెలకు నట్టే యేరా నీవు
వొకటంటే నొకటని వొట్టులేల పెట్టేవు
నికలంకుఁడవేయైతే నీకేల వెఱపు ॥ ఎంత ॥

పొదిగి నే నుండఁగానే బూటకాలుసేసేవు
యెదురెదురుకట్ల నేరా నీవు
యిది నే సోదించితేను యెగ్గులేల పట్టేవు
మదిలో నిజముండితే మరియేల వెఱపు ॥ ఎంత ॥

చెక్కులు నే నొక్కితేను సిగ్గులువడేవు నీవు
యిక్కడ శ్రీవేంకటేశ యేరా నీవు
వొక్కమనసాయ నాకు వూరక నిస్సంటినే (తే?) ను
చిక్కినాయ నీవలపు చెల్ల దేలవెఱపు ॥ ఎంత ॥ 410

సామంతం

ఆయనాయఁ జాలుఁజాలు అన్నియు నే నెఱుఁగుదు
    చాయలకు దిద్దుకొంటే చలిమే బలుములు ॥ పల్లవి ॥

తేనెలమోవిమాట తీపులెక్కె వుండుఁగాక
    వీనులకు యేమాడిన వింతదోఁచీనా
పూని అవి నీకుఁ జవి పోరచిసవతులకు
    కానుకవట్టఁగఁబోతే కారములౌఁగాని ॥ ఆయ ॥

ననుపుచేతిసన్నలు నయమెక్కె వుండుఁగాక
    వెనక నీమనసుకు వెగటయ్యీనా
పనికివచ్చు నీకవి పరసతులకునైతే
    పెనవెట్టఁబోతేను బిరుసెక్కుఁగాని ॥ ఆయ ॥

కడుకాఁగిటిచన్నులు గట్లయ్యే వుండుఁగాక
    పొడవై నీరతులను పొల్లువొయ్యీనా
కదిమి శ్రీవేంకటేశ కలసితి నీకె, యూడో –
    పడఁతులకెల్లానైతే పచ్చిదోఁచుఁగాని ॥ ఆయ ॥ 411

శుద్ధవసంతం

నిచ్చ నిచ్చ సోబనాలు నెల మూఁడుసోబనాలు
    హెచ్చె నీకు నింతలోనె ఇవి గదవయ్యా ॥ పల్లవి ॥

చెలియమోహములే సేసపాలు
    పెలుచుసిగ్గులే మీకు పెండ్లితెర
కలగొనుచూపులే కంకణాలు
    సులభాన నీకు నబ్బె సుఖియించవయ్యా ॥ నిచ్చ ॥

మగువమాటలే నీకు మంత్రాలు
పొగరుమోవితేనెలే బువ్వాలు
వెగటుబొమ్మజంకెలే విడేలు
జిగి నీకు నేఁ డబ్బెఁ జిత్తగించవయ్యా ॥నిచ్చ॥

కాంతసరసములే కప్పురాలు
పొంతనున్న కుచములే బూ (పూ?) జకుండలు
చెంతలఁ గూడితి విట్టే శ్రీవేంకటేశా ! యివి
సంతసమాయను నీకు జయమందవయ్యా ॥నిచ్చ॥ 412

శంకరాభరణం

అతఁడు నేనుఁ [1]గూచుండే అతివలందరుఁ గూడి
చతురత నూడిగాలు సరసానఁ జేయరే ॥పల్లవి॥

కాయమెల్లాఁ జెమరించె గందవొడి చల్లరే
యేయెడనుండి వచ్చెనో యీతనికిని
చేయిచాఁచి నే నేమైనా సేవలు సేయఁగఁబోతే
చాయలకు సిగ్గువడీ సంగతిగా దిపుడు ॥అతఁ॥

మోవి గడువసివాడె మొక్కి విడెమియ్యరే
యీవేళకు నుచితము ఇతనికిని
కావించి యేమైనా నిచ్చకములు నేఁ జేయఁబోతే
భావించి తలవంచును భావ్యముగా దిపుడు ॥అతఁ॥

అంగమెల్లా బడలెను ఆరగించఁబెట్టరే
ఇంగితపు శ్రీ వేంకటేశ్వరునికి
సంగతిగా సరి నే విన్నవించితే
వెంగలినవ్వులు నవ్వు వేళలు గాదిపుడు ॥అతఁ॥ 413

---

1 'గూచుండే మతివ' కావచ్చు.

ఆహిరి

చేయివట్టి తియ్యకువో చెనకి వేగిరించకు
 నీయాఁధీనమె యిటే నెట్టుక వుందానను ॥ పల్లవి ॥

దగ్గరి విచ్చేసి నాతలపై సేసలువెట్టి
 సిగ్గులెల్లఁ బాపి మతి చింత దీర్చితి
 నిగ్గులకళలతోడ నిండురాజసముతోడ
 సగ్గుదై ముగ్గుదై యిం(యి?)ట్టై సంతసించుదానను ॥ చేయి ॥

కఁచపుమోవి యిచ్చి కన్నులనే నవ్వినవ్వి
 చంచలములెల్లఁ బాపి చనవిచ్చితి
 నించినవేడుకతోడ నీసరసముతోడ
 మంచముపై రతులని మలసి వుందానను ॥ చేయి ॥

మచ్చిక నాపై నెరపి మనసెల్ల సోదించి
 ముచ్చటల నీవు నాపై మోహించితివి
 ఇచ్చకపు(శ్రీ)వేంకటేశ నీకాఁగిటితోడ
 నిచ్చలపుటానందాన నెరసి వుందానను ॥ చేయి ॥ 414

రేకు 1070 దేశాక్షి

నామాట వినవయ్య నాటకమేల సేసేవు
 వేమారు నింతేసి నీకు విన్నవించఁగలమా ॥ పల్లవి ॥

కోపము నీకుఁ దగదు కోమలిమీఁదట; నీవు
 తీపుచల్లి వలపించి తెచ్చుకొంటివి
 ఆపె నిన్ను నేమనినా నందుకు నవ్వఁగవలె
 వోపనంటేఁబోవునా వొగి మగవాఁడవు ॥ నామా ॥

మంకులు నీకుఁ దగదు; మానినికిఁ దొలుతే
వుంకువగా నిచ్చితివి వుంగరము
సంకెలేక యాపె నిన్ను జరసితే మెచ్చవలె
కొంక నిఁకఁ దీరునా కొండవంటిదొరవు ॥ నామా ॥

వేసట నీకుఁ గూడదు వెలఁదికాఁగిట; నీవు
యీసుదీర శ్రీవేంకటేశ కూడితి
ఆసల నాపె నిన్ను ఆఱడెంత సేసినా
వాసులు నీ కమరపు వలచినజాణవు ॥ నామా ॥ 415

ఆహిరి

చెలియా మరి నాకుఁ జెప్పవే బుద్ధి
వలపులమొదలనే వలరాజున్నాఁడు ॥ పల్లవి ॥

చెలఁగి నావిన్నపము చిత్తాన నున్నదో లేదో
తలఁపించి రాఁగదవే తగువిభుని
వెలి నేడ నున్నవాఁడో వేళ యెటువంటిదో
తెలిసి నీవు వచ్చితే తేరీని పనులు ॥ చెలి ॥

ఆయమైననాగుఱుతు లంగాన నున్నవో లేవో
చాయలఁ జూపుమనవే సరసునిని
యీయెడ కెపుడు వచ్చీ నేమనున్నదో గుణము
నాయాననే సోదించితే ననిచీని పనులు ॥ చెలి ॥

అదివో వాకిటికిఁ దా నట్టె వచ్చినాఁడో లేదో
యెదురుకోవే నీవు ఇంతలోననే
అదన శ్రీవేంకటేశుఁ డాతఁడే విచ్చేసి కూడె
పొదిగి పాయకుండితే పొసఁగీని పనులు ॥ చెలి ॥ 416

పాడి

ఎప్పుడును నాకు లోనె(నై?) యేరా కృష్ణా
*చెప్పేవు ప్రియ మప్పుడే చెలువపుఁగృష్ణా ॥ పల్లవి ॥

చన్నుల నొరసితిని సాదించేననుచు నిన్ను
వెన్నలేల దొంగిలేవు వేసాలకృష్ణా
కన్నుల జంకించితిని కాఁగిటఁ బట్టేనని
పన్నసేల మాయ లింత బాలకృష్ణా ॥ ఎప్పు ॥

మాటల నిన్నొరసితి మంతనానకు రమ్మని
చాటేవేల సరసాలు జంగిలికృష్ణా
యీటుతోనే నవ్వితిని యిద్దర మొక్కటేయని
వోటమి నీ కెందూ లేదు వున్నతపుకృష్ణా ॥ ఎప్పు ॥

కూడితి కాఁగిట నిన్ను గుఱుతులు నించి నించి
జాడలు దప్పకుమీ జాణకృష్ణా
వీడె మిచ్చితిని శ్రీవేంకటాద్రిపయి నీకు
వాడికలు మనసొమ్ము వన్నెల వోకృష్ణా ॥ ఎప్పు ॥ 417

కాంబోది

పువ్వులవేసి నిన్ను పొందులుచల్లీ నతఁడు
నవ్వులు నవ్వుచు నీతో ననుపై వున్నాఁడు ॥ పల్లవి ॥

వంచనేలే శిరసు వాడనేలే మోము
అంచెలఁ బతితో మాటలాడరాదా
కంచువంటిది వలపు గాలివంటిది వయసు
పెంచకువే కోపము నీప్రియుఁ డీడ నున్నాఁడు ॥ పువ్వు ॥

నిట్టూర్పులేలే నీకు నిండఁ జెమరించనేలే
గుట్టుతోడఁ బతివద్దఁ గూచుండరాదా
నెట్టుకొన్నవి కాంక్షలు నిండినది తమకము
వట్టివిసుపేలే నీవద్ద నాతఁ డున్నాఁడు ॥ పువ్వు ॥

కొంతకొంత సిగ్గులేలే కొనగొనయాసలేలే
ఇంతలో శ్రీవేంకటేశు నెనయరాదా
మంతనాన మన్నించె మాముందర నెలయించె
ఇంత నిన్నుఁ గూడి యాతఁ డింటనే వున్నాఁడు ॥ పువ్వు ॥ 418

బౌళి

కూడినమీఁదట మరి కొరతేఁటికే
యీడులేదు ఇన్నిటా మీయిద్దరికిఁ జుమ్మీ ॥ పల్లవి ॥

చక్కెరవంటిమాటలు సారెసారె నాడఁగాను
ఇక్కువలకుఁ దీపెక్కె నీ విభునికి
చెక్కునొక్కి ఇఁకఁ జప్పఁజేయక కాఁగిలించితే
పక్కనను చెలుకున పండు వండుఁజుమ్మీ ॥ కూడి ॥

పన్నీరువంటిమోహము పతిపైనే చల్లఁగాను
వెన్నెలతేటలువారె వీడు దోడుగ
ఇన్నిటా నిఁక విరహపుటెండలు గాయకుండితే
పన్నినరతి కప్రపుపంట వండుఁజుమ్మీ ॥ కూడి ॥

చిగురువంటిప్రియాన శ్రీవేంకటేశుఁ గూడఁగా
తగులెల్లా గురులాయ తతి మీలోన
పొగరుభోగములనుఁ బొదిగి పోదిసేసితే
పగటునవరసాలపంట వండుఁజుమ్మీ ॥ కూడి ॥ 419

బౌళి

చిత్తమువచ్చినయట్టు సేయవయ్య
 *ఇత్తలికి నత్తలికి యెడమాట లేఁటికి ॥పల్లవి॥

కోపగించుకొనినట్టికొలత దీరుచుకోను
 వైపుగాఁ గని ఇంటికి వచ్చితి నేను
 ఆపొద్దుననుండి నీవు అట్టె కాచుకుండఁగాను
 యేపున నీ వున్నమంచ మెక్కితి నేను ॥చిత్త॥

ఆడరానిమాటాడిన ఆనెగులుదీర్చుకోను
 వీడెమిచ్చి పాదాలు సేవించితి నేను
 వాడుదేరె మోము తోడ వద్ద నే మాటాడఁగాను
 వేడుకగందము పూసి వెలసితి నేను ॥చిత్త॥

నీరతులలో చేఁతలనేరమెల్లఁ దీరేయట్టు
 గారవించి కాఁగిలించి కైకొంటి నేను
 యీరీతి శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నుఁ గూడితి
 మేరతో నీగుణానకు మెచ్చితి నేను ॥చిత్త॥ 420

రేకు 1071 రామక్రియ

ఇద్దరుఁ గూడుండితే నేకచిత్త మౌఁగాక
 గద్దరితనా లింతేసి కడుఁదగదయ్యా ॥పల్లవి॥

ఇంటిలోన ఆపెను నీ వేమంటివో కాని
 గొంటుఁదనమున నట్టె కూచున్నది
 వెంటఁబెట్టుకొనిరాక వెళ్ళివచ్చితివి నీవే
 వొంటి నాపె వేగించనోపునటవయ్యా ॥ఇద్ద॥

పానుపుపై నాపె నెంతపచ్చిసేసితివో కాని
వూనినట్టిసిగ్గుతోడ నూరకున్నది
మౌనాన నట్టె వుండక మారుమంచ మెక్కితివి
పూనినవలపులకుఁ బోయఁజోఁచేదయ్యా ॥ ఇద్ద ॥

కాఁగిటిలో నాపె నెంత కరఁగించితివో కాని
మాఁగినమోవితోడ మలఁకున్నది
వీఁగక శ్రీవేంకటేశ వెలఁదికొంగు వట్టితి
చేఁగదేర నిట్లానే చిత్తగించవయ్యా ॥ ఇద్ద ॥ 421

వరాళి

ఏమిసేయఁగలము మీ రిద్దరును నిద్దరే
దోమటిదాడికి మీలో దొమ్మిసేయరాదా ॥ పల్లవి ॥

ఆతనినీచూపులే అవి తారుకాణగాక
యీతల నేము తార్కాణా ఇంతులము
కాతరపుమాటలేల కందువకుఁ దీసి పతి
చేతులార బుజగించి సేవసేయరాదా ॥ ఏమి ॥

చెలఁగి మీరువెట్టినసేసలే గుఱుతుగాక
అలుకకు వద్దిచెలులందరు గుతే
పెలుచుఁదనములేల పెంపునఁ బానుపుమీఁద
చలములన్నిఁ దీర సాదించరాదా ॥ ఏమి ॥

కూడినమీకాఁగిటికూటమే మెచ్చులుగాక
వూడిగపువారిమెచ్చు లొద్దికయ్యీనా
వేడుకఁ గూడితివి శ్రీవేంకటేశ నిట్టే మతి
వాడుదేర మోవి ఇచ్చి వన్నెసేయరాదా ॥ ఏమి ॥ 422

ధన్నాసి

నీవే యెఱుఁగుదువు నీవుసేసినమహిమ
కైవశమాయఁ బనులు కల్లలేదు యిందును ॥ పల్లవి ॥

తలఁపు నీభోగములే తలపించీఁగాని నీతో
చలము సాదించేనంటే సాగనియ్యదు
వలపు లంతంతకు వడ్డివారీఁగాని మరి
పలుకకవుండేనంటే పట్టరా దెఁ(దెం?)తైనా ॥ నీవే ॥

చూపులు నీరూపము చూడనే కోరీఁగాని
కోపగించుకొనేనంటే కొలుపనీదు
తీపులజవ్వన మిది తేనెలే మించీఁగాని
వోపనన్నాఁ దమకము వుడివోవనీయదు ॥ నీవే ॥

కాయమిది నీకాఁగిటికందువఁ బొదలీఁగాని
చాయ సేసుకొనేనంటే సమ్మతించదు
యీయెడ శ్రీవేంకటేశ ఇంత సేసి పొందితివి
ఆయము లంటేనంటే అడ్డమయ్యీఁ గరుణ ॥ నీవే ॥ 423

శ్రీరాగం

మఱవకుమీ మాట మతిలోనను
జఱసి నీవేమనినా సమ్మతించేదానను ॥ పల్లవి ॥

చింతదీరె నీవు నాపైఁ జేయివేసినయప్పుడే
మంతనాన బుజ్జగించ మఱీవలెనా
వింతదాననా నేను విభుఁడవు నీవు నన్ను
యెంత సేసినా నెటె యియ్యకొందుఁగాక ॥ మఱ ॥

తనివిఁబొందెను నీవు దగ్గరినయప్పుడే
మనసు రంజిల్లఁజేయ మఱివలెనా
నను నీ వెఱఁగవా నమ్మికిచ్చినవాఁడవు
పనిగొన్నయందుకెల్లా పంపుసేతుఁగాక ॥ మఱి ॥

మెచ్చితిని నీవు నన్ను మేకొనికూడినప్పుడే
మచ్చికలు వచరించ మఱివలెనా
యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నీయిల్లాలను
తచ్చివేసినట్టు నిన్ను తగిలుందుఁగాక ॥ మఱి ॥ 424

భైరవి

ఎందాఁకా నలుకలు యేఁటికే నీకు
విందువలె నిఁక నిన్ని వేడుకలేకాక ॥ పల్లవి ॥

తగులు మనసులోన తగిలినవారైతే
మొగము చూడకుందురా ముచ్చటకైనా
అగపడి నీవాతని ఆనలేల పెట్టేవే
నగకుండవచ్చునా ననిచి నీతోను ॥ ఎందాఁ ॥

పోలానిచుట్టరికముపొసగినవారైతే
గారవించి యేఁ(యెం?)తైనా దగ్గరకుందురా
ధీరత నంటకుమని తిట్లేల తిట్టేవే
కూరిమిసేయకుండునా కూడేటినీతోను ॥ ఎందాఁ ॥

సమ్మతించినమోహము చనవుగల వారైతే
కమ్ముకొనకుందురా కాఁగిట నిట్టే
యిమ్ముల శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడె
బొమ్మజంకెలే లితఁడు పొసఁగె నీతోను ॥ ఎందాఁ ॥ 425

నాదరామక్రియ

ఎన్నిలేవు సుద్దులు యేఁటికి విచారాలు
మన్నించి ఆచింతలెల్లా మానుము నీ విఁకను ॥ పల్లవి ॥

మనసెఱిఁగినచోట మాటలు సోదించనేల
తనువుకుఁ దనువే తారుకాణ
పనిమాలినపనికి బాసలేల సేసేవు
చెనకితి లోనికి విచ్చేయవయ్యా యిఁకను ॥ ఎన్ని ॥

కూడివుండినట్టిచోట గుఱుతు వెతకనేల
వేడుకలు(కు?) వేడుకలే వీడుజోళ్లు
జాడలతో వారి వీరి సాకిరేల తెలిపేవు
వీడెమిచ్చే నామాఁట వినవయ్య ఇఁకను ॥ ఎన్ని ॥

రతిగలిగినచోట రవ్వసేయఁగనేల
యితవుకు నితవులే యియ్యకోళ్లు
సతమై శ్రీవేంకటేశ సరిగాఁ గూడితి నన్ను
అతిముదములు మనకబ్బెనయ్యా ఇఁకను ॥ ఎన్ని ॥ 426

రేకు 1072 ముఖారి

వద్దు వద్దు నీ కింతేసి వలసీనొల్లములు
గద్దించి నిన్నుఁ గలసేకాఁగిటిలోదానను ॥ పల్లవి ॥

వెట్టికే మాటలాడకు వేగినంతా నాతోను
యెట్టకేలకు వచ్చితి వీడకు నీవు
జట్టిగొని చక్కఁజూడు సరసములాడు నాతో
[1]కట్టఁగడదానఁ గాను కలదాన నీకు ॥ వద్దు ॥

---

1 'కడ+కడ' 'కట్టకడ. కట్టఁగడ' లో ద్రుతమూ – తత్కార్యమూ వింత.

తేరనవ్వులు నవ్వకు తిరిగి తిరిగి నీవు
ఆరితేరి చేతికి లోనైతి విపుడు
ఆరగించుమా కప్పురము అందుకో తమకమున
పోరచివారము గాము పోరానివారము ॥ వద్దు ॥

నివ్వెరగులు విడువు నెమ్మది శ్రీవేంకటేశ
యివ్వేళఁ గూడితివి నన్నిచ్చకముతో
పవ్వళించుమా వద్దఁ బాయ కిట్టె సుఖియించు
దవ్వులవనితనా దండనుండేయింతిని ॥ వద్దు ॥ 427

లలిత

నీరమణునికొలఁది నీ వెఱుఁగుదు
గారవించి మట్టుతోనే కలయు నీ వపుడు ॥ పల్లవి ॥

చెలియరో నీ వతనిచెక్కు నొక్కఁబోయేవు
ములువాఁడికొనగోరు మోచీఁజుమ్మీ
వులివచ్చివలపుల వుప్పొలి కినుమడై తే
ములుగ ములుగ నట్టె వేఁగౌనపుడు ॥ నీర ॥

సరుసఁ గూచుండి నీవు సారె సారెఁ బెనఁగేవు
వొరసి నీచనుఁగొండ లొత్తీఁజుమ్మీ
తిరమై పాసి కలి ముదిరి మెడిదెయైతే
ధరలో పండ్లువులిసి తమిరేఁగు నపుడు ॥ నీర ॥

మోవిచవులకుఁ జొక్కి ముందుముందె కొసరేవు
సోవలుగఁ గొంత పల్లుసోఁకీఁజుమ్మీ
శ్రీవేంకటేశుఁడు గూడె చిగురె చేఁగలైతే
వేలువేలు చేఁతలెల్లా వెలవెట్టు నపుడు ॥ నీర ॥ 428

సాళంగం

దిక్కులను మగవాఁడు ధీరుఁ డందురు
యెక్కడికెక్కడ మోహ మింతసేతురా ॥ పల్లవి ॥

నిడువాలుఁగన్నులను నెలఁత నిన్నుఁ జూచితే
తడసి నీమన సాపెఁ దగిలున్నది
వడి నీవద్దనుండినవారి నెఱఁగ విందుకు
కడవా రిది చూఁచితే గక్కనను నవ్వరా ॥ దిక్కు ॥

మచ్చికల నీయెదుట మాటలాడినంతలోనె
అచ్చపునీమోహ మాపె నంటుకున్నది
నిచ్చలాన నాఁకలియు నీరువట్టూ నెఱఁగవు
హెచ్చిననీసతులెల్లా నిందు కిట్టె నవ్వరా ॥ దిక్కు ॥

ఆయమెరిఁగి కొసరి ఆసఇచ్చినంతలోనే
చాయల శ్రీవేంకటేశ సతిఁ గూడితి
పాయక ఆపెతో రేయిఁబగ లేమీ నెఱఁగవు
యీయెడ నేనూఁ గూడితి నిఁక లోలో నవ్వరా ॥ దిక్కు ॥ 429

ఆహిరి

ఏది నిజమని మీరు యెట్టు వొడఁబరచేరే
ఆదినుండి యీకతలు అడుగరే యాతని ॥ పల్లవి ॥

కన్నుల తేటలువారె కాయము చెమటగారె
యెన్నియైనా తనమాట లేద కెక్కునే
నిన్ననే వచ్చేనని నేఁడు యీపొద్దుకు వచ్చె
అన్నిటాఁ గలదో లేదో అడుగరే మీరు ॥ ఏది ॥

మోమునఁ గళలు నిక్కె మోవిపైఁ గెంపులు చిక్కె
యేమిటికైనా తన్ను నెట్టు నమ్మేరే
దోమటి యాడఁ దొడికె దొరతన మీఁదఁ జేసె
ఆముక కలదో లేదో అడుగరే మీరు ॥ఏది॥

నెలవుల నవ్వు నించె చేతులనే కాఁగిలించె
యెలమి నెటుల నిఁక నెదురాడేనే
కలవాఁడు తానె శ్రీవేంకటపతి నన్నుఁ గూడె
అలుకలన్నియుఁ దేరె నడుగరే మీరు ॥ఏది॥ 430

ముఖారి

ఎంతపని కెంతపని యేల పదరేవే నీవు
కాంతుఁడు చెలరేఁగితే కందువలు ముట్టవా ॥పల్లవి॥

తగునా నీ కింతమాట తరుణి యాతనితోడ
చిగురుఁబెదవి వంచి 'చీ' యంటివి
మొగము చూచి యతఁడు ముంచి నవ్వె నింతేకాని
తగవులఁబెట్టఁబోతే తప్పు నీదే కాదా ॥ఎంత॥

చెల్లునా నీ కింత సేఁత చెలువునితోడను
మెల్లనే సేమంతిచెండు మీఁదవేసితి
వల్లగా నాతఁ డందుకు సరసములాడెఁగాని
వొల్లనే మారువేసితే నోరుచుకోఁగలవా ॥ఎంత॥

అమరునా శ్రీవేంకటాధీశ్వరునితోడ
తమకిం చలిగితి విందాఁకా నీవు
రమణ నాతఁడే నిన్ను రతులఁ గలసెఁగాని
సమముగాఁ బెనఁగితే చాలుననవచ్చునా ॥ఎంత॥ 431

మధ్యమావతి

వలసినప్పుడు తానే వచ్చీఁగాని
చలపట్టి మీరేల సాదించేరు రారే ॥ పల్లవి ॥

చిత్తములోపలిప్రేమ చెప్పి చూపవచ్చునా
హత్తినచూపులఁ గాననగుఁగాక
తత్తరీఁడు తనలోనితలఁపెల్లాఁ దెలిసెను
కొత్తలుగా మీరేల కొసరేరు రారే ॥ వల ॥

అప్పటి మొగమొటాలు అవియే తేవచ్చునా
మెప్పించినవేళలను మించుఁగాక
ముప్పిరి నుబ్బరికాఁడు మోహామెల్లాఁ దెలిసెను
వుప్పటించి కడునేల వొరసేరు రారే ॥ వల ॥

వేడుకలు గలన్నియు వేరేవుంటేఁ దోఁచునా
కూడిన కాఁగిటిలోనే గుఱుతవుఁగాక
యీడనె శ్రీవేంకటేశుఁ డెనసెఁ దా విచ్చేసి
ఆడనే దూరక మీరు అండకిట్టె రారే ॥ వల ॥ 432

రేకు 1073 వరాళి

మగవాఁడు తాను మగువను నేను
నగుమనవే యిట్టే నాలి యాల యిఁకను ॥ పల్లవి ॥

కన్నులఁజూచినప్పుడే కాఁకలెల్లాఁ జల్లనాయ
యెన్నికేల రమ్మనవే యేమనే నేను
సన్నలుసేసినప్పుడే చనవెల్ల నాకిచ్చె
విన్నవించవే తనకు వెఱపేల యిఁకను ॥ మగ ॥

యింటికివచ్చినప్పుడే యియ్యకోళ్లాయ నాకు
జంటయై యుండుమనవే సాదించ నేను
అంటిముట్టినయప్పుడే ఆయములెల్లాఁ గరఁగె
దంటతనమే మేలు తప్పులేదు యిఁకను ॥ మగ ॥

కలసినయప్పుడే కడమలు లేవు నాకు
బలువుఁడు తా ననవే పైకొంటి నేను
అలరి శ్రీవేంకటేశుఁ డన్నిటాఁ దా నన్ను నేలె
వలపు లిద్దరివాయ వంతులేలే ఇఁకను ॥ మగ ॥ 433

గుండక్రియ

మానఁగదె ఇంతట నీమంకువిద్యలు
యీనెపాన నాతఁడన్ని నియ్యకొనఁడా ॥ పల్లవి ॥

నవ్వులకు నొకమాట నాయకుఁడాడినందుకు
ఇవ్వల సతులతోడ నేమి చెప్పేవే
జవ్వని వేకతమున సాదించితే నాతఁడు
చివ్వన నీ చెప్పినట్టు సేయకుండీనా ॥ మానఁ ॥

చేరి నిన్ను రమణుఁడు చేయివట్టినందుకు
తేరకొన నీవేల తిట్టఁజూచేవే
యీరీతి పానుపుమీఁద నేమినేసినా నతఁడు
గారవించి నీకు లోనుఁగాక వుండీనా ॥ మానఁ ॥

శ్రీవేంకటేశుఁడు నిన్ను చెనకి కూడినందుకు
చేవదేర నీవేల సిగ్గువడేవే
నీవేమి ఆతనికి నేరిపిన యాతఁడు
కావించి నిన్నంతలోనే కడుమెచ్చకుండీనా ॥ మానఁ ॥ 434

దేసాళం

మనసుకు మనసే మరి తారుకాణ గాక
తెనకకు ముందరికి విచారములేలా ॥ పల్లవి ॥

కన్నులనీచూపులే కంకణదారములాయ
పన్ని నన్ను వేరే వొడఁబరచనేల
చన్నులనావొత్తులే సరి నీకు ముద్రలాయ
విన్నపాలు మరి సేసేవిధమేల ॥ మన ॥

నెలవులనవ్వులే నేసపాలై అబ్బె నాకు
వెలిమొన సారె నన్ను వేఁడుకోనేల
యెలమి నాశా(సే?)వలే నీకెదురువుంకువలాయ
కులికి నే నిన్ను వేరె కొసరనేల [1] ॥ మన ॥

కందువనీమోవి నాకు కై కొన్నబువ్వములాయ
విందువలె చెక్కునొక్క వేరెయేల
అందముగ శ్రీవేంకటాధిప కూడితి విన్ను
మందలించి యిఁక నీతో మట్టుమీరనేల ॥ మన ॥ 435

భైరవి

లేవయ్య నీ కెంతలేదు లేమతోడను
చేవదేరినపనికి సిగ్గు లిఁకనేల ॥ పల్లవి ॥

మంతనానఁ గూచుండి మగువపైఁ జేయివేసి
చింతలు దీరుచరాదా చెలియకును
వంతులకే పెనఁగిని వాసులే పెంచీ నాపె
పంతమా నీ కింతితోడ బలుమగవాఁడవు ॥ లేవ ॥

---

1. ఈ రెండవచరణమున గూడ 'ఁ' అని యున్నది. పొరపాటు.

మంచముపైఁ బవళించి మర్మములు సోఁకించి
చంచలము దీర్చరాదా సకియకును
మంచి నీపైఁ గొసరులే మోహము చల్లీ నాపె
కొంచెమా నీ వియ్యకొంటే కొండవంటిదొరవు ॥ లేవ ॥

కన్నుఁగొనలను నవ్వి కాఁగిట శ్రీవేంకటేశ
యిన్నిటా నీ వెనసితి వీసతితోను
మన్ననకే ఆసపడి మాటలఁ జొక్కీ నాపె
యెన్నికా నీ కిఁదువల్ల ఇంతదొడ్డవాఁడవు ॥ లేవ ॥ 436

కాంబోది

ఎందుకని చింతింతు నేమి సేతును
కందువనీమహిమకుఁ గడపల లేదు ॥ పల్లవి ॥

మనసులో కోపము మాటలలోపల లేదు
మొనసి యింతటిలో నీమోము చూచితే
పెనగొన్న కోరికలు బిగువుచూపఁగనీదు
తనివోనినీమంచితన మెంచితేను ॥ ఎందు ॥

చేతులలో చల్లఁగా ఁక నెలవినవ్వుల లేదు
నీతో సరసములు నేనాడితే
ఘాతఁ గొనగోరివాఁడి కాయముపై నాఁటదు
యీతల నీనాసందిఇంపు లెంచితేను ॥ ఎందు ॥

జంకెలకారాలు మోవిచవులలోపల లేవు
కంకిగా నిన్ను రతులఁ గాఁగిలించితే
అంకెల శ్రీవేంకటేశ అన్నిటాఁ గూడితి మిదె
కొంకులేనిమనలోనిగుణా లెంచితేను ॥ ఎందు ॥ 437

ధన్నాసి

నవ్వినట్టివాఁడవు ఆనయ మియ్యనేరవా
జవ్వనభారముతో వేసరుకొనేఁగాక ॥ పల్లవి ॥

ఆస పుట్టించి వలపు లంత రేఁచినవాఁడవు
రాసికెక్క భోగించనేరవా నీవు
వీసమంతకోపముతో విరహతాపముతోడ
రానేటికుచాలతో రాయడించేఁగాక ॥ నవ్వి ॥

ఆనవెట్టి నిలిపి నాఆయాలంటినవాఁడవు
అనుక నన్నుమన్నించే దరుదా నీకు
సానఁబట్టేచూపులతో సణఁపుఁగాఁకలతోడ
తానకపుఘాతలతో తమకించేఁగాక ॥ నవ్వి ॥

అరతిఁ గాఁగిలించి అట్టెకూడినవాఁడవు
చేరి నాకు వినయాలు సేయనేరవా
యీరీతి శ్రీవేంకటేశ ఇంపుతోడ సొంపుతోడ
కోరికలు కొనసాగ కొసరితిఁగాక ॥ నవ్వి ॥ 438

రేకు 1074 పళవంజరం

విన్నవించితిమి నీకు వేడుకైన దీమాట
పన్నినట్టిమేళ్లెల్లా పైపైనే వున్నవి ॥ పల్లవి ॥

నిందునిధానములుగా నెలఁతచన్నులు నీకు
దండిగాఁ బయ్యదలో దాఁచుకున్నది
పండుమోవితేనెలపంచామృతాలతోడ
గండుమీరి విందుచెప్పఁ గాచుకున్నది ॥ విన్న ॥

కందువచిరునవ్వులకప్పురవిడేలు నీకు
అంది సూడిదెవట్టుక అట్టె వున్నది
సందడి కనుచూపులచకోరపుఁబక్షులను
యిందు కెదురుగా నంపి ఇంపుతోడ నున్నది ॥ విన్న ॥

పక్కన తనజవ్వనబండార మంతయును
అక్కజాన నీ కిచ్చేనని వున్నది
తక్కక శ్రీవేంకటేశ తానే నిన్నుఁ బిలుచుక
వెక్కసాన నిన్నుఁ గూడి విఱ్ఱవీఁగి వున్నది ॥ విన్న ॥ 439

ఆహిరినాట

కొంకక నావద్ద నిట్టె కూరుచుండరా
సంకెలెల్లాఁ బాపి నిన్ను జాణఁజేసే నిపుడు ॥ పల్లవి ॥

మొదల నీవే నాకు మోహించవలెఁగాక
అది నాతో మారుకొనేఆపాటిదా
వొదిగి దానికిఁగా నీ వూరకే లోఁగే వింతే
అదన నేనే తీర్చే ఆవెరపు నీకు ॥ కొంక ॥

చనవిచ్చి నీవు నాకు సమ్మతించవలెఁగాక
పెనఁగి యాపె నాతో బీరమాడేదా
చెనకి ఇందుకుఁగాను చింత నీకు నింతయేల
అనుమానమెల్లాఁ బాపే ఆసతిముందరనే ॥ కొంక ॥

ఇటువలె నీవు నన్ను యెనయఁగవలె గాక
సటకారిఇంతి నాతో సరిదూఁగేదా
ఘటన శ్రీవేంకటేశ కాఁగిలించితివి నన్ను
కిటుకులన్నియుఁ బాసె కేరికేరి నవ్వేరా ॥ కొంక ॥ 440

శ్రీరాగం

ఇందాఁకా దూరితి ని న్నేదలేనిమాటలను
చందమాయఁ బనులెల్లా జాణవౌదువయ్యా ॥ పల్లవి ॥

గక్కన నానవెట్టఁగ కపటములెల్లఁ దీరె
చెక్కునొక్కఁగా మతి సేదదేరె
చక్క నన్నుఁ జూడఁగాను సంతసములెల్లాఁ జేరె
వొక్కమనసునను నావొద్ద నుండవయ్యా ॥ ఇందాఁ ॥

తారుకాణ నేయఁగాను తప్పులన్నియునుఁ బాసె
కోరి నాతో నవ్వఁగాను కొంకుదేరెను
సారె సారెఁ బెనఁగఁగ చవులాయ పొందులెల్ల
యీరీతి నేకాలము మమ్మేలుకొనవయ్యా ॥ ఇందాఁ ॥

మచ్చికఁ గాఁగిలించఁగ మర్మములెల్లఁ గరఁగె
చెచ్చెర నీరతులను చింతదీరెను
అచ్చపుశ్రీవేంకటేశ అన్నిటా మేలే చేరె
తచ్చనలేక మాతో తాపుకొనవయ్యా ॥ ఇందాఁ ॥ 441

రామక్రియ

ఇద్దరము నిద్దరమే యెందువొయ్యేమే
కద్దులేవే వేడుకకుఁ గడమేమీ లేదు ॥ పల్లవి ॥

చవులై నవలపులు సరుసనే వుండఁగాను
ఇవల నెడమాటలు యింకానేలే
తవిలి నేనే వచ్చే తా నీడకు విచ్చేసీ
వివరముతో నంతేసి వేగిరములేలే ॥ ఇద్ద ॥

కాతరపుతమకము కైవశమై వుండఁగాను
చేతుల సన్నలు గొంత సేయఁగనేలే
యీతలఁ దా చెక్కునొక్కి యిందుకు నేనైనా మొక్కి
యేతులు యెమ్మెలు నిఁక యెంచనున్నదా ॥ఇద్ద॥

కదిసినదేహములు కాఁగిటనే వుండఁగాను
గుదిగొని మది వేరే కొసరనేలే
యిదివో శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్నుఁ గూడె
వెదకి చూచితే మరి వేరులేదు ఇఁకను ॥ఇద్ద॥ 442

దేసాళం

ఈపాటివుపచార మిది చాలదా
చేపట్టి నే నిఁక నిన్నుఁ జేసేదేమీ ॥పల్లవి॥

అందరితోనుఁ జెప్పక అట్టె మనపొందులెల్లా
అంది ఆకెతోఁ జెప్పితి వది చాలదా
చెంది యాఁటదాని కీసిగ్గులే సింగారములు
నిందలమగవాఁడవు నీ కేమయ్యా ॥ఈపా॥

అంగపుమేనిగురుతు లాపెకే చూపితిగాని
అంగడిఁ బెట్టవైతి వది చాలదా
ముంగిట నిల్లాలికి ముంచినసొమ్మణఁకువ
చెంగట నీవు దొరవు చెప్పనేఁటికయ్యా ॥ఈపా॥

అంకెల మాతోసాటికి ఆకెనే యేలితి గాని
అంకిం చితరులనేల వది చాలదా
మంకులేని నేర్పరికి మానమే మూలధనము
యింక శ్రీవేంకటేశ నన్నేలితివి మేలయ్యా ॥ఈపా॥ 443

లలిత

చెలులము మా కీమాట చెప్పకపోదు
 చెలఁగి ఆపెకోరిక చెల్లించవయ్యా ॥ పల్లవి ॥

మతకపునీలోనిమనసు దెలియలేక
 సతి నన్ను రమ్మనఁగఁజాలదు గాని
 తతి నిన్నుఁ బిలువఁగ తానే విచ్చేసినది
 యితవైనకోరిక నీ వీడేరించవయ్యా ॥ చెలు ॥

కడురాజసపునిన్నుఁ గమ్మి వేగిరించలేక
 వొడిసి కొంగువట్టక వున్నది గాని
 అడరి విందుచెప్పఁగ నాయతపడి వున్నది
 కడలేనివేడుకతో కానిమ్మనవయ్యా ॥ చెలు ॥

మించినజాణవు నిన్ను మితిమీఱఁగాలేక
 ముంచినమొగము చూచి మొక్కీఁగాని
 అంచెల శ్రీవేంకటేశ అట్టె నిన్నుఁ గూడున్నది
 చంచుల నీలాగులనే చనవియ్యవయ్యా ॥ చెలు ॥ 444

రేకు 1075 రీతిగౌళ

వట్టిమాటలఁ బోదు వలపుపేరడియైతే
 గుట్టుతో నేమీననక కొంగువట్టుమనరే ॥ పల్లవి ॥

పాయపుఁదానూ నేను పంతములాడుకొంటే
 కాయములందలికందగర్వ మందురు
 చాయల నేకతమున సమరతి వుపరతి
 సోయగపుబలుములు చూపవలె ననరే ॥ వట్టి ॥

జాణల మిద్దరమును చనవునఁ బెనఁగితే
గాణలు మెరసినకాతర మందురు
ప్రాణమైనకాఁగిటిలో బంధవిశేషములను
రాణించఁజేసితే మేలు రాశికెక్కనవరే ॥ వట్టి ॥

వొక్కటైన తాను నేను వూరకేవుండితేను,
మక్కువమీరినయట్టిమత్తు లందురు
ఇక్కువ శ్రీవేంకటేశుఁ డిదె నన్నుఁ గూడెఁ గాన
యెక్కువతక్కువ గత్తె నెంచవలె ననలే ॥ వట్టి ॥ 445

నాట

ఒద్దుఁ బొద్దు నిన్నుఁ జూచి వూరకుండేను
సుద్దులనీచేఁతలు సోదించ నేఁకను ॥ పల్లవి ॥

అంగడి నున్నది చిత్త మప్పట నుండి నీకు
కొంగువట్టి నేఁ దీసితే కోపమురాదా
ఇంగిత మెఱఁగకున్న నేది జాణతనము
వెంగలితనాన నిన్ను వేసరించ నేఁకను ॥ ఒద్దు ॥

తత్తరాన నున్నది నీతనువు అప్పటనుండి
అత్తి నేఁ బెనఁగితే నీ కలపుగాదా
ఇత్తల గుట్టులేకున్న నేది దొరతనము
పొత్తుల మంకుదనాన బోదించ నేఁకను ॥ ఒద్దు ॥

పైపై నున్నది నీభావ మప్పటనుండి
చేపట్టి నేఁ గూడకుంటే చింత రేఁగదా
కాపాడి శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
దాఁపుల బేలుఁదనాన రవ్వసేయ నేఁకను ॥ ఒద్దు ॥ 446

ఆహిరి

అప్పటికోప మించుకే అపఁగలేవైతివి
 వొప్పుగా విభునికెట్టు వుత్తరమిచ్చేవే ॥ పల్లవి ॥

చెక్కునొక్కి నీకు బుద్ధిఁచెప్పడా అతఁడు దొల్లి
 వొక్కపై ఆపెనుఁ గూడుకుండు మనుచు
 యిక్కడ నది మఱచి యి తితో వాదించితివి
 యెక్కువ నాతనిమొగ మేమని చూచేవే ॥ అప్ప ॥

సేయరానిప్రియమెల్లాఁ జేయఁడా అతఁడు దొల్లి
 మాయలసవతిపోరు మానుమంటా
 ఆయమెరఁగక వొ ట్లాపెకేల పెట్టితివి
 చాయల నీతనికెట్టు సమ్మతిసేసేవే ॥ అప్ప ॥

శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జేరికూడఁడా తొల్లి
 సేవసేసీ నాపె నీకుఁ జేకొనుమని
 వేవేలు సతి నాడి వెనక బుజ్జగించితి
 నీవిభుఁ డీతని కెంత నేరుపు చూపేవే ॥ అప్ప ॥ 447

సామంతం

వాదులేల మాతోను వట్టిసటలకు నీవు
 సేదదేరి నవ్వరాదా సేఁతలెల్లా నున్నవి ॥ పల్లవి ॥

తిద్దినగంధపుబొట్టు తియ్యనిమోవిని గుట్టు
 కద్దని నీకునీకే కానవచ్చునా
 వద్దనున్నమావంటివారు చెప్పఁగా విని
 అద్దము చూచుకోరాదా అన్నియును నున్నవి ॥ వాదు ॥

చెక్కుల మించిననిగ్గు చిత్తములోపలిసిగ్గు
చొక్కుచు నింతంతని చూపవచ్చునా
దక్కియున్నారము నేము దాఁపిరాలకెల్లా మమ్ము
వక్కణ లడుగరాదా వన్నెలెల్లాఁ జెప్పేము ॥వాదు॥

నిలువునివ్వెరగులు నేరుపులమరఁగులు
తొలఁకఁగా నవి నీకు దొబ్బవచ్చునా
యెలమి శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
తలపోసుకొనరాదా తగవెల్లాఁ గనేవు ॥వాదు॥ 448

గౌళ

వీడఁలవీడులనేఁగేవిట్ట[1](ట్ఠ)లేశా[2]। వట్టి -
వేదలెల్లాఁ బాసె నిఁక విట్టలేశా ॥పల్లవి॥

వేడుకకాఁడవైతివి విట్టలేశా। నీకు
వీడె మందుకోవోయి విట్టలేశా।
వీడఁజోడునగవులవిట్టలేశా। నీపై
వేదెవెట్టె మావలపు విట్టలేశా ॥వీడు॥

వెలసె నీమోవి గడువిట్టలేశా। నీకు
వెలుపలే లోనయ్యె విట్టలేశా
వెలలేనిమహిమలవిట్టలేశా। పూవు -
విలుతునిఁగన్నతండ్రి విట్టలేశా। ॥వీడు॥

వెన్నెలతేటమాఁటలవిట్టలేశా। నా -
విన్నపానకే కూడితి విట్టలేశా
వెన్నతో శ్రీవేంకటాద్రివిట్టలేశా। నీవు
వెన్నుఁడవు వెయినామాలవిట్టలేశా ॥వీడు॥ 449

---

1. 'విట్ఠల' కు 'విట్టల' అనియే రేకులో గలదు. ఒకచోట సూచించి వదలితిని.
2. ఈ గీత రేకులో లేదు. 'వట్టి' తో పాదము ప్రారంభిస్తే ప్రాసభంగము

### దేవగాంధారి

తొడిఁబడ సందుసుడిదొంగాడిని
 వెడఁగుఁగొప్పుశిరసు వెన్నముద్దకృష్ణుఁడు ॥ పల్లవి ॥

[1] ఆదిగొని నేరాఁగా నఱచేతివెన్నముద్ద
 పాదుకొన నోర నిండాఁ బావుకొన్నాఁడు
 సాదించీ నామాఁటాడఁ దచ్చమయ్యీనగోలవలె
 యీదెసఁ జట్టిలో వెన్న యియ్యవచ్చీఁ జేతికి ॥ తొడిఁ ॥

కుత్తుకబంటిదాఁకా గూనలో పాలెల్లాఁ దాగి
 యెత్తుకవున్నాఁడు మొగ మిందుదాఁకాను
 యెత్తుకొనఁ బిలిచితే యెంతైనాఁ గదలఁడు
 వొత్తిపట్టి వూఁదుకొనీ నొకచేత నేలను ॥ తొడిఁ ॥

పెరుగుమీఁగడలెల్ల పిన్నవాండ్ల కందిచ్చి
 దొరవలె లోననుండి తొంగిచూచీని
 యెరవు లేక శ్రీవేంకటేశుఁడని మొక్కితేను
 ఇరవైతినని నవ్వీ నిట్టె సెలవులను ॥ తొడిఁ ॥ 450

రేకు 1076

### రామక్రియ

ఎవ్వరినైనా నడుగు మీమాట నీవు
 రవ్వలుసేయుచు నే [2] లెఱఁగవో కాక ॥ పల్లవి ॥

మొక్కితినంటా నన్ను మోహపుఁదిట్టు దిట్టేవు
 వెక్కసాన నేమైనా వెంగెమా యిది
 కక్కసించి నీవొళ్లఁ గల్లలేమి గల్గఁగానో
 తక్కరితనమునఁ గాఁతాళించేవుగాక ॥ ఎవ్వ ॥

---

1. ఆదిగొని=గుఱుతు చూచి? 2. ఏల + ఎఱఁగవో

నగితినంటా నన్ను నన(ను?)గోర నూఁదేవు
వొగరుఁదనముల నీవొరటా యిది
యెగసక్కెపునీచేఁత లెందుకుసరివచ్చెనో
పగటున నీలోనీవే భావించేవుగాక ॥ ఎవ్వ ॥

చన్నులనొత్తితినంటా సారెఁ దప్పకచూచేవు
కన్నెనైన నీవొద్దిగర్వమా యిది
యిన్నిటా శ్రీవేంకటేశ యెమ్మెలు గలుగఁగానో
నన్నుఁ గూడితివి నీనయా లిట్టేకాక ॥ ఎవ్వ ॥ 451

సాళంగనాట

చూడరమ్మ చెలులార జూటితఁడు
యీడుజోడై వినయాలు యెంత సేసీ నితఁడు ॥ పల్లవి ॥

సన్నల సారెసారె సాగిలి నే మొక్కఁగాను
యెన్నేసినవ్వులు నవ్వీ నితఁడు
కన్నులఁ [1]దప్పక నేను కాఁగిలించి [2]చూడఁగాను
వున్నతి తానేల లోఁగి వూరకైనా నితఁడు ॥ చూడ ॥

కూరిమి నిలుచుండి నే కొలువులు సేయఁగాను
యీరీతి చెలఁగువట్టీ యీతఁడు
తారుకాణలైనట్టు తన్ను నేనే పాడఁగాను
ఆరసి తా చెక్కునొక్కీ నంతలోనే యీతఁడు ॥ చూడ ॥

చింతదీర తనకు నే సేవలెల్లాఁ జేయఁగాను
యింతలోనే కాఁగిలించీ నితఁడు
అంతటి శ్రీవేంకటేశుఁడని నే తన్నుఁ గూడితి
సంతోసములెల్లా రేఁచి చనవిచ్చీ నితఁడు ॥ చూడ ॥ 452

---

1, 2. క్రియావిశేషణములను క్రియలను గూడ విరిచి దూరముగ ప్రయోగించుట భాషాధికారిగుర్తు.

ముఖారి

వెల్లవిరాయ వలపు వేసాలేలే
చల్లగా నతఁడు విన్ను సమ్మతించఁజేసెను ॥ పల్లవి ॥

సెలవిఁబారేటినవ్వు చేతనేల మూసేవే
అలుకదేరిచె పిభుఁ డపుడే పిన్ను
బలువైనపులకలు పయ్యదనేల కప్పేవే
సొలసి మర్మ మతఁడు సోఁకించె విన్నును ॥ వెల్ల ॥

అంగపుఁజెమటలు పయ్యదనేల తుడిచేవే
వెంగలినీసిగ్గతఁడు విడిపించెను
ముంగిటినీనిట్టూర్పులు మొరఁగి యేలణఁచేవే
చెంగలించ జేసి నీలో చింతవాపె నతఁడు ॥ వెల్ల ॥

వేడుక మోవికెంపులు విదేననేల కప్పేవే
కూడి యీతఁడే నీకొంకు దేర్చెను
యీడనె శ్రీవేంకటేశు నింతలోనేల మెచ్చేవే
జాడతోఁ గలకాలము సతమాయ నీకును ॥ వెల్ల ॥ 453

లలిత

ఎందువోయే విపుడు ఇద్దర మెదురైతిమి
కందువల మనగుట్టు కానవచ్చీ నిఁకను ॥ పల్లవి ॥

చన్నులు నీపైనాని సాదింతుఁగాక కత-
లెన్నిచెప్పినా నేను యేలమానేను
విన్నవినుకులకును వేతుఁగాక నీపై నింద
పన్నినసీయానలకు భ్రమసేనా ఇఁకను ॥ ఎందు ॥

పెదవితేనియ లాని పిప్పిసేతుఁగాక నవ్వు-
లెదుట నెంతనవ్వినా యేలమానేను
వుదుటునీయెమ్మెలకు వూఁదుదుఁగాక గోరు
చదురునీసేఁతలకు జడిసేనా ఇఁకను ॥ ఎందు ॥

కూడినరతుల నాని కుమ్మరింతుఁగాక తమ్మ
యీడ నీ వెంతమొక్కినా యేలమానేను
పాడితో శ్రీవేంకటేశ పైకొంటివి మెత్తుఁగాక
అదుకోలుపంతాలకు నలసేనా ఇఁకను ॥ ఎందు ॥ 454

## తోండి

ఏల వూరకున్నాఁడవు ఇంకా నీవు
పాలించి మనలోనివే పంతాలు గావా ॥ పల్లవి ॥

మచ్చికతో నీవు నేను మాటలాడినందుకే
తచ్చి యాపె దిట్టుకొనీఁ దానేతాను
విచ్చనవిడి నందుకు వేఁడుకొనవయ్య నీవు
నెచ్చలి తన్నునుకొంటే నినునంట గాదా ॥ ఏల ॥

ఇద్దరము నేకతాన ఇట్లనుండినందుకే
కొద్దిమీరఁ జెలులపైఁ గోపగించీని
బుద్ధిచెప్పి చేయివట్టి బుజ్జగించవయ్య నీవు
పెద్దరిక మాపెది నీపేరే యింతా గాదా ॥ ఏల ॥

మక్కువ శ్రీవేంకటేశ మనము గూడినందుకే
కక్కసించి వూరకైనాఁ గాఁతాళించీని
వొక్కటే ఆపె నేను వొరసి కూడితి విదె
నిక్కము దెలుసుకొంటే నీవు నీవే కావా ॥ ఏల ॥ 455

ఆహిరి

ఇదివో మావాళ్లినేర మిఁకనేఁటిది
నిదులనాజవ్వనము నీచేతి దిఁకను ॥ పల్లవి ॥

ననిచి యప్పటి నీతో నవ్వులు నే నవ్వితిఁగా
తనిసి యన్నిటా నీపైఁ దమకించక
మనసుమెత్తనిదాన మఱి యేమిచెప్పే నీకు
నినుపై నాభాగ్యము నీచేతి దిఁకను ॥ ఇది ॥

సొలసి యప్పటి నీతో సుద్దులు చెప్పితిఁగా
బలిమి పాడిపంతాలు పచరించక
అలరినమేలుదాన అననేమున్నది నిన్ను
నెలవై నాధైర్యము నీచేతి దిఁకను ॥ ఇది ॥

గక్కన నప్పటి నీతో కాఁగిటఁ గూడితిఁగా
చొక్కులఁబెట్టుచు నీతో సోదించక
వొక్కపై శ్రీవేంకటేశ వొరయనేఁటికి నిన్ను
నిక్కపునాసిగ్గులెల్లా నీచేతి దిఁకను ॥ ఇది ॥ 456

రేకు 1077 రామక్రియ

అతఁడిదె నీవిదె అరగొరతేఁటికే
కాతరానఁ గాఁగిలించి కపటము లేఁటికే ॥ పల్లవి ॥

యిచ్చకములాడేది హితవు మోహములకు
పచ్చిదేర నవ్వేది ఫల మందుకు
ముచ్చటలు నడపేది మొదలు కూటములకు
యెచ్చుకుందుసొలపులు యీడ మరియేఁటికే ॥ అతఁ ॥

తమకించి పైకొనుచే తగవు వయసులకు
అమరఁగఁ బెనఁగేదే ఆయమందుకు
సమమగుసరసాలే చవులు కరఁగులకు
తిమిరేటిపంతముల తెరమఱఁగేఁటికి ॥అతఁ॥

ఇటువలెఁ గూడేదే యెన్నిక ఆసలకును
ఘటన మోవితేనెలే కందు వందుకు
తటుకనఁ గూడె శ్రీవేంకటరమణుఁడు నిన్ను
నటనలన్నియుఁ గూడె నాలి ఇఁకనేఁటికే ॥అతఁ॥ 457

నాట

బుద్దిచెప్పరా నీకు పొరుగులవారెల్ల
తిద్దుబడీఁ దా నిన్నీఁ దెలిసినపనులు ॥పల్లవి॥

పంతమాడనేఁటికి పడఁతులముందరను
వింతవా రెవ్వరున్నారు వీరిలోన
దొంతినున్నవలపులు దోమటి దొడికితిమి
రంతుసేయఁబోతేను రవ్వకెక్కుఁ బనులు ॥బుద్ది॥

తప్పకచూడనేఁటికి తరవాతిపనులకు
వుప్పటించుచుట్టాలెల్లా వొద్దనున్నారు
రెప్పలనున్నయాసలు రేపునుమాపును నిండె
చొప్పులెత్తఁబోతేను జోడించుఁ బనులు ॥బుద్ది॥

సిగ్గువడనేఁటికి చెందినకాఁగిటిలోన
అగ్గలమయ్యేరా నీకు నండవారెల్లా
కగ్గని శ్రీవేంకటేశ కందువలఁ గూడితిమి
వెగ్గళించఁబోతేను వింతలవుఁ బనులు ॥బుద్ది॥ 458

బౌళి

ఇన్నిటాను మేఱమేలు యేల దాఁచేవు
వన్నెలను తొల్లింటివాఁడవా నీవిపుడు ॥ పల్లవి ॥

మంతనాన నీతో నాపె మాటలాడెనటకా
చెంతలఁ జెవిలోనేమో చెప్పెనటకా
సంతసాన మరియును సన్న సేసెనటకా
వింతలుగ నన్నియును వింటిమి నీసుద్దులు ॥ ఇన్ని ॥

అంగన తనపై నీకు నానవెట్టెనటకా
సంగతి వలపులెల్లఁ జల్లెనటకా
[1]వుంగిటిదీరఁగ సెలవుల నవ్వెనటకా
చెంగటనే వూరెల్లాఁ జెప్పిరి నీసుద్దులు ॥ ఇన్ని ॥

కలికి పైకొని నిన్నుఁ గాఁగిలించెనటకా
యెలమి మాయింటి కప్పణిచ్చెనటకా
కలసితివి శ్రీవేంకటరమణుఁడ నన్ను
పలుకుఁబంతములను బలిసె నీసుద్దులు ॥ ఇన్ని ॥ 459

భైరవి

ఇంతిచనవు చెల్లించు మెగ్గులుపట్టకు నీవు
సంతసించి మెచ్చుటే చాయపాటుఁదనము ॥ పల్లవి ॥

అంగన యలిగితేను అట్టె తా మారలుగక
సంగడిఁ గూచుండితేనే జాణతనము
యింగితమెరిఁగి యాపె కిచ్చకములే యాడి
కొంగుపట్టి తియ్యుటే గక్కున మంచితనము ॥ ఇంతి ॥

---

1. వ్రాతవశమున హల్లైన 'వుంగిటి' లోని 'వు' వర్ణమునకు, సహజముగ హల్లైన 'సెలవుల'లోని 'వు' వర్ణమునకును యతి ఇది వింత. 481-వ పాటతో పోల్చి చూడగలరు. అది సహజము.

కామిని దిట్టఁగాఁ జూచి కదిసి యాకెమోోవి
దోమటి దొడికితేను దొరతనము
చేముట్టి సరసమాడి చేతికి లోనుగాఁజేసి
ఆమనిరతిఁ జొక్కించే దది దొడ్డతనము ॥ ఇంతి ॥

గుట్టుతోడ నున్నసతి గొల్లునను నవ్వించి
నెట్టనఁ గాఁగిలించుటే నేర్పుఁదనము
యిట్టె శ్రీవేంకటేశ యీమగువఁ గూడితివి
నట్టనడుమఁ గూడుటే నయగారితనము ॥ ఇంతి ॥ 460

గౌళ

ఎందుకు రోయనివాఁడ వేమైనాఁ జేయవచ్చేవు
విందువలె వింతవారు వింటే నవ్వేరయ్యా ॥ పల్లవి ॥

[1]వుంగిటిగా నెవ్వతో నీవురమున మెత్తినట్టి-
యెంగిలిగందాలు నాపైనేల పూసేవు
పంగెముగలవాఁడవు బాఁతిపడుదువు గాక
సంగతా ఇల్లాండ్లకు సర విది యౌనా ॥ ఎందు ॥

అమరించి యేడవారో అట్టె నీకు నిచ్చినట్టి-
చెమటసొమ్ములు నాచేతఁ బెట్టేవు
తమిగలవాఁడవు తగిలించుకొని వచ్చి
గుమితాన నుండేమాకు గురిగా నిచ్చితివి ॥ ఎందు ॥

మానినులరతులను మాఁగినచేతులఁ దెచ్చి
శానుకవట్టుచు నన్నుఁ గాఁగిలించేవు
కానీలే శ్రీవేంకటేశ కలసితివి వలపు
నానఁబెట్ట నీకుఁ దగు నాలి నాకుఁ దగునా ॥ ఎందు ॥ 461

1. 459 కీర్తనక్రింద చూడదగు.

పాడి

నీకుఁబోదు నాకుఁబోదు నీచనవుగలదాన
మేకొని నిన్నేమనినా మేలుసుమ్మీ విభుఁడా ॥పల్లవి॥

వొద్దనుండి చన్నులనే వొరసితి నే నిన్ను
అద్దుక నాఁటవుగదా ఆకొనలు
పెద్దరికానకే కడుఁబెనఁగేవారము నీపై -
నుద్దండాలు నేతుము వోరుచుకో విభుఁడా ॥నీకుఁ॥

ముచ్చటాడేనని వచ్చి మోవి యెంగిలిసేసితి
పచ్చియై తోఁచదుగదా పలుసోఁకుల
మెచ్చులసలిగెలను మెరసేవారము నిన్ను
యెచ్చుకుందు లాడుదుము యియ్యకొమ్మా విభుఁడా ॥నీకుఁ॥

కాఁగిలించుకొంటానే కన్నుల జంకించితిని
చేఁగదేరించవుగదా చేఁతలెల్లాను
మూఁగిన శ్రీవేంకటేశ మోహపువారము నీతో
పీఁగక కూడితి మిది వింతసుమ్మీ విభుఁడా ॥నీకుఁ॥ 462

రేకు 1078 దేసాళం

[1] మెఱుఁగుఁజెక్కులఅలమేలుమంగా
తరి(జిఁ?)తోడిరతులను దైవారవమ్మా ॥పల్లవి॥

చనవులు నీకిచ్చి చక్కనివదన మెత్తి
పెనఁగీ నాతఁడు నిన్నుఁ బ్రేమతోడను
కనువిచ్చి చూడవమ్మ కందువల నవ్వవమ్మ
మనసిచ్చి యాతనితో మాటలాడవమ్మా ॥మెఱుఁ॥

1. రేఫ శకటరేఫల కక్కడక్కడ అపురూపముగా యతిప్రాసలు కనబడు-చున్నవి. వ్రాయసకాని ప్రమాదము కావచ్చు. చూ—470 పాట.

పొందులు నీతో నెరపి పూఁచి నీపైఁ జేయివేసి
చిందీ నీపై నతఁడు చిఱుఁజెమట
విందులమోవియ్యవమ్మ వేడుకలు చూపవమ్మ
అందుకొని ఆకుమడి చాతని కీవమ్మా ॥ మెఱుఁ ॥

గక్కనను గాఁగిలించి కరుణ నీపై నించి
ఇక్కవఁ గూడె శ్రీవేంకటేశుఁడు నిన్ను
వక్కణ లడుగవమ్మ వన్నెలెల్లాఁ జూపవమ్మ
నిక్కుచు నురముమీఁద నిండుకొనవమ్మా ॥ మెఱుఁ ॥ 463

## శ్రీరాగం

ఈవిన్నపము మఱవ కింకా నీవు
నీవూదిగపుదాన నీచిత్త మిఁకను ॥ పల్లవి ॥

మోము చూచినవాఁడవు మొక్కించుకొన్నవాఁడవు
యీమేలే నడుపుము ఇంకా నీవు
నామనసెఱుఁగుదువు నమ్మించితివి తొల్లె
నేమము వట్టితి నీకే నీచిత్త మిఁకను ॥ ఈవి ॥

చేయివట్టితివి నీవు నెలవుల నవ్వితివి
యీయెడ నన్నుఁ బాయకు మింకా నీవు
ఆయము నీచేతిది అడియాల మిదె నాపై
నీయిచ్చలోనిదాన నీచిత్త మిఁకను ॥ ఈవి ॥

గట్టిగా నన్నుఁ గూడి కప్పురవిడె మిచ్చితి
ఇట్టె కరుణఁజూడు మింకా నీవు
అట్టె శ్రీవేంకటేశుఁడ వలమేలుమంగ నేను
నెట్టుకొంటి పానుపుపై నీచిత్త మిఁకను ॥ ఈవి ॥ 464

గౌళ

ఔలే యెఱిఁగితిమి అన్నియు నేఁడు
· మేలుమేలు జాణవౌదు మెచ్చితిమి నిన్నును ॥ పల్లవి ॥

నీమేనివాసనలే నెలఁత మేన నున్నవి
యేమి సమ్మంధములో మీ కిద్దరికిని
చేముట్టి నా కప్పటి నీచెలిజవ్వాది వూసేవు
కామించి కదంబముగాఁ గలపేవు వలపు ॥ ఔలే ॥

అదిగో నీవుంగరాలే ఆపెవేళ్లఁ గొన్నున్నవి
కదిసినతగ వెంతగద్దో కాని
వుదుటున నీముద్దుటుంగరము నా కిచ్చేవు
పొదిగి తొరలించేవా పొరుగులవలపు ॥ ఔలే ॥

అంగపునీకరఁగులే అలమేల్మంగ కున్నవి
సంగతి శ్రీవేంకటేశ చనవెట్టిదో
అంగవించి యేలితివి అప్పటి నన్నింతలోనే
ముంగిటనే నిలిపేవా మునుకొన్నవలపు ॥ ఔలే ॥ 465

వసంతవరాళి

ఎంతవేగిరకాఁడమ్మ ఇదివో తాను
పొంత నావద్దఁ గూచుండి బోధించీఁ దాను ॥ పల్లవి ॥

సిగ్గువడి చెక్కుచేత చింతించుకుండఁగాను
వెగ్గళించి నాపైఁ జేయివేసీ తాను
దగ్గరి ఇందరిలోన తలవంచుకుండఁగాను
అగ్గలము వేఁడుకొని ఆదరించీ తాను ॥ ఎంత ॥

మానాపతితనాన మాటలాడకుండఁగాను
 అనుకొని యాడోకత లడిగీఁ దాను
 పానుపుపైఁ గూచుండి పంతముతో నుండఁగాను
 మేను ముట్టి సారెసారె మేలమాడీ తాను ॥ ఎంత ॥

ఇయ్యకొని తనకాఁగి లిచ్చగించి వుండఁగాను
 పయ్యదంటుచును వొడఁబరచీఁ దాను
 నెయ్యపుఅలమేల్మంగ నేను తా శ్రీవేంకటేశుఁ—
 డియ్యెడఁ గరుణఁ గూడె ఇన్నిటాఁ దాను- ॥ ఎంత ॥ 466

## పాడి

ఇద్దరము నున్నారము ఇంత చాలదా
 పెద్దగాఁగ నడియాస పెనచఁగవలెనా ॥ పల్లవి ॥

మొక్కితి నీకు నేను మొన్ననిన్నటిసుద్దికి
 వక్కణలేల చెప్పేవు వద్దు వద్దు
 కుక్కి తోసినట్టు నీకు గుట్టున నుంది వలపు
 పిక్కటిల్లు తనుఁదానె పెడరేఁచవలెనా ॥ ఇద్ద ॥

నవ్వితి నీమోము చూచి నాలిసేసి ఇందాఁకా
 జవ్వనమేల పట్టేవు చాలుఁజాలు
 పువ్వులవలెనే నీకు పూఁచుక వున్నది తమి
 రవ్వలయ్యీఁగాక తానే రారాఁపు వలెనా ॥ ఇద్ద ॥

ఆడితి నలమేల్మంగనని నన్నుఁ గూడితివి
 యీడనే బాసలుసేసేవేల యేల (?)
 వేడుకవలెనే శ్రీవేంకటేశ నిండె మాట
 వాడికలై వుండీఁగాక వ్రాసిచూపవలెనా ॥ ఇద్ద ॥ 467

ఆహిరి

ఇదివో దిష్టము చూడు యింతి ఇదె నీ విదె
మదిలో మావిన్నపాలు మఱవకువయ్యా ॥ పల్లవి ॥

నిన్నుఁజూచినంతలోనే నెలఁతమై చెమరించె
చన్నులపైఁ బులకలు జాజుకొనెను
కన్నులఁ దేటలు మించె కళలు మోమున నిండె
యెన్నెని నీమీఁదిమోహ మేమిచెప్పేమయ్యా ॥ ఇది ॥

మాటలాడినంతలోనే మగువకుఁ గొప్పు జారె
తేటలై నసిగ్గులెల్లా దిమ్మవానెను
పాటించి కోరికలెల్లా భావాన నీరికలొత్తె
కూటువ నీపై కాంక్షలు కొలఁదియేదయ్యా ॥ ఇది ॥

దగ్గరినయంతలోనే తతిగొనె నూరుపులు
దిగ్గనఁ బయ్యదకొంగు దిగజారెను
అగ్గమై శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
కగ్గుదీర నిన్నుఁ గూడె కడమేదదయ్యా ॥ ఇది ॥ 468

రేకు 1079 ఆహిరి

ఇట్టె నన్నుఁ గరుణించి యీడేర్తు గాక
తొట్టుకొన్నసవతులతొడుసులేల ॥ పల్లవి ॥

నమ్మించి వద్ద నీవు నాకుఁ గలిగుండఁగాను
పమ్మినట్టివిరహపుభయమేల
సమ్మతించి యన్నిటాను చనవిచ్చియుండఁగాను
చిమ్ముల౦ జెక్కిటిచేతిచింతలేల ॥ ఇట్టె ॥

మనసిచ్చి నీవు నన్ను మన్నించియుండఁగాను
ఘనమైనకాంక్షల కడమేల
ననుపున నీవు నాతో నవ్వులు నవ్వఁగాను
యెనసి చెలులచేతియెడమాట లేల ॥ ఇట్టె ॥

కూడి నీవు నన్ను నిట్టె కొంగువట్టుకుండఁగాను
ఆడుకోలుమాటలలో ఆరడేల
నీడల శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
మేడెపురతు లబ్బెను మేకు లింకానేల ॥ ఇట్టె ॥ 469

వరాళి

[1] ఎఱఁగము వోరుచుకో యేమి గలిగినా నన్ని
తఱివచ్చె పనులలో తప్పుదేరీఁగాని ॥ పల్లవి ॥

చనవుగలుగువారు సణఁగు లెంతాడినాను
మనసు నాటుకొని మంచిదై తోఁచు
పెనఁగితి నిందాఁకా ప్రియము రెట్టించ నేను
యెనసి నీచిత్తానకు యెట్టుండెనో ॥ ఎఱ ॥

పిలిపించుకొన్నవారు బీరము లెంతాడుకొన్నా
వలపులచేఁతలకు వన్నెలై తోఁచు
మలసితి నిందాఁక మర్మము సోఁకఁగ నిన్ను
వలనై నీచిత్తానకు వచ్చునో రాదో ॥ ఎఱఁ ॥

బాసలుగొనినవారు పట్టి యేమిసేసినాను
వేసట యించుకలేక వేడుకై తోఁచు
యీసులేక శ్రీవేంకటేశ నేఁ గూడితి నిన్ను
ఆసతో, నీ చిత్తానకు నది మించెనో ॥ ఎఱఁ ॥ 470

1. చూ : 463 పాట.

సాళంగనాట

నేరుపరి విన్నిటాను నెరజాణవు
మేరలు మీరేవారము మేము మీకెదురా ॥ పల్లవి ॥

మారుకొని నీతోడ మాటలాడ వసమా
బీరానఁ జదివేవి పెనువేదాలు
గారవాన వేసేవి గాలాలైతే నాయఁగాక
తీరువడరైరా నీలో త్రిపురాంగనలు ॥ నేరు ॥

సాదించి నీదిక్కు చక్కఁజూడవశమా
గాదిలినీచూపులు అంగజుశాస్త్రాలు
కాదన నీచేఁతలు చీఁకటివైతే నాయఁగాక
నేదదేరరైరా నీలో చేరి గొల్లసతులు ॥ నేరు ॥

జాదల నీమోవితీపు చవిగొనవశమా
ఆడుకొంను వందునే మోహనమంత్రాలు
కూడనా శ్రీవేంకటేశ గొల్లవైతే నవుదుగాక
యీడ నే నలమేల్మంగ నిందరును మెచ్చరా ॥ నేరు ॥ 471

తెలుఁగుఁగాంబోది

చూతువు విచ్చేయవయ్య సుద్దులు చెప్పగనేల
రాతిరిఁబగలు జాగరములాయను ॥ పల్లవి ॥

ముంచినవలపు తలమునుకలై వనితకు
దించినట్టు కొప్పువీడి దిగజారెను
యెంచరానితమకము ఇగిరించినట్టు మేనఁ
ంచులపులకలెల్ల జాజుకొనెను ॥ చూతు ॥

తగినచింతాసముద్రానఁ గోరికవోడ
దిగినయట్టు చెక్కు చేతికి వచ్చెను
పగటున నిధానాలు బయటఁబడినయట్టు
సగముపయ్యెదెదలి చన్నులు మెరసెను ॥ చూతు ॥

కందువఁ దనభాగ్యము కాఁగిట నిలిచినట్టు
పొందితి శ్రీవేంకటేశ పొలిఁతి నిట్టె
అందె అలమేలుమంగ నప్పటి లోనింటి కేఁగి
కందువ [1] చెప్పెంపినట్టు కాంతలఁ బుత్తెంచెను ॥ చూతు ॥ 472

నారాయణి

చిత్తగించి నీవే నన్నుఁ జేకొని పాలింతుగాక
బత్తు లేదకెక్కను నాభావ మేమున్నదిరా ॥ పల్లవి ॥

చేరి నీమోము చూచితే సిగ్గులే ముంచీ నాకు
యేరీతి మాటలాడుదు యేమినేతురా
ఆరయ నిన్నునంటితే నంగమెల్లాఁ జెమరించీ
నేరుపు లేదకెక్కను నేఁడు నీముందరను ॥ చిత్త ॥

ననుపు నటించఁబోతే నవ్వులే వచ్చీ నాకు
మనసెటు దెలుసు నీమర్మమేదిరా
చనుమొనల నొత్తితే జాజుకొనఁ బులకించీ
తనివేడఁ దెచ్చుకొందు దంటవు నీయెదుట ॥ చిత్త ॥

గడుఁగాఁగిలించఁబోతే కరఁగీ మర్మములెల్ల
తడవ కెట్టుండుదును తతి యేదిరా
అదరి శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
జడియక కూడితిని సరసుఁడవౌదువు ॥ చిత్త ॥ 473

1-చెప్పి+అంపినట్టు.

శ్రీరాగం

ఇంతటనుఁ గరుణించు ఇదె విన్నపము నీకు
ఇంతి యలమేలుమంగ ఇరవై నీకున్నది ॥ పల్లవి ॥

చేతుల నీరూపు వ్రాసి చెలరేఁగివుండేయాస
గాతల నీసతి పొద్దుగడపీ నదె
నీతితోడ వీనులను నీకతలు వినేయాస
రాతిరిఁబగలును బీరము నేసుకున్నది ॥ ఇంత ॥

తలపోఁతలను నిన్ను దగ్గరివుండేటియాస
పెలుచై నదేహము పెంచీ నదె
కలలోననైన నిన్నుఁ గాఁగిలించుకొనేయాస
బలువుగాఁ బ్రాణము పట్టుకున్నదదివో ॥ ఇంత ॥

యిట్టె నీవు వచ్చేవని యెదురుచూచేయాస
నెట్టుకొని వేడుకతో నిలుచున్నది
గట్టిగా శ్రీవేంకటేశ కైకొని కూడితి విదె
వొట్టుక నిన్నుఁ బాయక వొద్దికై తానున్నది ॥ ఇంత ॥ 474

రేకు 1080 సామంతం

దాఁచినవాఁడే యెఱుఁగు ధనముగుఱుతు నాకు
పూఁచి నీవు చెప్పితేను పొంచివినే నిఁకను ॥ పల్లవి ॥

మొక్కితి నప్పుడే నీకు మోహము రెట్టించనా
చెక్కులేల నొక్కేవు చేరి యందుకు
నిక్కి నీలోనికడమ నీకే తెలుసుఁగాక
ఇక్కువలలోని [1]యర్తా(ర్థా?) లెఱుఁగ నావశమా ॥ దాఁచి ॥

---

1. 'యర్తా' లని రేకు,

వీడెమిచ్చితి నాడనే వేవేలుచందముల
కూడి యేలకాఁగిలించి కుచ్చియెత్తేవు
నీడ నీవునేనేచేఁత నీకే తెలుసుఁగాక
వేడుకతో నవి నేను విచ్చి చెప్పఁగలనా ॥ దాఁచి ॥

పాదాలొత్తితి నేను పంతపుశ్రీవేంకటేశ
ఆదిఁ గూడి తలమేల్మం గందురంటాను
నీదయ నాపైఁ బెట్టేది నీకే తెలుసుఁగాక
మేదినిలో నింతంతని మెచ్చ నాకు నలవా ॥ దాఁచి ॥ 475

కన్నడగౌళ

నిచ్చలు నాబతుకెల్ల నీచేతిది; నీ—
యిచ్చవచ్చినట్టు సేయు మెదురాడ నిఁకను ॥ పల్లవి ॥

పలికితి నీతోడఁ బంతములు సారెసారె
సొలసితిఁ గొంతగొంత చూపులలోను
అలసితి నిఁకనోప నన్నిటా నీచిత్తమునఁ
గలిగినయట్లఁ జేయు కాదన నే నిఁకను ॥ నిచ్చ ॥

కక్కసించితిని నిన్ను ఘనమైనరతులను
వెక్కసానఁ గొసరితి వేసరించితి
మొక్కెద నిఁక నే నేర మొదల నుపాయాలు
మక్కువగలట్టే సేయు మఱఁగేల యిఁకను ॥ నిచ్చ ॥

కరఁగించితి మనసు కాఁగిటిరతుల నిన్ను
సిరుల శ్రీవేఁకటేశ సేవచేసితి
అరమఱచితి; నవ్వే నలమేలుమంగ నేను
తరవాత నన్నిఁ జేయు తమకించ నిఁకను ॥ నిచ్చ ॥ 476

కేదారగౌళ

చెప్పినట్టు సేతుగాక చెలువునియెడ నీవు
 ముప్పిరిఁ బెనగుదురా మోహించినదానవు ॥ పల్లవి ॥

వొగ్గి నీరమణుఁ డిదె వొడిపట్టుకుండఁగాను
 సిగ్గులేలే చింతలేలే చెల్లఁబో నీకు
 దగ్గరఁ గూచుండి తానే తతి నిన్ను వేఁడుకోఁగా
 యెగ్గులేలే యెమ్మెలేలే యింకా నీకు ॥ చెప్పి ॥

పలుకుల నీవిభుఁడు పాలార్చఁగా నిన్ను
 అలుకేలే కలఁకేలే అద్దో నీకు
 నిలుచుండి యాతఁడు నిన్ను నొడఁబరచఁగా
 చలమేలే బలిమేలే సారెసారె నీకు ॥ చెప్పి ॥

కడు శ్రీవేంకటేశుఁడు కాఁగిలించుకుండఁగాను
 తడవేలే గొడవేలే తగవా నీకు
 అదరి యలమేల్మంగవని నిన్నుఁ గూడె నేఁడు
 బెడసేలే గడుసేలే ప్రియురాల నీకు ॥ చెప్పి ॥ 477

సింధురామక్రియ

ముట్టివచ్చినపనికి మొక్కేనయ్యా
 జట్టిగొంటి విన్నిటాను జగడము లేఁటికి ॥ పల్లవి ॥

పంతము నాచేతిది బలిమి నీచేతిది
 ఇంతినిదె కంటి నెక్కుడా నేను
 వింతదాన నేఁ గాను విడువఁగరాదు నీవు
 యెంతకెంత రావయ్య ఇఁకనేల అలుక ॥ ముట్టి ॥

తగవు నాహొళ్ళిది దయ నీకుఁ గలదే
మగువ నిదివో నేను మారాడేనా
వెగటాడ నే నీతో వెక్కసము లేదు నీకు
తగు నిఁక లేవయ్య తలపోఁత లేఁటికి ॥ముట్టి॥

ఫలమెల్లా నాసొమ్ము పైపైనవ్వులు నీవి
అలమేలుమంగ నేను అడ్డమున్నదా
యెలమి శ్రీవేంకటేశ యిద్దరముఁ గూడితిమి
చెలఁగితి నుండవయ్య నేసన్నలేఁటికి ॥ముట్టి॥ 478

## నాదరామక్రియ

కల్లగాదు యిది నీవు గన్నపనే
చెల్లు నీకే యన్నియును చిత్తగించరాదా ॥పల్లవి॥

మొక్కిననామొక్కులోనే మోహమెల్లాఁ గానరాదా
చొక్కపునామననేమి సోదించేవు
యిక్కడనే భ్రమయించ యిదిగొంత వలెనా
తక్కరితనము నేర దయఁజూడు మిఁకను ॥కల్ల॥

యిచ్చినకానికెలోనే యితవెల్లాఁ దెలియదా
తచ్చి మాగుణములేమి తలపోసేవు
రచ్చఁబెట్టి నీవింత రవ్వసేయవలెనా
మచ్చరమెఱఁగ నన్ను మన్నించు మిఁకను ॥కల్ల॥

కూడిననాకూటమిలో గుణమెల్లఁ గానరాదా
తోడనే మమ్మెంత నీవు తొరలించేవు
వేడుక మించితివి శ్రీవేంకటేశ నన్ను నిట్టె
జాడ నలమేల్మంగను చనవులి మ్మిఁకను ॥కల్ల॥ 479

శంకరాభరణం

ఈదేరిచనవాఁడవు యెప్పుడు నీవు మానేవా
మేదెపుఁగళలచేత మించేవుగాక ॥ పల్లవి ॥

ఆయములెరిఁగి మెచ్చ నది నీవే నేరుతువు
నీయంత నేరుతునా నెలఁత నేను
చాయల నన్నేల నీవు సరులువెట్టుకొనేవు
కాయకమైనయామేలు గట్టుకొందుగాక ॥ ఈదే ॥

పంతము చెల్లించఁగ పాడి నీ వెఱుఁగుదువు
యెంతయిన నీతోడ యీడువచ్చేమా
అంతలోనే నీవు నన్ను అప్పణలేలడిగేవు
చెంత నీదొరతనమే చెల్లింతుగాక ॥ ఈదే ॥

రతులఁ జవులుచూపేరసికుఁడ వౌదువు
యితవులు దెలియ నే మెంతవారము
గతియై శ్రీవేంకటేశ కాఁగిటఁ గూడితి నన్ను
సతమై నీమహిమలే జట్టిగొందుగాక ॥ ఈదే ॥ 480

రేకు 1081 లలిత

ఆయనాయ చాలుఁజాలు అంతసేయకు
నాయములఁ బెట్టి నిన్ను నవ్వించఁజాలనా ॥ పల్లవి ॥

సిగ్గున నూరక చెక్కుచేతితో నుంటిఁగాక
దగ్గరి మాటాడ నిన్నుఁ దడవా నాకు
వెగ్గళించి నీమాట వేలుచుకొనుచుంటిఁగాక
యెగ్గులెంచి వొలవేయ నెంతకైనా నేరనా ॥ ఆయ ॥

సారెసారెఁ గన్నుల నీసరిత చూచితిఁగాక
తారుకాణలకుఁ దియ్య దడవా నాకు
గారవపు నీమోహము కన్నదాఁకా నుంటిఁగాక
బీరమాడి నీతో నింత పెనఁగనోపనా ॥ఆయ॥

నిలుచుండి నీచేఁతకు నివ్వెరగందితిఁగాక
తలఁపెల్లఁ దెలియఁగఁ దడవా నాకు
బలిమి శ్రీవేంకటేశ పాయకిట్టె కూడితివి
అలమేలుమంగను నే నంతనేరనా ॥ఆయ॥ 481

గౌళ

చేతికిలోనాయఁ బతిఁ జేకొనవమ్మ
నీతులెల్లఁ గంటిమిదె నీవంకనే యమ్మ ॥పల్లవి॥

మొగము నీవు చూడఁగ మోహము రెట్టించె నేఁడు
నగవమ్మా ఇప్పుడిట్టె నాయకునితో
నిగిడి కూటములకు నీయంతనే పోఁగువెళ్లె
వగదీరె నాతనిని వలపించవమ్మా ॥చేతి॥

ముచ్చట నీ వాడఁగాను ముమ్మడించె నిదె మేలు
ఇచ్చకమాడవమ్మ ప్రాణేశునితోను
నిచ్చలపుఁగందువలు నీవద్దనే వున్నవి
రిచ్చగా నాతనితమి రేఁచఁగదవమ్మా ॥చేతి॥

వెలసె నీవు మెచ్చఁగ వేవేలాయ రతులు
కలయవమ్మ శ్రీవేంకటపతిని
కలికితనము లివి కాణాచిగా నీకుఁ జిక్కె
పొలసి యీతనినిట్టె భోగించవమ్మా ॥చేతి॥ 482

దేసాళం

ఊరకే అలుగకు నీ వోయయ్యా
ఆరితేరినమాట నిన్నంటి నింతేకాక ॥ పల్లవి ॥

కపటములెల్లాఁ బానె కన్నులఁ గన్నంతలోనె
వుపమలు చెప్పవయ్య వోయయ్యా
చపలచిత్తుఁడవా జడిసేటివాఁడవా
అపురూపముగనేమో అంటి నింతేకాక ॥ ఊర ॥

పట్టకు నీవంతయెగ్గు పనిలేనిపనులకు
వొట్టుక నవ్వఁగదయ్య వోయయ్యా
వెట్టివలపా నీది వేసట నీ కున్నదా
అట్టునిట్టు యేఁటికో నిన్నంటి నింతేకాక ॥ ఊర ॥

కోరిక లీడేరె నిన్నుఁ గూడినయంతటిలోనే
వూరటనేసుకోవయ్య వోయయ్యా
యీరీతి శ్రీవేంకటేశ యిన్నిటా జాణవౌదువు
ఆరసి నిన్నూరకె అంటి నింతేకాక ॥ ఊర ॥ 483

వేళావళి

ఇంకనేల మఱఁగూ యిందరు నెఱిఁగిరి
సంకెదీర నీమోవి చవిగొంటిమి ॥ పల్లవి ॥

సొరిది నీసుద్దులకే చొక్కి చొక్కి నేమెల్ల
వరుసలు వెట్టుకొని వలచితిమి
సిరులఁ గొలనిదరిని చీరలకొరకుఁగాను
వెరవుతోడ నిన్ను వేఁడుకొంటిమి ॥ ఇంక ॥

---

ఈ గీతలుగలతావులు చిలుమెక్కి రేకు అరిగియుండుటచే సరిగ కానవచ్చుట లేదు; నే నూహించినవే.

చల్లలమ్మేచోటనెల్ల జాణతనాలాడి యాడి
లొల్లిగా నీపోఁగులకు లోనయితిమి
[1]కొల్లలాడినవెన్నలగొందులసందులనెల్ల
పెల్లురేఁగి నీకాఁగిటఁ బెనఁగితిమి ॥ ఇంక ॥

యమునలో పిల్లఁగోవి యరనేరాగాలు విని
గుమిగట్టి వచ్చి నిన్నుఁ గూడితిమి
తమితో శ్రీవేంకటేశ తలఁపు నీపైఁ బెట్టి
సమరతుల మెప్పించి చనవు చేకొంటిమి ॥ ఇంక ॥ 484

సాళంగనాట

చెప్పనేల నీసుద్దులు చెల్లుబడై వుండఁగాను
కప్పినపట్నాలవారు గందమిత్తురా ॥ పల్లవి ॥

నాలిసేసినవాఁడవు నగ నీవే నేరుతువు
మేలుమేలనుచు నిన్ను మెచ్చఁగనేల
వాలుమగఁడవు యింతవాఁడవు గాకుండితే
మూలనున్నగొల్లెతలు మోహింతురా ॥ చెప్ప ॥

వలపించినవాఁడవు వంకలాడ నేరుతువు
సులివాఁడిగోరఁ జెక్కునొక్కఁగనేల
కలికితనాల నింతఘనుఁడవు గాకుండితే
పొలసి పురసతులు భోగింతురా ॥ చెప్ప ॥

కొంగువట్టినవాఁడవు కూడ నిట్టె నేరుతువు
వెంగలితనాన నిన్ను వేఁడుకోనేల
సంగతి శ్రీవేంకటేశ జాణ వింతగాకుండితే
జంగిలిపదారువేలు చనవిత్తురా ॥ చెప్ప ॥ 485

---

1. వెన్నలు కొల్లలాడిన గొందులసందు, అని భావమేమో?

శుద్ధవసంతం

ఆకెకు నీకుఁ దెలుసు నామీఁదిసుద్దులెల్లా
చేకొని వాకుచ్చి నీతో చెప్పనేమున్నదిరా ॥ పల్లవి ॥

ఆయమునోఁకినమాఁట లప్పుడు నీ వాడఁగాను
కాయమెల్లఁ బులకించెఁ గరఁగీ చెలి
చాయనేసుకొని నీవు సంగడివారి మొరఁగి
మాయలనవ్వు నవ్వేవు మరి నేనేమందురా ॥ ఆకె ॥

కమ్మటి నీవు కడగండ్లనే చూడఁగాను
యెమ్మెలెల్లా నాడదా నీయింతి ఆవేళ
దిమ్మరేఁగి చెలులకుఁ దెలియకుండా నీవు
చిమ్మి పెదవిసన్నలు సేసేవు యేమందురా ॥ ఆకె ॥

అంటిముట్టి యాపెను నీ వరమఱపించఁగాను
నంటులెల్ల నడపదా నమ్మి యీడను
గొంటవై శ్రీవేంకటేశ కూడితి విందుకు నన్ను
జంటలఁ గొసరితేను సాదించే వేమందురా ॥ ఆకె ॥ 486

రేకు 1082 బౌళి

కానీవే అందుకేమి కల్లలేదు నాయందు
దానికేరా నీకల్లకు తతిరాదు యిఁకను ॥ పల్లవి ॥

అందుకేవే గొల్లెతా ఆసలివే కానుక
కందువవుర నీచేఁత కానుక గాదా
నిందలేల వేసేవే నెలఁతల నడుగవే
సందడిలో నేమనినా సాకిరులుగావా ॥ కానీ ॥

పుచ్చుకోవే లంచమూ పోరచికెమ్మోవితేనె
లచ్చనపలుసోఁకులే లంచములౌరా
పచ్చిసేయకువే నీవు పనులు గలవు మీఁద
పచ్చనిమోముకళలు పాలుగారీఁగదరా ॥ కానీ ॥

ఇయ్యకోవే వలపూ ఇవివో మచ్చికలు
ఇయ్యకొంటిరా తొల్లె ఇన్నిటా నిన్ను
ముయ్యకువే నీమెచ్చుముసిముసినవ్వులను
యియ్యెడ శ్రీవేంకటేశ యిదివో మెచ్చితిరా ॥ కానీ ॥ 487

సౌరాష్ట్రం

నేనేమీ నవఁజుమ్మీ నిన్నుఁ దొలుత
కానుకగా నిన్ను నీవే కాకుసేసుకొందురా ॥ పల్లవి ॥

తగవు లేమిటికి తప్పు నీయందున్నదా
నగఁగా నీతో నేను నగితిఁగాక
మగిడిమగిడి యాల మర్మము లెత్తుకొనేవు
వెగటుగ నీకునీవే వెల్లవిరు లౌదురా ॥ నేనే ॥

వొడఁబరచఁగనేల వొద్దంటినా నిన్ను
తడవఁగానే నేనుఁ దడవేఁగాని
బడల నీవే వోళ్లెల పట్టి చూచుకొనేవు
జడిసి నీపై నీవే సడివేసుకొందురా ॥ నేనే ॥

తమకించి కూడితివి దయగలవాఁడవౌదు
భ్రమయఁగా నేను నీతో భ్రమసితిని
అమర శ్రీవేంకటేశ అంటి నన్నుఁ గూడితివి
సమరతులలో గుట్టు సారె నాడుకొందురా ॥ నేనే ॥ 488

భైరవి

ఏఁటికి సిగ్గులువడే విందువంకఁ దప్పేమి
నాటకములన్నిటాను నావాఁడవే ॥ పల్లవి ॥

నీవు నామొగము చూచి నిలుచుండితేఁజాలు
చేవదేర రతిఁ జొక్కించినవాఁడవే
కైవశమై నాకు నీవు కలిగివుండితేఁజాలు
యీవలసినచన విచ్చినట్టివాఁడవే ॥ ఏఁటి ॥

చేసన్నల నామేను చేతనంటితేఁజాలు
వోసరించక మాయింట నున్నవాఁడవే
వేసరక నావునికి విచారించితేఁజాలు
పోసరించి నీవు నన్ను భోగించినవాఁడవే ॥ ఏఁటి ॥

పానుపుపై నీవు నన్నుఁ బాయకుండితేఁజాలు
నానారీతుల నాకు నంటువాఁడవే
కోనేటిశ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
యీనెలవులను బాసలిచ్చినట్టివాఁడవే ॥ ఏఁటి ॥ 489

ముఖారి

ఎంచితే నావల్ల నీకు నేమున్నది
మించి నేనే జాణనంటా మెచ్చేవుగాక ॥ పల్లవి ॥

మొక్కలాన నే నీతో మోమువంచుకుండఁగాను
చెక్కునొక్కి మోమెత్తి చిత్తగించితి
ఇక్కువ నింతమన్నించ నేమిబాఁతి నే నీకు
నిక్కి నీమంచితనమే నెరపేవుగాక ॥ ఎంచి ॥

పంతములు నే నీతో పచరించుకుండఁగాను
చింతదీర నవ్వు నవ్వి చేయివట్టితి
చెంత నన్నుఁ బొది గింతసేయ నేమిపని నీకు
కాంతలెడ [1] నీ పుణ్యము గట్టుకొంటిఁగాక ॥ ఎంచి ॥

ముందువెనకెంచి నీతో మొనవెట్టుకుండఁగాను
అంది నన్నుఁ గాఁగిలించి యాదరించితి
కందువ శ్రీవేంకటేశ కారణమేమి నీకు
సందడి యామేలే నీకు సాజమేమో కాక ॥ ఎంచి ॥ 490

కన్నడగౌళ

నేనేమి యెఱఁగను నీవే భారకుఁడవు
మోనముతో నున్నదాన ముచ్చట నీచేతిది ॥ పల్లవి ॥

తేనెగారేనీమాటలతేటలకే చొక్కితిమి
లోనుండిన నీమనసులోఁతెంతో
ఆనుక బాగాలిచ్చి ఆకు చేతఁబట్టుకొని
నానఁబెట్టుకున్నదాన ననుపు నీచేతిది ॥ నేనే ॥

చవులై నవినయాలసందడి నే మున్నారము
తవిలి నీరతులకు తతి యేదో
జవళిఁ బాదములొత్తి సంగడి మర్మాలు రేఁచి
తవన మీఁదెత్తితిని తగవు నీచేతిది ॥ నేనే ॥

యిచ్చిననీచవులయెమ్మెల నోలలాడితి
కచ్చుపెట్టి బోగములకత లేఁటివో
యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
యిచ్చలు నీ కాడితిని యిరవు నీచేతిది ॥ నేనే ॥ 491

---

1-కాంతలెడన్ + ఈపుణ్యము.

సామవరాళి

ఏల బూటకము సేసే వింతలోనను
    షోలికలన్నియును నీపొరుగున నున్నవి ॥ పల్లవి ॥

బత్తిసేయ నెఱఁగను పంతమాడ నెఱఁగను
    చిత్తమువచ్చినదాఁకా సేవ చేసేను
    హత్తి కాఁగిలించుమంటా నానలేల పెట్టేవు
    వత్తివలె నీమోవి వాడుదేరీ నిపుడు ॥ ఏల ॥

తలఁపు దెలియనోప తమకించి దూరనోప
    వలెనన్నప్పటిదాఁకా వద్ద నుండేను
    మొలకనవ్వులతోడ మొగమేమి చూచేవు
    కలిగినయలపెల్లా కాయముపై నున్నది ॥ ఏల ॥

కనుసన్న సేయఁజాల కమ్మటిఁ గొసరఁజాల
    తనిసినయందాఁకా తమిరేఁచేను
    ఘనుఁడ శ్రీవేంకటేశ కరగించి కూడితివి
    వెనకటిరతులెల్లా వెరగులై మించెను ॥ ఏల ॥ 492

రేకు 1083 మాళవిగౌళ

నయము గలుగనే నవ్వుదుగాక
    రయమునఁ జెనకితే రవ్వకోపునా ॥ పల్లవి ॥

సిగ్గువడివున్నచెలిఁ జెఱఁగువట్టి తీసేవు
    అగ్గలపుఁగొలువులో నందరుఁ జూడ
    నిగ్గులప్రౌఢవు నీవు నెలఁత యీపె బాలకి
    దిగ్గనఁ గొసరేవు ఇంతేసికోపునా ॥ నయ ॥

పంతాననుండినసతిఁ బచ్చిమాట లాడేవు
అంతరంగ మెఱఁగవు ఆసకాఁడవు
అంతటా సూ(శూ?)రుఁడవు నీ వాపె గడుముద్దరాలు.
చెంతలఁ బెనఁగితే నీచేతికోపునా ॥ నయ ॥

తలవంచుకున్నకాంతఁ దమకించి కూడితివి
చలమరి వవుదువు సాదించను
బలిమికాఁడవు నీవు భామ నీకుఁ జనవరి
వెలసె శ్రీవేంకటేశ వేసరఁగనోపునా ॥ నయ ॥ 493

ఆహిరి

నీవే యెఱిఁగి మన్నించు నీచిత్తము
కావరించి నిన్ను నంత గాసిఁబెట్టను ॥ పల్లవి ॥

కొసరఁగఁ దగుదువు కొంగువట్టఁ దగుదువు
విసిగేవోయని నిన్ను వేసరించను
రసికుఁడ విన్నిటాను రాజసము చెల్లు నీకు
వసమైనదాఁకా నీతో వాసు లెంచను ॥ నీవే ॥

పచ్చిసేయఁ దగుదువు పంతమాడఁ దగుదువు
రచ్చకెక్కేవని నిన్ను రాయడించను
వచ్చినట్టివత్తువు వలపు గలదు నీకు
మెచ్చినదాఁకా నీతో మేలమాడను ॥ నీవే ॥

నవ్వ నవ్వఁదగుదువు నాలిసేయఁ దగుదువు
జవ్వనపువాఁడవని సాదించను
యివ్వల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
చివ్వన నిందాఁకా నిన్నుఁ జెక్కునొక్కను ॥ నీవే ॥ 494

పాడి

నిండుకున్నది వలపు నీమీఁద
పంతివున్నవి ఆసలు పైపై నామీఁదను ॥ పల్లవి ॥

చెక్కులు నీవు నొక్కఁగ చింతలన్నియునుఁ బాసె
మొక్కులు నే మొక్కఁగాను మోహము నిండె
ఇక్కువలు గరఁగితి మిద్దరము నిందువంక
తక్కినమాటలేమియుఁ దడవకు మిఁకను ॥ నిండు ॥

చేయి నీవు వేయఁగాను చెమరించె దేహమెల్ల
చాయల నేఁ జూడఁగాను చవివుట్టెను
పాయపువేడుక లబ్బె పలుమారు నిందువంక
పోయినసుద్దులు వోసీ బొంకకుమీ ఇఁకను ॥ నిండు ॥

చెనకి నీవు గూడఁగ సిగ్గులు పొత్తుకు వచ్చె
తనిసి నే మెచ్చఁగాను తమివుట్టెను
యెనసితిమి శ్రీవేంకటేశుఁడ నేఁ డిందువంక
చనవులెల్ల నీదేరె సాదించకు మిఁకను ॥ నిండు ॥ 495

ఛాయానాట

ఔరా లెస్సాయను ఇట్టేకాదా
కేరికేరి మమ్మునింత గేలిసేసేవు ॥ పల్లవి ॥

చెలులతో నీవుసేసేచేఁత లాడుకొంటినో
చలపట్టి సారెసారె సాదించేవు
అలమి నాకొనగోర నంగము లంటితినో
చలివాసి బొమ్మలనే జంకించేవు ॥ ఔరా ॥

మేకులకు నీసతులమీఁదఁ బెట్టితినో
వాకుచ్చి వాదులకే వచ్చేవు నీవు
కైకొని నీమోవిమీఁద గంటిగాఁ జేసితినో
దీకొని తప్పకచూచి దిమ్మరేఁచేవు ॥ ఔరా ॥

నీతగిలి కాఁగిటిలో తప్పులువట్టితినో
నగుతానే నాతో నానలువెట్టేవు
జిగి నలమేల్మంగను శ్రీవేంకటేశుఁడ నీవు
మిగులఁ గూడితినంటా మెచ్చు మెచ్చేవు ॥ ఔరా ॥ 496

శంకరాభరణం

వలచినందుకు నిటువంటిదా గురి
తలపోసి నీమోము తప్పకచూచెను ॥ పల్లవి ॥

నగవులు నీతో నవ్వి నాటకములెల్లాఁ జేసి
తగుల నిన్నుఁ దిట్టెఁగా తరుణి
మొగమోటించుకలేక ముంగోప మెట్లఁ జూపె
వెగటుగ నాకిందుకు వెరగయ్యీ నేఁడు ॥ వల ॥

మచ్చిక నీపైఁ జల్లి మంచిమాటలెల్లనాడి
పచ్చినేసెఁగా నిన్ను పడఁతి
రచ్చల నవ్వేరనక రాజస మెట్లఁ జూపె
తచ్చి నీమోము చూచి దయవుట్టీ నాకు ॥ వల ॥

కన్నులనే సన్నసేసి కాఁగిట తిగించి కూడి
నిన్ను నలయించెఁగా నెలఁత
యిన్నిటా శ్రీవేంకటేశ యీడ నన్నుఁ గూడితివి
కన్నె నిన్ను యెట్టు మెచ్చె కతడిగె నిపుడు ॥ వల ॥ 497

రామక్రియ

వింతవారా నీకు వీరు విడువ వింకా గుట్టు
వంతుతోడ నంత తలవంచనేల యిఁకను ॥ పల్లవి ॥

చెవిలోన నీకు నేఁ జేసినవిన్నపములు
అవల నీసతులెల్లా నడిగేరు
తివిరి యానతియ్య దేవరవే వారితోడ
జవళినేల నవ్వేవు సారెసారె నిపుడు ॥ వింత ॥

సమ్మతించి నేను నీతో సన్నసేసినభావము
నెమ్మది విచారించేరు నీసతులు
తెమ్మలుగ నందరికి తెలుపవయ్యా నీసుద్ది
చిమ్ముచు నింతలోనేల సిగ్గువడ నీకును ॥ వింత ॥

లోలత నిన్నుఁ జేవట్టి లోనికిఁదీసినపని
ఆలించి వినేమనేరు అతివలెల్లా
లాలించి శ్రీవేంకటేశ లలి నన్నుఁ గూడితివి
పోలికలు చూపవయ్యా బొంకనేల యిఁకను ॥ వింత ॥ 498

రేకు 1084 శుద్ధవసంతం

మాపుదాఁకా యేమనిన మంకుదేరేవా
తీపులు చల్లుక నీతోఁ దెగడేదే నాపని ॥ పల్లవి ॥

చలము సాదించరాదు సణఁగులఁ దిట్టరాదు
వలచినదాన నిన్ను వంచుకోరాదు
తెలివిదెచ్చుక నీతో తేటలుగా నవ్వునవ్వి
కెలసి ఇచ్చకమాడి గెలిచేదే నాపని ॥ మాపు ॥

పెనఁగఁదగదు నీతో బిగువు చూపఁదగదు
నని చినదాన నీతో నాలి దగదు
మనసువట్టుక నీమర్మములు సోఁకించి
చనవు సేసుకుండేది సంగతైననాపని ॥ మాపు ॥

పొందుసేయ కిఁకఁబోదు భోగించి మెచ్చకపోదు
విందువంటిదాన మాట వినకపోదు
కందువతోడుత శ్రీవేంకటేశ నేఁ గూడితి
యిందునే పాయకవుండి యెనసేదే నాపని ॥ మాపు ॥ 499

ఆహిరి

నావొళ్లఁ గల్లలేదు నామాట నాకుఁ జెల్లె
ఆవేళ నీకుఁ దీరదాయఁజుమ్మీ విభుఁడా ॥ పల్లవి ॥

పవళించి చంద్రగావిపచ్చడముసు(సుఁ?)గుతో
జవళి నాపెయు నీవు సరినుండఁగా
ఇవల నప్పుడు నిన్ను యెరుకసేసుకోఁ; గాని
తివిరి వచ్చితిఁజుమ్మీ దేవరవద్దికిని ॥ నావొ ॥

తలపీడి మొలపీడి దంతపుటోవరిలోన
అలమినాపెయు నీవు నట్లుండఁగా
పలికించి నిన్నప్పుడు పచరించనైతిఁ: గాని
నిలిచి చూచితిఁజుమ్మీ నీమొగము నేను ॥ నావొ ॥

చిత్తజకేలిని మీఁరు సిగ్గువిడిచుండఁగా
హత్తి శ్రీవేంకటేశ నిన్నలమితిని
పొత్తులఁ గూడితి విట్టె పూఁచి పేరు చెప్పఁ; గాని
తత్తరించనైతిఁజుమ్మీ దండనే వుందానను ॥ నావొ ॥ 500

ఆహిరినాట

నీవేల లేదనేవు నీసతితోను
కావరించి పదుఁగాక కాదనక్కు మిఁకను ॥ పల్లవి ॥

మచ్చికలు చల్లుచు నీతో మాటలాడి నీకు నేఁడు
ఇచ్చకము నెరపదా ఇందాఁకను
అచ్చమైనఆపెనేపో అన్నసుద్దులెల్లా నేను
ముచ్చటగా మరియేల మూసిదాఁచే విపుడు ॥ నీవే ॥

పీదెమిచ్చి నీతోను వేసాలు నేసుకొంటా
యీడ నిట్టే వుండదా యిందాఁకను
యేడనైనాఁ గాని యాపె సిన్నిటా నేఁ దిట్టితిఁబో
[1] ఆడని(నీ?)వాదు లేఁటికి అణఁచేవు యిపుడు ॥ నీవే ॥

సరి నిన్నుఁ గాఁగిలించి సరసములాడుకొంటా
యిరవుకొని వుండదా ఇందాఁకను
అరిది శ్రీవేంకటేశ ఆపెనేపో కొసరితి
గరిమ మమ్మేల వొక్కటినేసే విపుడు ॥ నీవే ॥ 501

కేదారగౌళ

ఇంక నీవు వెలవకు యీడ నే నుందానను
పొంకపునీగుణములే పోదినేసె నిన్నును ॥ పల్లవి ॥

నిన్నుఁ జేత ముట్టితేను నీవేల వులికేవు
పన్నినమరుచిగురుబాణమా యిది
యెన్నిక యీచేఁతలను యెవ్వతె బెదరించెనో
ఇన్నిటా నీయలవాటు ఇంతనేసె నిన్నును ॥ ఇంక ॥

1. ఆడ జరిగిననీవాదులని యర్థమేమో? ఆడనివాదు లంటే అంతగా రుచిలేదు.

దగ్గరఁ గూచుండితేను తత్తరించనేల నీకు
అగ్గలపునీపాలిటిఅత్తనా నేను
దిగ్గన యెవ్వతెచే సాదింపులఁబడి వచ్చితో
యెగ్గుల నీమొగమోటే ఇంతసేసె నిన్నును ॥ ఇంక ॥

ఇట్టె నారతిలోన యేల బుసకొట్టేవు
గట్టిగా సాముచేసేటిగరిడా యిది
పట్టుక యెవ్వతె నిన్ను పంతమిచ్చి కూడెనో
యెట్టు శ్రీవేంకటేశుఁడ యెమ్మెసేసె నిపుడు ॥ ఇంక ॥ 502

పాడి

నాకే సతమైతే మాతో నవ్వవయ్యా
కాకుసేసేచేఁతలైతే కాఁక [1]కోపమయ్యా ॥ పల్లవి ॥

సంగడిఁ గూచుంటిమంటా సరుస నిందలాడేరు
రంగుగా నింత మాకు రవ్వ యేలయ్యా
యెంగిలిసేసేవు మోవి యెక్కడనుండో వచ్చి
వుంగిటితరితీపుల కోపమయ్యా ॥ నాకే ॥

సరసమాడితిమంటా సతులెల్లా నేఁకరేరు
తరఁగు మొరఁగులైతే తగులేలయ్యా (?)
కరఁగించేవు మనసు కడలఁ దనిసివచ్చి
పొరుగుపోరచులైతే పొందుకోపమయ్యా ॥ నాకే ॥

కూడితి నన్ననంటా కొమ్మలెల్లా గొణఁగేరు
ఆడికలకు లోనైతి మదిగోవయ్యా
వేడుక పుట్టించేవు శ్రీవేంకటేశ నేఁడు వచ్చి
తోడుత నలసితిమి దొమ్మి కోపమయ్యా ॥ నాకే ॥ 502

---

1 కాఁకపు + ఓపమయ్యా.

కన్నడగౌళ

నీవే విచ్చేసి చూడు నెలఁతభావములెల్లా
. భావించఁగలమా అయ్య పడఁతిలోవలపు ॥ పల్లవి ॥

తలపోఁతలనె కొంత తమకములనె కొంత
మలసి పొద్దుజరపె మగువ
అలసేయంతటిలోనె అతివమీఁద నొరగె
బలిమి నింతటిమీఁద పట్టరాదు వలపు ॥ నీవే ॥

యెడమాటలనె కొంత యెదురుచూపులఁ గొంత
అడరి ధీరత నుండె అతివ
జడిసి పానుపుమీఁద చల్లఁగాఁ బవ్వళించె
విడువక ఇఁక విన్నవించరాదు వలపు ॥ నీవే ॥

నీపై పాటలఁ గొంత నిక్కలలనే కొంత
తీపులఁ గాచుకుండెను తెఱవ
యేపున శ్రీవేంకటేశ యింతలో నీపెఁ గూడితి
యేపొద్దూఁ దనివిలేదు యేమిటాను వలపు ॥ నీవే ॥ 504

రేకు 1085 సామంతం

మానవయ్యా యింతేసి మంకుఁదనము
కోనల[1]చూపులలోని కొసరేఁటికిఁకను ॥ పల్లవి ॥

కన్నులనే మెచ్చి మోవిఁగప్పురము లియ్యఁగాను
కన్నెనేల తిట్టేవు కాతరించి
వున్నతి వెంగెమాడెనా వూడిగము నేసెఁగాక
పన్ని నీకు నేఁ డింత భయమేఁటికిఁకను ॥ మాన ॥

---

1. 'కోణ' శబ్దభవమా?

నెలవుల నవ్వు నవ్వి చెక్కులిట్టె నొక్కఁగాను
చెలినేల జంకించేవు చిత్తగించి
వెలయ రట్టునేసెనా వేడుకలు చూపెఁగాక
కొలఁదిమీరఁగ నీకు కోపమేఁటికిఁకను ॥ మాన ॥

కందువలు చూపి నిన్నుఁ గాఁగిలించుకొనఁగాను
ఇందుముఖినేల మించే విచ్చగించి
సందడి నీపైఁ జేసెనా చనవుమెరఁసెగాక
అంది శ్రీవేంకటేశుఁడ అలపేల ఇఁకను ॥ మాన ॥ 505

పాడి

ఊరకే చక్కఁజాడతో నుండనీరాదా
సారె సారె మమ్మునింత జాగుసేయవలెనా ॥ పల్లవి ॥

కన్నసతులనెల్లా నాకాళ్లకు మొక్కించేవు
పన్ని నీవే మొక్కించుక బతుకరాదా
ఇన్నేసిరవ్వలు నేసి యేల వుప్పటించేవు
కన్నెలము మమ్మునింత కాకుసేయవలెనా ॥ ఊర ॥

అండనున్నవారిచేత నాకుమడిచిప్పించేవు
దండిగా నీవే అందుక తనియరాదా
బందునేసి మమ్మునేల పరచేవు ఇటువలె
నిందుసిగ్గులవారము నేఁడె ఇంతవలెనా ॥ ఊర ॥

వుమ్మడిసవతులచే నూడిగాలు సేఇంచేవు
ఇమ్ముల నీవే మెచ్చి ఇయ్యకోరాదా
నమ్మించి శ్రీవేంకటేశ నన్ను నిట్టె కూడితివి
సమ్మతించి నీవారము సంతోసించవలెనా ॥ ఊర ॥ 506

లలిత

ఎవ్వరిఁ బొగడుదుము యెంతని నేము మెచ్చేము
బువ్వముల కిచ్చుడా(లా?)య భోగపుమీకతలు ॥ పల్లవి॥

జక్కవచన్నులమీఁద సరులు నీ వంటఁగాను
చెక్కులెల్లాఁ జెమరించె చెలియకు
యెక్కడికెక్కడ సూత్ర మెంతనేరిచె మరుఁడు
పుక్కిటిపురాణమాయ పొందులమీచేఁతలు ॥ ఎవ్వ ॥

తుమ్మెదనెరులకొప్పు దొడ్డగా నీవు వెట్టఁగ
కమ్మి మేను పులకించె కాంతకు
యెమ్మెల నేడకునేడ యెంతనేసీ యీవలపు
వుమ్మడినే దిగుపారె వొళ్ళనే మీజాడలు ॥ ఎవ్వ ॥

గక్కన కంబుకంఠము కాఁగిలించుకొనఁగాను
ఇక్కువలు గరఁగెను ఇంతికి
ఇక్కడ శ్రీవేంకటేశ యెంతకెంత మీనేర్పులు
వక్కణలలేకలాయ వాడిక మీరతులు ॥ ఎవ్వ ॥ 507

సౌరాష్ట్రం

తలఁచినపనులెల్ల దక్కె నీకును
సిలుగులన్నియు మాని చెలరేఁగవయ్యా ॥ పల్లవి ॥

ఆకె నీతో మాటలాడె అన్నియునుఁ దలకూడె
యేకచిత్తమున నుండు మిఁక నీవు
రాకుండఁగ నిందాఁక రవ్వగా నలిగితివి
యీకడ నీతొడ యెక్కె నిఁక నవ్వవయ్యా ॥ తలఁ ॥

యిదె నీపైఁ జేయివేసె ఇచ్చకములెల్లాఁ జేసె
యెద నిమురుకవుండు మిఁక నీవు
అదనఁ బిలువదంటా అసురుసురై తివి
చదురులమాటలాడె చనవియ్యవయ్యా. ॥ తలఁ ॥

నెయ్యమునఁ గాఁగిలించె నేరుపుల మోవి యిచ్చె
యియ్యకోలు నేసుకొమ్మా యిఁక నీవు
పయ్యదంటి కొసరితి భామను శ్రీవేంకటేశ
తియ్యఁగానే నిన్నుఁ గూడె [1]తిరముకోవయ్యా ॥ తలఁ ॥ 508

## శ్రీరాగం

తడఁబాట్లాయఁ బని తప్పులోరుచుకోవయ్య
అడరి నాసొమ్మువునీవంటా నేనుంటిని ॥ పల్లవి ॥

వొలిసి యెవ్వతెనో నీ వూరకే చింతించఁగాను
మలసి నడుమ నేను మాటాడించితి
కులికి నీచిత్తానకు కోపముగాదుగదా
అలరి నాకే వలతువంటా నేనుంటిని ॥ తడఁ ॥

పట్టి యెవ్వతోచన్నులపైఁ బరాకై నీవుండఁగ
గుట్టున నుండక నిన్నుఁ గొంగువట్టితి
వెట్టియైననీభోగానకు వేసటగాదుగదా
నట్టుకొన్న నీచేఁతలు నాకంటా నేనుంటిని ॥ తడఁ ॥

సొరిది నెవ్వతెపైనో చూపువెట్టుకుండఁగాను
గరిమ నిన్నుఁ గాఁగిటఁ గలసితిని
అరుదై శ్రీవేంకటేశ అంతెవచ్చెనా నీకు
పరువపునీమాటపట్టు నమ్మివుంటిని ॥ తడఁ ॥ 509

---

1. తిరముకొనుట = స్థిరముకొనుట, బలిగొనువంటిది.

సాళంగనాట

సారెకు నానవెట్టకు సంగతి గాదు
మారుమాట నే నేర మర్మ మింతేకాని ॥పల్లవి॥

చిత్తమెట్టున్నదో నీకు సిగ్గువడుందాన నేను
అత్తి నీవూ నాపెఁ గూడినది చూచితి
యిత్తల మగవాఁడవు యేమైనా నమరు నీకు
రుత్తనవ్వే వచ్చి నాకు రోసమేమీ లేదు ॥సారె॥

తగవెట్టున్నదో నీకు దయవుట్టీ నాకైతే
తెగువతో మీఇద్దరిదిక్కునుఁ జూచి
అగపడ్డదొరవు నీ వన్నియుఁ జెల్లు నీకు
మొగమోటే మించె నాకు మోసమేమీ లేదు ॥సారె॥

వెఱగెట్టాయనో నీకు వేడుకవుట్టెను నాకు
నెఱి మీభావ మెఱిఁగి నేఁ గూడితి
వెఱపేమీ లేదు శ్రీవేంకటేశుఁడవు నీవు
తఱి నామతి గరఁగె తక్కువేమీ లేదు ॥సారె॥ 510

రేకు 1086 శ్రీరాగం

నాయందుఁ గడమలేదు నమ్మించినవాఁడవు
చెయిమీఁదుగా నెట్టునేసినా నీచిత్తము ॥పల్లవి॥

మొక్కలాన నే నిన్ను మంచి యాడినమాఁటకు
మొక్కితిఁ బంతమిచ్చితి ముందుముందుగా
కక్కసించనోప దయగలిగినప్పుడు నీవే
మక్కువనేసి నన్ను మన్నింతువుగాక ॥నాయం॥

చలపట్టి నే నిన్ను జంకించినయందుకు
చెలఁగి నవ్వు నవ్వితి సెలవుగాను
బలిమికాయఁగనోప బత్తిగలప్పుడే నీవే
పిలిచి కాఁగిట నించి పెనఁగేవుగాని ॥ నాయం ॥

ఆసపడి నిన్నుఁ గూడి అలయించినయందుకు
వాసితో మోవి యిచ్చితి వన్నెలుగాను
యీసుదీరె శ్రీంవేకటేశ నన్నుఁ గూడితివి
రాసికెక్క నింకా నీవే రక్షించేవు గాని ॥ నాయం ॥ 511

## భైరవి

సరసములలోనికి జగడాలేల
బెరసి యంతగలితే పెనఁగఁగరాదా ॥ పల్లవి ॥

మోహమునఁ జెలి నీపై మొనగో రంటించెఁగాక
సాహసాన నాపె నీతోఁ జలపట్టెనా
వూహించ కిందుకుఁగాను వూరకే మారుమోమేల
సోహగా మొకామొకాలు చూచుకొనరాదా ॥ సర ॥

గట్టినేసి యాపె నిన్ను గందమున వేసెఁగాక
గుట్టుతోడ నీమీఁదికుచ్చితములా
వట్టినొప్పు లిందుకుఁగా వహించుకో నీకేల
చుట్టపువరుస మించ జోడై వుండరాదా ॥ సర ॥

కందువచేఁతలు చూపి కాఁగిట బిగించెఁగాక
అంది నీతో బలిమి దా నట్టె సేసెనా
ఇందుకుఁగా శ్రీవేంకటేశ బుసకొట్టనేల
పొందుగాఁ గూడితి రిట్టె భోగించరాదా ॥ సర ॥ 512

దేశి

ఏమైనా [1] నను యెదురాడ నేను
  దీమసంబుతోఁ దెలిసితి నేను ॥ పల్లవి ॥

యెక్కుడుమాట నే నేమనియాడిన
  వెక్కసురాలని విసుగుదువు
  మొక్కుచు నీపాదములు చూచుక ఇటు
  వొక్కట నూరకయుండెద నేను ॥ ఏమై ॥

పంతంబున నేఁ బైకొని నవ్విన
  అంతరట్టడని యాడుదువు
  చెంత నూడిగము సేసుక నీకిట్టె
  చింతదీరి కడుచెలఁగెద నేను ॥ ఏమై ॥

అలమి నిన్ను రతి నలయించినను
  బలిమితోడిదని పలుకుదువు
  యెలమిని శ్రీవేంకటేశ్వర కూడితి
  మెలఁగినట్లనే మెచ్చెద నేను ॥ ఏమై ॥ 513

వరాళి

నీకునీకే కొంకనేల నెలఁత నిన్నేమనీని
  చేకొని నేదదేరిచి చెక్కునొక్కరాదా ॥ పల్లవి ॥

సిగ్గుతోడ నున్నది చెలి నీవన్నమాటకు
  యెగ్గువట్టియున్న దలయించినందుకు
  నిగ్గుదేరుచున్నది నీవు చెనకినందుకు
  బిగ్గఁ గాఁగిలించి కడుఁబెనఁగఁగరాదా ॥ నీకు ॥

---

1 ఏమైనాన్ + అను.

మోనముతో నున్నది మొక్కళపునీచేతకు
అనవెట్టుకున్న దేమోఅనినందుకు
పూనిపట్టుకున్నది పొందేటినీకతలకు
కానుకగా నీవే వచ్చి కలయఁగరాదా ॥నీకు॥

పఱుపుపై నున్నది పంతములాడినందుకు
తఱిఁ గెరలుచున్నది తక్కినందుకు
యెఱిఁగి శ్రీవేంకటేశ యింతలో నీవు గూడితి
జఱసి సరసముల చనవియ్యరాదా ॥నీకు॥ 514

దేసాళం

అందుకై తే దోసములేదంటి మింతే నేము
సందడిజాణవు నీవు సమ్మతించుకొందుగా ॥పల్లవి॥

రేయిఁబగలును [1]నీరేపల్లెలోచేఁతలు
ఆయాలు మోవఁగా నిన్ను నాడెఁగా చెలి
యీయెడనై తే నేము యింతేసికి నోపము
పాయపువాఁడవు మాటఁబడ నోపుదువుగా ॥అందు॥

గుఱుతై నయట్టినీకొలనిలోచేఁతలు
వెఱవక నిన్ను వెలివేసెఁగా ఆపె
తెఱవల మింతేసితెగువకుఁ జాలము
[2]నెఱతనీఁడ విన్నిటా నీకు నవ్వవచ్చుగా ॥అందు॥

యింపుమీర నాఁటదాని నెత్తుకవచ్చిననింద
ముంపున నీమీఁద నిట్టె మోపెఁగా ఆపె
జంపుల శ్రీవేంకటేశ సరి నిన్నింత నేఁ జేయ
అంపక నన్నుఁ గూడితి వన్నియు నేర్తువుగా ॥అందు॥ 515

1. 'రేపల్లెలో చేఁతలు' అనుట సహజము. వ్యస్తపదములలోగూడ ఇట్లు గూర్చుట యతి నిర్బంధమా? 2. 'నెఱతనము + ఈఁడు' కావచ్చు.

హిందోళవసంతం

ఇప్పుడు విచ్చేసితి వేమందు నే నీఁక
కప్పినమొగమోటముగలదాన నేను ॥ పల్లవి ॥

యెదురుచూచితి నీకు నెప్పుడు వత్తువోయంటా
నిదుర గంటికి రాక నిన్ననెల్లాను
వెదకి తెమ్మంటి నిన్ను వెలదులనెల్లాఁ బంపి
వుదుటున నెవ్వతింట నుందువోయంటాను ॥ ఇప్పు ॥

పేరుకొని పిలిచితి పెద్దవాస(కు?)నను నిన్ను
కూరిమితో నిట్టె పలుకుదువంటాను
వారివీరి నడిగితి వలసినచోట్లను
ఆరగించి పవ్వళించేయట్టినీఇక్కువలు ॥ ఇప్పు ॥

దేవరకే మొక్కకొంటి దిక్కులకుఁ జేయెత్తి
కావించి నిన్నుఁ గన్నులఁగన్నదాఁకాను
శ్రీవేంకటేశ నన్ను జిగిఁ గూడితివి నేఁడు
తావులనే నెలకొంటి దక్కుదువంటాను ॥ ఇప్పు ॥ 516

రేకు 1087 దేశాక్షి

సతి నిన్ను గెలిచెను జవ్వనపుగరిడీలో
మతిలోన మెచ్చిమెచ్చి మన్నించు రమణుఁడా ॥ పల్లవి ॥

కనుసూటివలపూ కాంతచూచినచూపు
కొనకెక్క మరుఁడదె గురులేసెను
మొనకత్తిసామూ ములువాఁడికొనగోరు
పెసఁగి చెక్కులనొత్తి పేరెమువారెను ॥ సతి ॥

చేసూటివలపూ చెలికాఁగిలించినది
బాసతోనే కాయజుఁడు పందెమాడెను
మూసిదింపుమొరఁగూ ముంచినపయ్యదకొంగు
ఆసలు నీకుఁ జూపి ఆయాలు రేఁచెను ॥ సతి ॥

మొగసూటివలపూ మోహపురమణినవ్వు
తగవుతో మదనుఁడు దారగట్టెను
అగపడి శ్రీవేంకటాధిప నీవు గూడితి
జగడమింతయుఁ దీరి చనవుచేకొనెను ॥ సతి ॥ 517

బౌళి

తెలుసుకోవయ్య నీవే దిష్టమిది మోహము
కలకాలమును నీపైఁ గలది నామోహము ॥ పల్లవి ॥

ఆయములు గరఁగేటిఅదివో మోహము
చాయలకు లోనైనదే సరిమోహము
పోయినానుఁ బోనీకపొదిగినది మోహము
యీ(యే?)మెడ నెగ్గులుసిగ్గు లెంచనిదె మోహము ॥ తెలు ॥

మంతనమె యేపొద్దు మరిగినది మోహము
దొంతిపులకల తొప్పఁదోగే(దీ?) మోహము
వింతలేనినవ్వులవేడుకలే మోహము
బంతిరతుల నేపొద్దుఁబరగుటే మోహము ॥ తెలు ॥

కన్నులఁగనినప్పుడు కాఁగిలించుటే మోహము
వన్నెలకు మాటగడవని(దీ?)మోహము
ఇన్నిఁటాను శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
వున్నతి నలుగ కిట్టె వుండుటే మోహము ॥ తెలు ॥ 518

లలిత

ఏలినవారికి నెల వేమిసేసినా
నాలి నాచేఁతలెల్లాను నవ్వుసేసుకొమ్మీ ॥ పల్లవి ॥

తాలిమిలేనిదాన తమకించి నిన్ను నిట్టె
వేళతోనే రావనుచు వెంగెమాడితి
నీలాగు లెఱఁగక నేరములెల్లా నెన్నితి
వోలవేయ కిఁకనన్నీ నోరుచుకొమ్మీ ॥ ఏలి ॥

చపలచిత్తపుదాన సడిఁబడ్డకోపాన
కపటములెల్లాఁ జూచి కల్లలాడితి
వుపమలనే వంచక వొరసితి జరసితి
నెపములెంచక యిఁక నెయ్యమే నిలుపుమీ ॥ ఏలి ॥

చనవుతోడిదాన సారెసారె నిట్టె
కనుఁగొని కనుఁగొని [1]కలదాడితి
యెనసితి శ్రీవేంకటేశ నేవింతటిలోనె
తనిసితనిసి నాతో దయివారుమీ ॥ ఏలి ॥ 519

శంకరాభరణం

నేరమెల్లా నావొళ్లిదే నీవేమిసేతువు
దారిదప్పి సూటిఁబడ దరిచేరే మిదివో ॥ పల్లవి ॥

సేసవెట్టినవాఁడవు చేకొనేవుగాక యిఁక
వేసరేవా యిందువంక వీడీనా పొందు
ఆసపడి తమకాన అలసినదానఁ గాన
వేసినట్టేవేసి నిన్ను వేఁడుకొనే నిదివో ॥ నేర ॥

1. కలది + ఆడితి.

వలపించినవాఁడవు వద్దనే వుండేవుగాక
తలఁగేవా యింతలోనే తప్పె(ప్పీ?)నా మాట
బలిమి నీచనవునఁ బరగినదానఁ గాన
పిలిచి నిన్ను జంకించి ప్రేమచల్లే నిదివో · ॥ నేర ॥

అంటికూడినవాఁడవు ఆదరించేవుగాకిట్టె
జంటవాసేవా మొగచాటున్నదా
యింటనే శ్రీవేంకటేశ యిరవైనదానఁ గాన
దంటనై నీసరసాన దక్కితి నే నిదివో ॥ నేర ॥ 520

రామక్రియ

ఓపినదానఁ గాను వూరకే సుద్దులకెల్లా
నీపాదముసేవసేసి నిలుచుంట చాలదా ॥ పల్లవి ॥

మొక్కుచు నీకొకమాఁట మొన్ననే విన్నవించనా
పక్కన నన్నేల వాదఁబరచేవంత
చిక్కినవారిపై నేల చేఁతలెల్లాఁ జేసేవు
వొక్కపై నీవారమని వుండుటిది చాలదా ॥ ఓపి ॥

వేమారు నే నిన్ను వేఁడుకొననా ఇందాఁక
నామువార నాతోనేల నవ్వేవంత
దీమసములేనివారిఁ దెగి యేలపరచేవు
ప్రేమతోడ నీతోఁ గొంత పెనఁగుట చాలదా ॥ ఓపి ॥

కందువలంటుచు నిన్నుఁ గాఁగిలించుకొననా
అందరిలో నన్ను మెచ్చే వప్పటి నీవు
విందువెట్టి యిట్టె శ్రీవేంకటేశ కూడితివి
పందెమాడి నీమాటలో పరగుట చాలదా ॥ ఓపి ॥ 521

మాళవిగౌళ

తలవంచనేఁటికి దండనున్నవారిఁ జూచి
వెలయఁగ నేమెల్లా వింతవారమా ॥ పల్లవి ॥

సిగ్గువడ్డదానవు చింతతోటిదానవు
యెగ్గులుఁ దప్పులు నిఁకనేఁటికమ్మా
దగ్గరి యాతఁడేమైనాఁదడవినా చేఁతలకు—
నగ్గమైతి విఁక నీకు నంకెలాయనమ్మా ॥ తల ॥

జవ్వనపుదానవు సతమైనదానవు
యెవ్వరిబుద్దులు వినవేఁటికమ్మా
పువ్వుల వేసి యాతఁడు పూఁచి సన్నలునేయఁగ
నవ్వితివి నీకు నిఁక ననుపాయనమ్మా ॥ తల ॥

మంతనపుదానవు మాటలోనిదానవు
యెంతసేసినాఁ జెల్లె నేమమ్మా
చింతదీర నింతలోనె శ్రీవేంకటేశుఁడు గూడె
అంతరంగమెల్లా నిండె ననువాయనమ్మా ॥ తల ॥ 522

రేకు 1088 ముఖారి

రమ్మనవు పొమ్మనవు రాజసము నెరపేవు
తెమ్మలుగా నవ్వునవ్వి తెలుసుకోవే ॥ పల్లవి ॥

చెప్పుడుమాటలు విని, చెలువుఁడు నీకిచ్చిన—
కప్పురమేఁటికి నీకుఁ(వు?) గాదనేవే
దప్పిదేరేమోవితోడ తలవంచుకొని యాతఁ—
దప్పటనుంటియు నున్నాఁ డది గదవే ॥ రమ్మ ॥

ఇంగితాకారాలు చూచి యీతఁడు వెట్టినతమ్మ
యెంగిలి యనుచు సారెనేల మొక్కేవే
వుంగరము చేతికిచ్చి వూరకే యానలువెట్టి
అంగవించి నిన్నుఁబాయఁ దదిగదవే ॥ రమ్మ ॥

వింతవాసనలతో నీవిభుఁడు కొంగువట్టఁగ
ఇంతలోఁ దప్పించుకొంటానేల లోఁగేవే
అంతటిశ్రీవేంకటేశుఁ డాతఁడే నిన్నిటు గూడె
అంతరంగమెల్లాఁ జెప్పె నదిగదవే ॥ రమ్మ ॥ 523

ఆహిరి

మంచిదాయ మేలుమేలు మాకు నది పరిణాము
అంచెల నాకె నిన్ను ఆదరించెనా ॥ పల్లవి ॥

చెలఁగివున్నాఁడవు చిమ్ముఁగళలతో నేఁడు
మలసి నీతో నాపె మాటలాడెనా
సొలసేవు కెలసేవు సుమాళముతో నప్పటి
కులికి నీపై నాపె గురుతులు నించెనా ॥ మంచి ॥

ఇందరికి నీవేళ యేమడిగిన నిచ్చేవు
విందువలె నాపె నీకు విడెమిచ్చెనా
పందేలకే పెనఁగేవు పారిపారి మాతోను
సందడించి తనమోవి చవిచూపెనా ॥ మంచి ॥

గక్కన నన్ను మన్నించి కాఁగిలించి కూడేవు
పుక్కటగాక నీ కాపె బుద్ధిచెప్పెనా
యిక్కువతో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వక్కణించి నీకుఁ జెప్పి వరుసకు నంపెనా ॥ మంచి ॥ 524

దేవగాంధారి

సారపునవ్వులతోడి సటకాఁడా
పోరచిపొరుగులనే బుద్ధిచెప్పరా ॥ పల్లవి ॥

చలము సాదించేనంటే చవి చాల దించుకంత
వలపు చల్లేనంటే వాసి చాలదు
బలిమి చూపేనంటే పాడిపంతము చాలదు
యెలమి నీతోడిపొందు లెట్టునేతురా ॥ సార ॥

సిగ్గుతోడ నుండేనంటే సెలవులే దెవ్వరికి
దగ్గరేనంటే దంటతనము లేదు
వెగ్గళించేనంటే నీతో విరసమేమియు లేదు
యెగ్గుదప్పులేక సేవ యెట్టునేతురా ॥ సార ॥

మఱఁగున నుండేనంటే మనలో భేద మెఱఁగ
జఱసేనంటేను నీసర వెఱఁగ
గుఱిగా శ్రీవేంకటాద్రిగోవిందరాజ నేఁడు
యెఱుకతోఁ గూడితివి యిఁకనేమినేతురా ॥ సార ॥ 525

మధ్యమావతి

పరాకు సేయకురమ్మ పడఁతులాల
సరాగాన బాగాలీరే సతులకుఁ బతికి ॥ పల్లవి ॥

మాటలఁ దేటలు చల్లి మగువలిద్దరిమీఁద
కూటువఁ బాదాలు చాఁచి కొలువున్నాఁడు
చాటుచు నవ్వులు నవ్వి సన్నలు కన్నులఁ జేసి
వేఁటలాడీ వలపు గోవిందరాజు లిదివో ॥ పరా ॥

వొత్తగిలి పానుపుపై నుంగరపువేళ్లు చూపి
గుత్తపుగుబ్బలంటఁగఁ గోరుచున్నాఁడు
పొత్తుల మోవులు చూపి పూవులవాట్లు వేసి
విత్తిఁ దమకము గోవిందరాజు లిదివో ॥ పరా ॥

లోననే యేపొద్దునుండి లోకమెల్లాఁ దెలుసుక
మానినులకాఁగిళ్ళ మరిగున్నాఁడు
నానినచెమటలతో నంటుశ్రీవేంకటేశుఁడై
పీనులలో మాటాడీ గోవిందరాజు లిదివో ॥ పరా ॥ 526

## భైరవి

ఏమి నేసీనని నీవు యేలడిగేవు
కామించినచెలి నిట్టె కరుణించు మిపుడు ॥ పల్లవి ॥

నీమీఁదిచిత్తమున నిద్దుర కంటికిరాక
కోమలి కత చెప్పించుకొంటా నున్నది
దోమటితో మదనునితుమ్మిదబలములకు
దామెనగాఁ గొప్పు విడిదల నేయుచున్నది ॥ ఏమి ॥

చెలుల నీకడకంపి చిమ్మెటియాసలతోడ
కెలన నడిమివాకిట నున్నది
పొలసి తనచూపులు పూవులబాణములకు
బెళకులు లేకుండాఁ బెనఁబెట్టుకున్నది ॥ ఏమి ॥

దగ్గర నిన్ను రప్పించి తమకము రెట్టించఁగ
సిగ్గుతోడ విన్నపాలు సేయుచున్నది
యెగ్గుదీర శ్రీవేంకటేశ నేఁడె కూడితివి
నిగ్గులను నవ్వుకొంటా నెలవున నున్నది ॥ ఏమి ॥ 527

ఆహిరినాట

వద్దు వద్దు వేగిరాలు వనితతోను
పొద్దువొద్దు నీనిజము పొదిగొంటేఁ జాలును ॥ పల్లవి ॥

కలువరేకులవంటికన్నులకలికి నీమై
సొలసి సొలసి చూచి సోదించీని
కొలఁదిమీఱఁగ నీకుఁ గోపమేల తాపమేల
మొలచి నీవొళ్ల కల్ల మోవకున్నఁజాలును ॥ వద్దు ॥

నాలికప్పురమువంటినవ్వులచెలియ నేఁడు
లోలత నీమనసు దెలుసుకొనీని
వోలి నీకు నింతలోనె వొట్లేల సత్యాలేల
తాలిమితో నీతగవు తప్పకున్నఁజాలును ॥ వద్దు ॥

తీగెలవంటిచేతులతెఱవ కాఁగిట నించి
ఆగతి నిన్ను రతుల నలయించీని
వేగిరమేఁటికి శ్రీవేంకటేశ యిటువలె
బాగుగాఁ బెనఁగి మీరు పాయకున్నఁజాలును ॥ వద్దు ॥ 528

రేకు 1089 ముఖారి

ఏలయ్య మాకు నిది యెంతదోసము
యీలీలఁ దప్పకచూచే వెఱఁగనివారమా ॥ పల్లవి ॥

పగటు గోపికలతోఁ బరచవై వుంటివని
జగమెల్ల నిన్నే చాటేరు
వెగటై నీపేనులనే వినవయ్య వీదివీది
నిగిడి నేఁడు గొత్తగా నేము గడించేమా ॥ ఏల ॥

యిక్కువ రాచకూఁతురు నెత్తుకవచ్చితివని
 యెక్కుడ చూచిన నీపై నిదే సుద్ది
నిక్కము దెలుసుకొంటే నీవుచేసినచేఁతలే
 వుక్కున మాకెంతగుండె వూరకే మిమ్మాడను ॥ఏల॥

మించుఁదామెరలోసతి మెడఁగట్టుకొంటివని
 యెంచేరు కొలువులోన యిదే దిష్టము
కొంచక శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
 మంచముపైఁ గళదేరీ మఱి యేఁటిపనులు ॥ఏల॥ 529

శ్రీరాగం

నిండునాపాయము నేఁడు నాచేతిది
 గుండెలో నీయాసలైతే కోటానఁగోట్లు ॥పల్లవి॥

తనివోదు నిన్ను మతిఁదలపోసినా నాకు
 మనసులోపలికాంక్ష మఱి యెట్టిదో
మొనసి నవ్విన ముచ్చటలు దీరవు
 పెనఁగేటిసంతసపుఁబ్రేమ యెట్టిదో ॥నిండు॥

కన్నులలో తమి వోదు కదిసి తప్పకచూచి
 ఇన్నిటా నాతరితీపు లెటువంటివో
యెన్నిమాఁట లాడినాను యేఁకటలు వాయవు
 సన్నల నాలుకమీఁదిచవు లిఁక నెట్టివో ॥నిండు॥

కాయముపై కసి వోదు కాఁగిట బిగించినాను
 చాయల సన్నల సాహసము లెట్టివో
యీయెడ శ్రీవేంకటేశ యీడేర నన్నుఁ గూడితి
 మాయనిమనలోపలిమాటప ల్లెట్టివో ॥నిండు॥ 530

వరాళి

ఆసపడ్డవారికి నడ్డమేడది
వాసులసిగ్గులతోడ వడఁబడనేఁటికి ॥ పల్లవి ॥

తప్పకచూచితే నీవు తలవంచుకొనెఁ జెలి
యిప్పటి మీలోనిసుద్దు లేఁటివో కాని
చెప్పరాదా మాకు నవి చిక్కులు వాపేముగాని
దప్పిదేరేమోవులతో డడఁబడనేఁటికి ॥ ఆస ॥

నీవు మాటలాడఁగాను నెలఁత [1] తో మాటలాడీ
యేవేళ నీ వాపె నేమంటివో
చెవదేర నవ్వరాదా చెలఁగఁజేసేముగాని
వేవేలుసణఁగుల వేసరఁగనేఁటికి ॥ ఆస ॥

కొంగువట్టి తియ్యఁగాను కొనగోర నదిమీని
యింగితాకారాలు మీకు నెటువంటివో
అంగవించి కూడితిరి అట్టె శ్రీవేంకటేశ
కంగ కిట్టె వుండరాదా కడుజంకె లేఁటికి ॥ ఆస ॥ 531

ఆందోళి

వెనకటిపొందు గద్దు వెలపేల నీకును
అనుమాన మిఁకనేల ఆడవయ్య మాఁట ॥ పల్లవి ॥

సిగ్గులు మోమునఁగాని చిత్తములోపల లేదు(వు?)
దగ్గరి కూచుండవయ్య తరుణివద్ద
వెగ్గళించినా నిన్ను వింతలా నీకు నాపెకు
అగ్గమైనదాఁకా నింతే అంటవయ్య చన్నులు ॥ వెన ॥

1. తో = వెంటనే కావచ్చు.

జంకెలు బొమ్మలఁగాని చలము లోపల లేదు
వంకలు దీరుచవయ్య వడిఁ గురులు
మంకునఁ దిట్టినా నిన్ను మచ్చిక నీమీఁదఁ గద్దు
సంకెదీరుదాఁకా నింతే చల్లవయ్య వలపు ॥ వెన ॥

మఱఁగు రెప్పలఁగాని మర్మము లోపల లేదు
యెఱఁగి మోవియ్యవయ్య యెదురుగాను
జఱసి శ్రీవేంకటేశ సతి నిట్టె కూడితివి
నెఱవైనదాఁకా నింతే నించవయ్య కరుణ ॥ వెన ॥ 532

లలిత

పచ్చిదేరినపనికిఁ బరాకులేల
మచ్చికతో మీరిద్దరు మన్నించేవారము ॥ పల్లవి ॥

ఇంతి నీమొగము చూచె ఇన్నిటికి నొడఁబడి
అంతరంగములోపను లానతీవయ్యా
వింతవారమా నీకు వింటేనేమి సిగ్గుగాదు
చెంతల మివ్వూడిగాలు సేసేటివారము ॥ పచ్చి ॥

సతి నీతో మాటలాడె చనవెల్లాఁ జెల్లించె
మితిమీర నవ్వునవ్వి మెచ్చవయ్యా
మతకపువారమా మరఁగు లిందులోనేల
అతివకు నీకు నేము అడపమువారము ॥ పచ్చి ॥

తరుణి కాఁగిటఁ గూడె తలపెల్లా నీదేరె
పొరసి నానారతుల భోగించవయ్యా
సరివారమా నేము చాయల శ్రీవేంకటేశ
ధరలోఁ గూడితివి నీదయలోనివారము ॥ పచ్చి ॥ 533

మాళవి

అందుకుఁగా చెలి నవ్వి అంగమెల్లాఁ జెమరించె
సందడిజాణతనాల సరసుఁడ వవుదువు ॥ పల్లవి ॥

తెప్పమీఁద నుండి నీవు దిక్కులు చూడఁగాను
అప్పుడు తామెరఁ గొని అతివ వేసె
తప్పవట్టి యంతలోనే తాకెనంటా నీమేను
రెప్పలెత్తి చూచేవు రేసు లిఁకనేఁటికి ॥ అందు ॥

పంతముతో జలకేలిఁ బరాకై వుండఁగాను
అంతలో జలము చల్లె అంగన నిన్ను
వంతుకుఁ దిట్టేవు నీవన్నె దొప్పఁదోఁగెనంటా
యెంత బొమ్మల జంకించే వెగసక్కేలేఁటికి ॥ అందు ॥

చంచులఁ గోనేటిలోన చల్లఁగా నీవు దేలఁగా
మించి కాఁగిలించె నలమేలుమంగ
ముంచి శ్రీవేంకటేశుఁడ మొక్కేవు బిగించెనంటా
పొంచి సరివెనఁగేవు బూటకములేఁటికి ॥ అందు ॥ 534

రేకు 1090 రామక్రియ

ఐతేనేమి దోసము అపరాధమేమి నీకు
కాతరముగలిగినఘనుఁడవు నీవు ॥ పల్లవి ॥

పుక్కటఁబోసినయట్టిబుద్ధులు నీకవి సుమ్మీ
తక్కక ఆకెపెట్టినతమ్ములము
అక్కడ నీకు నేను ఆకుమడిచియ్యలేదు
యెక్కడనుండి వచ్చెనో యేల లేదనేవు ॥ ఐతే ॥

వుంకువిచ్చి కై కొన్న వాగి [1]సంచకారుసుమ్మీ
అంకెల నీకొనవేలిఅవుంగరము
పొంకాన నే మెన్నఁడు పూఁచి యిచ్చినది లేదు
లంకెఁ బెట్టుకొంటివి పల్లదా లేలాదేవు ॥ ఐతే ॥

వుమ్మడి నాపెవెట్టినవొరపువలపుసుమ్మీ
కమ్మి కాఁగిటనంటినగందము నీకు
నెమ్మది శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
అమ్మకో(రో?) నే నెఱఁగని వానలేల పెట్టేవు ॥ ఐతే ॥ 535

కాంబోది

వద్దు వేఁడుకొనవయ్య వనిత చేతిలోనిది
పెద్దరికానకే పొంచీఁ బ్రేమగల దాపె ॥ పల్లవి ॥

కప్పురాన వేసె నాపె గందవొడిని వేసేవు
యెప్పుడు నందుకునిందు కెంతమాత్రము
చప్పనివలపుగాదా సరిగానిపనులకు
కుప్పళించి అందుకేపో కోపగించె నాపె ॥ వద్దు ॥

కంటసరి యిచ్చె నాపె కప్పి వుంగర మిచ్చేవు
యింటిలో నందుకు నిందు కెంతమాత్రము
వొంటనితలఁపుగాదా వోపికగానియీవులు
వెంటలుగా నందుకేపో పెనఁగె నేఁడాపె ॥ వద్దు ॥

చన్నుల నిన్నొత్తె నాపె సరిగా మోవి ఇచ్చితి
ఇన్నిటా మెచ్చాయ నిఁక నెంతమాత్రము
యెన్నగ శ్రీవేంకటేశ ఇట్టె నీవు గూడితివి
మన్ననల దైవారి మరిగిన దాపె ॥ వద్దు ॥ 536

1. సమాసము వింతైనది. ధాతువిశేషణానికి విశేష్యానికిమధ్య 'వాగి' అనే అవ్యయము. ఈ 'వాగి' యతినిర్బంధము కావచ్చు.

పాడి

గందమందుకోవయ్య కలికి నీ కొసఁగిని
అందుకనందుకే సరి అధికము వలపు ॥పల్లవి॥

దవ్వులనుండినపతి దగ్గరివచ్చినప్పుడు
రవ్వలై నకోపము రాకుండదు
నవ్వులనుఁ దోడనే నయములు చూపకుండదు
యెవ్వరికి నిందుకుఁగా నెగ్గులేల యెంచను ॥గంద॥

తలవంచుకొన్నవాఁడు తప్పకచూచితేను
మొలకపంతాలు గడుమోవకుండవు
అలరి అంతటిలోనే ఆసలు రేగకుండవు
చలము లిందుకుఁగాను సాదించనేఁటికి ॥గంద॥

మెడఁగట్టుకొన్నవాఁడు మేలములాడితేను
అడియాలములు మేన నంటకుండవు
అదరి శ్రీవేంకటేశ ఆపె యలమేలుమంగ
వాడికమై కూడితిరి వోసరించనేఁటికి ॥గంద॥ 537

గౌళ

ఏమన్నా నంటివిగాని యెంచిచూచితే నేఁడు
కామించునాయకునిపైఁ గల్లలేదే యిఁకను ॥పల్లవి॥

అనలువెట్టుకోఁగానే ఆడెనంటా లేనిమాట
పూని యేల గడించేవే పురుషునిపై
రానికోపమున నింత రవ్వసేసితే నెఱఁగ
కానిమ్మన ఆతనిపై కల్లలేదే యెపుడు ॥ఏమ॥

---

శ్రీగీతలుగలది చిలుముదిన్నందున నే నూహించినది.

సాదువలె నుండఁగాను సన్న సేసీనంటా నెందో
వేదలేల కట్టేవే విభునిమీఁద
వాదులొకటి పైఁబెట్టి వంకలొత్తితే నెఱఁగ
కాదన నాతనిమీఁద కల్లలేదే యిపుడు ॥ ఏమ ॥

కొంగువట్టి కొసరఁగ కులికి తీసెనంటా
వింగళించేవేలే శ్రీవేంకటేశ్వరు
చెంగటఁ గూడినందుకు చెనకితే నే నెఱఁగ
కంగులేనియాతనిపై కల్లలేదే యిపుడు ॥ ఏమ ॥ 538

సౌరాష్ట్రం

అటువంటివానినా అలయించేవు
సటలు నీ కాతఁడు చవిచూపఁజాలఁడే ॥ పల్లవి ॥

మొక్కలపుమాటల మొనగోరినాటుల
తక్కులఁబెట్టేవేల తగ దాతని
చిక్కనినవ్వులు నవ్వె సిగ్గులెల్లాఁ బెడఁబాపె
వెక్కసానఁ బతి నీపై వింత సేయఁజాలఁడే ॥ అటు ॥

బొమ్మముడిజంకెలను బూటకపులంకెలను
చిమ్మనేల కోపమెల్లఁ జెల్ల దాతని
సమ్మతించ నిన్నుఁ జేసె చనవులెల్లాఁ జెల్లించె
కమ్మనిరమణుఁడు గాత సేయఁజాలఁడే ॥ అటు ॥

పూవులచెండులవాట్ల బొంకులకన్నులగిఁ(గిం?)ట్ల
కావరించనేఁటికే కాఁగా దాతని
మోవియిచ్చి నిన్నుఁ గూడె మోహమెల్లా నిండఁజల్లె
శ్రీవేంకటేశుఁ డితఁడు చెనకఁగఁజాలఁడే ॥ అటు ॥ 539

---

* క్రిగీతలుగలది చిలుము తిన్నందున నే నూహించినది. 1. సంయుక్తపూర్వమందున్న యీపూర్ణానుస్వారము 'కంసా' దులందువలె పూర్ణానుస్వారానికే గుర్తు కావచ్చు.

ఆహిరి

నీయందు నేరమి లేదు నే నెఱఁగనైతిఁగాక
. ఆయమైనయెమ్మెకాఁడ వవుదువయ్యా ॥ పల్లవి ॥

మంతనాన నే నీతో మాఁటలాడినవియెల్ల
అంతరంగముగఁ జెప్పె నాపె నాతోను
యింతలోనే పెద్దరికా లేదేడ నాడుకొంటివి
అంతటిదొడ్డవాఁడ వవుదువయ్యా ॥ నీయం ॥

గుమితాన నీవు నేనుఁ గూడినకూటములెల్ల
అమరఁగ నాపె చెప్పె నందరితోను
రమణుఁడ నీవలపు రచ్చఁబెట్టుకోవలెనా
అమసి(రి?)న నిఁ(నిం?)డుదొర వవుదువయ్యా ॥ నీయం ॥

ముచ్చట నీవును నేను మోహించినచేఁతలెల్లా
పచ్చిచేసెఁ జెలులతోఁ బైపై నాపై
అచ్చమై శ్రీవేంకటేశ అప్పటి నన్నుఁ గూడితి–
వచ్చపడ జాణఁడ వౌదువయ్యా ॥ నీయం ॥ 540

రేకు 1091 బౌళి

నన్నేల యసపెట్టేవు నాయకునిమీఁదను
పిన్నదాన ఆతనికిఁ బ్రియమాదేదానను ॥ పల్లవి ॥

పెలుచుమాటదానవు పెద్దాలవు
అలరి నీవే యతని ననవమ్మా
వలచినదాన నేను వద్దనుండేదానను
పిలువనేరుతుఁగాని బిగియఁగనేరను ॥ నన్నే ॥

---

బ్రీగీతలు గలవి చిలుము తిన్నవి.

చనవరిదానవు చలమరిదానవు
చెనకి నీవేమైనాఁ జేయవమ్మా
ననిచినదాన నేను నయగారిదానను
వినయమే నేరుఁగాని వేసరించనేరను ॥ నన్నే ॥

తగవరిదానవు తమకపుదానవు
సొగిసి నీవే దయఁజూడవమ్మా
మొగమోటదానను మంచి శ్రీవేంకటేశుఁడు
జిగిఁ గూడె బొంకనేర చెంగలించనేర్తును ॥ నన్నే ॥ 541

సామంతం

సేసినట్టితప్పు గాచినదే దొరతనము
వాసుల నాతనిమేలు వన్నెవెట్టరాదా ॥ పల్లవి ॥

చలము సాదించరాదు చనవుమెరయుచోట
చలివాయఁ బతినేల సాదించేవే
తెలిసినపనులకు తేటతెల్ల మిఁకనేల
కులికి పయ్యదమఱఁగున దాఁచరాదా ॥ సేసి ॥

మొక్కలములాడరాదు మొగమోడేయట్టిచోట
కక్కసించి యేల తారుకాణఁబెట్టేవే
వొక్కటై నమీఁద మఱి వూరఁగలసుద్దులేల
అక్కునఁబెట్టుక అట్టే ఆదరించరాదా ॥ సేసి ॥

సిగ్గులువడఁగరాదు చేకొనికూడినచోట
దగ్గరుండి యిఁకనేల తలవంచేవే
యెగ్గుదీర శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడె
వెగ్గళించి మోవితేనె విందువెట్టరాదా ॥ సేసి ॥ 542

రామక్రియ

ఆపె కావలె నొండె అట్టె నేనే కావలె
.యేపని కేపనిసేసే వింకనేడ సుద్దులు ॥ పల్లవి ॥

గద్దరిచూపులఁ జూచి కన్నులనే మాటలాడి
తిద్దుకొనె నిన్నుఁ జేతికిలోనుగా
వొద్దనుండి మమ్మునేల వొడఁబరచేవు నీవు
యిద్దరికి నోపుదువా యిఁకనేడ సుద్దులు ॥ ఆపె ॥

వోరికొట్లు గొట్టి నిన్ను వొరసి చన్నులనొత్తి
సారె నలవాటుసేసె జంట నీ కాపె
చేరిచేరి మమ్మునేల చెనకేవు నీ విప్పుడు
యేరా మమ్ముఁ గొసరే విఁకనేడ సుద్దులు ॥ ఆపె ॥

కమ్మటిని మోవి నీకిచ్చి కాఁగిటను బిగియించి
నమ్మించి దక్కఁగొనెను నవ్వుతా నిన్ను
దొమ్మిసేసి నను నీవు తొడిఁబడఁ గూడితివి
యెమ్మెల శ్రీవేంకటేశ యిఁకనేడ సుద్దులు ॥ ఆపె ॥ 543

కాంబోది

* రావే ఆతఁడు నిన్ను రంతుసేసి పిలిచీని
తావులనే లోఁగుటే తగునేరుపు ॥ పల్లవి ॥

బలిమిఁ బెనఁగరాదు పాయపువారికెల్ల
వలనైనచనవు చూపవలెఁగాని
కలిగినవేడుకలు కైవ్రాలకుం[1]డాను
నెలవునఁ గూడుటే నెరవైననేరుపు ॥ రావే ॥

---

* ఈ పాటలో పల్లవిభాగమంతా చిలుముదిని దుంకలు పడినది. గీతలు లేవి — స్థలముమాత్రము స్పష్టముగ నున్నది. మిగతంతా గుర్తిగుర్తుతో నేనూహించినది.

1. క్రిగీతలు గలది చిలుముదిన్నభాగము.

వాదు లడువఁగరాదు వలచినవారికెల్ల
నేదదేరి చెప్పినట్లు చేసుటేకాని
పోదిగొన్న కోరికలు పొది విచ్చకుండాను
సాదువలె లోనొాటె చక్కనినేరుపు ॥ రావే ॥

సిగ్గులువడఁగరాదు నేసపాలవారికెల్ల
నిగ్గులఁ గాఁగిటఁ గూడి నిక్కుటేకాని
అగ్గమై శ్రీవేంకటేశుఁ డరసి నిన్నుఁ గలసె
కగ్గులేక సుఖించుటే కడునేరుపు ॥ రావే ॥ 544

శుద్ధవసంతం

నీవే యిన్నిటాఁగల నెరజాణవు
తావుల నీవన్నమాఁట తలఁచుకోవయ్యా ॥ పల్లవి ॥

బొమ్మలలో సరసము పూఁచినజంకెనలు
నెమ్మనపుసరసము విందినగుట్టు
తమ్మిమోముసరసము తనివోనినగవులు
తెమ్మలుగాఁ జెలి యాడీ తెలుసుకోవయ్యా ॥ ॥ నీవే ॥

కొనగోరిసరసము గురియైనతాఁకులు
తనువుపై సరసము తడఁబాట్లు
చనుమొనసరసము సారెసారె కులుకులు
పనివడి యిందునే తెప్పలఁ దేలవయ్యా ॥ నీవే ॥

పెదవులసరసము ప్రియములముచ్చటలు
చదురై నరతిసరసము ముద్దులు
నిదుల శ్రీవేంకటేశ నీచెలిఁ గూడితివి
వదలక యిన్నియు నవధరించవయ్యా ॥ నీవే ॥ 545

1. క్రీగీతలు గలది చిలుముదిన్నది

సాళంగనాట

ఏమిటికి బుద్ధిచెప్పేమే యిఁక నీకు
కామించి యాతని కిచ్చకములే ఆడేవు ॥ పల్లవి ॥

మించి మోహపువారికి మొగమోటలేకాని
యించుకంతనిష్ఠూరమూ నెఱఁగరు
చంచుల నెడసితేను సాహసములేకాని
పంచలఁ దాలిములను పట్టలేరు మనసు ॥ ఏమి ॥

ననిచినవారికి నగవులే వచ్చుఁగాని
పెనఁగినకోపము పెంచరు
తనివోక వుండితేను తమకమే హెచ్చుఁగాని
గునిసి వేసటలకు గుఱిగారు ॥ ఏమి ॥

కూటినట్టివారికి కోరికలే మించుఁగాని
వాడుదేరినకాఁగిలి వదలరు
వీడెమిచ్చి కూడెను శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్ను
వేడుకలు మీవలెనే విడువరు లోకులు ॥ ఏమి ॥ 546

రేకు 1092 గుండక్రియ

ఇద్దరితో నాలిసేయ నిఁకనేఁటికే
బుద్ధులెల్ల నీ వక్కునఁ బోసిచూపరాదా ॥ పల్లవి ॥

చనవున నాపె నిన్ను సాకిరు లడుగఁగాను
తనువులోపలిమాట దాఁతురా
సునిసి నామొగమేమి చూచి నీవు లోఁగేవు
మనసునఁ గలయట్టే మాకుఁ జెప్పరాదా ॥ ఇద్ద ॥

---

* వ్రాఁతప్రతిలో గంది చిఱుముదిన్నది.

నట్టనడుమ నీలావు నమ్మి యాపె వుండఁగాను
పట్టిపెనఁగేపనికి పరాకౌదురా
యెట్టయెదుటను మాకు నింతయేల వెఱచేవు
బెట్టి నీవు మాతోనుఁ బెనఁగఁగరాదా ॥ ఇద్ద ॥

మోసదీర ఆపె నేఁడు మొక్కులు మొక్కగాను
యీసులు రేసులు మరి నీకనెంతరా
నేసవెట్టి కూడితివి శ్రీవేంకటేశ్వర నన్ను
ఆసపడ్డవారిని మ మ్మాదరించరాదా ॥ ఇద్ద ॥ 547

దేసాళం

వేడుక నేఁ జేసితేను వెంగెమందురా
కోదెతనమెల్ల నాపై గురిసేసేవేరా ॥ పల్లవి ॥

చిగురుఁబెదవి వంచి చెప్పితి నేఁ బ్రియములు
నగవు లింకానేల నాతో నీకు
అగడు నేఁ జేసితే నాయములు సోఁకెఁగాక
తగుఁబలుసోఁకులకే తమకించేవేరా ॥ వేడు ॥

కొనగోరు వంచి నిన్ను కొసరితిఁ బలుమారు
పెనఁగ సింకానేల బింకాన నీకు
మొనలు నేఁ జూపితి నామోహములు రేఁగెఁగాక
కొనచంద్రవంకలకే గుంపించేవేరా ॥ వేడు ॥

గట్టిచన్ను లిటు వంచి కాఁగిలించుకొంటి నిన్ను
గుట్టుసేయ నీకనేల కొసరి నీకు
ఇట్టె శ్రీవేంకటేశ యిందుకే మెచ్చితిఁగాక
చుట్టపురతుల కీఁక సూడువట్టేవేరా ॥ వేడు ॥ 548

పాడి

నిన్నరానికోపము నేఁడేఁటికే
పన్ని నీచేఁతలచే భ్రమయించరాదా ॥ పల్లవి ॥

మొగము చూచి నీపై మోహ మాతఁడు చల్లఁగా
నగరాదా కొంతైనా నాలి యేఁటికే
బిగువు చూపకుండితే పిఱదీసినట్లుండు
తెగువతో దీమసము తెచ్చుకోరాదా ॥ నిన్న ॥

దగ్గర వచ్చి విభుఁడు తమకము రేఁచఁగాను
సిగ్గులు విడువరాదా చింతలేఁటికే
కగ్గుదేరి యంటకున్న కైకోనియట్లుండు
వెగ్గళించి మచ్చికలు వెదచల్లరాదా ॥ నిన్న ॥

శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జిత్తగించి కూడఁగాను
భావించి మెచ్చఁగరాదా పంత మేఁటికే
మోవితేనె లియ్యకున్న మొరఁగినయట్లనుండు
సావధానాన నన్నిటా చనవియ్యరాదా ॥ నిన్న ॥ 549

కాంబోది

మించి నారమణుఁడవు మేనవాఁడవు
వంచుకొని తిద్దుకొనేవారిచేతివాఁడవు ॥ పల్లవి ॥

వేళలు గాచితినంటా వేసరించనైతినంటా
వేలెత్తి మమ్మేల మెచ్చి వింతసేసేవు
నీలాగు లెఱఁగనా నీవే నేఁ గానా
పాలుమాలితే నిన్నిట్టే పచ్చిసేయవలెనా ॥ మించి ॥

కొమ్మ నిన్నుఁ గంటినంటా కోపగించనైతినంటా
వుమ్మడి మాకేల మొక్కి వూరడించేవు
యెమ్మెలకాఁడవుగావా యిందుకు రాజవుగావా
దొమ్మికాఁడనైతే నీకు దూరుగట్టవలెనా ॥ మించి ॥

కందువ నుండితినంటా కాఁగిలించుకొంటినంటా
ఇందరిలో మన్నించి యెంత సేసేవు
పొందిన శ్రీవేంకటేశ భోగించ నింతనేరవా
అందాలకు మాటాడితే నొఁగాదనవలెనా ॥ మించి ॥ 550

వరాళి

నావంటివారెందరున్నా నయమే నీకు
పూవువలె భోగించితే పుణ్యములే చేరును ॥ పల్లవి ॥

వాసులువంతు లెంచక వద్దనున్నదానను
వేసరకుమీ నీవెలఁది నేను
ఆసపడ్డవారిమతి అక్కరదీరిచితేను
దోసములే దిందువంక తొయ్యలులు మెత్తురు ॥ నావం ॥

సిగ్గులువడక నీపైఁ జేతులు నేఁ జాఁచితే
యెగ్గులు వట్టకుమీ నీయింతిని నేను
వొగ్గినవారిచనవు లొనరఁ జెల్లించితేను
తగ్గుమొగ్గు లేదు నీదయ లోకు లెంతురు ॥ నావం ॥

అలపుచూడక నిన్ను అట్టె కాఁగిలించితి
బలిమిసేయకుమీ నీపడఁతి నేను
చెలఁగి నన్నేలితివి శ్రీవేంకటేశ నీవు
సిలుగులేదు నిన్నుఁ జేరి నేఁ బొగడుదు ॥ నావం ॥ 551

శంకరాభరణం

తిట్టితేనే పెదవినే (ని?) తేనె గారీనే
గట్టియాయ నీపనులు కానీలేవే ॥ పల్లవి ॥

నీమనసువచ్చునటే నెలఁతా
చేముట్టి నీవు నవ్వఁగఁ జేరి వుండితి
యేమిటికి నవ్వేవే యింతలో నీవు
కామినివంటా నుంటిఁ గానీలేవే ॥ తిట్టి ॥

పంతము చెల్లెనటవే పడఁతీ
మంతనాన నీకు నాకుమడిచిచ్చితి
రంతులేల సేసేవే రచ్చల నన్ను। యే-
కాంతమున నీకుఁ జెప్పేఁ గానీలేవే ॥ తిట్టి ॥

కలసితి వన్నిటాను కలికీ
బలిమి శ్రీవేంకటాద్రిపతినే తాను(నేను?)
చలపట్టి యింతయేల సాదించేవే
కలిగె నీదయ నాపైఁ గానీలేవే ॥ తిట్టి ॥ 552

రేకు 1093 రీతిగౌళ

ఎవ్వరిబలువు వీరి నేమందమే
పువ్వులు బలియఁగాను పూఁపలాయ నిదివో ॥ పల్లవి ॥

సిగ్గువడివున్నచెలిఁ జేయివట్టితియ్యఁబోతే
దిగ్గనను వినరావితిట్లు దిట్టెను
యెగ్గువట్టక విభుఁడు యెగసక్కెలకే మరి
బిగ్గెఁగాఁగిలించి మోవి పిప్పిసేనె నిదివో ॥ ఎవ్వ ॥

మూలనున్న యింతిఁ బట్టి మూంగిటికిఁ దీసితేను
తాలిమి సేయరానిసేఁతలు చేసెను
బేలుఁడై యుండ కితఁడు ప్రియమునఁ జెలరేఁగి
కాలుదొక్కి పానుపుపై కందువంటె నిదివో ॥ ఎవ్వ ॥

వొద్దనున్న ఇల్లాలి నురముపైఁ బెట్టుకొంటే
గద్దించి బొమ్మజంకెలఁ గైకొని కూడె (?)
వొద్దికై శ్రీవేంకటేశుఁ డొనగూడి మన్నించి
పెద్దరికమెల్లాఁ జేసి ప్రియమాడె నిదివో ॥ ఎవ్వ ॥ 553

## శ్రీరాగం

[1]అంతలోనే నవ్వునవ్వే వౌనే నీవు
అంతరంగమెల్ల నింద ఆతఁడుగదే ॥ పల్లవి ॥

చిన్నఁబోయివుండినది చెలియ నీమోమిదేమే
చెన్నగునీవిభుఁడు విచ్చేయఁడాయనా
వెన్నెలలోపల నుండి వేసవియెండ లనేవు
అన్నమాటలోనే వచ్చె నాతఁడుగదే ॥ అంత ॥

నొసలెల్లాఁ జెమరించి నున్ననిచెక్కులఁ జారె
అసురుసురుగ నీతఁ డలయించెనా
పసురుమొగ్గలు చూచి పంచబాణము లనేవు
అసమునఁ జేయిచాఁచీ నాతఁడుగదే ॥ అంత ॥

కాయమెల్లఁ బులకించి కళలునిండె నిప్పుడు
యీయెడ శ్రీవేంకటేశుఁ డిట్టె కూడెనా
రేయిఁబగలాయనని రెట్టించె వలపనేవు
ఆయములిన్నీఁ దెలిపె నాతఁడుగదే ॥ అంత ॥ 554

1. ఆతఁడు అంతరంగమెల్ల నిడఁగదే , నీవు అంతలోనే నవ్వు నవ్వేవు; ఔనే— అని అన్వయము కాబోలు.

గౌళ

నేనేమెఱుఁగుదును నీచేఁతలు
అనుక నిన్ను వెంగెములాడేపాటిదానవా ॥పల్లవి॥

ముచ్చట నీవాడఁగాను మొగము చూచితిఁగాక
వొచ్చెములెంచి తప్పు లున్నవంటినా
తచ్చనలు నే నేర తగులువిరుబు నేర
యిచ్చల నీవే లోఁగేవు యేమి సేసితివో ॥నేనే॥

దగ్గరి నీవు రాఁగాఁ బాదాలు గదిగితిఁగాక
బగ్గన యెవ్వతె దొక్కె పాదమంటినా
వెగ్గళించ నే నేర వెంగమాడ నే నేర
సిగ్గువడే వేపనులు చిత్తములో నున్నవో ॥నేనే॥

గక్కన నీవు గూడఁగఁ గాఁగిలించుకొంటిఁగాక
మక్కువతో నిన్ను నే నమ్మకయుంటినా
యిక్కువెఱిఁగి కూడితి విదివో శ్రీవేంకటేశ
వెక్కసాలు నే నెఱఁగ వేడుక నీకెట్టిదో ॥నేనే॥ 555

భైరవి

దేవర విన్నిటా నీదేవిని నేను
నీవే నా కిన్నియును నేరుపుదుగాక ॥పల్లవి॥

యెక్కుడుమాఁట నీవన్నా యెదురాడఁదగవా
అక్కర మంకుదనాన నాడితిఁగాక
యిక్కువైనతగవు నీవెఱఁగనివాఁడవా
చొక్కముగా నామనసు సోదించేవుగాక ॥దేవ॥

తప్పులు నీవు వట్టితే తారుకాణించఁదగవా
అప్పటికోపము లాఁపనైతిఁగాక
కప్పి నీవల్ల నేమైనా కడమలు గలవా
తిప్పి నాచేఁతల నన్నుఁ దిట్టించేవుగాక ॥ దేవ ॥

వొత్తి కాఁగిలించుకొంటే వోపననఁదగవా
చిత్తగించి రతి నలసితిఁగాక
కొత్తగా శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
తత్తరపువాఁడవా దయ ఇదిగాక ॥ దేవ ॥ 556

తెలుఁగుకాంబోది

నాయకుఁడ నీచిత్తము నాభాగ్యము
పాయపుఁజక్కఁదనాన పాయకుందుఁగాక ॥ పల్లవి ॥

వీనులఁ బొంచుకుంటిని వేడుకనీమాటలకు
అనుకొని సరసము లాడవైతివి
నేనా నిన్నుఁ గొసరి నెప్పునకుఁ దెచ్చేదాన
మోనముతోఁ జేతులెత్తి మొక్కఁగలఁగాక ॥ నాయ ॥

కన్నులఁ గాచుకుంటిని కదిసి నీమాటలకు
నిన్ననే రావైతివి నీయంతను
నన్నువంటిదా నిన్ను నయానకుఁ దీసేది
పన్నిననీపాదుకలు పట్టఁగలఁగాక ॥ నాయ ॥

చేతులు చాఁచుకుంటిని శ్రీవేంకటేశ్వర నీకు
యీతల నన్నుఁ గూడితి విందుకుఁగానే
ఘాతల మాతరమా కరఁగించ నీమనసు
నీతితో నాతమకము నించఁగలఁగాక ॥ నాయ ॥ 557

రామక్రియ

[1] నేఁడే నాగవెల్లి నేఁడే యిల్లునింపులు
పోఁడిమి గోవిందపతి భోగించీ నిదివో ॥ పల్లవి ॥

అల్లదే దేవునిరథ మల్లదే గరుడధ్వజ–
మెల్లలోకములు గెల్చి యేఁగీనదే
యిల్లిదే లక్ష్మిభూము లిద్దరుదేవుళ్లు వీరె
చల్లేరు శాసలుఁ దాము సరికి బేసికిని ॥ నేఁడే ॥

సేనాపతి యల్లవాఁడే చేరి దేవతలు వారే
శ్రీనారాయణుఁడు చెలఁగీనదే
ఆనుక యడుగడుగు కారగించీ వీధులను
వానలుగా నందరికి వరములొసఁగుచు ॥ నేఁడే ॥

దేవదుందుభులు మ్రోసె దిక్కులెల్లాఁ జల్లనాయ
శ్రీవేంకటేశుఁ డితఁడె చిత్తగించీని
సేవించరో భావించరో జీవులాల బ్రదుకుఁడు
వేవేలుశోభనముల వేడుకకాఁ డితఁడు ॥ నేఁడే ॥ 558

రేకు 1094 బౌళి

ఏరా నన్నింతలోనే యెంతగాఁ జూచేవు నీవు
దారతో, నీదాననై నతగవరిఁగాక ॥ పల్లవి ॥

సారె నిన్ను సాదించ చలమరిదాననా
వారిచి నిన్నుఁబొందేటియోగిణి(ని?) నేను
కూర వండి కసవేరి(రే?)గొల్లమంకుదాననా
నేరిచి బతికేననేనీదేవిఁగాక ॥ ఏరా ॥

1. ఇది అధ్యాత్మకీర్తనలలో నుండదగినది.

కన్నుల నిన్ను జంకించేకపటపుదాననా
అన్నిటా నీతలఁపులో యక్షిణి నేను
విన్న కన్నందుకుఁ బట్టేవెట్టివంటిదాననా
సన్నల నీపనిసేసేజవరాలఁగాక ॥ ఏరా ॥

సోలి నిన్ను వేసరించేసూడుఁబాడుదాననా
లాలించి నిన్నుఁగూడినలక్ష్మిని నేను
ఆలమాడి పెనఁగ నే నందగారిదాననా
యీలీల శ్రీవేంకటేశ యింటిదానఁగాక ॥ ఏరా ॥ 559

## ముఖారి

నిచ్చలు నాపుణ్యము నీచేతిది
మచ్చరపుదానఁ గాను మరియేఁటిమాటలు ॥ పల్లవి ॥

పంతమాడి నీతోను పచ్చిగా నే వలచితి
యెంతసేసినా నీచిత్త మేమనే నిన్ను
దొంతులాయఁ గోరికలు దొమ్మిసేసెఁ దమకము
మంతుకెక్కె నావయసు మరియేఁటిమాటలు ॥ నిచ్చ ॥

చలపట్టి నీతోను సలిగెకే పెనఁగితి
యెలమి నీదయే మాకు యేమనే నిన్ను
నిలువెల్లఁ జెమరించె నిండె నీపైఁ జూపులు
మలసీ నాతలపోఁత మరియేఁటిమాటలు ॥ నిచ్చ ॥

కొంగువట్టి నీకాఁగిటఁ గూడితి శ్రీవేంకటేశ
యెంగిలిసేసితి మోవి యేమనే నిన్ను
వుంగరము నాచేఁ జిక్కె వొక్కటాయ నామనసు
మంగళాలన్నియుఁ జేరె మరియేఁటిమాటలు ॥ నిచ్చ ॥ 560

సామంతం

ఇన్నిటా జాణఁడవైతే నేమాయను
పన్ని చెలికునఁ బందువందినట్టె ఆయను ॥ పల్లవి ॥

అందరును మనవారె అంగనలు నీకు నేఁడు
యెందరు చుట్టాలైన నేమాయను
అందుకుఁగా నిజాలేల అమరఁజెప్పఁగనేల
ఇందులోనే వుప్పొలికి ఇనుమడి ఆయను ॥ ఇన్ని ॥

పనికివచ్చినవారె పాయపువారెల్ల నీకు
యెనతురు గాక అందుకేమాయను
వెనకముందెంచనేల వెలిపులు మరియేల
ఘనముగఁ బాలు నీరు గలసినట్టాయను ॥ ఇన్ని ॥

తగినట్టిమేనవారే దండనున్నవారెల్ల
యెగసక్కె లిందుకేల యేమాయను
నగుతా శ్రీవేంకటేశ నన్నుఁ గూడితి విప్పుడు
చిగురుతంగేటిజున్ను చేరినట్టె ఆయను ॥ ఇన్ని ॥ 561

గుజ్జరి

ఏమాయ నీకిందుకు నేఁటికే సిగ్గు
చేముట్టి చెనకఁగాను చేయిచాఁచకుందురా ॥ పల్లవి ॥

మొక్కుచు నీతో నాపె మొదలనే విన్నవించి
చెక్కునొక్కి వేఁడుకొనె నేయవైతివా
మొక్కల[1] మింతేశాల మొగమోట మాతోనేల
వొక్కట నాపె రమ్మంటే వోపనందురా ॥ ఏమా ॥

1. ఇంతేని + ఏల.

వన్నెవెట్టు కాపె నీవద్దనే నిలుచుండె
అన్నిటాఁ బెనఁగి నీవంటవైతివా
యెన్నికలింతేశాల యెవ్వరేమనేరు నిన్ను
వున్నతి నాపె నవ్వఁగా నూరకుందురా ॥ ఏమా ॥

కందువలు నీకుఁ జూపి కాఁగిలించుకొనె నాపె
కిందుపడి నీమోవి సోఁకించవైతివా
అందపుశ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
పందెము ఆపె వేయఁగా పరాకులు సేతురా ॥ ఏమా ॥ 562

బౌళి

కొంకనేల యిఁకను కొమ్మలము నీకును
సంకెదేర్చి మామాటకే సమ్మతింతుగాక ॥ పల్లవి ॥

చనవువారము గాక సరివారమా నేము
మననేమి చూచేవు మాతోడను
వెనకవారమే మేము వేడుకకాఁడవు నీవే
పనిగొని మమ్మునిట్టె పాలింతు గాక ॥ కొంక ॥

యిచ్చకమాడేము గాక యెదురుమాటాడేమా
పచ్చియేలనేసేవు పలుమారును
మెచ్చితిమప్పుడే నిన్ను మించె నీ జాణతనాలు
కచ్చుపెట్టి మమ్మునిట్టె కరుణింతుగాక ॥ కొంక ॥

చుట్టాలమౌదుము గాక సూడుబంట్లమా నేము
రట్టల మమ్ముఁ జేసేవు ఇట్టె రతివేళను
గుట్టుతో శ్రీవేంకటేశ కూడితి మిందరమును
వొట్టుక మావద్దఁ బాయకుండుదువుగాక ॥ కొంక ॥ 563

పాడి

ఇంతటిగడుసులకు నేది[1] వాటి
చింతలేక నీమొగాన( జెల(గా కళలు ॥ పల్లవి ॥

మేలుమేలు జాణవౌదు మెత్తనిమనసు గాదు
యీలీల విరహమా(ప ఇంతకోపను
తాలిమితో గదెవెట్టి తరుణి లోనవుండ(గ
గోలవై మాతో మాటాడ(గొలిపె(గా నీకును ॥ ఇంత ॥

ఘను(డవౌదువు నీవు కర(గేవా(డవు గావు
యెనసినచో దంటల మింతేసి కాము
వనిత పంతములకు వాకిట వచ్చివుండ(గ
చెనకి మాతో నవ్వ(జెల్లె(గా నీకును ॥ ఇంత ॥

వేడుకకా(డ వౌదువు వెనకతియ్య వెందుకు
యీడుజోడై కలసే దింతెఱ(గము
ఆడ నాపె వుండ(గాను అట్టె నన్ను( గూడితివి
తోడనే శ్రీవేంకటేశ దొరకె(గా నీకును ॥ ఇంత ॥ 564

రేకు 1095 నారాయణి

ఎరవులవారెవ్వరు యిందులో నీకు
విరివికా(డవు నీవు విచ్చేయవయ్యా ॥ పల్లవి ॥

తగవెల్ల నీయందె తగిలించినదిగాన
మగువలతో( జెలి మాటాడదు
వగయెఱ(గ కిందా(కా వలలబడుండితిమి
అగడు నీవల్ల( దీరు నాడకు రావయ్యా ॥ ఎర ॥

---

1. ఏది + పాటి.

పాయమెల్లా నీకే పాలుపెట్టినదిగాన
వేయైనా తనగుట్టు వెళ్లవేయదు
చాయదెలియ కిందా(కా సరితలు చూచితిమి
నీయందే చిక్కులువాసీ నిక్కిచూడవయ్యా ॥ ఎర ॥

వారసి కాఁగిలి నీకే వొప్పగించినదిగాన
సొరిది నెవ్వరిబుద్ధి చౌరనియ్యదు
యిరవై శ్రీవేంకటేశ యీపె నిట్టె కూడితివి
వెరవు నీవల్ల నుంది విడెమియ్యవయ్యా ॥ ఎర ॥ 565

లలిత

ఎంత నీవు జఱసిన యేమనే నిన్ను
వంతువాసులెంచ కిట్టె వద్దనుండవయ్యా ॥ పల్లవి ॥

చిక్కనితేనెలమోవి చేరి నాకు నియ్యఁగాను
చక్కెరమాటలాడితి సారె నీతోను
వక్కణ లడుగనేఁ వట్టితలపోఁతలేల
వొక్కరీతిఁ జక్కజాడ నుండవయ్యా ॥ ఎంత ॥

చల్లనివలపుఁజూపు సారె నాపై వంచఁగాను
మెల్లనినవ్వు నవ్వితి మించి నీతోను
చిల్లరముచ్చటలేల చేవట్టిపెనఁగనేల
బల్లిదుఁడవై యిట్టె బతుకవయ్యా ॥ ఎంత ॥

కందువజాణతనాలఁ గాఁగిలించుకొనఁగాను
పొందితి రతుల నిన్ను భోగించితి
విందులఁ గూడితివి శ్రీవేంకటేశ బాసలేల
సందడి నాకిటువంటిచన వియ్యవయ్యా ॥ ఎంత ॥ 566

ఆహిరి

కాతరాన మోహించి కాచుకుందాన నీవేళ
చేతికి నీవు వరమిచ్చేదెపుడోకాని ॥ పల్లవి ॥

పొలపచూపులఁ జూచి బొమ్మలను జంకించి
చలిమీ బలిమీని సాధించితి
వలపుతేటలు చల్లి వాదించితిని నీతో
కెలన నీమతి గరఁగేదెన్నఁడోకాని ॥ కాత ॥

చెనకి చేఁతలేసేసి సిగ్గులు సోఁకించితి
ననుపు గావలెనని నవ్వు నవ్వితి
మొనవాఁడిగోరితోనే మొక్కులెల్లా మొక్కితిని
యెనసి నీవు లోనయ్యే దెట్లానోకాని ॥ కాత ॥

తగులాయములు చెప్పి తమకము గడునించి
తగవులెల్లా నెరపి దైవారితి
మగువనని దయతో మన్నించి కూడితి విట్టె
నిగిడి శ్రీవేంకటేశ నేర్పుయేదోకాని ॥ కాత ॥ 567

సామంతం

కానవచ్చినపనికిఁ గైదివ్వె లిఁకనేల
తానే యెఱుఁగుఁగాక తతిఁబోరనేలే ॥ పల్లవి ॥

వలపించుకొన్నవాఁడు వచ్చికూడనేరఁడా
కొలచినందె కొలచి కొసరఁగాక
చెలులనంపె నిపుడు చేరవచ్చేననుచు
వొలసినొల్లములకు వొరయఁ జోటేది ॥ కాన ॥

నేసవెట్టినవాఁడు చేకొనఁగనేరఁడా
రేసుల తనమనసు రేఁచఁగాక
ఆసలకు నడియాల మంపీ నచటనుండి
తీసిపె[1]ట్టయినచోట తెలుప చోటేది ॥ కాన ॥

దగ్గరి వచ్చినవాఁడు తమకించనేరఁడా
అగ్గలపుమాట తను నాడఁగాక
యెగ్గెఱఁగి శ్రీవేంకటేశుఁడే నన్నుఁ గూడె
సిగ్గువడివున్నచోట చెప్పఁజోటేది ॥ కాన ॥ 568

దేసాళం

ఇన్నియునుఁ గానవచ్చె నిందువంకనే
[2]సంగడి(సన్నల?)నింతక నీవు సంగడిఁ గూచుండవా ॥పల్లవి॥

తగులుగలవాఁడవు తమకించవలెఁగాక
చిగురుఁబెదవిమీఁదిసిగ్గులేల
జిగి నీవే యేమిగల్లనేసివున్నాఁడవో కాక
పగటున నింత కిట్టె పైకొనిదగ్గరవా ॥ ఇన్ని ॥

ప్రేమముగలవాఁడవు పెనఁగఁగవలెఁగాక
నేమముతోడుత వట్టినీటులేల
యేమగువకును బాస ఇచ్చివున్నాఁడవోకాక
దోమటి నింతక కాలుదొక్కవా నీవు ॥ ఇన్ని ॥

చుట్టమైనవాఁడవు చొచ్చి కూడవలెఁగాక
పట్టినకొంగుతో నొడఁబరచనేల
యిట్టె శ్రీవేంకటేశ యెరిఁగి కూడితిగాక
గుట్టున నింతక బుసకొట్టుల నలయవా ॥ ఇన్ని ॥ 569

1. తీయుట + పెట్టుటగలచోటు. 2 ప్రాసభంగము, అర్థములేనిపునరుక్తియునగు.

శంకరాభరణం

మెచ్చితి నిన్నప్పటి మేలు మేలు
ముచ్చటాడి రావయ్య మొఱఁగులు మానితి ॥ పల్లవి ॥

తక్కించనేరుతువు తరిదప్పకుండా నట్టే
వొక్కటిసేయానేర్తువు వొక్కొక్కరినే
చెక్కులేల నొక్కేవు చిఱునవ్వేల నవ్వేవు
మొక్కె నూరకుండవయ్య మోహానఁ దనిసితి ॥ మెచ్చి ॥

ఆడకూఁ గలవు నీవు యీడకునుఁ గలవు
తోడతోడ వలపులు తొరలించితి
వేడుకకాఁడ వౌదువు వేసాలేల సేసేవు
కూడే నోరుచుకోవయ్య కొంకెల్లఁ దేరితిని ॥ మెచ్చి ॥

తమకించా నీకే చెల్లు దయసేయా నీకే చెల్లు
అమరించితి విద్దరి నట్టె కాఁగిట
చెమరించఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను
గుమితమేల సేసేవు కోవయ్య వీడెము ॥ మెచ్చి ॥ 570

రేకు 1096 రామక్రియ

ఎదురుమాటలు నీతో నేమందురా
చెదరెఁ గస్తురిబొట్టు చెనకనేఁటికిరా ॥ పల్లవి ॥

కూరిమి రెట్టించె నాకు కొనగోరు వాఁ[1]డాయ
యేరా నీవింకా నాతో నేమనేవురా
సారె జారీఁ జెమట చన్నులకొనలవెంట
యీరీతి వేఁడుకొన నేనేమి బాఁతిరా ॥ ఎదు ॥

---

1-వాఁడి + ఆయ.

జవ్వనము తతివచ్చె జడివట్టె నవ్వులెల్లా
యివ్వల నాతో నీవు యేమనేవురా
పువ్వులతురుము వీడి బుజము రేకలు రాఁగె
తవ్వేవు నాసిగ్గులెల్ల తగునటరా ॥ ఎదు ॥

రతు లెన్నికకువచ్చె రాసులాయఁ గళలెల్లా
యితవులు నాతో నేఁడు యేమనేవురా
సతమై శ్రీవేంకటేశ చనవిచ్చి కూడితివి
పతినలు పలికేవు పట్టపుదేవినిరా ॥ ఎదు ॥ 571

లలిత

తానేవచ్చీఁగాక తలవాతిపనులెల్ల
మోనాన నాడినమాట మోపులుగట్టెరా ॥ పల్లవి ॥

చింతకొలఁదే మరి చెక్కుటఁబెట్టినచేయి
సంతోసముకొలఁదే సరి నవ్వులు
అంతేసేల దూరేరే ఆతఁదేమిసేసు నిఁక
కొంత కొంత మీరు బత్తి గొట్టానఁ బెట్టేరా ॥ తానే ॥

పెనఁగేటికొలఁదే ప్రేమపుచుట్టరికాలు
చనవులకొలఁదే సలిగెలును
మనసేమి చూచేరే మగవాఁడాతఁడు తొల్లే
తనిసినవలపులు దప్పికిఁ బోసేరా ॥ తానే ॥

ఆసలకొలఁదులే ఆయములు గరఁగేవి
నేసినకొలఁదులే జిగిఁ బుబ్బాలు
యీసుదీర శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
పోసరించినబుద్దులు పోరచివెట్టేరా ॥ తానే ॥ 572

మాళవిగౌళ

ఇల్లాండ్ల కిదివో జ యింపులు నీకేకాక
చిల్లర లింకాఁ గలవు చిత్తగించవయ్యా ॥పల్లవి॥

చిగురుమోవి వంచి నెలవినే నవ్వు నవ్వి
సగము మాటలాడీ సతి నీతోను
యెగసక్కెలై తోఁచు యేమిచెప్పినా నేము
జిగి నీవే ఆపెమోమూ చిత్తగించవయ్యా ॥ఇల్లాం॥

కడకంటనుఁ జూచి కందువ సన్నలు సేసి
జడిసి(గ?) వలపుచల్లీ సతి నీతోను
తడవితే సవతులందలిమచ్చర మనేరు
చిదుముడి యింకా నీవే చిత్తగించవయ్యా ॥ఇల్లాం॥

చేయిఁ జేయి నప్పళించి చెలఁగి పందేలువేసి
చాయలకు గోరనొత్తీ సతి నీతోను
యీయెడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
చేయరానిచేఁత నేసె చిత్తగించవయ్యా ॥ఇల్లాం॥ 573

శ్రీరాగం

ఏడలేనివిన్నపాలు నిఁక నేలా
వాడుదేరి నీకు నాకు వలపులే గుఱుతు ॥పల్లవి॥

పలుమాఁటలాడఁగాను పైపైఁ గోపమందురు
కలసి పూరకుండితే గర్వమందురు
మలసి విభుఁడ నీవు మన్నించినదే గుఱుతు
చెలరేఁగి నేను సంతసించినదే గుఱుతు ॥ఏడ॥

మయిముట్టి చెనకఁగా మందెమేళములందురు
ప్రియమున లోఁగితేనే బీరమందురు
దయతోడ నీవు నన్ను దగ్గరినదే గుఱుతు
నయమున నే నీతో నవ్వినదే గుఱుతు ॥ ఏడ ॥

నెట్టన నిన్ను రమ్మంటే నిండురాజసమందురు
గట్టిగా నే వచ్చితేను గబ్బినందురు
గుట్టున శ్రీవేంకటేశ కూడితి విదే గుఱుతు
మెట్టుకొని నే నిను మెచ్చినదే గుఱుతు ॥ ఏడ ॥ 574

ఆహిరి

వలపు నిలుపలేవు వట్టిబీరాలేకాని
నలువంక చూచేవు నయమేదే యిందుకు ॥ పల్లవి ॥

తప్పకచూచినందుకు తలవంచుకుందేవు
చప్పుడుగా కతనితో సంగతా యిది
వొప్పుగా నౌననవలె నొండెఁ గాదనవలెను
కుప్పళించేవు చెమట గురుతేదే ఇందుకు ॥ వల ॥

చేయివట్టి తియ్యఁగాను సిగ్గులువడి వుందేవు
పాయపువిభునితోడ పంతమా ఇది
యీయకోవలె నొండె ఇచ్చలాడవలె నొండె
మోయిచు నుస్సురనేవు మొదలేదే ఇందుకు ॥ వల ॥

మోవి నీకు నియ్యఁగాను ముచ్చటలాడవచ్చేవు
శ్రీవేంకటేశ్వరుతోడ చెల్లునా ఇది
భావించి యీతఁడే కూడె పైకొనఁగవలె నొండె
సేవసేయవలె నొండె నేసేదేమే ఇందుకు ॥ వల ॥ 575

సాళంగనాట

ఏటికి వేగిరపడే విపుడు నీవు
కూటువవేళ నే నిన్నుఁ గొసరేఁగాక ॥పల్లవి॥

మనసిచ్చి నీవు నాపె మాఁటలాడుకొనేవేళ
గునిసి నిన్ను సాదించఁగూడునా నాకు
యెనసి నామోము చూచి యేమీయనినవేళ
చెనకి నీకుఁ బ్రియాలు చెప్పేఁగాక ॥ఏటి॥

సందడి నాపెయు నీవు సరసమాడేటివేళ
గొంది నీతోఁ బైయాడఁగూడునా నాకు
విందుల నాపైఁ జేయివేసినయప్పటివేళ
కందువలంటుచు నిన్నుఁ గైకొనేఁగాక ॥ఏటి॥

ననుపున నాపె నీవు నవ్వులు నవ్వేటివేళ
కొనగోరు సోఁకించఁగూడునా నాకు
యెనసితివి శ్రీవేంకటేశుఁడ యిప్పటివేళ
తనిసితి నింకా మీదఁ దలపించేఁగాక ॥ఏటి॥ 576

రేకు 1097 శుద్ధదేశి

మమ్మేమి చూచేవు నీవు మాఁటిమాఁటికి
దిమ్మరి మీలోమీరే తెలుసుకోరయ్యా ॥పల్లవి॥

తతి నామొగమైయుండి తలఁచుక నవ్వేవు
సతి నీతోనన్నమాట సరివచ్చెనా
మతకరివాఁడవు మాయదారి ఆపె నీకు
ఇతవుగ మరుఁడు మిమ్మెట్టు గూర్చెనయ్యా ॥మమ్మే॥

పందేలువేయుచు నాతో పచ్చిమాటలాడేవు
అందిచ్చి నాఁడె నీకు ఆపె నేర్పెనా
అందగాఁడవు నీవైతే అంకెలు నేరుచునాపె
ఇందుకునందుకు సరి యెట్టుగూర్చె మరుఁడు ॥మమ్మే॥

శ్రీవేంకటేశుఁడ నన్నుఁ జిత్తగించి కూడితివి
వేవేలుగ నాపె నీకు విన్నవించెనా
దేవర విన్నిటా నీవు దేవులమ్మ ఆపె నీకు
యీవిధాల మరుఁడు మిమ్మెట్టు గూర్చె నిపుడు ॥మమ్మే॥577

పాడి

అప్పటి కిప్పుడు మాట లవియేల తడవేవే
కప్పురము దిన్నమీఁద కాఁకలుండునా ॥పల్లవి॥

తెగువలేమిటికే తేనెగారేమోవిమీఁద
నగవే నింతురుగాక నయముగాను
చిగురుఁగాలమునాఁడు చేరి వొగరైవుండు
మిగులఁ బండిననాఁడు మించి తీపైవుండును ॥అప్ప॥

సూడుఁబాడు లేఁటికే చుట్టరికమైనచోట
వీడుదోడులైవుండుటే వేడుకగాక
యేడనైనాఁ బట్టపగ లెండలు గాయుచునుండు
ఆడ వెన్నెలగాయు నది చల్లనౌను ॥అప్ప॥

శ్రీవేంకటేశుఁడు గూడె సిగ్గులు పైపైనేలే
వేవేలువిధాలఁ జెల్లు వేడుకలెల్లా
భావించఁగ ననలు పసురువేయుచునుండు
పూవులైతే వాసనలు బుగులుకొనుండును ॥అప్ప॥ 578

లలిత

అందరును చుట్టాలే అందరును బందుగులే
 సందడి మీతో నేను జగడించేనా ॥ పల్లవి ॥

వరుస రాజుమన్నించేవారే దేవుళ్లగాక
 యెరవులవా రిందుకేల వచ్చేరే
నిరతి నాతఁడుండఁగ నేఁడు మీ రేమిసేతురే
 గౌరబుసేసి మిమ్మిఁక కోపగించేనా ॥ అంద ॥

బలువుఁడు కసవుచేపట్టిన మేరువేకాక
 నెలకొన్నసతులకు నేరమేడదే
కలవాఁ డాతఁడేకాక కారణము మీరయ్యేరా
 పిలిచి మీతో నేను బీరమాడేనా ॥ అంద ॥

పక్కనను వెదుళ్లపందిలే చక్కనగాక
 యెక్కువ తక్కువలు మీ కేడనున్నవే
యిక్కువతో శ్రీవేంకటేశుఁ డిదె నన్నుఁ గూడె
 వొక్కటైతి మీతో నిఁక నొరటులాడేనా ॥ అంద ॥ 579

గౌళ

నీవు నేసినదేచేఁత నీనగరిలోపలను
 ఆవటించనేమిటికి అనుమానా లిఁకను ॥ పల్లవి ॥

కాతరించి ఆపె నీకు కమ్మి కొలువులోనుండి
 చేతులెత్తి మొక్కేదే నెలవా నీకు
పోతరాన మేనుసోఁక పొందులు నేయఁగరాదా
 యీతలఁ గాదనేవారు యెవ్వరు నిన్నిఁకను ॥ నీవు ॥

కమ్మి నీవూడిగమున కాళాఁజి వట్టుకొని
చిమ్ముచుఁ జూచినదే సెలవా నీకు
కుమ్మరించి యాపెలోనికోరిక దీరుచరాదా
బొమ్మల నింతలో వెలిఁబుట్టీనా యీసుద్దులు ॥ నీవు ॥

తమకించి యేకతాన దగ్గరి మేరలుమీరి
చెమటలు నించినదే సెలవా నీకు
అమర శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
జమళి నీవలపులు సరిదాఁకె నిపుడు ॥ నీవు ॥ 580

వరాళి

తగ నిన్నిటికి నిదే దండముసుమ్మీ
నగితి నిందాఁక నీపై నసుపునఁజుమ్మీ ॥ పల్లవి ॥

అనరానిమాటలెల్ల నాడుదు నిన్నెందుకైనా
మునుకొని నీమీఁదిమోహమేసుమీ
పనివడి నిన్నుఁ గొంగువట్టితీతు నొకవేళ
చనవున నీవిచ్చినసలిగెలఁజుమ్మీ ॥ తగ ॥

పంతమున నీమీఁద పక్కనఁ జేయిచాఁచితే
అంతయును నీమీఁదిఆసలేసుమ్మీ
సంతమై నిన్ను బొమ్మల జంకించి అదలింతును
వింతలైన నీమీఁదివేడుకలెసుమ్మీ ॥ తగ ॥

కదిసి నిన్నుఁ గాఁగిట కడుబిగించితే నేను
పొదిగిననీకు నిది భోగమేసుమ్మీ
అదన శ్రీవేంకటేశ అంటి నిన్ను గెలిచితి
యెదుట నీపెద్దరిక మిదియునుఁ జుమ్మీ ॥ తగ ॥ 581

సింధురామక్రియ

ఎందరు గావలె మరియింకా నీకు
సందడిలోపల నాకు చనవులిచ్చేవు ॥ పల్లవి ॥

వలచిననీవే నావాఁడవై యుండితేఁ జాలు
యెలమి నేఁ గడనుంటే నేమాయను
కులికి కులికి యేల కొంగువట్టి తీసేవు
చెలులెల్ల నావారే చేరి నీకున్నారు ॥ ఎంద ॥

అచ్చమైననీకు నే నాలననుకొంటేఁ జాలు
యెచ్చుకుందు లేమైనా నేమాయను
పచ్చిగా నాగద్దము[1] పట్టేల వేఁడుకొనేవు
యిచ్చట నాచెల్లెండ్లె ఇందరునుఁగారా ॥ ఎంద ॥

యింతట శ్రీవేంకటేశ యిటు గూడితివి చాలు
యెంత వెనకనైనాను యేమాయను
పంతమిచ్చి నాకేల బాసలుసేసే విప్పుడు
వింతవారా వూడిగపువెలఁదులు మనకు ॥ ఎంద ॥ 582

రేకు 1098 శుద్ధవసంతం

ఏమని విన్నవించేను యెందాఁకా నీకు
నేమపురతులకును నీవు నేనే గుఱుతు ॥ పల్లవి ॥

మనసు నీపైఁబెట్టి మంకుతో నే నుండినాను
యెనసినదాననే నీ వెగ్గుపట్టకు
తనువులు మోచినాను తలఁపులు మోచినాను
నినుపైనపనులకు నీవు నేనే గుఱుతు ॥ ఏమ ॥

1. పట్టి + ఏల.

వయసు నీకొప్పగించి వద్ద నిద్దిరించినాను
ప్రియురాలనే నీకు భేదముగాదు
క్రియతో సన్న సేసినా కేలువట్టి తీసినాను
నియతపుచేఁతలకు నీవు నేనే గుఱుతు ॥ఏమ॥

చన్నుల నిన్ను నొరసి జగడాలఁ బెనఁగినా
నిన్నుఁగూడినదాననే నేరమెంచకు
మన్నించి శ్రీవేంకటేశ మరిగి నన్నుఁ గూడితి
నిన్ను నన్నుఁ జూచుకొంటే నీవు నేనే గుఱుతు ॥ఏమ॥ 583

ముఖారి

ఎంతయిన నెఱఁగవు యేమని బుద్ధిచెప్పిన
బంతినే మాకు సిగ్గయ్యీ పైపై నిన్నుఁ జూచి ॥పల్లవి॥

చల్లలమ్మేవారితోడ జాణతనాలాడనేల
గొల్లెతలచేఁ దిట్టించుకొననేల
కొల్లలుగ మందలోన గోవులపాలు దాగి
బల్లిదుఁడవై యిట్టె బదుకరాదా ॥ఎంత॥

కందువల వెన్నదీసేకాంతలతో నవ్వనేల
కిందుపడి అంకులు దాఁకించుకోనేల
పొందుగ బాఁపనవారిపోరచికూళ్లారగించి
బందుకలవాఁడవై బలియరాదా ॥ఎంత॥

దొడ్డిలోన నేఁడు మమ్ము తొడికి కూడఁగనేల
గొడ్డేరేసీవు బుసకొట్టఁగనేల
వొడ్డుక శ్రీవేంకటేశ వూరవిందు లారగించి
పెద్దాఁగమయి నీవు వెలయరాదా ॥ఎంత॥ 584

మంగళకౌశిక

సేయఁగలపని నాకుఁ జెప్పుమనరే
ఆయమెఱిఁగి మాఁటలు ఆడుమనరే ॥ పల్లవి ॥

నెట్టనఁ దానూ నేను నేరుపరుల మన్నిటా
వట్టిసట లిందులోన వద్దనరే
గుట్టుతెలిసి కొలిమిగూంట్లో సూదులమ్మితే
జట్టిగొని యిద్దరికి చవులేకావా ॥ సేయఁ ॥

పంతాన వొకరొకరు బలువుల మిద్దరము
వంతులువాసులు నిఁక వద్దనరే
యెంత బేరిజోకొట్టినా యెక్కుడే వాఁగుఁగాక
వొంతనే నిద్రవోయిన బూమెలేకావా ॥ సేయఁ ॥

శ్రీవేంకటేశుఁడు దాను చేరి తనదేవులను
వావివర్తన లడుగవద్దనరే
అవటించి నన్నుఁ గూడె అట్టె నీళ్లడచితే
వేవేలకయినాను వేరులయ్యీనా ॥ సేయఁ ॥ 585

పళవంజరం

తలఁచినప్పుడు రాక తడసితివి
చలము సాదించి నేఁడు చనవులిచ్చితివి ॥ పల్లవి ॥

చేపట్టి విడువకు చిత్తగించి నవ్వేవు
యీపాటివాఁడవు నిన్న నెందువోతివి
తీపులయీవిరహాన దేహమెల్ల నలసితి
కోపుల నిట్టె రతికిఁ గొలిపీ నామనసు ॥ తలఁ ॥

అక్కరతోఁ గాఁగిలించి అనలెల్లాఁ బెట్టేవు
యిక్కడనక్కడ నీవు యేలవుంటివి
చొక్కముగా నీ కెదురుచూచి చూచి వేసరితి
పక్కనఁ దొల్లిటివలె పదరీ నాఅసలు ॥తలఁ॥

తనివిగా నన్నుఁగూడి దప్పులెల్లఁ దీరిచేవు
యెనయక యిందాఁకా యెంతసేసితి
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసి నే భ్రమసితి
అనుగునిష్ఠూరాలు నిన్నాడీనా నామాఁటలు ॥తలఁ॥ 586

బళహంస

పాయపువారమట పండిపొల్లవోయీనా
చాయల మెలఁగవోయి జరపులేమిటికి ॥పల్లవి॥

కన్నుల నీవు మొక్కఁగ కాదని తోసేనా
చన్నుల నొత్తితేను చాలుననేవా
యెన్నిలేవు నీయాస లెక్కడ నుండినాను
పన్ని లోనికి రావోయి పరపుమీఁదికివి ॥పాయ॥

సరసము నీవాడఁగ సమ్మతించకుండేనా
వొరసి నేఁ గొసరితే నొల్లననేవా
యిరవైనకోరికలే యిందుకు మీఁదుమిక్కిలి
తెరవేసితి రావోయి తేరి నాముందరికి ॥పాయ॥

పైపై నీవు గూడఁగాను పలుమారు లోఁగేనా
దాపుగా నామోవిచ్చితే తనివందేవా
యేపున శ్రీవేంకటేశ యెప్పుడూ సమరతులే
ఆపనికి రావోయి అప్పటి కాఁగిటికి ॥పాయ॥ 587

రామక్రియ

పంతము నీకుఁ దగదు పదఁతితోను
చింతలకుఁ బనిలేదు చిక్కులెల్లాఁ బాసెను ॥పల్లవి॥

మొగము చూచి చెలి మోనమునఁ దలవంచె
నగవురాఁగా నణఁచి నాలిసేసెను
తగిలి యింతటఁబోయి దగ్గరఁ గూచుండవయ్య
అగపడి నిన్నుమెచ్చి నలుకెల్లాఁ దీరెను ॥పంత॥

వలపు నీపైఁజల్లి వాసులువట్టుక చెలి
పలుకఁబోయి మాని పరాకైనది
చెలఁగి యింతటఁబోయి చెక్కులిట్టె నొక్కవయ్య
చలముతెల్లా విడిచి సమ్మతించు నీకును ॥పంత॥

బొమ్మలజంకెన చూచి పూఁచి చూపి సిగ్గువడి
తమ్ములపుమోవి చేత దాఁచి మూసెను
యిమ్ముల శ్రీవేంకటేశ యింతలోఁ గూడితివయ్య
నెమ్మనము నీకునిచ్చి నివ్వెరగుఁ బొందెను ॥పంత॥ 588

రేకు 1099 హిజ్జిజి

చెప్పితి మాసాజము చెనకకు మమ్మును
కప్పినపయ్యదవల్లఁ గరఁగీ నామనసు ॥పల్లవి॥

యేపునఁ బ్రియము చెప్పే [1]వేల చేయివట్టేవు
మాపుదాఁకా మావల్ల మంకుఁదనాలే
తీపులు మామోవి నింతే తేనెలు మామాట లింతే
దాపుగా నీకిందువల్లఁ దనిసీ నామనసు ॥చెప్పి॥

1. చెప్పేవు + ఏం

వాడివట్ట నేమిటికి వూరకే నవ్వనేఁటికి
కడలేనిమాచూపులు కడువాండ్లే
విడియాలు మాచేతివి వేసాలు మాగుణాలు
నడుమనే ఇందువల్ల నమ్మీ నామనసు ॥చెప్పి॥

గక్కునఁ గూడితి విట్టె కప్పురము చల్లేవు
యెక్కువైనమాచన్ను లివి గల్లే
మొక్కులు మాచేతులవి మొరఁగులు సిగ్గులవి
ఇక్కువ శ్రీవేంకటేశ యెరిఁగీ నామనసు ॥చెప్పి॥ 589

లలిత

సేయఁగలపని మాకుఁ జెప్పవమ్మా
యీయెడ కాతఁడు వచ్చె నెదురుకోవమ్మా ॥పల్లవి॥

భావములోపలనున్న పంతపునీరమణుఁడు
కైవశము నీకు నాయఁగదవమ్మా
ఆవటించి నిన్ను నింత ఆరడిఁబెట్టినవాఁడు
నోవిలేకుండాఁ జెక్కునొక్కెఁగదవమ్మా ॥సేయఁ॥

పేరుకొని ఇందాఁకాఁ బిలిపించుకొన్నపతి
యీరీతి నీతోడ యెక్కె నిదివోయమ్మా
సూరుఁడు నీవు యెదురుచూచి మోహించినవాఁడు
నేరుపుల నవ్వు నీపై నించెఁగదవమ్మా ॥సేయఁ॥

చేపట్టినపెండ్లాడిన శ్రీవేంకటేశ్వరఁ(రుఁ?)డు
యేపున నిన్నుఁ గూడె నిఁకనేమమ్మా
తీపగునీకు మోవిచ్చి తేనెమరపినవీఁడు
నీపొందులే మరిగి నిలిచెఁగదవమ్మా ॥సేయఁ॥ 590

సావేరి

నేనెంతకోపినైన నీకేల చలము
 పూనిపట్టి నాకు నీవు బుద్ధిచెప్పరాదా ॥ పల్లవి ॥

బీరములాడేవారికి బిరుదులే యెక్కుఁగాక
 వోరుపుగలవారికి వొరటున్నదా
 నేరుపుగలవాఁడవు నేనేమనిన నీవు
 ఆరితేరి చుట్టమవై అండనే వుండరాదా ॥ నేనెం ॥

తెగువగలవారికి దిమ్ము లట్టె రేఁగుఁగాక
 మొగమోడేవారికి మోసమున్నదా
 తగవరివట నీవు తత్తరించి నే మీరితే
 నగుతా నన్ను బోదించి నమ్మించరాదా ॥ నేనెం ॥

వాసులువట్టేవారికి వట్టిజోలి మించుఁగాక
 నేసవెట్టినవారికి సిగ్గులున్నవా
 ఆసతో శ్రీవేంకటేశ ఆయము లు నే నంటితే
 యీసులేక కూడితివి యిఁక మెచ్చరాదా ॥ నేనెం ॥ 591

సాళంగనాట

ప్రియురాలితోనేల బీరాలు
 జయమంది రాకాసుల సాదించరాదా ॥ పల్లవి ॥

చిగురుమోవిదాన చిగురుమేనిదాన
 చిగురుచిత్తముదాన చెప్పేదేమి
 నగుతానే సరసాన నాతోనేల పెనఁగేవు
 పగవారిమీఁద నీబలువు చూపరాదా ॥ ప్రియు ॥

తామెరకన్నులదాన తామెరచేతులదాన
తామెరమోముదాన తడవేదేమి
సాముసేసిసేసి మాచన్నులేల పిసికేవు
దోమటిబూతకిమీఁద తొడుకఁగరాదా ॥ ప్రియ ॥

తీగెబుజములదాన తీగెకోరికలదాన
తీగెమెఱుఁగులదాన తెలిసేదేమి
యీగతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితి । నీ –
జాగులు చప్పనాతికే చల్లి చూపరాదా ॥ ప్రియ ॥ 592

పాడి

ఇట్టాయఁ బనులు యిఁక నేమనందు నిన్ను
గుట్టు బయలుసేసేవు గుణివంటా నుంటిని ॥ పల్లవి ॥

మతకము నేరుతుము మాటలాడ నేరుతుము
కతకుఁ గాళ్లదిగితే కడమ నేర
బతిమాలి నే నీకు బానిసననుకున్నాను
రతికిఁ దీసేవు నీవు రాజవంటా నుంటిని ॥ ఇట్టా ॥

నంటుసేయనోపుదుము నగ నీతో నోపుదుము
ముంటికి వాఁడివెట్టఁగ ముందే వోపము
గొంటరినై నే నీకు కుంటెన నడచేనన్నా
జంటల మొక్కవచ్చేవు జాణవంటా నుంటిని ॥ ఇట్టా ॥

వంకలాడనెఱుఁగుదు వలవఁగ నెఱుఁగుదు
తెంకాయలో నీటికి తెరువెఱఁగ
మంకుగొల్లదాననన్నా మన్నించి నన్నుఁ గూడితి
పొంకపుశ్రీవేంకటేశ భోగివంటా నుంటిని ॥ ఇట్టా ॥ 593

దేసాళం

అటువంటిది గలితే నానతీవయ్యా
యెటువంటిమగవాఁడ వేమిచెప్పేవయ్యా ॥ పల్లవి ॥

చనవుసేసుక నీతో సరసములాడితేను
కొనగోరుదాఁకెనంటా గుంపించేవు
వెనకటిచెలులెల్లా వినోదములాడేవేళ
మనసిజముద్రలకు మాన్యమిచ్చిరా ॥ అటు ॥

మచ్చికచేసుక నీతో మాటలు నేనాడితేను
యెచ్చుకుందులున్నవంటా యెగ్గుపట్టేవు
అచ్చమైనరతివేళ ఆగువారెల్లాఁ గూడి
పచ్చిమాటలాడుమని బాసయిచ్చిరా ॥ అటు ॥

కూరిమి సేసుక నిన్నుఁ గూడఁగా శ్రీవేంకటేశ
మేరలుమీరితినంటా మించివచ్చేవు
కోరిక కాఁగిట నీకు గోపసతులెల్లాను
మారుకొనమని నీకు మన్ననిచ్చిరా ॥ అటు ॥ 594

రేకు 1100 ఆహిరి

నీయంత నీవెఱిఁగి మన్నింతువుగాక మమ్ము
దాయగానివలె బొంకఁదగునా నీకు ॥ పల్లవి ॥

తేరినపనులకు తియ్యనిమోవులకు
దారదప్పక నవ్వేవు తగునా నీకు
నేరుపరిచేఁతలెల్లా నీమేన నుండఁగానే
తారుకాణించవచ్చేవు తగునా నీకు ॥ నీయం ॥

కప్పురపుమాటలకు గట్టియైనచన్నులకు
తప్పకచూచే విట్టే తగునా నీకు
కుప్పళించి నీసతులు కొలువులో నుండఁగాను
తప్పక అనవెట్టేవు తగునా నీకు ॥ నీయం ॥

పొగరుమాకళలకు భోగించేమానేర్పులకు
తగిలి మమ్ము మెచ్చేవు తగునా నీకు
నిగిడి శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గలసితి
దగదొట్టి అలసేవు తగునా నీకు ॥ నీయం ॥ 595

నాదరామక్రియ

ఆతనికంటె జాణవవుదువే నీవు
చేతికి లోనుచేసుక సిగ్గులువడేవు ॥పల్లవి॥

మచ్చిక నాతఁడు నీమనసుచూడవలసి
నెచ్చెలియొకతెవంక నిక్కిచూచెను
అచ్చలాన నీవంతలో నాతనికన్నులు మూసి
పెచ్చుపెరుగుచు నీపేరు చెప్పుమనేవు ॥ ఆత ॥

రంతులనీపతి నిన్ను రాఁపులు సేయవలసి
చెంతల వేరొకతెకు చేయిచాఁచెను
పంతాన నీవంతలోనే బాగాలు చేతికిచ్చి
వింతలుగ దోమతెర వేసేవు నీవు ॥ ఆత ॥

శ్రీవేంకటేశుఁడు నీచే చెనకించుకోవలసి
పూవుల నొకతెమీఁద పూఁచివేసెను
ఆవల నీవంతలోనే యద్దము వచ్చి నిలిచి
కైవసము చేసుకొని కాఁగిలించుకొంటివి ॥ ఆత ॥ 596

రామక్రియ

ముందువెన కెఱఁగవు మోహామున నీవతని
.పొందుల నీకొనగోళ్ళఁ బోట్లాడేవా ॥ పల్లవి ॥

మంచముపైఁ గూచుండి మాఁటలకుఁబెట్టి నీతో
కంచముపొత్తుకుఁ దీసి కడి యందిచ్చెను నీకు
యించుకంతాఁ గరఁగవు ఇదియేమే నీవతని
మంచుక నీబొమ్మలను ముళ్ళఁబెట్టేవా ॥ ముందు ॥

జలకేలినేసేచోట సరసములెల్లా నాడె
కొలఁకులోపల నుండి కోరి తొడెక్కించుకొనె
కలసీఁగలయవు నీకై వశమైనయతని
మొలకనీచన్నులనే మొనలుచూపేవా ॥ ముందు ॥

కాఁగిటిలో నినుఁ గూడి కందువలెల్లా నంపె
మాఁగినమోవిరసాల మచ్చిక చూపె
చేఁగదేరఁ గూడితివి శ్రీవేంకటేశ్వరుని
పాఁగినతమకములఁ బచ్చినేసేవా ॥ ముందు ॥ 597

సౌరాష్ట్రం

నేరమెల్లా నేరుపాయ నీవంకను
యీరీతి నిన్నుదూరి యేమినేసే మీఁకను ॥ పల్లవి ॥

సిగ్గులు చేతికివచ్చె చింతలు మతికి దక్కె
నిగ్గులయీవనితకు నీవంకను
దగ్గరి నీవే దయదలఁతువుగాక యిఁక
యెగ్గుపట్టి నేము నిన్ను యేమినేసే మీఁకను ॥ నేర ॥

చెఱఁగు ముఁ(ముం?)జేత జాఱె చెమట మడుగుగట్టె
నెఱవుగఁ జెలియకు నీవంకను
గిఱికొన మన్నించి కీరితిఁ బొందుదుగాక
యెఱిఁగించితి నిన్ను యేమిసేసే దిఁకను ॥ నేర ॥

పులకలు రాసిపడె పొందులు దగ్గరివచ్చె
నిలువులఁ గామినికి నీవంకను
అలరి శ్రీవేంకటేశ అట్టె కూడితివిగాక
యెలమి నేమెల్లా మొక్కి యేమిసేసే మిఁకను ॥ నేర ॥ 598

గౌళ

కొంగువట్టి తియ్యనేల కోరి బుజ్జగించనేల
ముంగిటనే వున్నారము మొదల నీవారమే ॥ పల్లవి ॥

కులికి నీచూపులకు గురియైనమీఁదట
నిలుచుకవుండినను నీవారమే
పిలిపించి నీవు లోనఁబెట్టుకొన్నమీఁదట
నెలకొని యాడనున్నా నీవారమే ॥ కొంగు

సారె నీవు మాతోను సరసమాడినమీఁద
నేరక మాటాడినాను నీవారమే
చేరి నీవు మాపయిని నేసవెట్టినట్టిమీఁద
నేరక కొసరినాను నీవారమే ॥ కొంగు ॥

భావించి నీకు నేను పదఁతినయినమీఁద
నీవు మమ్ముఁ గూడినాను నీవారమే (?)
శ్రీవేంకటేశ నన్నుఁ జేరి కూడితి విదివో
నీవిధాలు గన్నమీఁద నీవారమే ॥ కొంగు ॥ 599

## తెలుఁగుఁగాంబోది

రావయ్య యిఁకనూ రమణుఁడ లోనికి
యీవలఁ జలము మనకిఁకనేలయ్యా ॥ పల్లవి ॥

వాసులెల్లా నామాఁట వన్నెలెల్లా నీమాఁట
నేసినట్టెల్లా మనకుఁ జెల్లునయ్యా
వేసరవు మనసులు వేడుకైనరతులకు
యీసులు రేసులు మనకిఁకనేలయ్యా ॥ రావ ॥

పంతమెల్లా నాసొమ్ము పలుకెల్లా నీసొమ్ము
చెంతలఁ జేసినవెల్లాఁ జెల్లునయ్యా
దొంతినే తమకములు దోమటిదొడుకఁజొచ్చె
యింతలోనే బిగువులు ఇఁకనేలనయ్యా ॥ రావ ॥

యెగ్గులు నేఁ బట్టితి యెమ్మెలు నీవు సేసితివి
సిగ్గులువిడువ నీఁకఁ జెల్లునయ్యా
అగ్గమై శ్రీవేంకటేశ అన్నిటాఁ గూడి తిమిదె
యిగ్గుచునుందము వెర పిఁకనేలయా ॥ రావ ॥ 600

శ్రీః శ్రీః శ్రీః

# 1-వ అనుబంధము

## అకారాదిగ రాగ, సంకీర్తనసంఖ్యాసూచి

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| అమరసింధు | 244. |
| ఆందోళి | 20, 361, 532. |
| ఆహిరి | 22, 96, 111, 138, 166, 219, 231 241, 255, 293, 296, 324, 325, 330, 348, 352, 371, 387, 400, 414, 416, 430, 447, 456, 468, 469, 494, 500, 524, 540, 567, 575, 595. |
| ఆహిరినాట | 391, 440, 501, 528. |
| కన్నడగౌళ | 331, 476, 491, 504. |
| కాంబో(భో)ది | 12, 66, 136, 169, 177, 261, 306, 341, 392. 418, 437, 536, 544, 550, |
| కేదారగౌళ | 93, 154, 374, 402, 477, 502. |
| గుండక్రియ | 70, 286, 305, 312, 434, 547. |
| గుజ్జరి | 237, 562. |
| గౌళ | 128, 201, 218, 327, 377, 380, 449, 461, 465, 482, 538, 555, 580, 599. |
| ఛా(చా)యానాట | 496. |
| తెలుఁగు కాం(గాం)బోది | 13, 29, 115, 310, 353, 390, 472, 557, 600. |

| రాగములు | | సంకీర్తనసంఖ్యలు |
|---|---|---|
| తోండి | .... | 26, 368, 455. |
| దేవగాంధారి | .... | 31, 37. 250, 253, 266, 337, 379, 450, 525. |
| దేశా(సా)క్షి | .... | 25, 175, 243, 338, 398, 415, 517. |
| దేశి | .... | 345, 513. |
| దేసాళం | .... | 15, 18, 59, 91, 94, 151, 203, 221, 247, 260, 288, 334, 372, 397, 407, 435, 443, 463, 483, 515, 548, 569, 594. |
| ధ(ద)న్నాశి(సి) | .... | 109, 423. 438. |
| నాగవరాళి | .... | 24, 360. |
| నాట | .... | 141, 230, 271, 446, 458. |
| నాదరామక్రియ | .... | 74, 126, 157, 216, 246, 282, 350, 357, 366, 426, 479, 596, |
| నారాయణ దేసాక్షి | .... | 254, 318. |
| నారాయణి | .... | 162, 248, 473, 565. |
| నీలాంబరి | .... | 302. |
| పడ(డి)(ళ)వంజరం | .... | 223, 362, 439, 586. |
| పాడి | .... | 33, 41, 45, 113, 132, 137, 153, 174, 196, 204, 209, 227, 247, 269, 285, 289, 311, 339, 342, 381, 386, 399, 405, 417, 462, 467, 495, 503, 506, 537, 549, 564, 578, 593. |

| రాగములు | | సంకీర్తనసంఖ్యలు |
|---|---|---|
| బలహాంస | .... | 587. |
| బౌళి(భవుళి) | .... | 8, 42, 64, 72, 81, 98, 99, 161, 185, 200, 226, 279, 317, 320 336, 375, 393, 410, 419, 420, 459, 487, 518, 541, 559, 563. |
| బౌ(భౌ)ళిరామక్రియ | .... | 148. |
| భూపాళం | .... | 38. |
| భైరవి | .... | 2, 32, 54, 63, 86, 95, 104, 107, 122, 130, 134, 171, 181, 220, 272, 294, 322, 347, 383, 401, 425, 436, 460, 489, 512, 527, 556. |
| మంగళకౌశిక | .... | 149, 190, 295, 585. |
| మధ్యమావతి | .... | 21, 235, 370, 432, 526. |
| మలహరి | .... | 281. |
| మాళవి | .... | 9, 105, 300, 303, 403, 534. |
| మాళవిగౌళ | ... | 14, 77, 167, 179, 239, 258, 297, 354, 364, 493, 522, 577. |
| ముఖారి | .... | 23, 43, 50, 83, 101, 114, 123, 139, 145, 152, 164. 170, 193, 207, 213, 257, 307, 328, 332, 344, 376, 427, 431, 453, 490, 523, 529, 560, 584. |
| రామక్రియ | .... | 34, 39, 67, 76, 79, 82, 97, 106, 124, 127, 133, 142, 150. |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
| --- | --- |
| | 160, 168, 183, 194, 199, 206 214, 228, 229, 249, 252, 256, 273, 292, 316, 358, 388, 421, 442, 451, 457, 498, 521, 535, 543, 558, 571, 588, 597. |
| రీతిగౌళ | .... 276, 355, 445, 553. |
| లలిత | .... 5, 60, 112, 116, 125, 144, 165, 180, 189, 222, 259, 287, 314, 335, 369, 396, 428, 444, 454, 481, 507, 519, 533, 566, 572, 579, 590. |
| వరాళి | .... 1, 16, 44, 46, 51, 187, 217, 224, 225, 263, 265, 284, 299, 309, 409, 422, 483, 470, 514, 531, 551, 581. |
| వసంతవరాళి | .... 340, 378. 466. |
| వేళావళి | .... 56, 119, 373, 484. |
| శంకరాభరణం | .... 6, 28, 35, 47, 58, 65, 69, 71, 73, 84, 90, 100, 103, 118, 135, 159, 186, 192, 195, 198, 205, 212, 234, 240, 251, 262, 278, 304, 308, 315, 356, 365, 382, 389, 413, 480. 497, 520, 552, 570. |

| రాగములు | | సంకీర్తనసంఖ్యలు |
|---|---|---|
| శ్రీరాగం | .... | 19, 87, 92, 117, 131, 156, 191, 232, 270, 275, 290, 291, 321, 363, 384, 424, 441, 464, 474, 509, 511, 530, 554, 574. |
| శుద్ధదేశి | .... | 147, 577. |
| శుద్ధవసంతం | .... | 27, 55, 78, 88, 245, 326, 333, 346, 412, 486, 499, 545, 583. |
| సామంతం | .... | 3, 4, 7, 17, 30, 40, 53, 57, 62, 68, 75, 80, 85, 108, 110, 120, 121, 129, 140, 155, 158, 172, 184, 188, 197, 202, 211, 233, 268, 274, 277, 298, 301, 313, 343, 394, 408, 411, 448, 475, 505, 542, 561, 568. |
| సాళంగం | .... | 10, 61, 102, 146, 163, 176, 178, 210, 236, 267, 367, 429, 492. |
| సాళంగనాట | .... | 11, 36, 52, 143, 173, 182, 215, 238, 264, 319, 385, 406, 452, 471, 485, 510, 546, 576, 592. |
| సింధురామక్రియ | .... | 349, 478, 582, 591. |
| సౌరాష్ట్రం | .... | 89, 208, 283, 323, 395, 488, 508, 539, 598. |
| హిందోళం | ... | 49, 280, 329. |
| హిందోళ వసంతం | .... | 48, 351, 359, 516. |
| హిజ్జిజి (జ్జి) | .... | 404, 589. |

# 2-వ అనుబంధము

## అకారాదిగ సంకీర్తన, రాగ, సంఖ్యాసూచి

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య. |
|---|---|---|
| అందకేఁగి | సామంతం | 211 |
| అందనుండే | శుద్ధవసంతం | 333 |
| అందనే | సామంతం | 172 |
| అంతనీవు | రామక్రియ | 183 |
| అంతమమ్ము | నాగవరాళి | 24 |
| అంతలోనే | శ్రీరాగం | 554 |
| అంతేకాదా | భైరవి | 54 |
| అందపువిభుఁడు | ముఖారి | 145 |
| అందరివంటిది | ఆహిరి | 387 |
| అందరునుచుట్టాలే | లలిత | 579 |
| అందరును విన | తెలుఁగుఁగాంబోది | 29 |
| అందాఁకా | ముఖారి | 23 |
| అందిఇతవు | సాళంగం | 61 |
| అందుకుఁగా | మాళవి | 534 |
| అందుకునిందు | పాడి | 45 |
| అందుకుసరికి | పళవంజరం | 223 |
| అందుకేపో | నాట | 271 |
| అందుకేమి | పాడి | 386 |
| అందుకేమి | దేసాళం | 372 |
| అందుకేమి | కాంబోది | 136 |
| అందుకైతే | దేసాళం | 515 |
| అటువంటిది | దేసాళం | 594 |
| అటువంటినిన్నే | సాళంగనాట | 319 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అటువంటివాని | సౌరాష్ట్రం | 539 |
| అట్టేమేలు | బౌళి | 8 |
| అతఁడు | శంకరాభరణం | 413 |
| అతనికివెల్లా | శంకరాభరణం | 73 |
| అతనిమన్ననే | మధ్యమావతి | 235 |
| అతనిమీరే | శంకరాభరణం | 240 |
| అదినా | భైరవి | 272 |
| అదియేమరకు | ఆహిరి | 296 |
| అదేరాముఁడు | సాళంగం | 178 |
| అననింకేమున్న | బౌళిరామక్రియ | 148 |
| అనుమానానకు | ముఖారి | 207 |
| అనుమానాలిఁక | బౌళి | 72 |
| అన్నినీవే | సామంతం | 394 |
| అన్నియు | రీతిగౌళ | 355 |
| అప్పటికప్పుడేకాక | నాట | 141 |
| అప్పటికప్పుడే చెప్పే | ముఖారి | 257 |
| అప్పటికిప్పుడు | పాడి | 578 |
| అప్పటికోప | ఆహిరి | 447 |
| అప్పటినన్నేల | గౌళ | 377 |
| అప్పటినాకే | సాళంగనాట | 173 |
| అప్పటినీ | శుద్ధవసంతం | 27 |
| అప్పటినొడఁబాటేల | సాళంగనాట | 264 |
| అప్పటిమానవు | ముఖారి | 152 |
| అప్పుడే | లలిత | 222 |
| అబ్బెనాకు | శంకరాభరణం | 28 |
| అయ్యోనీకు | సామంతం | 120 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అలపు దీర్చు | భూపాళం | 38 |
| అలిగితినా | రామక్రియ | 214 |
| అలుకలు | శంకరాభరణం | 6 |
| ఆకెకునీకుఁదెలుసు | శుద్ధవసంతం | 486 |
| ఆకెకు నీకుఁబోవు | హిజ్జిజి | 404 |
| ఆడఁగల | ఆహిరి | 330 |
| ఆడరాదు | సాళంగం | 236 |
| ఆడుకోఁగలి | శ్రీరాగం | 87 |
| ఆడేబొమ్మలు | కాంబోది | 392 |
| ఆతఁడదె | మధ్యమావతి | 370 |
| ఆతఁడిదె | రామక్రియ | 457 |
| ఆతనికంటే | నాదరామక్రియ | 596 |
| ఆనలేలయ్యా | కాంబోది | 177 |
| ఆపెకావలె | రామక్రియ | 543 |
| ఆయనాయఁజా | సామంతం | 411 |
| ఆయనాయచాలు | లలిత | 481 |
| ఆయనాయయింద | దేసాళం | 397 |
| ఆయలేరా | సామంతం | 277 |
| ఆఱడిఁబెట్టీ | ముఖారి | 139 |
| ఆసపడ్డ | వరాళి | 531 |
| ఇంకనీవు | కేదారగౌళ | 502 |
| ఇంకనేల దూరు | ముఖారి | 170 |
| ఇంకనేలమఱఁగూ | వేళావళి | 484 |
| ఇంకనేలేకొంక | బౌళి | 393 |
| ఇంకనేలేనీ | శంకరాభరణం | 304 |
| ఇంకానేమౌనో | వరాళి | 1 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇంచుకంత | సామంతం | 274 |
| ఇంటికి | రామక్రియ | 273 |
| ఇంతకంటె | శంకరాభరణం | 58 |
| ఇంతగలుగ | బౌళి | 336 |
| ఇంతటనుఁగరు | శ్రీరాగం | 474 |
| ఇంతటనైన | కన్నడగౌళ | 331 |
| ఇంతటి | పాడి | 564 |
| ఇంతలాయ | వరాళి | 284 |
| ఇంతలోఁగోపము | శుద్ధవసంతం | 55 |
| ఇంతలోరమణుఁడ | భైరవి | 104 |
| ఇంతిచనవు | భైరవి | 466 |
| ఇంతినే | పాడి | 196 |
| ఇంతిరో | భైరవి | 63 |
| ఇందాఁకా | శ్రీరాగం | 441 |
| ఇందుకు | ముఖారి | 43 |
| ఇటమీఁద | పాడి | 289 |
| ఇటమీఁది | భైరవి | 95 |
| ఇటునీకు | బౌళి | 42 |
| ఇటువలె | కేదారగౌళ | 402 |
| ఇట్టాయఁ బను | పాడి | 593 |
| ఇట్టెనన్నుఁగరు | ఆహిరి | 469 |
| ఇదిగొంత | భైరవి | 383 |
| ఇదివోదిష్టము | ఆహిరి | 468 |
| ఇదివోమావాళ్లి | ఆహిరి | 456 |
| ఇదెయదె | నాదరామక్రియ | 126 |
| ఇదెశిరసు | రామక్రియ | 229 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇద్దరమునిద్దరమె | ఆందోళి | 361 |
| ఇద్దరమునిద్దరమే | రామక్రియ | 442 |
| ఇద్దరమునున్నారము | పాడి | 467 |
| ఇద్దరికిఁబోవు | శంకరాభరణం | 159 |
| ఇద్దరికూట | లలిత | 5 |
| ఇద్దరితో | గుండక్రియ | 547 |
| ఇద్దరుఁ గూ | రామక్రియ | 421 |
| ఇన్నిటాజాణఁడ | సామంతం | 561 |
| ఇన్నిటాను | బౌళి | 459 |
| ఇన్నియునీ | పాడి | 269 |
| ఇన్నియునుఁగాన | దేసాళం | 569 |
| ఇన్నిసుద్దులును | దేసాళం | 203 |
| ఇప్పట | శంకరాభరణం | 65 |
| ఇప్పుడువిచ్చేసితి | హిందోళవసంతం | 516 |
| ఇప్పుడువేగిర | రామక్రియ | 160 |
| ఇరవయి | తెలుఁగుఁగాంబోది | 390 |
| ఇరవైన | వరాళి | 265 |
| ఇల్లాండ్ల | మాళవిగౌళ | 573 |
| ఇవినీకొక్కని | గుండక్రియ | 305 |
| ఈడనెవ్వరి | రామక్రియ | 32 |
| ఈడమాతో | పాడి | 242 |
| ఈదేరిచిన | శంకరాభరణం | 480 |
| ఈపాటివుపచార | దేసాళం | 443 |
| ఈరుఁదియ్య | వరాళి | 225 |
| ఈ విన్నపము | శ్రీరాగం | 464 |
| ఉన్నవేమీ | నీలాంబరి | 302 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఊడిగపు | లలిత | 335 |
| ఊరకున్న | దేశాక్షి | 25 |
| ఊరకేఅలుగకు | దేసాళం | 483 |
| ఊరకే చక్కజాదతో | పాడి | 506 |
| ఊరకేవున్న | లలిత | 369 |
| ఎంచితేనావల్ల | ముఖారి | 490 |
| ఎంతగద్దు | మాళవి | 403 |
| ఎంతచెప్పినా | దేశాక్షి | 243 |
| ఎంతదవ్వయిన | సామంతం | 301 |
| ఎంతనీవు | లలిత | 566 |
| ఎంతనేర్చె | రామక్రియ | 142 |
| ఎంతపని | ముఖారి | 431 |
| ఎంతమీఁదు | లలిత | 144 |
| ఎంతయిన | ముఖారి | 584 |
| ఎంతలేగిరకాఁడమ్మ | వసంతవరాళి | 466 |
| ఎంతవేగిరకాఁడవు | బౌళి | 410 |
| ఎంతవేగిరకాఁడే | సౌరాష్ట్రం | 208 |
| ఎంతైనా | నారాయణి | 248 |
| ఎందరు | సింధురామక్రియ | 582 |
| ఎందాఁకాజోలి | గౌళ | 128 |
| ఎందాఁకానలుకలు | భైరవి | 425 |
| ఎందాఁకానీ | వేళావళి | 119 |
| ఎందుకని | కాంబోది | 437 |
| ఎందుకురోయని | గౌళ | 461 |
| ఎందువోయే | లలిత | 454 |
| ఎక్కువతక్కువ | సింధురామక్రియ | 349 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎగ్గువట్టి | కాంబోది | 66 |
| ఎచ్చరించ | నాదరామక్రియ | 74 |
| ఎటువంటివలపో | సాళంగం | 267 |
| ఎటువంటివేడుకలో | మధ్యమావతి | 21 |
| ఎట్టుండునో | సామంతం | 184 |
| ఎట్టుగూడెఁబెండ్లి | గౌళ | 201 |
| ఎట్టునమ్మవచ్చు | శుద్ధదేశి | 147 |
| ఎట్టు నేరిచితి | మాళవి | 105 |
| ఎదమాట | దేసాళం | 247 |
| ఎదురుగుదురుగా | రామక్రియ | 150 |
| ఎదురుమాటలు | రామక్రియ | 571 |
| ఎదురైతి | భైరవి | 134 |
| ఎన్నటి | శంకరాభరణం | 90 |
| ఎన్నిలేవు | నాదరామక్రియ | 426 |
| ఎప్పటివాఁడ | సామంతం | 202 |
| ఎప్పుడునీదాననే | కేదారగౌళ | 374 |
| ఎప్పుడును | పాడి | 417 |
| ఎప్పుడుమీకే | దేసాళం | 151 |
| ఎమ్మెలనాలి | దేసాళం | 334 |
| ఎమ్మెలు | శంకరాభరణం | 382 |
| ఎరవుల | నారాయణి | 565 |
| ఎఱఁగక | భైరవి | 107 |
| ఎఱఁగఁడు | శంకరాభరణం | 135 |
| ఎఱఁగము | వరాళి | 470 |
| ఎఱుఁగుదు | రామక్రియ | 388 |
| ఎవ్వరిఁబొగడు | లలిత | 507 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తన |
|---|---|---|
| ఎవ్వరికి | శంకరాభరణం | 356 |
| ఎవ్వరినైనా | రామక్రియ | 451 |
| ఎవ్వరిబలుష | రీతిగౌళ | 553 |
| ఎవ్వరు | లలిత | 259 |
| ఎవ్వరూంద | పాడి | 311 |
| ఏంటికి అనుమానాలు | పాడి | 405 |
| ఏంటికినన్ను | శ్రీరాగం | 275 |
| ఏంటికిసిగ్గులు | భైరవి | 489 |
| ఏకచిత్తమున | ఆహిరి | 324 |
| ఏకమైవుండిన | బౌళి | 375 |
| ఏటికి వేగిరపడే | సాళంగనాట | 576 |
| ఏదనున్నా | ఆహిరి | 293 |
| ఏదలేని | శ్రీరాగం | 574 |
| ఏదినిజమని | ఆహిరి | 430 |
| ఏపులను | పాడి | 113 |
| ఏమంటే | శంకరాభరణం | 315 |
| ఏమనిచెప్పుదు | రామక్రియ | 168 |
| ఏమనిచెప్పేనే | సాళంగం | 10 |
| ఏమనివిన్న | శుద్ధవసంతం | 583 |
| ఏమనేవో | వరాళి | 51 |
| ఏమన్నానంటివి | గౌళ | 538 |
| ఏమన్నానన | సామంతం | 4 |
| ఏమయ్యా | సౌరాష్ట్రం | 323 |
| ఏమరించి | లలిత | 116 |
| ఏమాయనిందుకు | మాళవిగౌళ | 167 |
| ఏమాయనీకిందుకు | గుజ్జరి | 562 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏమిటికి బుద్ధి | సాళంగనాట | 546 |
| ఏమి దప్పిపోయ | దేసాళం | 407 |
| ఏమిసేతునమ్మ | భైరవి | 220 |
| ఏమిసేతునిఁక | ఆహిరి | 255 |
| ఏమిసేతురమణుఁడ | లలిత | 125 |
| ఏమిసేయఁగల | వరాళి | 422 |
| ఏమిసేయు | దేసాళం | 221 |
| ఏమిసేసీనని | భైరవి | 527 |
| ఏమీనెఱఁగని | శ్రీరాగం | 131 |
| ఏమైనా | దేశి | 513 |
| ఏరానన్నింత | బౌళి | 559 |
| ఏలబూటకము | సామవరాళి | 492 |
| ఏలమమ్ము | గుజ్జరి | 237 |
| ఏలమాను | ముఖారి | 332 |
| ఏలయ్యమాకు | ముఖారి | 529 |
| ఏలరా | దేశాక్షి | 175 |
| ఏలలోఁగీ | సామంతం | 408 |
| ఏలవూరకున్నదాన | సామంతం | 17 |
| ఏల వూరకున్నాఁడవు | తోండి | 455 |
| ఏల వూరకున్నాఁడవో | ముఖారి | 122 |
| ఏల వేగిరించేవు | నాదరామక్రియ | 366 |
| ఏలినవారికి | లలిత | 519 |
| ఏలేమనసుద్దులు | దేవగాంధారి | 250 |
| ఏరే రమణునికి | రామక్రియ | 256 |
| ఏలో తెలియదు | శంకరాభరణం | 100 |
| ఏళ్ల వెనకవే | తెలుఁగుఁగాంబోది | 13 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఐతేనేమిదోసము | రామక్రియ | 535 |
| ఒక్కపై | ఆహిరి | 138 |
| ఒక్కమాఁటి | దేసాళం | 94 |
| ఒక్కరీతి | సామంతం | 68 |
| ఒట్టులేల | శంకరాభరణం | 303 |
| ఒద్దనుంచేఁజెప్ప | లలిత | 165 |
| ఒద్దువొద్దు | నాట | 446 |
| ఒల్లనని | రామక్రియ | 97 |
| ఓపినదానఁగాను | రామక్రియ | 521 |
| ఓయమ్మ ఇంతయేల | సామంతం | 62 |
| ఓయమ్మ తనపొందు | ఆహిరి | 231 |
| ఓరిచితేఁజుట్ట | సామంతం | 108 |
| ఔరాలెస్సా | ఛాయానాట | 496 |
| ఔలేయెటుఁగితిమి | గౌళ | 465 |
| కంటిమిగా | సాళంగం | 102 |
| కంటిమి నీజాడ | నారాయణదేశాక్షి | 318 |
| కటకటా | భైరవి | 181 |
| కనీఁగానము | వరాళి | 46 |
| కన్నులు | సామంత | 110 |
| కన్నెవయసు | శంకరాభరణం | 262 |
| కరుణగల | దేశి | 345 |
| తలదా తొల్లి | నాట | 230 |
| కలదిదె | హిందోళవసంతం | 351 |
| కల్లగాదు | నాదరామక్రియ | 479 |
| కల్లసుమ్మీ | బౌళి | 81 |
| కాంతునివలపు | ఆహిరి | 22 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కాఁకసేయఁద | శ్రీరాగం | 92 |
| కాతరాన | ఆహిరి | 567 |
| కానవచ్చిన | సామంతం | 568 |
| కానీకానీపదవే | సామంతం | 53 |
| కానీకానీయందుకేమి | గుండక్రియ | 286 |
| కానీకానీయందుకేమి | వరాళి | 263 |
| కానీకానీయిఁకనేల | బౌళి | 185 |
| కానీకానీలేరా | శుద్ధవసంతం | 245 |
| కానీకానీలేవే | నాదరామక్రియ | 216 |
| కానీవే | బౌళి | 487 |
| కాలములారు | శుద్ధవసంతం | 88 |
| కుచ్చితము | వసంతవరాళి | 340 |
| కూడినమీఁదట | బౌళి | 419 |
| కూరిమి | కేదారగౌళ | 93 |
| కొంకకనావద్ద | ఆహిరినాట | 440 |
| కొంకనేల | బౌళి | 563 |
| కొంకితినందుకే | శంకరాభరణం | 365 |
| కొంగువట్టి | గౌళ | 599 |
| కొన్నదె | రీతిగౌళ | 276 |
| కోరినట్టే | సామంతం | 3 |
| క్షీరాబ్ధి కన్యకకు | మంగళకౌశిక | 295 |
| గందమందు | పాడి | 537 |
| గుట్టుతోడ | గౌళ | 327 |
| గుట్టుతోడి | రామక్రియ | 124 |
| గుట్టుతోనే | శంకరాభరణం | 34 |
| ఘనుఁడవు | శ్రీరాగం | 363 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
| --- | --- | --- |
| ఘనుఁడు | శంకరాభరణం | 103 |
| ఘాత నలుపుఁదె | రామక్రియ | 316 |
| చంక గుదియ | సామంతం | 155 |
| చవిగానిపని | పళవంజరం | 362 |
| చాలుఁజాలు | బౌళి | 98 |
| చిత్తగించినీవే | నారాయణి | 473 |
| చిత్తగించిమాపై | దేవగాంధారి | 337 |
| చిత్తగించురమణుఁడ | శ్రీరాగం | 384 |
| చిత్తజగురుఁడ | లలిత | 189 |
| చిత్తముకొలఁది | కాంబోది | 341 |
| చిత్తమువచ్చినట్టు | భైరవి | 171 |
| చిత్తము వచ్చినయట్టు | బౌళి | 420 |
| చిన్నదానఁజేసి | భైరవి | 322 |
| చూడరమ్మ చెలులార | సాళంగనాట | 452 |
| చూడరమ్మ చెలులాల | సామంతం | 197 |
| చూతమింక | పాడి | 33 |
| చూతుఁబో | కాంబోది | 308 |
| చూతువువిచ్చేయ | తెలుఁగుఁగాంబోది | 472 |
| చెప్పనేలనీసుద్దులు | సాళంగనాట | 485 |
| చెప్పరాదు మీ | రామక్రియ | 292 |
| చెప్పితి మాసాజము | హిజ్జిజి | 589 |
| చెప్పినట్టునేతుఁగాక | దేవగాంధారి | 379 |
| చెప్పినట్టునేతుగాక | కేదారగౌళ | 477 |
| చెలియరో | సామంతం | 80 |
| చెలియామరి | ఆహిరి | 416 |
| చెలులమునేమన్న | తోండి | 368 |
| చెలులము మాకీ | లలిత | 444 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చెలులార | లలిత | 180 |
| చెలువుఁడు | ముఖారి | 213 |
| చెల్లఁబో యింత | ఆహిరి | 241 |
| చెల్లినట్లు నీవే | మాళవి | 300 |
| చెల్లునా | బౌళి | 161 |
| చెల్లుబడి | ముఖారి | 50 |
| చేఁత సేసేవారు | ముఖారి | 307 |
| చేతికి లోనా | గౌళ | 482 |
| చేయిముట్టి | మాళవి | 9 |
| చేయివట్టి | ఆహిరి | 414 |
| చేరిచూడ | వరాళి | 299 |
| చేరియిందు | ముఖారి | 328 |
| చేసినవారి చేఁతలు | సాళంగనాట | 11 |
| తగనిన్నిటికి | వరాళి | 581 |
| తగవు నీవెఱఁగవా | సాళంగనాట | 143 |
| తగవోనగవో | నారాయణిదేశాక్షి | 254 |
| తగుదువమ్మ | శంకరాభరణం | 205 |
| తగునయ్య | మాళవి | 303 |
| తడఁబాట్లా | శ్రీరాగం | 509 |
| తడవకుమము | సాళంగం | 163 |
| తడవీ నూరక | పాడి | 174 |
| తతిపచ్చెనిఁక | బౌళి | 320 |
| తనకు నాకు | శంకరాభరణం | 389 |
| తనిసితిమిఁక | శంకరాభరణం | 234 |
| తనువులోదైవము | భైరవి | 86 |
| తలఁచిన | సౌరాష్ట్రం | 508 |
| తలఁచినప్పుడు | పళవంజరం | 586 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| తలవంచనేఁటికి | మాళవిగౌళ | 522 |
| తానెంతనేనెంత | ఆహిరినాట | 391 |
| తానేడోమననేడో | సామంతం | 121 |
| తానేనేనైన | శ్రీరాగం | 117 |
| తానేయెఱుఁగు | ఆహిరి | 219 |
| తానేవచ్చీఁగాక | లలిత | 572 |
| తాముఁదామెరఁగ | పాడి | 381 |
| తామెయెఱుఁగుదురు | భైరవి | 347 |
| తిట్టితేనేపెదవినే | శంకరాభరణం | 552 |
| తెలిసెఁగా నీగుణము | సాళంగం | 176 |
| తెలుసుకోయిఁక | నాగవరాళి | 360 |
| తెలుసుకోవయ్యా | బౌళి | 518 |
| తేనెపేరు నోరనంటే | సామంతం | 75 |
| తొడిఁబడ | దేవగాంధారి | 450 |
| తొలుతనే | పాడి | 204 |
| దగ్గరినప్పుడే | రామక్రియ | 199 |
| దయదలఁచే | శంకరాభరణం | 278 |
| దాఁచినవాఁడే | సామంతం | 475 |
| దిక్కులను | సాళంగం | 429 |
| దిమ్మరిమాట | శంకరాభరణం | 186 |
| దేవనీవునికి | ఆహిరి | 325 |
| దేవర విన్నిటా | భైరవి | 556 |
| దేవుఁడవు నీవు | రామక్రియ | 106 |
| దైవమే యెఱుఁగుఁగా | అమరసింధు | 244 |
| దొరతోఁ బొందు | సాళంగనాట | 215 |
| నంటున నీమేకు | శుద్ధవసంతం | 346 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నగినగివాదులేల | రామక్రియ | 76 |
| నగుఁ బాలు | సామంతం | 188 |
| నన్నుమీరఁడా | హిందోళం | 329 |
| నన్నేల యస | బౌళి | 541 |
| నయము గలుగ | మాళవిగౌళ | 493 |
| నవ్వినట్టివాఁడవు | ధన్నాసి | 438 |
| నవ్వునవ్వే | నారాయణి | 162 |
| నవ్వులు నవ్వించ | లలిత | 60 |
| నవ్వే దెలుఁగఁడు | శంకరాభరణం | 47 |
| నాఁటికి మరి | రామక్రియ | 252 |
| నాఁదేకన్నది | ముఖారి | 193 |
| నాకే నతమైతే | పాడి | 503 |
| నాటివాఁడనె | వరాళి | 224 |
| నాటివాఁడవేకాదా | మలహరి | 281 |
| నామాట | దేశాక్షి | 415 |
| నాయందుఁగడ | శ్రీరాగం | 511 |
| నాయకుఁడ | తెలుఁగుఁగాంబోది | 557 |
| నావంటి | వరాళి | 551 |
| నావొళ్లఁగల్ల | ఆహిరి | 500 |
| నిండుకున్నది | పాడి | 495 |
| నిండునాపాయము | శ్రీరాగం | 530 |
| నిచ్చనిచ్చ | శుద్ధవసంతం | 412 |
| నిచ్చలు నాపుణ్యము | ముఖారి | 560 |
| నిచ్చలు నాబతుకెల్ల | కన్నడగౌళ | 476 |
| నిచ్చానిచ్చా | సామంతం | 140 |
| నిజమరివి | వేళావళి | 56 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నిజమాఁడ | మాళవిగౌళ | 77 |
| నిన్ననరాని | పాడి | 549 |
| నిన్నుమంచివాఁడ | రామక్రియ | 133 |
| నిమిషముఁబాయ | శ్రీరాగం | 290 |
| నిలువుఁగొలువు | ఆహిరి | 166 |
| నిలువులమేడలో | శ్రీరాగం | 321 |
| నీకంటేమునుపను | పాడి | 132 |
| నీకుఁబోదు | పాడి | 462 |
| నీకునీకే | వరాళి | 514 |
| నీకెట్టుదెలుసును | సామవరాళి | 367 |
| నీకేలేమాగొడవ | సామంతం | 268 |
| నీగుణము చక్కనాయ | హిందోళవసంతం | 359 |
| నీడ చూడనిఁక | లలిత | 314 |
| నీతోఁబంతము | ఆహిరి | 348 |
| నీపాలివారము | గుండక్రియ | 312 |
| నీయంతనీవెఱిఁగి | ఆహిరి | 595 |
| నీయందునేరమిలేదు | ఆహిరి | 540 |
| నీరమణుని | లలిత | 428 |
| నీరువట్టు గొన్నచోట | మాళవిగౌళ | 239 |
| నీరు వట్టు గొన్న వేళ | సామంతం | 7 |
| నీవల్లఁగడమగద్దా | పాడి | 285 |
| నీవు మన్నించఁగా | ధన్నాసి | 109 |
| నీవు ముందు | శంకరాభరణం | 251 |
| నీవు సేసినదే | గౌళ | 580 |
| నీవూనీయంతనే | గుండక్రియ | 70 |
| నీవెటువలె | తెలుఁగుఁగాంబోది | 115 |

| • సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నీవెప్పుడూ | పాడి | 339 |
| నీవెఱఁగని | ఆహిరి | 352 |
| నీవేచనవిచ్చితివో | దేసాళం | 288 |
| నీవేయిన్నిటాఁగల | శుద్ధవసంతం | 545 |
| నీవేయెఱిఁగి | ఆహిరి | 494 |
| నీవేయెఱుఁగుదువు | ధన్నాసి | 423 |
| నీవే యెఱుఁగుదువునే | సౌరాష్ట్రం | 395 |
| నీవేల లేదనేవు | ఆహిరినాట | 501 |
| నీవే విచ్చేసి చూడు | కన్నడగౌళ | 504 |
| నీవొకటి దలఁచఁగా | భైరవి | 2 |
| నూటికొక్కటే | బౌళి | 226 |
| నెలఁతఁగరుణించితివి | సామంతం | 343 |
| నేఁడేనాగవల్లి | రామక్రియ | 558 |
| నేనిదెనీవిదె | దేసాళం | 260 |
| నేనెంతకోపినైన | సావేరి | 591 |
| నేనెంతతమకినైనా | ముఖారి | 114 |
| నేనేమియెఱఁగను | కన్నడగౌళ | 491 |
| నేనేమీననఁజుమ్మీ | సౌరాష్ట్రం | 488 |
| నేనేమెఱుఁగుదును | గౌళ | 555 |
| నేనేవాదఁబరచే | దేవగాంధారి | 253 |
| నే నొకటిసేయఁగాను | సౌరాష్ట్రం | 89 |
| నేనొకమాఁటాడితేను | దేవగాంధారి | 31 |
| నేమెట్టుండితిమి | రామక్రియ | 79 |
| నేరమింతటికి | మాళవిగౌళ | 297 |
| నేరమెల్లానావొళ్లిదే | శంకరాభరణం | 520 |
| నేరమెల్లానేరుపాయ | సౌరాష్ట్రం | 598 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నేరుపరివినౌదువు | లలిత | 396 |
| నేరుపరివిన్నిటాను | సాళంగనాట | 471 |
| నేరుపరివౌదువమ్మ | సాళంగనాట | 385 |
| నేరుపరులిందరును | పాడి | 342 |
| నేరుపెల్లానొక్కటే | వరాళి | 44 |
| నేవచ్చినపనేమి | కాంబోది | 169 |
| పంతగాఁడవు | నాదరామక్రియ | 357 |
| పంతము నీకిదె | రామక్రియ | 588 |
| పంతము నీకుఁదగ | భైరవి | 294 |
| పగవారినైననింత | ఆహిరి | 371 |
| పచ్చిదేరిన పని | లలిత | 533 |
| పట్టకు పట్టకురా | కాంబోది | 12 |
| పట్టకురా అంత | శంకరాభరణం | 69 |
| పట్టితే పదిరూపులై | రామక్రియ | 82 |
| పట్టిన పంతమె | శంకరాభరణం | 195 |
| పతిమీఁది తమకాన | హిందోళవసంతం | 48 |
| పద పద ఇఁక | పాడి | 227 |
| పరమాత్మఁడైన | సాళంగనాట | 36 |
| పరాకు సేయకురమ్మ | మధ్యమావతి | 526 |
| పలుక కూరకుండుటే | మాళవిగౌళ | 14 |
| పాకము దప్పి | దేవగాంధారి | 37 |
| పాయపువారమట | బళహంస | 587 |
| పాయమేపైతర | భైరవి | 32 |
| ప్రియురాలితో | సాళంగనాట | 592 |
| పువ్వులనువేసి | కాంబోది | 418 |
| పూఁచిపట్టి | గౌళ | 218 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పూవుటమ్ముల | మాళవిగౌళ | 179 |
| పూవులవేసిన | నాదరామక్రియ | 246 |
| పేరఁటాండ్లు | సాళంగనాట | 182 |
| పేరుఁగీర్తి | సామంతం | 57 |
| పొందినట్టి | తెలుఁగుఁగాంబోది | 353 |
| పొందైన యింతులు | బౌళి | 64 |
| పొద్దువోకకిటు | శ్రీరాగం | 156 |
| పొద్దువోదతఁడు | మాళవిగౌళ | 258 |
| పొమ్మంటేఁగాని | పాడి | 153 |
| పొయ్యేవోపోవో | కేదారగౌళ | 154 |
| పోనీపోనీ ఇఁకనేల | నాదరామక్రియ | 282 |
| పోపో అదేమోసి | రామక్రియ | 127 |
| పోపో యిదేడ | ముఖారి | 164 |
| బలిమి సేయకురే | పాడి | 137 |
| బాపుబాపుజాణఁడా | లలిత | 287 |
| బుద్ధి చెప్పరా నీకు | నాట | 458 |
| మంచిదాయమేలు | ఆహిరి | 524 |
| మగరూపునాడరూపు | వరాళి | 309 |
| మగవాఁడు తాను | వరాళి | 433 |
| మనసుకుఁ జల్ల | సామంతం | 313 |
| మనసుకుమనసే | దేసాళం | 435 |
| మనసురానిది | భైరవి | 122 |
| మన్నించవోయి | ముఖారి | 344 |
| మమ్మేమిచూచేవు | శుద్ధదేశి | 577 |
| మరిగేవిప్పుడును | భైరవి | 401 |
| మరులుకొలుపఁజోటు | సామంతం | 40 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మఱవకుమీ | శ్రీరాగం | 424 |
| మఱియేమిటి | రామక్రియ | 358 |
| మాఁజితేను | సామంతం | ·85 |
| మాతోనీవు | ముఖారి | 376 |
| మానఁగదె | గుండక్రియ | 434 |
| మానవయ్య | సామంతం | 505 |
| మానవయ్యా | దేసాళం | 59 |
| మానిపండ్లు | బౌళి | 279 |
| మానుమనవే | పాడి | 41 |
| మానుమన్నా | దేసాళం | 15 |
| మాపుదాఁకా | కాంబోది | 261 |
| మాపూదాఁకా | శుద్ధవసంతం | 499 |
| మించి నారమణుఁడవు | కాంబోది | 550 |
| మించినీవేసేతుగాక | సామంతం | 298 |
| మించెమందెమేళములు | వరాళి | 217 |
| మీఁదమీఁద | దేసాళం | 91 |
| ముందువెనకెఱఁగవు | రామక్రియ | 597 |
| ముట్టకుముట్టకు | శఁకరాభరణం | 212 |
| ముట్టి వచ్చి | సింధురామక్రియ | 478 |
| మూసిమంతనాల | బౌళి | 317 |
| మెచ్చితి నిన్నప్పటి | శంకరాభరణం | 570 |
| మెచ్చితి నిన్నిటా | శంకరాభరణం | 198 |
| మెఱుఁగుఁ జెక్కుల | దేసాళం | 463 |
| మేలునీకంటె | వరాళి | 409 |
| మేలు మేలు విభుఁడా | సామంతం | 129 |
| మేలే చెలియా | రామక్రియ | 228 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| రచ్చలఁబెట్ట | మాళవిగౌళ | 364 |
| రమణికడకు | దేశాక్షి | 338 |
| రమణిభాగ్యము | ఆహిరి | 96 |
| రమణుఁడ ఇంతట | దేవగాంధారి | 266 |
| రమణుఁడ చెప్పు | శ్రీరాగం | 291 |
| రమ్మనవు పొమ్మనవు | ముఖారి | 523 |
| రవ్వమాని | శ్రీరాగం | 232 |
| రాఁడాయ నతఁడిందు | తెలుఁగుఁగాంబోది | 310 |
| రాఁపు సేయక | లలిత | 112 |
| రాజసాలే | శంకరాభరణం | 118 |
| రాతిరే చెప్పి యంపితి | పాడి | 399 |
| రావయ్య యిఁక | తెలుఁగుఁగాంబోది | 600 |
| రావే ఆతఁడు | కాంబోది | 544 |
| రేసులు వాసులు | ముఖారి | 83 |
| లేవయ్యనీకెంత | భైరవి | 436 |
| వంచకువే శిరసు | సామంతం | 233 |
| వట్టి దూరులేల | సాళంగనాట | 52 |
| వట్టి దూసకము | నాదరామక్రియ | 350 |
| వట్టి మాఁట | రీతిగౌళ | 445 |
| వద్దన్నవారెవ్వరు | వసంతవరాళి | 378 |
| వద్దు వద్దు నవ్వ | మంగళకౌశిక | 190 |
| వద్దు వద్దు నీకింతేసివట్టి | బౌళి | 200 |
| వద్దు వద్దు నీకింతేసి వలసీ | ముఖారి | 427 |
| వద్దు వద్దు నీకేల | గౌళ | 380 |
| వద్దు వద్దు మమ్ము | సాళంగం | 210 |
| వద్దు వద్దు యెన్నఁడూ | వరాళి | 16 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| వద్దు వద్దు వేగిరాలు | ఆహిరినాట | 528 |
| వద్దు వేఁడుకొనవయ్యా | కాంబోది | 536 |
| వనితకుఁ బతి | హిందోళం | 49 |
| వరుసకు రాకుంటే | సౌరాష్ట్రం | 283 |
| వరుస దప్పి | శంకరాభరణం | 35 |
| వలచినందుకు | బౌళి | 99 |
| వలచినపతి | శంకరాభరణం | 497 |
| వలపించి తిప్పేవు | రామక్రియ | 67 |
| వలపు గంప | దేసాళం | 18 |
| వలపు తొలుకరించె | ముఖారి | 101 |
| వలపు నిలుపలేవు | ఆహిరి | 575 |
| వలవని జోలింక | రామక్రియ | 206 |
| వలసినప్పుడు తానే | మధ్యమావతి | 432 |
| వలసినప్పుడు నేనే | శంకరాభరణం | 192 |
| వలెనా అతనితో | శ్రీరాగం | 270 |
| వాకిటికి వచ్చి | శుద్ధవసంతం | 78 |
| వాదులు మాతో | వేళావళి | 373 |
| వాదులేలమాతో | సామంతం | 448 |
| వాసికి బతుకుటింతే | శ్రీరాగం | 19 |
| వాసి వంతు | సాళంగం | 146 |
| వింటిరావో చెలులాల | దేశాక్షి | 398 |
| వింతవారా నీకు | రామక్రియ | 498 |
| విచ్చేయరాదా | వరాళి | 187 |
| విన్నపమిదె | సామంతం | 158 |
| విన్నపాలు | శంకరాభరణం | 71 |
| విన్నమాఁట | రామక్రియ | 34 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| విన్నవించితి | పళవంజరం | 439 |
| విరహ మొక్కంద | శ్రీరాగం | 191 |
| వీదుల వీదుల | గౌళ | 449 |
| వెనకటి పొందు | ఆందోళి | 532 |
| వెనక నీవు | భైరవి | 130 |
| వెన్న వేసినట్టి వారి | రామక్రియ | 194 |
| వెల్లివిరాయ వలపు | ముఖారి | 453 |
| వేడుక నేఁ జేసితే | దేసాళం | 548 |
| వేగిరించ మనకేల | మాళవిగౌళ | 354 |
| సంగతి నట్టే | తోండి | 26 |
| సతమైనదాన | ఆహిరి | 111 |
| సతినిన్ను గెలిచెను | దేశాక్షి | 517 |
| సతివిధము | సామంతం | 30 |
| సరసములోనికి | భైరవి | 512 |
| సవతిపోరు | సాళంగనాట | 238 |
| సవతై నానాపె | శుద్ధవసంతం | 326 |
| సాదించఁ బొద్దు | హిందోళం | 280 |
| సారపునవ్వుల | దేవగాంధారి | 525 |
| సారెకు నానపెట్టకు | సాళంగనాట | 510 |
| సారెదూరఁజాలమా | మంగళకౌశిక | 149 |
| సింగారరాయఁడ | నాదరామక్రియ | 157 |
| సిగ్గువాసి కూటికే | ఆందోళి | 20 |
| సేయఁగలపని | మంగళకౌశిక | 585 |
| సేయఁగలపని | లలిత | 590 |
| సేవింపరోజనులాల | సాళంగనాట | 406 |
| సేసినట్టితప్పు | సామంతం | 542 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నేసినదిచేఁతగాక | రామక్రియ | 249 |
| నేసినపాటే చాలు | ఆహిరి | 400 |
| నేనెఁగాదైవము | పాడి | 209 |


N. B. ప్రతిసంవత్సరమునందును "సందిగ్ధపదసమీక్ష" అను శీర్షిక క్రింద ఆయాసంపుటములలో వ్యాకరణములను తికమక బెట్టెవి, నిఘంటువులయందు గుర్తింపబడనివియగు పదములకు నాకు తోఁచిన సూచనలను వ్రాయుచుంటిని. అట్లే యీ సంపుటమునందును దాదాపు 35 పదములను గుర్తుంచుకొంటిని. వానిలో కొన్నిటిని పాదదీపికలో (Foot Note) చూపినందున, కొన్ని యితర సంపుటములలో చర్చించినందున, తక్కినవి కొంచెము శ్రమించితే తెలుగు నిఘంటువులందే విశదమగుటచేతను వేరుగ వ్రాయలేను.

1. మాఁటిటే — పాట 85
2. వీడు — పాట 182

మొదలగు 3, 4 పదములు మాత్రమేయుండుచేట ఈసంపుటములో ఆశీర్షిక ప్రకటింపలేదు.



తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము, తిరుపతి.